# పదో తరగతి

## తెలుగు వాచకం

### ముఖ్యసలహాదారు

**శ్రీమతి చిత్రా రామచంద్రన్,** ఐ.ఎ.ఎస్.,
ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ, తెలంగాణ.

### సంపాదకమండలి

**డా॥ బన్న అయిలయ్య,** ప్రధానాచార్యులు, ఆర్ట్స్ మరియు సైన్సు కళాశాల, వరంగల్.
**డా॥ దహగాం సాంబమూర్తి,** విశ్రాంత ప్రధానాచార్యులు, ఉపాధ్యాయ విద్యా కళాశాల, వరంగల్.
**డా॥ ఎన్. రజని,** తెలుగు విభాగాధిపతి, బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**డా॥ ఎస్. రఘు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
**శ్రీ దేశపతి శ్రీనివాస్,** ప్రత్యేక అధికారి, ముఖ్యమంత్రి కార్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.
**శ్రీ సువర్ణ వినాయక్,** కో-ఆర్డినేటర్, తెలుగు, రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ, హైదరాబాద్, తెలంగాణ.

**చిత్రాలు : శ్రీ కూరెళ్ల శ్రీనివాస్,** ప్రధానోపాధ్యాయుడు, జి.ప.ఉ.పా. వెంకటేశ్వరనగర్, నల్లగొండ జిల్లా.

### సమన్వయం, సహకారం

**శ్రీ మారసాని సోమిరెడ్డి,**
సంయుక్త సంచాలకులు,
సార్వత్రిక విద్యాపీఠం,
తెలంగాణ, హైదరాబాద్.

**శ్రీ బోయినపల్లి వెంకటేశ్వరరావు,**
స్టేట్ కో-ఆర్డినేటరు,
సార్వత్రిక విద్యాపీఠం,
తెలంగాణ, హైదరాబాద్.

### పాఠ్యపుస్తక ప్రచురణ సమితి

**శ్రీమతి ఎ.దేవసేన,** ఐ.ఎ.ఎస్.,
సంచాలకులు,
పాఠశాల విద్యాశాఖ,
తెలంగాణ, హైదరాబాద్.

**శ్రీ ఎ. కృష్ణారావు,**
సంచాలకులు,
సార్వత్రిక విద్యాపీఠం,
తెలంగాణ, హైదరాబాద్.

**శ్రీ ఎస్.వెంకటేశ్వర శర్మ,**
సంచాలకులు,
పాఠ్యపుస్తక ముద్రణాలయం
తెలంగాణ, హైదరాబాద్.

**ప్రచురణ**
సార్వత్రిక విద్యాపీఠం,
తెలంగాణ, హైదరాబాదు

© Government of Telangana, Hyderabad

*First Published 2021*

**All rights reserved**

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser.

The copy right holder of this book is the Sarvatrika Vidya Peetham, Telangana, Hyderabad.

This Book has been printed on 70 G.S.M. Maplitho
Title Page 200 G.S.M. White Art Card

సార్వత్రిక విద్యాపీఠం, తెలంగాణ 2021-22

*Printed in India*
at the Telangana Govt.Text Book Press,
Mint Compound, Hyderabad,
Telangana.

# ముందుమాట

విద్య మనిషికి మూడోకన్నులాంటిది. తనను, తన చుట్టూ ఉన్న సమాజాన్ని అర్థంచేసుకొని పరిస్థితులకనుగుణంగా తనను తాను ఆవిష్కరించుకొనేలా చేసేది విద్య. విద్య మనిషికి గుర్తింపునిస్తుంది, గౌరవాన్ని పెంపొందిస్తుంది. విద్యావంతులు ఉన్న సమాజం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించి అగ్రగామిగా నిలుస్తుంది. **'అందరూ చదువాలి – అందరూ ఎదగాలి'** అనేది ఒక సార్వత్రిక లక్ష్యం. చదువుకోవడం పాఠశాలల ద్వారా మాత్రమే కాకుండా అందరికీ చదువును అందించడానికి సార్వత్రిక విద్యాపీఠం ఏర్పాటైనది. **'అందరికీ విద్య – అందుబాటులో విద్య'** అనే లక్ష్యంతో చదువునుండి దూరమైన వారికి, చదువుకోనివారికి విద్యనందిస్తున్నది. 14 సం॥రాలు నిండినవారు సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 10వ తరగతిని అభ్యసించవచ్చు. 10వ తరగతి ఉత్తీర్ణులైనవారు ఇంటర్మీడియట్ చదువును కొనసాగించవచ్చు.

సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదవతరగతి చదువుతున్న అభ్యాసకుల కోసం 2021 సంవత్సరం నుండి నూతన వాచకాలను అందించాలని నిర్ణయించారు. మారుతున్న సామాజిక పరిస్థితులు, అవసరాలు, జాతీయ విద్యావిధానం మౌలిక సూత్రాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా అభ్యాసకులకు నాణ్యమైన విద్యను అందించడంకోసం వాచకాలను ఆధునీకరించారు.

'భాష' భావ వినిమయ సాధనం మాత్రమేకాదు, ఆలోచన సాధనంగా ఆలోచించడానికి, ఆలోచనలను క్రమబద్ధీకరించుకొని వ్యక్తీకరించడానికి తోడ్పుతుంది. భాషలో సమర్థతను కల్గి ఉండి, అభ్యాసకులు తమ దైనందిన వ్యవహారాలలో భాషను సమర్థవంతంగా వినియోగించగలగాలి. వీటిని దృష్టిలో పెట్టుకొని జాతీయ విద్యాపరిశోధన శిక్షణాసంస్థ (ఎన్.సి.ఇ.ఆర్.టి.) భాషాసామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలను నిర్ధారించింది. భాషా వాచకాలు వీటి సాధనకు తోడ్పడాలి.

తెలంగాణ రాష్ట్రంలో తెలుగు అధికార భాషగా ఉంది. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరిగా ప్రతి ఒక్కరు 10వ తరగతి వరకు తెలుగును అభ్యసించాలని చట్టాన్ని కూడా 2018లో రూపొందించింది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో తెలుగును సామాజిక కోణంలో అవసరాలను తీర్చుకొనే భాషగా, మానవ సంబంధాలను పెంచుకొనే సాధనంగా భావించి నేర్చుకోవడం అనివార్యంగా మారింది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం అమలులోవున్న 10వ తరగతి తెలుగు వాచకాన్ని ఆధునీకరించడమైనది.

ఈ వాచకంలో 18 పాఠాలను పొందుపరిచారు. పద్యం, వచన కవిత, గేయం, ప్రపంచపదులు, ద్విపద, కథ, కథానిక, ఆత్మకథ, జీవిత చరిత్ర, వ్యాసం, అభినందనవ్యాసం, సంభాషణల వంటి ప్రక్రియలతో కూడిన పాఠ్యాంశాలతో వాచకాన్ని రూపొందించారు. పర్యావరణం, నైతిక ఆధ్యాత్మిక విలువలు, దేశభక్తి, స్త్రీ సాధికారత, పిల్లల స్వభావం, సామాజిక బాధ్యత, స్ఫూర్తి, వ్యక్తిత్వ వికాసం, హాస్యం, పఠనాభిలాష, హితోపదేశం, గిరిజన సంస్కృతి, శ్రమజీవన సౌందర్యం మొదలైన ఇతివృత్తాలతోకూడిన పాఠ్యాంశాలను తెలుగు సాహిత్యం నుండి ఎంపికచేశారు. భాషాసామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలు సాధించడానికి అనుగుణంగా అభ్యాసాలను పొందుపరిచారు. తెలుగు భాషపట్ల అవగాహన పెంపొందించేలా వ్యాకరణాంశాలను పరిచయం చేశారు. పుస్తకం భారం తగ్గించి స్వయం అధ్యయనానికి అనుగుణంగా, ఆసక్తికలిగించేలా రూపొందించారు.

అతి తక్కువ సమయంలో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి వాచక రూపకల్పనలో పాల్గొన్న ఉపాధ్యాయులు, చిత్రకారుడు, సంపాదకమండలి సభ్యులకు, డిటిపి ఆపరేటర్‌కు కృతజ్ఞతలు. వాచక రూపకల్పనలో సంధానకర్తగా, విషయనిపుణుడిగా వ్యవహరించిన **శ్రీ సువర్ణ వినాయక్,** కో–ఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి. గారికి అభినందనలు. వాచక రూపకల్పన కోసం విషయనిపుణులు, కోఆర్డినేటరు సేవలు వినియోగించడానికి అనుమతించి సహకరించిన **శ్రీమతి ఎమ్. రాధారెడ్డి,** సంచాలకులు, ఎస్.సి.ఇ.ఆర్.టి. గారికి, వాచక రూపకల్పనను ప్రారంభించి ఎప్పటికప్పుడు సహకరించిన పాఠ్యపుస్తక ముద్రణాలయం సంచాలకులు **శ్రీ ఎస్. వెంకటేశ్వర శర్మ** గారికి కూడా ప్రత్యేక కృతజ్ఞతలు. వాచకాల మార్పు ఆవశ్యకతను గుర్తించి ప్రేరేపించి దిశానిర్దేశం చేసిన **శ్రీమతి చిత్రారాంచంద్రన్,** ఐ.ఎ.ఎస్., ప్రత్యేక ప్రధానకార్యదర్శి, విద్యాశాఖ గారికి ధన్యవాదాలు. రాష్ట్రవిద్యాశాఖామంత్రిగా ఎప్పటికప్పుడు దిశానిర్దేశంచేసి ప్రోత్సహిస్తున్న **శ్రీమతి సబితా ఇందిరారెడ్డి** గారికి ప్రత్యేక ధన్యవాదాలు. వాచక రూపకల్పనలో రచయితలు, సంపాదకమండలి, చిత్రకారులు, కో–ఆర్డినేటర్లతో చర్చించి, సమన్వయంచేసి పుస్తకం పూర్తికావడానికి కృషిచేసిన సంయుక్త సంచాలకులు **శ్రీ మారసాని సోమిరెడ్డి, శ్రీ బోయినపల్లి వెంకటేశ్వర రావు** స్టేట్ కో–ఆర్డినేటర్ గారికి ప్రత్యేక అభినందనలు. ఈ వాచకం అభ్యాసకుల అవసరాలను తీర్చి, భాషా సమర్థతను పెంచడానికి తోడ్పడుతుందని ఆశిస్తున్నాను.

తేది : 24-12-2020
స్థలం : హైదరాబాద్.

**ఎ.కృష్ణారావు**
**సంచాలకులు**
సార్వత్రిక విద్యాపీఠం, తెలంగాణ, హైదరాబాద్.

## వందేమాతరం

– బంకించంద్ర ఛటర్జీ

వందేమాతరం, వందేమాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం; వందేమాతరం
శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీం
ఫుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం మాతరం వందేమాతరం.

## జాతీయ గీతం

– రవీంద్రనాథ్ ఠాగూర్

జనగణమన అధినాయక జయహే !
భారత భాగ్య విధాతా !
పంజాబ సింధ్ గుజరాత మరాఠా,
ద్రావిడ ఉత్కళ వంగా !
వింధ్య హిమాచల యమునా గంగా,
ఉచ్ఛల జలధి తరంగా !
తవ శుభనామే జాగే !
తవ శుభ ఆశిష మాగే !
గాహే తవ జయ గాథా !
జనగణ మంగళదాయక జయహే !
భారత భాగ్య విధాతా !
జయహే ! జయహే ! జయహే !
జయ జయ జయ జయహే !

## ప్రతిజ్ఞ

– పైడిమర్రి వేంకట సుబ్బారావు

భారతదేశం నా మాతృభూమి.
భారతీయులందరూ నా సహోదరులు.
నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను.
సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం.
దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను.
నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను.
ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను.
జంతువులపట్ల దయతో ఉంటాను.
నా దేశంపట్ల, నా ప్రజలపట్ల, సేవానిరతి కలిగి ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.
వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

## విషయనిపుణులు, నిర్వహణ

**శ్రీ సువర్ణ వినాయక్,** కో-ఆర్డినేటర్, తెలుగు, రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ, హైదరాబాద్.

## రూపకల్పనలో పాల్గొన్నవారు

**శ్రీ పల్లెర్ల రామమోహన రావు,** స్కూ.అ. (తెలుగు),
జి.ప.ఉ.పా., వేముల, మహబూబ్‌నగర్ జిల్లా.

**శ్రీ ఎల్.ఎం.ప్రసాద్,** భాషోపాధ్యాయుడు,
ప్ర.ఉ.పా., సి.పి.ఎల్., అంబర్‌పేట, హైదరాబాద్.

**శ్రీ ఎ. భానుప్రకాశ్,** స్కూ.అ. (తెలుగు),
జి.ప.ఉ.పా., లోనికలాన్, సంగారెడ్డి జిల్లా.

**శ్రీ సాగర్ల సత్తయ్య,** స్కూ.అ. (తెలుగు),
జి.ప.ఉ.పా., చింతగూడెం, నల్లగొండ జిల్లా.

**శ్రీ కన్నెగంటి వెంకటయ్య,** స్కూ.అ. (తెలుగు),
జి.ప.ఉ.పా., చెరువు మాదారం, ఖమ్మం జిల్లా.

**శ్రీ చక్రవర్తుల శ్రీనివాస్,** భాషోపాధ్యాయుడు,
జి.ప.ఉ.పా., చర్లపల్లి, వరంగల్ (గ్రామీణ) జిల్లా.

**డా॥ ఎ.జయప్రకాశ్;** పి.జి.టి., తెలుగు,
తెలంగాణ మోడల్ స్కూల్, రేగోడ్, మెదక్ జిల్లా.

**డా॥ జె.నీరజ,** అసిస్టెంట్ ప్రొఫెసర్,
అకడమిక్ సెల్, కళాశాల విద్యాశాఖ, హైదరాబబాద్.

**డా॥ జి. త్రివేణి,** భాషోపాధ్యాయిని,
ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్.

**శ్రీ గాజుల రవీందర్,** స్కూ.అ. (తెలుగు),
ప్ర.ఉ.పా., కార్ఖానాగడ్డ, కరీంనగర్.

**డా॥ వి. శరత్ బాబు,** స్కూ.అ. (తెలుగు),
ప్ర.ఉ.పా., రాజ్‌భవన్, హైదరాబాద్.

**శ్రీ కె. రంగరాజు,** స్కూ.అ. (తెలుగు),
జి.ప.ఉ.పా., రంగాపురం, రంగారెడ్డి జిల్లా.

**శ్రీ కె. జనార్దన్,** స్కూ.అ. (తెలుగు),
జి.ప.ఉ.పా., జన్నారం, మంచిర్యాల జిల్లా.

**శ్రీ మెంగవరం పవన్‌కుమార్,** స్కూ.అ. (తెలుగు),
జి.ప.ఉ.పా., గర్గుల్, కామారెడ్డి జిల్లా.

**శ్రీ కటుగోజ్జుల మనోహరాచారి,** స్కూ.అ. (తెలుగు),
జి.ప.ఉ.పా., కోరుట్ల, జగిత్యాల జిల్లా.

**శ్రీ గంగా కాశీనాథ్,** భాషోపాధ్యాయుడు,
జి.ప.ఉ.పా., గొంగ్లూరు, సంగారెడ్డి జిల్లా.

**శ్రీమతి పల్లి మాధవి,** భాషోపాధ్యాయిని,
భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల,
జూబ్లిహిల్స్, హైదరాబాద్.

**శ్రీమతి పురిమళ్ల సునంద,** స్కూ.అ. (తెలుగు),
జి.ప.ఉ.పా., కలకోట, ఖమ్మం జిల్లా.

---

**డి.టి.పి., లే ఔటు, ముఖచిత్రం & డిజైనింగ్ : ప్రతిమ పాతూరి,** హైదరాబాద్.

# అభ్యాసకులకు సూచనలు

- ఈ వాచకం ద్వారా మీరు తెలుగుభాషలో పట్టు సాధించాలి. అనగా తెలుగులో ధారాళంగా చదువగలగడం, అర్థం చేసుకోవడం, సొంతంగా రాయగలగడం వంటివి చేయగలగాలి.
- వీటిని దృష్టిలో పెట్టుకుని ఈ వాచకం పూర్తయ్యేసరికి సాధించాల్సిన భాషాసామర్థ్యాలకు చెందిన అభ్యసనాఫలితాల జాబితాను పాఠాలకంటే ముందే ఇచ్చారు.
- వీటిని సాధించడానికి అనుగుణంగా ప్రతి పాఠంలో **"భాషాసామర్థ్యాలను సాధిద్దాం"** అనే పేరుతో అభ్యాసాలున్నాయి. వీటిని సాధన చేయాలి.
- ప్రతిపాఠం ప్రారంభంలో ఆ పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు, అభ్యసనా ఫలితాలను ఇచ్చారు. వీటిని చదువాలి.
- అన్ని పాఠాలలో **"అభ్యాసకులకు సూచనలు"** ఉన్నాయి. వీటిని చదువాలి, సూచించిన విధంగా చేయాలి.
- పాఠ్యభాగ వివరాలు, పాఠం ఉద్దేశం / నేపథ్యం, కవిపరిచయాలను చదివి అర్థం చేసుకోవాలి.
- పాఠంలోని విషయాన్ని నిడివినిబట్టి రెండు లేదా మూడు విభాగాలుగా విభజించారు. ప్రతి విభాగంలో **"మీరేమి అర్థం చేసుకున్నారు?"** అని బాక్సులో ప్రశ్నలుంటాయి. వీటికి జవాబులను పాఠంలో గుర్తించాలి. దీనివల్ల మీకు పాఠం మీద అవగాహన పెరుగుతుంది.
- పాఠం తరువాత **"భాషాసామర్థ్యాలను సాధిద్దాం"** అనే శీర్షికతో అభ్యాసాలున్నాయి. వీటిని చదివి అర్థం చేసుకోవాలి. సొంతంగా జవాబులు రాయాలి.
- పాఠం చివర **"నేను ఏయే భాషాసామర్థ్యాలు సాధించాను?"** అనే శీర్షికతో మీ అవగాహనను మీరే పరీక్షించుకునేలా వాక్యాలుంటాయి. వాటికి **"అవును లేదా కాదు"** అని గుర్తించాలి. మీరు **"కాదు"** అని గుర్తించిన వాటిని బోధకులతో చర్చించి అవగాహన ఏర్పరచుకోవాలి.
- పాఠంలోని కఠిన పదాలకు పుస్తకం చివర **"పదవిజ్ఞానం"** పేరుతో అర్థాలు, నానార్థాలు, పర్యాయపదాలు, ప్రకృతి-వికృతులు, పదవివరణలు మొదలగు వాటిని ఇచ్చారు. పాఠం చదివేటప్పుడు వీటిని ఉపయోగించుకోవాలి.
- నిఘంటువు, విద్యార్థికల్పతరువు వంటివి మీవద్ద ఉండాలి. లేదా మీకు కేటాయించిన కేంద్రంలోని పాఠశాలలో ఉంటాయి. వాటిని ఉపయోగించుకోవాలి.
- మీకు పాఠ్యాంశాలు, అభ్యాసాల గురించి అవగాహన కల్పించడానికి కేంద్రంలో ప్రత్యక్ష బోధనకోసం క్లాసులను నిర్వహిస్తారు. వీటికి తప్పనిసరిగా హాజరు కావాలి. కేంద్రానికి వెళ్ళినప్పుడు బోధకుడితో చర్చించి సందేహాలను నివృత్తి చేసుకోవాలి.
- ఈ వాచకంలోని అభ్యాసాలను చేయడానికి / జవాబులు రాయడానికి ప్రత్యేకంగా ఒక నోటుబుక్కును ఉంచుకోవాలి. వీటిలో మీరే సొంతంగా జవాబులు రాయాలి. కేంద్రంలో బోధకుడికి అందజేసి సలహాలు, సూచనలు పొందాలి.
- మీకు నిర్వహించే పబ్లిక్ పరీక్షలో వాచకంలోని ప్రశ్నలు యథాతథంగా రావు. వాచకంలోని అభ్యాసాలలో ఇచ్చిన ప్రశ్నల వంటివి వస్తాయి. కాబట్టి మీరు వాచకంలోని అభ్యాసాలను సొంతంగా రాసినప్పుడు మాత్రమే మీకు ప్రయోజనం చేకూరుతుంది.
- పాఠ్యాంశాలు, అభ్యాసాల గురించి అవగాహన పెంపొందించడానికి ఆన్‌లైన్ సౌకర్యం కూడా ఉంటుంది. దీని ద్వారా కూడా మీరు లబ్ధిపొందవచ్చు.
- మీరు ఓపెన్‌స్కూల్ ద్వారా పదవ తరగతి చదువుతున్నప్పటికీ రెగ్యులర్ 10వ తరగతి విద్యార్థుల స్థాయికి సమానమైన స్థాయిని పొందడానికి అనుగుణంగా ఈ వాచకాలున్నాయి. వీటిని సరైన రీతిలో ఉపయోగించి ప్రయోజనాన్ని పొందాలి.

# బోధకులకు సూచనలు

- ఈ వాచకాన్ని మీరు ఆమూలాగ్రంగా చదివి సంపూర్ణ అవగాహనను పెంపొందించుకోవాలి.
- వాచకం ప్రారంభంలో **ముందుమాట, అభ్యాసకులకు సూచనలు, సాధించాల్సిన సామర్థ్యాలకు చెందిన అభ్యసనాఫలితాల జాబితా**ను పొందుపరచారు.
- **'ముందుమాట'**ను చదువడం ద్వారా మీకు వాచకం గురించిన ప్రాథమిక అవగాహన, ఉద్దేశం బోధపడుతుంది.
- **'అభ్యాసకులకు సూచనలు'** చదువడం ద్వారా అభ్యాసకులతో మీరు ఏమి చేయించాలో బోధపడుతుంది. వీటిని మీరు చదువాలి. తప్పనిసరిగా ప్రతి అభ్యాసకుడితో చదివించి అర్థం చేయించాలి.
- **'సాధించాల్సిన సామర్థ్యాలు - అభ్యసనాఫలితాల'**ను చదువడం ద్వారా మీకు ఈ వాచకం యొక్క బోధనోద్దేశం అవగతమవుతుంది. పాఠ్యాంశాలు పూర్తిచేయడం లేదా పరీక్షలో ఉత్తీర్ణత కోసం ఈ వాచకాన్ని రూపొందించలేదు. భాషాసామర్థ్యాలు – అభ్యసనాఫలితాల సాధనకుద్దేశించబడినది. వీటిని అభ్యాసకులు సాధించినప్పుడే మనం కృతకృత్యులైనట్లుగా భావించాలి.
- ప్రతి పాఠంలో **పాఠంపేరు, సాధించాల్సిన సామర్థ్యాలు - అభ్యసనాఫలితాలు, అభ్యాసకులకు సూచనలు, పాఠం ఉద్దేశం / నేపథ్యం,** పాఠ్యాంశ విషయం, **"మీరేమి అర్థం చేసుకున్నారు?"** అనే శీర్షికతో పాఠాంతర ప్రశ్నలు, **"భాషాసామర్థ్యాలను సాధిద్దాం"** అనే పేరుతో అభ్యాసాలు, **"నేను ఏఏ సామర్థ్యాలు సాధించాను?"** అనే స్వీయ మూల్యాంకన కృత్యం, చివరకు **"సూక్తి"** వంటి అంశాలున్నాయి. వీటిని ఈ క్రమంలోనే అభ్యాసకులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది.
- కేంద్రంలో ప్రత్యక్ష బోధన కోసం కేటాయించిన రోజులను దృష్టిలో పెట్టుకొని ఒక్కొక్క పాఠానికి ఎన్ని రోజులు వస్తుందో విభజించుకోవాలి.
- కేంద్రంలో పాఠ్యాంశ విషయం గురించి అవగాహన కల్పించడంతోపాటు అభ్యాసాలను సొంతంగా చేసేలా అవగాహన కల్పించాలి.
- **పదజాలం, అవగాహన – ప్రతిస్పందన**లోని ప్రశ్నలకు అభ్యాసకులే సొంతంగా జవాబులు రాయగల్గుతారు. వ్యాకరణాంశాలను విడమరచి చెప్పాలి. స్వీయరచన ప్రశ్నలకు జవాబులు ఎలా రాయాలో చర్చ ద్వారా అవగాహన కల్పించాలి. వ్యాసరూప సమాధాన ప్రశ్నను నల్లబల్లపై రాసి చర్చించి రాయించాలి. రాసిన విధానంలోని లోపాలను సరిచేయాలి. అనగా అభివ్యక్తి క్రమం, వాక్య నిర్మాణం, సరైన పదజాల వినియోగం, అక్షరదోషాలు వంటి వాటిని సవరించాలి.
- సృజనాత్మకతలోని అంశాలను తగిన ఉదాహరణల ద్వారా అవగాహన కల్పించి సొంతంగా రాసేలా చూడాలి.
- కేంద్రంలో నిఘంటువు, విద్యార్థి కల్పతరువు వంటివి అందుబాటులో ఉంచి ఉపయోగించుకునేలా చూడాలి.
- ప్రతి పాఠంలోని అభ్యాసాలను ఒక నోటు బుక్కులో రాసి తీసుకుని రమ్మనాలి. వాటిని పరిశీలించి సలహాలు, సూచనలు ఇవ్వాలి.
- ప్రత్యక్ష బోధనతోపాటు ఆన్‌లైన్ ద్వారా కూడా బోధన నిర్వహిస్తారు. ఆన్‌లైన్ బోధన సౌకర్యాన్ని అభ్యాసకులు వినియోగించుకునేలా చూడాలి.
- ఆన్‌లైన్ బోధనలో ప్రసారమైన లేదా పొందుపరచిన అంశాలను మళ్ళీ ప్రత్యక్ష బోధన చేయకుండా భాషాసామర్థ్యాలు, అభ్యసనా ఫలితాల సాధన కోసం అభ్యాసాల మీద ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలి.
- పాఠాలలో ఇచ్చిన అభ్యాసాలలోని ప్రశ్నలు పబ్లిక్ పరీక్షలో యథాతథంగా రావు. కాబట్టి అభ్యాసాల సాధన ద్వారా తగిన అభ్యాసం కల్పించినప్పుడే అభ్యాసకులు పరీక్షలో విజయవంతమయ్యే అవకాశం ఉంటుంది. కాబట్టి సొంతంగా రాయడాన్ని ప్రోత్సహించి భాషా సమర్థతను పెంచడం మీద దృష్టి కేంద్రీకరించాలి.
- అభ్యాసకులకు పఠన సామర్థ్యం పెంపొందేలా, భాషాభిరుచి ఏర్పడేలా మీ పాఠశాలలోని గ్రంథాలయ పుస్తకాలు, మ్యాగజైనులు, బాలసాహిత్యం, వార్తాపత్రికలు వంటి వాటిని చదివేలా ప్రోత్సహించాలి.
- మీ కేంద్రంలో నమోదైన అభ్యాసకులతో భాషా కార్యకలాపాలు అనగా వక్తృత్వ, ఉపన్యాస, పద్యపఠన, క్విజ్, సృజనాత్మక రచన వంటి పోటీలను నిర్వహించాలి.

# 10వ తరగతి వాచకం ద్వారా సాధించబడే భాషాసామర్థ్యాలు, అభ్యసన ఫలితాలు

## I. అవగాహన - ప్రతిస్పందన

- ముద్రిత, చేతిరాతల్లోని అంశాలను ధారాళంగా చదువగలగాలి, అర్థం చేసుకోగలగాలి.
- పరిచిత గద్యాంశాలు, పద్యాలు, గేయాలు, కవితలు, సంభాషణలు, ప్రకటనలు, కరపత్రాలు మొదలగువాటిని ధారాళంగా చదువగలగాలి, అర్థం చేసుకోగలగాలి.
- అపరిచిత గద్యాంశాలను, కవితలు, పాటలు, గేయాలు మొదలగువాటిని చదివి అర్థం చేసుకోగలగాలి. వీటికి చెందిన ప్రశ్నలకు జవాబులివ్వగలగాలి.
- తారుమారైన కవితాపంక్తులు, పద్యపాదాలు మొదలగు వాటిని సరిచేసి వరుసక్రమంలో రాయగలగాలి.
- చదివిన అంశం ఆధారంగా తప్పొలు గుర్తించడం, ఖాళీలు పూరించడం, శీర్షికలు పెట్టడం వంటివి చేయగలగాలి.
- వార్తాపత్రికలు, మ్యాగజైనులు, ప్రసారమాధ్యమాలలోని అంశాలను అర్థంచేసుకుని ప్రతిస్పందించగలగాలి.
- పుస్తకపఠనం అలవాటుగా చేసుకుని సాహిత్యాన్ని, కవులు, రచయితలను ప్రశంసించగలగాలి.

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

- ఇచ్చిన ప్రశ్నలకనుగుణంగా విశ్లేషణాత్మకంగా జవాబులు రాయగలగాలి.
- తెలిసిన, చూసిన, విన్న, చదివినవాటి గురించి సొంతమాటల్లో రాయగలగాలి.
- విరామచిహ్నాలనుపయోగించి దోషరహితంగా క్రమపద్ధతిలో రాయగలగాలి.
- సమర్థిస్తూ లేదా విభేదిస్తూ, వివరిస్తూ రాయగలగాలి.
- పద్యాలు, గేయాలు, కవితలకు తాత్పర్యాలు, భావాలు సొంతమాటల్లో రాయగలగాలి.
- పాత్రల స్వభావాలు, సారాంశాలు, కథలను సొంతమాటల్లో రాయగలగాలి.
- లేఖలు, కథలు, ఆత్మకథలు, వ్యాసాలు, సంభాషణలు, దినచర్య వంటివి రాయగలగాలి.
- గేయాలను పొడిగించగలగాలి. కవితలను రాయగలగాలి.

## III. భాషాంశాలు

- అర్థాలు, నానార్థాలు, పర్యాయపదాలు, ప్రకృతి-వికృతులు, వచనాలు వంటివి రాయగలగాలి.
- నిఘంటువును ఉపయోగించి అర్థాలను గ్రహించగలగాలి.
- వివిధ రంగాలకు చెందిన పదజాలాన్ని అర్థం చేసుకోగలగాలి.
- ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు రాయగలగాలి. జాతీయాలను అర్థం చేసుకొని ఉపయోగించగలగాలి.
- వర్ణమాల, పదాలు, వాక్యాలు, భాషాభాగాలను అర్థం చేసుకోగలగాలి.
- కర్త, కర్మ, క్రియ, కాలాలు-క్రియలు, సమాపక, అసమాపక క్రియలను అర్థం చేసుకోగలగాలి.
- విభక్తులను ఉపయోగించగలగాలి.
- సంధి, సమాసాలను అర్థం చేసుకోగలగాలి.
- ద్వంద్వ సమాసం, ద్విగుసమాసం, ఇకార, ఉకార సంధులు, సవర్ణదీర్ఘసంధి, గుణసంధులను అర్థం చేసుకోగలగాలి.
- అంత్యానుప్రాస, వృత్త్యనుప్రాస, అతిశయోక్తి, ఉపమ అలంకారాలను అర్థం చేసుకోగలగాలి.
- లఘు, గురువులను గుర్తించి గణవిభజన చేయగలగాలి.

# విషయసూచిక


| క్ర.సం. | పాఠం పేరు | కవి / రచయిత | ఇతివృత్తం | ప్రక్రియ | పుట |
|---|---|---|---|---|---|
| 1. | వర్షాలు | వానమామలై వరదాచార్యులు | పర్యావరణం | గేయం | 2 |
| 2. | స్నేహగీతి | దాశరథి కృష్ణమాచార్య | స్నేహం విలువ | గేయం | 11 |
| 3. | సత్పాత్రదానము | భండారు అచ్చమాంబ | పరోపకారం | కథ | 19 |
| 4. | అసామాన్యులు | కాపూరి పాపయ్య శాస్త్రి | శ్రమజీవన సౌందర్యం | గేయకవిత | 29 |
| 5. | విహారయాత్ర | – | గిరిజన సంస్కృతి | సంభాషణ | 39 |
| 6. | మాతృదేశం | కాళోజీ నారాయణరావు | దేశభక్తి | వచనకవిత | 50 |
| 7. | నా చదువు | సంగం లక్ష్మీబాయి | స్త్రీ సాధికారత | ఆత్మకథ | 61 |
| 8. | బాల్యక్రీడలు | బమ్మెర పోతన | పిల్లల స్వభావం | పద్యం | 70 |
| 9. | బడి | మాదిరెడ్డి సులోచన | సామాజిక బాధ్యత | కథానిక | 80 |
| 10. | గోలకొండ కోట | వేముగంటి నరసింహాచార్యులు | తెలంగాణ చారిత్రక వైభవం | పద్యం | 91 |
| 11. | సాహితీమూర్తి | బి.ఎన్.శాస్త్రి | స్ఫూర్తి | అభినందన వ్యాసం | 101 |
| 12. | శతక పద్యాలు | శతక కవులు | నైతిక విలువలు | పద్యం | 111 |
| 13. | భాగ్యోదయం | కృష్ణస్వామి ముదిరాజ్ | సంఘసేవ / సామాజికస్పృహ | జీవిత చరిత్ర | 122 |
| 14. | ప్రపంచపదులు | సి.నారాయణరెడ్డి | వ్యక్తిత్వ వికాసం | కవిత | 131 |
| 15. | సీతమ్మ గారి సీమ ప్రయాణం | పాకాల యశోదారెడ్డి | హాస్యం | కథ | 140 |
| 16. | హితబోధ | గోనబుద్ధారెడ్డి | హితోపదేశం | ద్విపద | 149 |
| 17. | పుస్తకాలు మన నిత్య సహచరులు | ఎ.పి.జె.అబ్దుల్ కలాం | ప్రేరణ / పఠనాభిలాష | ఆత్మకథ | 159 |
| 18. | అహంకారం | కొఱవి గోపరాజు | నైతిక విలువలు | పద్యం | 170 |
| | పదవిజ్ఞానం | | | | 181 |

# 1 వర్షాలు

– వానమామలై వరదాచార్యులు

## సాధించాల్సిన సామర్థ్యాలు – అభ్యసన ఫలితాలు

ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఈ కింది సామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలను సాధిస్తారు.

**I. భాషాంశాలు :**

అ) **పదజాలం** : ఇచ్చిన పదాలకు అర్థాలు రాయగలుగుతారు.

ఆ) **వ్యాకరణాంశాలు** : వర్ణమాలలో అచ్చులు, హల్లులు, హ్రస్వాలు, దీర్ఘాలు, అల్పప్రాణాలు, మహాప్రాణాలు గుర్తించగలుగుతారు, రాయగలుగుతారు.

**II. అవగాహన – ప్రతిస్పందన :**

అ) పాఠం చదివి ప్రాసపదాలను గుర్తించగలుగుతారు.

ఆ) అపరిచిత పేరాను చదివి ప్రశ్నలకు జవాబులను రాయగలుగుతారు.

**III. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

అ) **స్వీయరచన** : పాఠ్యభాగ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలుగుతారు.

ఆ) **సృజనాత్మకత** : అభ్యాసంలో ఇచ్చిన 'బతుకమ్మ' గేయాన్ని పొడిగించగలుగుతారు.

## అభ్యాసకులకు సూచనలు

- పాఠాన్ని చదువండి. తెలియని పదాలను గుర్తించండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరి అకారాది పట్టికలో వెతుకండి.
- పాఠాన్ని మళ్ళీ చదివి అర్థం చేసుకోండి.
- పాఠంలో అర్థంకాని అంశాల గురించి మీ సమీపంలోని ఉపాధ్యాయులు లేదా కేంద్రంలో బోధించే వారితో చర్చించి తెలుసుకోండి.
- బాక్సులో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను పాఠంలో గుర్తించండి.



## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'గేయ' ప్రక్రియకు చెందినది. గేయం లయబద్ధంగా పాడుకోవడానికి అనువుగా ఉంటుంది. గేయంలోని గణాలను 'మాత్రా' గణాలంటారు. ఈ పాఠం వానమామలై వరదాచార్యులు రాసిన 'విప్రలబ్ధ' అనే గేయ కథా కావ్యం లోనిది.

## పాఠం ఉద్దేశం / నేపథ్యం

వర్షం కురవడం వల్ల ప్రకృతిలో వచ్చే మార్పులు, పచ్చదనం, పర్యావరణంపట్ల ఆసక్తి, పశుపక్ష్యాదులు, మనుష్యులు పొందే ఆనందాన్ని తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

## కవి పరిచయం



16-08-1912
30-10-1984

వానమామలై వరదాచార్యులు 20వ శతాబ్దపు మహాకవుల్లో ప్రముఖుడు. ఈయన వరంగల్ అర్బన్ జిల్లాలోని మడికొండ గ్రామంలో జన్మించాడు. శ్రీమతి సీతాంబ, బక్కయ్య శాస్త్రి ఈయన తల్లిదండ్రులు. ప్రస్తుత మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ నందు స్థిరనివాసమేర్పచుకుని జీవించాడు. ఈయన మణిమాల, ఆహ్వానము, పోతన చరిత్రము, విప్రలబ్ధ, రైతుబిడ్డ, వైశాలిని, శ్రీస్తవరాజ పంచశతి మొదలగు అరవై నాలుగుకు పైగా రచనలు చేశాడు. అభినవ పోతన, అభినవ కాళిదాసు, మధురకవి, కవికోకిల వంటి బిరుదులనేకం పొందాడు. ఈయన 'ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి' పురస్కారం, వారణాసి విద్యాపీఠం వారి 'విద్యావాచస్పతి' పురస్కారం అందుకున్నాడు.



వచ్చెను వచ్చెను వర్షాలు
మా వసుధారాణికి తలబ్రాలు
విచ్చిన పూలై ప్రజాముఖమ్మున
వెల్లివిరిసెను మురిపాలు ॥వచ్చెను॥

## మీరేమి అర్థం చేసుకున్నారు?

- వర్షం చినుకులు వేటివలె ఉన్నవి?

కత్తులు కత్తులు మెరిసిన యట్టుల
ఉత్తర దిక్కున ఉరిమింది
కనుపాపల చెక్కని మెరిసింది.
గడగడ గడగడ దివి ఉరిమింది
చకచక చకచక దిశ మెరిసింది,
చలిగాడుపు రివరివ విసిరింది ॥ వచ్చెను ॥

పాడు కరవులకు బాణాలు మా
పంట చేలకివి ప్రాణాలు మా
కాపు కన్నులకు ముత్యాలు వరి
కర్రల నోళ్ళకు చనుబాలు ॥ వచ్చెను ॥

కోడెనాగులై ఉరికే వాగులు
క్షీరధారలై పారే తోగులు
భూసతి వానల తానములాడి
పచ్చిక కోకల పైట సవరించె ॥ వచ్చెను ॥

మీరేమి అర్థం చేసుకున్నారు?

- వర్షంలో తడిసిన పశుపక్ష్యాదులు ఏమి చేస్తున్నాయి?
- వర్షానికి గొడుగు పట్టుకొన్న రైతు ఎట్లా కనపడుతున్నాడు?



మదవృషభమ్ములు కొమ్ముల గ్రుమ్ముచు
మట్టిని జిమ్ముచు ఱంకెవేయగా
ముదిత మయూరం పింఛము విప్పి
ముద్దుగ నాట్యం సలిపింది. ॥ వచ్చెను ॥

ఆరవేసిన చీరల వోలె
తూరుపుగట్లం దావులు మేసె
నడిచే నల్లని గండ శిలలవలె
పడమటి గట్లను గేదెలు మేసె ॥ వచ్చెను ॥

కమ్మగొడుగుతో కాపు ఛత్రపతి
చేలలోన భూపాలుండయ్యె
పశుపతియై ములుకోలను బూని
కరువుల పాలిటి కాలుండయ్యె ॥ వచ్చెను ॥





## సారాంశం

కురుస్తున్న వర్షపు చినుకులు భూమి అనే రాణిపై తలంబ్రాలుగా పడుతున్నాయి. ప్రజలందరి ముఖాల్లో సంతోషపు వెలుగులు పువ్వుల్లా విచ్చుకున్నాయి. మేఘాలు ఒకదానికొకటితాకి కత్తులు కత్తులు రాసుకున్నట్లుగా ఉత్తరాన ఉరిమింది. మెరుపులు మెరిసాయి. కళ్ళు జిగేలుమన్నాయి. ఆకాశం గడగడమని ఉరిమింది. దిక్కులన్నీ తళుక్కున మెరిసాయి. చలిగాలి రివ్వుమని వీచింది.

వర్షం పంటలకు ప్రాణం పోస్తుంది. వర్షం చినుకులు బాణాలుగా కరువును పోగొడుతాయి. వాగులు కోడె నాగులై, వంకలు పాలధారలై పొంగిపొర్లుతున్నాయి. వర్షంతో తడిసిన నేల పచ్చదనంతో నిండింది. భూదేవికి ఆకుపచ్చని చీరకట్టినట్లుగా ఉంది.

వర్షం కురుస్తుంటే ఎద్దులు కొమ్ములతో కుమ్ముతూ, మట్టిని ఎగజిమ్ముతూ అంకెలు వేస్తున్నాయి. నెమలి పురి విప్పి, సంతోషంతో అందంగా నాట్యం చేస్తున్నది.

ఆరవేసిన చీరలవలె ఆవులు తూర్పున మేస్తున్నాయి. నడుస్తున్న నల్లని కొండరాళ్ళవలె కనిపించే బర్రెలు పడమటన మేస్తున్నాయి.

తాటి కమ్మతో చేసిన గొడుగు పట్టుకున్న రైతు, పొలమనే సామ్రాజ్యానికి చక్రవర్తిలా కనపడుతున్నాడు. చేతిలో ముల్లు కర్రను పట్టుకున్న అతడు పశుపతి (శివుడు) వలె ఉన్నాడు. చేతిలో దండము ధరించి, కరువును పోగొట్టే యమునివలె కనపడుతున్నాడు.

# భాషాసామర్థ్యాలను సాధిద్దాం!

## I. భాషాంశాలు

### పదజాలం

**అ) గీత గీసిన పదాలకు అర్థాలను రాయండి.**

1) పచ్చని చెట్లు, పంటపొలాలతో 'వసుధ' ఎంతో అందంగా కనిపిస్తుంది. ________________

2) నల్లని మేఘాలతో 'దివి' అంతా చీకటి కమ్ముకుంది. ________________

ఆ) 'గడగడ, చకచక' - ఇలాంటి పదాలను ధ్వన్యనుకరణ పదాలు అంటారు. కింది ధ్వన్యనుకరణ పదాలను వాటికి చెందిన పనులతో జతచేయండి.

| ధ్వన్యనుకరణ పదాలు | పనులు |
|---|---|
| తళతళ | నడుస్తున్నది |
| చకచక | తిరుగుతున్నది |
| గిరగిర | నవ్వుతున్నది |
| కిలకిల | మెరుస్తున్నది |

## వ్యాకరణం

అ) తెలుగుభాషలోని వర్ణాలను మూడు విధాలుగా విభజించారు.

అవి 1. అచ్చులు 2. హల్లులు 3. ఉభయాక్షరాలు

1) అచ్చులు :

అ - ఆ - ఇ - ఈ - ఉ - ఊ - ఋ - ౠ - ఎ - ఏ - ఐ - ఒ - ఓ - ఔ

ఇవి హ్రస్వాలు, దీర్ఘాలు అని రెండు విధాలు.

ఎ) హ్రస్వాలు : ఒక మాత్రకాలంలో ఉచ్చరించే అచ్చులను 'హ్రస్వాలు' అంటారు.

అవి: అ - ఇ - ఉ - ఋ - ఎ - ఒ ('మాత్ర' అంటే కనురెప్ప పాటు కాలం)

బి) దీర్ఘాలు : రెండు మాత్రల కాలంలో ఉచ్చరించే అచ్చులను 'దీర్ఘాలు' అంటారు.

అవి: ఆ - ఈ - ఊ - ౠ - ఏ - ఐ - ఓ - ఔ

2) హల్లులు :

క ఖ గ ఘ ఙ
చ ౘ ఛ ౙ జ ఝ ఞ
ట ఠ డ ఢ ణ
త థ ద ధ న
ప ఫ బ భ మ
య ర ల వ
శ ష స హ ళ ఱ

ఉచ్చారణ విధానాన్ని బట్టి హల్లులను ఈ కింది విభాగాలు చేశారు.

ఎ) క, చ, ట, త, ప - పరుషాలు

బి) గ, జ, డ, ద, బ - సరళాలు

సి) ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ లు మహాప్రాణాలు, వర్గయుక్కులు అని అంటారు.

డి)　ఙ, ఞ, ణ, న, మ　–　అనునాసికాలు.

ఇ)　య, ర, ల, వ　–　అంతస్థాలు.

ఎఫ్)　శ, ష, స, హ　–　ఊష్మాలు.

**సూచన :** "ఱ" అక్షరాన్ని ఆధునిక వ్యవహార భాషలో ఉపయోగించడం లేదు. దీనికి బదులు ఇప్పుడు 'ర' ను వాడుతున్నారు. అట్లే చ, జ లు వాడుకలో లేవు, వీటికి బదులుగ చ, జ లను వాడుతున్నారు.

3. **ఉభయాక్షరాలు :** మూడు. అవి సున్న 'ం' (పూర్ణబిందువు), అరసున్న 'ఁ', విసర్గ 'ః'. ఈ మూడింటిని **అచ్చులతోను, హల్లులతోనూ ఉపయోగించడంవల్ల వీటిని 'ఉభయాక్షరాలు' అని అంటారు.**

**సూచన :** అరసున్నకు గ్రాంథికభాషలో ప్రాధాన్యమున్నది. విసర్గ సంస్కృతపదాలలో మాత్రమే కనబడుతోంది.

**ఎ) కింది వాక్యంలో పరుషాలను గుర్తించి వాటి కింద గీత గీయండి.**

కష్టపడి చదివితే ఫలితం తప్పక ఉంటుంది.

**బి) కింది మాటల్లో సరళాలతో మొదలయిన మాటలను గుర్తించండి.**

బలం, కలం, గాలి, జలం, దళం, తళుకు, కాలు, డబ్బు, గళం

**సి) కింది మాటల్లో అంతఃస్థాలను గుర్తించండి.**

యమున, కారం, పాలు, వంకర, వేళ, కల

**డి) కింది వాక్యంలో ఊష్మాలను గుర్తించండి.**

భాష మనిషికి సహజమైన శక్తి.

## II. అవగాహన-ప్రతిస్పందన

**అ) వర్షం గేయాన్ని రాగయుక్తంగా పాడండి. కంఠస్థం చేయండి.**

**ఆ) గేయంలో 'మెరిసింది, ఉరిమింది' వంటి ప్రాసపదాలను గుర్తించండి. వాటి కింద గీతగీయండి.**

**ఇ) కింది పేరాను చదువండి. ప్రశ్నలకు జవాబులను రాయండి.**

మన దేశం ఒక పుణ్యభూమి. ఈ దేశంలో భారతీయులు ప్రకృతి ఆరాధనలో భాగంగా చెట్లను, పుట్టను, గుట్టను, పశుపక్ష్యాదులన్నింటినీ పూజిస్తారు, గౌరవిస్తారు. ప్రతి పూజ, నోము, పండుగల వెనుక పూర్వులు ఒక గొప్ప సామాజిక కోణాన్ని, చారిత్రక సత్యాన్ని, ప్రాకృతిక మార్పులను సంకేతాల రూపంలో మనకు అందించారు. సర్వమానవాళి సుఖంగా ఉండాలనే కోరికతోపాటు, జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాలనే సందేశాన్ని అందించారు. అంతేకాకుండా ప్రకృతిలోని మార్పులకు అంటే ఋతు, కాలమార్పులకనుగుణంగా ఏ పదార్థాలు తీసుకోవాలి? ఏ వేషధారణ ఉండాలి? అనే విషయాలకు నియమాలను జోడించారు.



మనం జరుపుకునే ఉగాది, వినాయకచవితి, బతుకమ్మ, సంక్రాంతి పండుగలన్నీ కూడా ప్రకృతి, ఋతు మార్పులకనుగుణంగా జరుపుకునే పండుగలే! దసరా, దీపావళి పండుగలు అధర్మంపై ధర్మం సాధించిన 'విజయాని'కి సంకేతంగా జరుపుకునే పండుగలు. మన పండుగలు సమాజానికి మనిషికీ, ప్రకృతికీ మనిషికీ మధ్య ఉండే సంబంధాన్ని తెలిపే సాంస్కృతిక వారసత్వ సంపద అని చెప్పవచ్చు. ఈ పండుగల్లో 'బతుకమ్మ' ప్రకృతి ఆరాధనకు నిలువెత్తు సాక్ష్యం. తంగేడు, గునుగు, గుమ్మడి ఒకటేమిటి తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి, ఒక చోట పెట్టి, ఊరంతా ఆడడం సామాజిక సమైక్యతకు, సమరస భావానికి నిదర్శనమని చెప్పవచ్చు. అందరూ కలిసి ఆడిపాడడం, చక్కని పలకరింపులు, తీయని మాటలు అన్నీ ఒక అద్భుతమైన జీవనసారం. ప్రకృతి ఆరాధనే మానవ జీవన మనుగడకు ఆధారమనే సందేశాన్ని అందిస్తుంది. మన పూర్వులు పర్యావరణ పరిరక్షణకు ఆనాడే శ్రీకారం చుట్టారు. వినాయక చవితి, ఉగాది, హోళీ అన్నీ కూడా ప్రకృతిమాతకు మనం చేసే ఆరాధన అని చెప్పవచ్చు.

**ప్రశ్నలు :**

1) మనం ప్రకృతి ఆరాధనలో భాగంగా వేటిని పూజిస్తాం?

2) దసరా, దీపావళి పండుగలను ఎందుకు జరుపుకుంటాం?

3) ప్రకృతి ఆరాధనకు సాక్ష్యమైన పండుగ ఏది?

4) బతుకమ్మను ఏయే పూలతో పేరుస్తారు?

5) పై 'పేరా' ద్వారా మీరేం తెలుసుకున్నారు?

## III. వ్యక్తీకరణ-సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులను రాయండి.**

1) వర్షానికి రైతుకు గల సంబంధాన్ని వివరించండి.

2) 'వర్షం' గేయ రచయిత పరిచయాన్ని రాయండి.

3) వర్షం పంటలకు ప్రాణం పోస్తుందనడంలో కవి ఉద్దేశమేమి?

**ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబును రాయండి.**

1) 'వర్షం' గేయ సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.



## సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది పాటను పొడిగించి రాయండి.**

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో
బంగారు బతుకమ్మ ఉయ్యాలో
రావమ్మ బతుకమ్మ ఉయ్యాలో
రంగులా బతుకమ్మ ఉయ్యాలో



______________________________

______________________________

______________________________

## నేను ఏయే సామర్థ్యాలు సాధించాను? (స్వీయమూల్యాంకనం)

| | | |
|---|---|---|
| 1) | పదాలకు అర్థాలు రాయగలను. | అవును / కాదు |
| 2) | వర్ణమాలలో అచ్చులు, హల్లులు అల్ప, మహాప్రాణాలు వంటి వాటిని గుర్తించగలను. | అవును / కాదు |
| 3) | గేయంలో ప్రాసపదాలను గుర్తించగలను, అపరిచిత పేరాను చదివి ప్రశ్నలకు జవాబులను రాయగలను. | అవును / కాదు |
| 4) | గేయ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలను. | అవును / కాదు |
| 5) | గేయాన్ని పొడిగించగలను. | అవును / కాదు |

### సూక్తి

"ప్రకృతిని ప్రేమించు..., ఆరాధించు...., రక్షించు....
అది నీకు సహకరిస్తుంది. సంరక్షిస్తుంది.
జీవితాంతం తోడుగా నిలుస్తుంది."

# 2 స్నేహగీతి

– దాశరథి కృష్ణమాచార్య

## సాధించాల్సిన సామర్థ్యాలు – అభ్యసన ఫలితాలు

ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఈ కింది సామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలను సాధిస్తారు.

**I. భాషాంశాలు :**

అ) **పదజాలం** : కఠిన పదాలకు అర్థాలు, పర్యాయపదాలు, నానార్థాలు రాయగలుగుతారు.

ఆ) **వ్యాకరణాంశాలు** : నామవాచక, సర్వనామ, విశేషణాలను గుర్తించి వివరించగలుగుతారు.

**II. అవగాహన – ప్రతిస్పందన :**

అ) గేయాన్ని కంఠస్థం చేసి గేయసారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగలుగుతారు.

ఆ) అపరిచిత కథలను చదివి, ప్రశ్నలకు జవాబులు రాయగలుగుతారు.

**III. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

అ) **స్వీయరచన** : గేయ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలుగుతారు.

ఆ) **సృజనాత్మకత** : ఇచ్చిన ఆధారాలకు అనుగుణంగా 'స్నేహం' విలువను తెలిపే 'కథ'ను రాయగలుగుతారు.

## అభ్యాసకులకు సూచనలు

- పాఠాన్ని చదువండి. తెలియని పదాలను గుర్తించండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరి అకారాది పట్టికలో వెతుకండి.
- పాఠాన్ని మళ్ళీ చదివి అర్థం చేసుకోండి.
- పాఠంలో అర్థంకాని అంశాల గురించి మీ సమీపంలోని ఉపాధ్యాయులు లేదా కేంద్రంలో బోధించే వారితో చర్చించి తెలుసుకోండి.
- బాక్సులో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను పాఠంలో గుర్తించండి.



## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం గేయ ప్రక్రియకు చెందినది.
గేయం పాడుకోవడానికి వీలుగా ఉంటుంది.
ఈ గేయం దాశరథి కృష్ణమాచార్య రచించిన "కవితాపుష్పకం" సంపుటిలోనిది.

## పాఠం ఉద్దేశం / నేపథ్యం

జన్మలన్నింటిలో మానవజన్మ ఉదాత్తమైనది. ఎన్నోబంధాలు, అనుబంధాలతో ముడివేసుకొని ఉన్నది. తల్లి, తండ్రి, సోదరుడు, సోదరి ఇలా పుట్టుకతో వచ్చినవి కొన్నిబంధాలైతే, ఆలోచనలు, అలవాట్లు, అభిరుచులు, అవసరాలు, భావాలు, భావనలు కలిపే బంధాలు కొన్ని. అటువంటి బంధాలలో జీవితాంతం తోడుండే బంధం "స్నేహబంధం". స్నేహితుడు అంటేనే మేలుకోరేవాడు అని అర్థం. అటువంటి స్నేహితుని లక్షణాలను వివరిస్తూ, వాటి విశిష్టతను తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

## కవి పరిచయం



**22-07-1925**
**05-11-1987**

దాశరథి కృష్ణమాచార్య పూర్వపు వరంగల్ జిల్లా నేటి మహబూబాబాద్ జిల్లాలోని చినగూడూరులో జన్మించాడు. నాటి పాలకులపై ప్రజావ్యతిరేక పోరాటాల్లో ఆచరణాత్మక వైఖరితో ప్రజలను చైతన్యవంతులను చేసిన ఉద్యమకవి. అగ్నిధార, రుద్రవీణ, మహాంధ్రోదయం, పునర్నవం, కవితాపుష్పకం, తిమిరంతో సమరం, అమృతాభిషేకం, ఆలోచనాలోచనాలు మొదలైన కవితా సంపుటాలను, నవమి (నాటికలు), యాత్రాస్మృతి (స్వీయచరిత్ర) వంటి పలుగ్రంథాలను రచించి, సినీగేయకవిగా ప్రసిద్ధి చెందాడు.

తెలుగులో గజల్ ప్రక్రియకు ప్రాణంపోసాడు. 1961లో గాలిబ్‌గజళ్ళను తెలుగులోకి అనువదించాడు. ఈయన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు (1967), కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు (1974) అందుకున్నాడు.

తైలాలు లేకుండ వెలిగేటి దీపం
విద్యుత్తు లేకుండ వెలిసేటి దీపం
హృదయాలలో ఎప్పుడు నిలిచేటి దీపం
నిజమైన దీపం మా స్నేహదీపం
మనసులో దీపం, మలిపితే పాపం

వర్ణాలు వర్గాలు వదిలితే స్నేహం
వేషాలు రోషాలు మానితే స్నేహం
ప్రాణాల నర్పించగలిగితే స్నేహం
కష్టాలనష్టాల నోర్చితే స్నేహం ॥ మనసులో దీపం॥

నిరుపేద అయితేమి? ఎవ్వరైతె ఏమి?
చదివేమిరానట్టి చవటయితె ఏమి?
అందాలు చందాలు లేకుంటె ఏమి?
నిన్ను కాచినవాడె నిజమైన నేస్తం ॥ మనసులో దీపం॥

దోస్తీని మించింది లేదు లోకాన
రత్నాలకంటె అది మిన్న తూకాన
మిత్రుడె కావాలి సుఖమున శోకాన
అతడు లేకున్నచో నగరమే కాన ॥ మనసులో దీపం॥

చీకట్లలో దారి చూపేది నేస్తం
కళ్ళు తలకెక్కితే దింపేది నేస్తం
మనలోని లోపాలు తెలిపేది నేస్తం
నిజమైన మనిషిగా నిలిపేది నేస్తం ॥ మనసులో దీపం॥





### మీరేమి అర్థం చేసుకున్నారు?

- స్నేహం ఎలాంటిది?
- స్నేహాన్ని ఎలా కాపాడుకోవాలి?
- స్నేహం ఏం చేస్తుంది?

### సారాంశం

1) మనిషికి స్నేహం ఒక దీపం వంటిది. దానిని ఆర్పే ప్రయత్నం చేయడం పాపం.

స్నేహదీపం వెలగడానికి ఎటువంటి నూనెలు, విద్యుత్తు అవసరంలేదు.

స్నేహదీపం మనసులలో ఎప్పుడూ వెలుగుతూనే ఉంటుంది. అదే నిజమైన స్నేహ దీపం.

2) కుల, మత, జాతి భేదాలు లేకుండా ఆవేశాలు, అపోహలు విడిచిపెట్టి కష్టాలను, నష్టాలను భరిస్తూ, ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉండేది స్నేహం.

3) పేదవాడివైన, చదువురానివాడివైనా, అందచందాలు లేకున్నా ఆపదలో నిన్ను ఆదుకున్నవాడే నిజమైన స్నేహితుడు.

4) ఈ ప్రపంచంలో స్నేహాన్ని మించిన సంపదలేదు. ఏ రత్నము కూడా స్నేహం విలువను తూచలేదు. సుఖదుఖాలలో తోడుండేవాడే స్నేహితుడు. స్నేహితుడు లేకుండా మనం ఎంతమంది మధ్యలో ఉన్నా (నగరంలో ఉన్నా) అది అడవిలో ఒంటరిగా ఉన్నట్టే.

5) మనిషి కష్టాలలో, ఆపదలో ఉన్నప్పుడు దారిచూపించేది స్నేహం. తనను తానుమరచి అహంకారంతో విర్రవీగితే అదిసరికాదని తెలిపేది స్నేహం. చేసిన, చేస్తున్న లోపాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ మనిషిని మనిషిగా నిలిపేది స్నేహం. అందుకే, మనిషికి స్నేహం ఒక దీపం వంటిది. దానిని ఆర్పే ప్రయత్నం చేయడం. పాపం చేయడంతో సమానం.

# భాషాసామర్థ్యాలను సాధిద్దాం!

## I. భాషాంశాలు

### పదజాలం

**అ) గీత గీసిన పదాలకు అర్థాలను రాయండి.**

1) విద్యార్థులకు <u>ఓర్పు</u> చాలా అవసరం.

2) చిన్న పిల్లలు తమ బాధను <u>శోకం</u> ద్వారా తెలియజేస్తారు.

**ఆ) కింది వాక్యాలలో ఒకే అర్థాన్నిచ్చే పదాలున్నాయి. వాటి కింద గీత గీయండి.**

1) అడవి మార్గంలో ప్రయాణం ప్రమాదం. కానలో వివిధ జంతువులు ఉంటాయి.

2) మానవులకు క్రోధగుణం కీడు చేస్తుంది, కావున మనుషులు కోపాన్ని వీడాలి.



## వ్యాకరణం

**అ) కింది గద్యాన్ని చదువండి. గీతగీసిన పదాలను పరిశీలించండి.**

1) ఉమ, గౌస్, అబ్రహం, మధు, శ్వేత, పర్వీనా వరంగల్‌లో జరిగిన మిత్రుని వివాహానికి వచ్చారు. వీరు హైద్రాబాద్, ఖమ్మం, మెదక్, నల్గొండ జిల్లాల నుండి వచ్చారు. వాళ్ళు వారివారి ఊర్లలో దొరికే జామ, బత్తాయి, సపోటా పండ్లను తెచ్చారు. వివాహానికి వచ్చినవారికి పంచారు.

గీతగీసిన పదాల్లో వ్యక్తుల పేర్లు, జిల్లాల పేర్లు, పండ్ల పేర్లు ఉన్నాయి కదా!

ఇట్లా వ్యక్తుల, ప్రాంతాల, వస్తువుల పేర్లను తెలిపేవాటిని **"నామవాచకాలు"** అంటారు.

మీకు తెలిసిన మరికొన్ని నామవాచక పదాలను రాయండి.

______ ______ ______ ______

**ఆ) కింది వాక్యాలు చదువండి. గీతగీసిన పదాలను చూడండి.**

1) లక్ష్మి తెలివైన బాలిక. ఆమె రోజూ కథల పుస్తకాలు చదువుతుంది.

2) శ్రీను పాట పాడినాడు. అతని కంఠం శ్రావ్యంగా ఉంటుంది.

3) కుక్క విశ్వాసంగల జంతువు. అది మనల్ని కాపాడుతుంది.

పై వాక్యాలలో లక్ష్మి, శ్రీను, కుక్క నామవాచక పదాలు.

"లక్ష్మికి బదులు ఆమె, శ్రీనుకు బదులు అతడు, కుక్కకు బదులు అది" అనే పదాలున్నాయి కదా!

ఇట్లా నామవాచకానికి బదులుగా వాడే పదాలను **"సర్వనామాలు"** అంటారు.

మీకు తెలిసిన మరికొన్ని సర్వనామాలను రాయండి.

______ ______ ______ ______

**ఇ) కింది వాక్యాలు చదువండి. గీతగీసిన పదాలను పరిశీలించండి.**

1) పాలపిట్ట. అందంగా ఉన్నది.

2) ఆకాశం నీలిరంగులో శోభిస్తున్నది.

3) కాకరకాయ చేదుగా ఉన్నది.

4) ప్రవీణ్ చక్కగా పాడుతాడు.

5) యూసుఫ్ ఐస్‌క్రీం ఇష్టంగా తింటాడు.

పై వాక్యాలలోని గీతగీసిన పదాలు గమనించారు కదా! *అందంగా, నీలిరంగు, చేదు, చక్కగా, ఇష్టంగా* అనేవి గుణాన్ని తెలిపే పదాలు. గుణాలను తెలిపే పదాలను **"విశేషణాలు"** అంటారు.

మీకు తెలిసిన మరికొన్ని విశేషణాలను రాయండి.

______ ______ ______ ______



## II. అవగాహన-ప్రతిస్పందన

**అ) స్నేహగీతి గేయాన్ని కంఠస్థం చేయండి.**

**ఆ) కింది గద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

స్నేహానికి పేద ధనిక భేదం లేదని చాటే అద్భుతకథ 'కృష్ణ-కుచేలుర' కథ. సాందీప మహర్షి వద్ద కృష్ణ-కుచేలులు విద్యను నేర్చుకున్నారు. ('కుచేలుడు' అంటే చినిగిన బట్టలు కలవాడు అని అర్థం.) పెరిగి పెద్దవారయ్యాక కుచేలుడు అధిక సంతానం వల్ల బీదవాడయ్యాడు. శ్రీకృష్ణ భగవానుడు మీ మిత్రుడే కదా! ఆయన వద్దకు వెళ్ళి సహాయం అడుగమని కుచేలుని భార్య ప్రాధేయపడింది. ఆ మాటలు విన్న కుచేలుడు తన మిత్రుడిని కనులారా చూడవచ్చని కృష్ణుడి వద్దకు కొన్ని అటుకులతో వెళ్ళాడు. మిత్రుడి వేషాన్ని చూసిన కాపలావారు లోనికి వెళ్ళకుండా అడ్డగించారు. కాని మిత్రునిరాక తెలిసిన కృష్ణుడు రుక్మిణితో కల్సివచ్చి, సాదరంగా ఆహ్వానించడంతోపాటు ఇతని కాళ్ళు కడిగి నీళ్ళు నెత్తిపై చల్లుకున్నారు. కమ్మని భోజనం పెట్టారు. కృష్ణుని మర్యాదకు ఉబ్బితబ్బిబ్బైన కుచేలుడు ఏమీ అడుగకుండానే వెనుదిరిగాడు. స్నేహం తప్ప మరేమి కోరని వాడు కుచేలుడు. నోరు తెరిచి ఏమీ అడగకున్నా, అన్నీ తెలిసిన శ్రీకృష్ణుడు మిత్రునికి ఎంతవైభవం ఇవ్వాలో అంతా ఇచ్చాడు.

1) 'కృష్ణ కుచేలుర' కథ దేనికి సంబంధించినది?

2) కృష్ణుని లక్షణం ఏమిటి?

3) కుచేలుడు కృష్ణుని వద్దకు ఎందుకు వెళ్ళాడు?

4) కుచేలుడు కృష్ణుడిని ఏమి కోరాడు?

5) కృష్ణుడు కుచేలునికి ఏ విధంగా స్వాగతం పలికినాడు?

**ఇ) కథలంటే మనందరికీ ఇష్టం కదా! ముఖ్యంగా 'పంచతంత్ర' కథలు తెలియని వారుండరు. సంస్కృతభాషలో విష్ణుశర్మ రాసిన పంచతంత్ర కథలను, చిన్నయసూరి తెలుగులోనికి అనువదించాడు. అందులోని 'మిత్రలాభం' లోని కథను చదువండి.**

హిరణ్యకుడు అనే ఎలుక చెట్టు కింది కన్నంలో ఉండేది. చెట్టుపైన కాకి, ప్రక్కనే చెరువులో ఉన్న తాబేలు ముగ్గురు మంచి స్నేహితులు. ఒకరోజు ఈ ముగ్గురు అడవిమార్గం గుండా వెళుతుండగా వలలో చిక్కిన చిత్రాంగుడనే లేడి కనిపించింది. హిరణ్యకుడు వలను కొరికి చిత్రాంగుడిని విడిపించాడు. ఆ లేడి వీరితో స్నేహాన్ని కోరింది. అప్పటి నుండి ఆ నాలుగు రోజూ కల్సి వాటి కష్టసుఖాలు చర్చించుకొంటూ ఆనందంగా ఉండేవి.

ఒకరోజు ఎలుక, కాకి, లేడి రావడం చూసి చెరువులో నుండి మంథరుడు అనే తాబేలు నెమ్మదిగా బయటకు రాబోయింది. అంతలో అటుగా వచ్చిన వేటగాడిని చూసి లేడి పరుగెత్తింది. కాకి ఎగిరిపోయింది. ఎలుక కన్నంలోకి వెళ్ళింది. తాబేలు వేటగాడికి చిక్కింది. దానిని తనవిల్లుకు కట్టుకుని బయలుదేరాడు వేటగాడు.

తాబేలు వేటగాడికి చిక్కడంవల్ల మిగిలిన ముగ్గురు స్నేహితులకు బాధయ్యింది. అవి వేటగాడిని అనుసరించాయి. ఒక ఉపాయం ఆలోచించాయి. లేడి దూరంగా వెళ్ళి చనిపోయినట్టు నటించగా, కాకి దానిని పొడుస్తున్నట్టు నటించింది. అది నిజమని నమ్మిన వేటగాడు తన విల్లును కిందపెట్టి లేడివైపు నడిచాడు. వేటగాడు లేడివద్దకు చేరేలోపు కాకి ఎగిరిపోయింది. లేడి లేచి పరుగెత్తింది. హిరణ్యకుడు విల్లును కొరికి తాబేలును విడిపించాడు.

పై కథ ఆధారంగా కింది వాక్యాలను పూరించండి.

1) ఎలుక పేరు ______________________________.

2) చిత్రాంగుడు అనగా ______________________________.

3) మంథరుడు అనగా ______________________________.

4) హిరణ్యకుడు విల్లును కొరికి ______________________________.

5) లేడి చనిపోయినట్లుగా ______________________________.

## III. వ్యక్తీకరణ-సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులను రాయండి.**

1) దాశరథి కృష్ణమాచార్య గురించి రాయండి.

2) "స్నేహం మానవుని జీవితంలో దీపం వంటిది" ఎలాగో రాయండి.

3) 'స్నేహం' చేయాలంటే ఎటువంటి గుణాలు ఉండాలి?

4) స్నేహం వల్ల కలిగే ప్రయోజనాలను రాయండి.

**ఆ) కింది ప్రశ్నకు పదేసి వాక్యాలలో జవాబులను రాయండి.**

1) 'స్నేహగీతి' గేయం సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.



## సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది సూచనల ఆధారంగా స్నేహం విలువను తెలిపే 'కథ'ను రాయండి.**

రక్షిత, రమ్య, అక్షయ ముగ్గురు చర్లపల్లి పాఠశాలలో కలిసి చదువుకున్నారు. రక్షిత, అక్షయ కుటుంబ నేపథ్యం బాగుండటంవల్ల చక్కగా చదువుకొని జీవితంలో స్థిరపడ్డారు. రమ్య తండ్రి చిన్నప్పుడే మరణించడంవల్ల, అర్ధాంతరంగా చదువు ఆపి, తన చెల్లెళ్ళకు తోడుగా ఉండిపోవాల్సివచ్చింది. స్థిరపడిన రక్షిత, అక్షయలు రమ్యకు ఎలా అండగా నిలిచారో ఊహిస్తూ చిన్న కథను రాయండి.

### నేను ఏయే సామర్థ్యాలు సాధించాను? (స్వీయమూల్యాంకనం)

| | | |
|---|---|---|
| 1) | వాక్యాల ఆధారంగా పదాలకు అర్థాలు తెలుసుకున్నాను. | అవును / కాదు |
| 2) | నామవాచకాలు, సర్వనామాలు, విశేషణాలను గుర్తించగలను. | అవును / కాదు |
| 3) | పరిచిత కథను చదివి అర్థం చేసుకోగలను. ప్రశ్నలకు జవాబులు రాయగలను. | అవును / కాదు |
| 4) | గేయసారాంశాన్ని సొంతమాటల్లో రాయగలిగాను. | అవును / కాదు |
| 5) | సూచనలకు అనుగుణంగా కథను సొంతంగా రాయగలిగాను. | అవును / కాదు |

### సూక్తి

**మనలోని భావాలను, బాధలను, కష్టాలను ఎవరితోనైతే నిర్భయంగా, నిస్సంకోచంగా పంచుకోగలమో వారే మనకు నిజమైన స్నేహితులు.**

# 3 సత్పాత్రదానము

– భండారు అచ్చమాంబ

## సాధించాల్సిన సామర్థ్యాలు – అభ్యసన ఫలితాలు

ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఈ కింది సామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలను సాధిస్తారు.

**I. భాషాంశాలు :**

అ) **పదజాలం** :
- ఇచ్చిన వాక్యాల ఆధారంగా పదాలకు అర్థాలను గుర్తించగలుగుతారు. ప్రకృతి, వికృతులను తెలుసుకొని గుర్తించగల్గుతారు.
- జాతీయాలను అర్థం చేసుకొని వివరించగలుగుతారు.

ఆ) **వ్యాకరణాంశాలు** : సమాపక, అసమాపక క్రియలను గుర్తించగలరు. 'కాలాలు – క్రియల'ను అర్థం చేసుకొంటారు, గుర్తించగలుగుతారు.

**II. అవగాహన – ప్రతిస్పందన :**

అ) 'బయోడేటా'ను చదివి అవగాహన చేసుకోగలుగుతారు, రాయగలుగుతారు.

**III. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

అ) **స్వీయరచన** : సత్పాత్రదానం కథను సొంతమాటల్లో రాయగలుగుతారు.

ఆ) **సృజనాత్మకత** : వ్యక్తుల మధ్య సంభాషణలను ఊహించి రాయగలుగుతారు.

## అభ్యాసకులకు సూచనలు

- పాఠాన్ని చదువండి. తెలియని పదాలను గుర్తించండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరి అకారాది పట్టికలో వెతుకండి.
- పాఠాన్ని మళ్ళీ చదివి అర్థం చేసుకోండి.
- పాఠంలో అర్థంకాని అంశాల గురించి మీ సమీపంలోని ఉపాధ్యాయులు లేదా కేంద్రంలో బోధించే వారితో చర్చించి తెలుసుకోండి.
- బాక్సులో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను పాఠంలో గుర్తించండి.



## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం కథానిక ప్రక్రియకు చెందినది. కథానిక జీవితపు ముఖ్య సన్నివేశాల్ని క్లుప్తంగా తెలియజేస్తుంది. సంఘటనల మధ్య సంబంధాన్ని కళాత్మకంగా చిత్రిస్తుంది. ఇది వచన ప్రక్రియల్లో ఒకటి. కథనం, పాత్రచిత్రణ సంభాషణలు, శిల్పం, సంక్షిప్తత కథానిక లక్షణాలు. 1902 ఆగస్టులో 'హిందూ సుందరి' అను పత్రికలో ప్రచురితమైన భండారు అచ్చమాంబ కథానికనే ప్రస్తుత పాఠ్యభాగం.

## పాఠం ఉద్దేశం / నేపథ్యం

కథానికను పరిచయం చేస్తూ, 1902 కాలం నాటి భాషా సౌందర్యాన్ని తెలియపరచడం, అర్హులైన వారికే దానం చేయాలని తెలియజేయడం, పిల్లల్లో దానగుణాన్ని పెంపొందించడం ఈ పాఠం ఉద్దేశం.

## కవి పరిచయం



(1874 - 1905)

తెలుగులో తొలి కథానిక రచయిత్రి భండారు అచ్చమాంబ. ఈమె కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలులో జన్మించింది. తన ఆరవ ఏటనే నల్లగొండ జిల్లా దేవరకొండకు వచ్చి తన సోదరుడు కొమర్రాజు శంకరరావు సంరక్షణలో పెరిగింది. ఆమె మేనమామ భండారు మాధవరావుతో అచ్చమాంబ వివాహం జరిగింది. వివాహానంతరం కొమర్రాజు లక్ష్మణరావు సహాయంతో చదువడం, రాయడం నేర్చుకుంది. స్వదేశాభిమానం, సంస్కరణాభిలాషతో రచనలు చేసింది.

గుణవతియగు స్త్రీ, లలిత శారదలు, జానకమ్మ, దంపతుల ప్రథమకలహం, స్త్రీ విద్య, ధనత్రయోదశి, భార్యాభర్తల సంవాదం, అద్దమును సత్యవతియును, బీద కుటుంబం మొదలైన కథలు రాసింది. 'అబలాసచ్చరిత్ర రత్నమాల' అనే గ్రంథం ఈమె రాసిన మరొక విశిష్ట రచన.

# I

మేడ మీద గవాక్షము దగ్గిర కుర్చీపైన కూర్చుండి కేశవుడు తన పాఠము చదువుకొనుచుండెను. ఇంతలోనొక గ్రుడ్డివాడు అయ్యా! కండ్లులేని కబోధినయ్యా, ధర్మము, సెయ్యరయ్యా, ఆకలి చేత కడుపు మండుకొనుపోతున్నదమ్మా! అని వీథిని నడుచుచుండెను. వాని దీన వాక్యములను విని కేశవుడు తల్లినిగని అమ్మా! వీథిలో గ్రుడ్డివాడొకడు ఆకలిచేత బాధపడుచు బోవుచున్నాడు. పాపము వాడు చాలా బీదవాడు. వానికిచ్చుటకొక పావలాయిచ్చెదవా? అని అడిగెను.

పాత్రాపాత్ర భేదము తెలియని యా బాలుని మాటలను విన్న మాత్రముననే పావలానతనికి నియ్యజాలక లక్ష్మీదేవమ్మ యా గ్రుడ్డివాడు పావలానిచ్చుటకర్హుడోకాడో విచారింపనెంచి వానిని మన యింటికి దీసికొని రమ్మని కేశవుని పంపెను. కేశవుడు తోడ్కొని వచ్చెను.

**లక్ష్మీదేవమ్మ** : నీవాకలిగొని యున్నావని మాకేశవుడు చెప్పుచున్నాడు. నిజమేనా? అట్లైన నీకు నేనింత యన్నము పెట్టెదను. దానిని తిని యాకలి చల్లార్చుకొనుము.



**గ్రుడ్డివాడు** : నీ కడుపు చల్లగుండి నీ కొడుకు ముసలోడుగాను; దేవుడు మీకు శుభములిచ్చును.

**లక్ష్మీదేవమ్మ** : ఇంటిదగ్గర నీకెవరెవరు బంధువులు కలరు?

**గ్రుడ్డివాడు** : ఆడ నా పెండ్లాము, ఇద్దఱు కొడుకులు, ఇద్దఱు మనుమలు గలరు.

**లక్ష్మీదేవమ్మ** : నీ పిల్లలు, భార్య నిత్యము దేనివలన కడుపు నింపుకొనెదరు? వారేమి చేయుచుందురు?

గ్రుడ్డివాడు : వాండ్లు ఇతరుల పొలమును కౌలుకు దీసికొని దానిని దున్నుకొని పొట్టనింపుకొనెదరు.

లక్ష్మీదేవమ్మ : నీ కిద్దఱు కొమారులు గలిగియు బిచ్చమెత్తుట యెందులకు?

గ్రుడ్డివాడు : తల్లీ! నా కొడుకులు దినమంతయు కష్టముజేసి తినుటకు గావలసినంత ధాన్యమును పోగుచేతురు. కాని యుప్పు మెరపకాయకు బట్టాపాతకు కావలెనుగదా? ఆ పల్లెలో నివి మాకు దొరకవు.

లక్ష్మీదేవమ్మ : అయితే నీవా వస్తువుల మట్టుకు సంపాదించెదవా?

గ్రుడ్డివాడు : ఔనమ్మా! నా కడుపు గడువగా మిగిలిన డబ్బులు బట్టలు పిల్లలకు బంపెదను.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

- కేశవుడు తన తల్లిని పావలా ఇవ్వమని ఎందుకు అడిగాడు?

ఆ దివ్య చక్షుడు భోజనము చేసి సంతసిల్లి, 'తల్లీ నీకు దేవుడు మేలు చేయును. నీ పుత్రుడు ముసలోడయి మనుమల నెత్తును' అని లక్ష్మీదేవమ్మను దీవించి తన దారిని దాను బోయెను. తల్లి యా యంధునకు పావలా నియ్యదని తెలిసికొని యబ్బాలుండు మిగుల చిన్నబోయెను.

## II

కేశవుడు మేడపైకి వచ్చిన వెంటనే అమ్మా! నీవా గ్రుడ్డివానికి బావలానేల యియ్యలేదని తల్లినడిగెను. అందుపై నా గ్రుడ్డి వానికి బావలా నియ్యనందుకా తల్లికొడుకులకిట్లు సంవాదమయ్యెను.



లక్ష్మీదేవమ్మ : వానికి బావల నిచ్చుటకంటెను అన్నము బెట్టుట యధిక యావశ్యమైనది.

కేశవుడు : అయినను మనము పావలాను గూడ వానికి యిచ్చి యుండిన దానిని వాడు తన యింటికి బంపియుండును గదా?

లక్ష్మీదేవమ్మ : పావలాలు, రూపాయిలు మొదలైన వెటువంటి వారికియ్యవలయునో నీకింకనూ తెలియదు.

కేశవుడు : తెలియకేమి బీదలగు గ్రుడ్డివారికి, గుంటివారికి నిచ్చుటయుత్తమము.

లక్ష్మీదేవమ్మ : అదే నిజమయినను వారిలో సహితము తారతమ్యములను విచారించి యేది యిచ్చుటకెవ్వరర్హులో వారికదియే యిచ్చుట యుత్తమము. విశేష యావశ్యకము లేనివారికది యియ్యగూడదు.

కేశవుడు : వాని కొడుకులాగ్రామమున ధనము దొరకక పెక్కిడుము బడుచుందురు గదా? దీనిని వారికేల యియ్యగూడదు?

లక్ష్మీదేవమ్మ : కొడుకుల కష్టములను వారు చిన్నవారయి యుండగా పోగొట్టుట తల్లిదండ్రుల కర్తవ్యము. వారు పెద్దవారైన పిదప వారే తమ సదుపాయము తాము విచారించుకోవలయును. ఆ గ్రుడ్డి వాని పుత్రులిరువురు హైదరాబాదు వంటి పట్టణమునకరిగి కూలిపని చేసినను వారు వారి కుటుంబములను రక్షించుకొనగలరు.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

- గ్రుడ్డి వానికి పావలా ఇవ్వక పోవడానికి లక్ష్మీదేవమ్మ చెప్పిన కారణం ఏమిటి?

## III

కేశవుడు : అయితే మనమేమయిన దానము చేయబలయునయిననెట్లు చేయబలయును?

లక్ష్మీదేవమ్మ : పొరుగునున్న జగన్నాథరావు గుమస్తాను నీ వెఱుగుదువు గదా! ఆయనకు బది రూపాయల వేతనము గలదు. ఆయన కుమారుడగు రాముడును, మన యింట వారభోజనమునకు వచ్చునచ్యుతుడును నీ స్నేహితులే! అయితే నీకొక పావలా నేనిచ్చినచో నీవీ యిద్దరిలో దానినెవరికి నిచ్చెదవు?

కేశవుడు : నేను దాని నచ్యుతునకే యిచ్చెదను. వాడు రాముని కంటెను బీదవాడు.

లక్ష్మీదేవమ్మ : పావలా లేనందున నచ్యుతునకు గలుగు నష్టము రామునకు గానేరదు. వాని తండ్రి యేలాగైనను వానికి పావలాను దెచ్చి యిచ్చును. అచ్యుతునకట్టి వారెవరును లేరు. ఇదిగాక మనమిచ్చునది దురుపయోగమున బడక సదుపయోగమున ఖర్చగుటకై మనము దానము



నెవరికి నిత్తుమో వారి సుగుణ దుర్గుణములను గూడా గుర్తెఱుగ వలెను. ఈ గ్రుడ్డివాని కొడుకులిరువురును ధన సంపాదనకు కావలసిన బట్టలు మొదలైనవి తెచ్చుటకు వారే ప్రయత్నింపవలెను. ఇట్టిచ్చుట న్యాయముగాదు.

తల్లి జెప్పిన హితబోధ మనసున నాటి యా చిన్నవాడధిక హర్షమును బొందెను. సొంత పొట్టబోసుకొను కొడుకులను సోమరులను జేయు గ్రుడ్డివానికి డబ్బులిచ్చుట కంటెను అచ్యుతునికిచ్చుటయే శ్రేష్ఠమని వానికి దోచెను. నాటి దినమా బాలకుడు తల్లిచెప్పిన విధమున సత్పాత్రదానము చేయుదునని సంతోషముతో దినము గడిపి సాయంత్రమా పావలాను అచ్యుతునకిచ్చెను.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

- గ్రుడ్డి వానికి ఇచ్చుటకంటే అచ్యుతునికి ఇచ్చుటయే శ్రేష్టమని కేశవునికి ఎందుకు అనిపించింది?

# భాషాసామర్థ్యాలను సాధిద్దాం!

## I. భాషాంశాలు

### పదజాలం

**అ) గీత గీసిన పదాలకు అర్థాలను రాయండి.**

1) <u>అంధులు</u> లోకాన్ని చూడలేరు. ______________
2) ప్రతి వ్యక్తి క్రమశిక్షణ అలవరుచుకొనుట <u>ఆవశ్యకము.</u> ______________
3) మా ఇంటి <u>గవాక్షము</u> గుండా చూస్తే పచ్చని పంటపొలాలు కనిపిస్తాయి. ______________
4) నవీన్ ఆటలో బహుమతి పొందినందుకు <u>హర్షం</u> వ్యక్తం చేశాడు. ______________

**ఆ) కింది పదాలను చదువండి. ఏం గమనించారో చెప్పండి.**

1) భక్తి - బత్తి
2) శక్తి - సత్తి
3) పట్టణం - పట్నం
4) నిజం - నిక్కం



మొదటి వరుసలోని పదాలు అనగా 'భక్తి, శక్తి, పట్టణం, నిజం' ఈ పదాలు సహజమైన పదాలు. వీటిని 'ప్రకృతులు' అంటారు. ఇవి మార్పు చెందగా ఏర్పడిన పదాలు 'బత్తి, సత్తి, పట్నం, నిక్కం'. ఇలా మార్పుచెందగా ఏర్పడిన పదాలను 'వికృతులు' అంటారు.

**కింది పదాలను చదవండి. ప్రకృతి పదాలకు చెందిన వికృతి పదంతో కలిపిరాయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| వీధి | బిచ్చము | భోజనం | దమ్మము | పుస్తకం |
| పొత్తం | ధర్మం | బోనం | భిక్ష | వీది |

**ఇ) కింది వాక్యాలను చదవండి.**

- నన్ను చదువుకోరా అంటూ మా అమ్మ నాకు చెవినిల్లుకట్టుకొని చెప్పింది.
- మా మామయ్య వ్యాపారం మూడు పూవులు ఆరు కాయలుగా ఎదిగింది.

పై వాక్యాలలో గీతగీసిన పదాలు ప్రత్యేకమైన అర్థాన్ని కల్గి ఉన్నాయి. ఈ విధంగా ఒక భాషలోని కొన్ని పదాలు కలిసి ఒక విశేష అర్థాన్ని ఇస్తే ఆ పదబంధాన్ని 'జాతీయం' అంటారు. దీనిని పలుకుబడి, నానుడి అనే పేరుతో పిలుస్తారు. వీటిని ఉపయోగించడం ద్వారా భాషకు సౌందర్యం కలుగుతుంది. మీ పాఠంలోని ఇటువంటి జాతీయాలను గుర్తించండి.

**ఉదా: కింది జాతీయాన్ని గమనించండి. అలాగే మిగిలిన జాతీయాలను వివరించండి.**

అ) హృదయము కరిగిపోవు : ఎదుటివారిపట్ల మిక్కిలి జాలి చూపడం అనే సందర్భంలో ఈ జాతీయం ఉపయోగిస్తారు.

ఆ) కడుపు చల్లగుండ : ______________________

ఇ) పొట్టపోసుకొను : ______________________

ఈ) మనసుకరుగు : ______________________

## వ్యాకరణం

**అ) కింది వాక్యాలను చదవండి.**

1) మానస గుడికి వెళ్ళింది.

2) నరేశ్ ఇంటికి వచ్చాడు.

3) అమ్మ కథ చెప్పింది.

4) అఖిల కథ చదువుతున్నది.



గీత గీసిన పదాలు మానస, నరేశ్, అమ్మ, అఖిల చేసిన పనులు తెలియజేస్తున్నాయి కదా! ఇట్లా పనిని తెలియజేసే పదాలను **'క్రియా పదాలు'** అంటారు. మరికొన్ని క్రియా పదాలను పాఠంలో గుర్తించి రాయండి.

__________ __________ __________ __________ __________ __________

__________ __________ __________ __________ __________ __________

**ఆ) కింది వాక్యాలను పరిశీలించండి.**

- శివాని రైలు <u>ఎక్కి</u> ఊరికి <u>వెళ్ళింది.</u>
- అంజలి బజారుకు <u>వెళ్ళి</u> కూరగాయలు <u>కొన్నది.</u>

పై వాక్యాలలో వెళ్ళింది, కొన్నది అనే క్రియాపదాలు వాక్యభావాన్ని పూర్తయినట్లుగా తెలుపుతున్నాయి కదా! ఇట్లా వాక్య భావాన్ని పూర్తిగా తెలిపే క్రియాపదాలను 'సమాపక క్రియలు' అంటారు. ఎక్కి, వెళ్ళి అనే క్రియాపదాలు పూర్తికాని పనిని తెలిపే పదాలు, ఈ పదాలు వాక్యభావాన్ని అసంపూర్తిగా తెలిపే క్రియాపదాలు. వీటిని అసమాపక క్రియలు అంటారు.

**కింది వాక్యాలలో సమాపక, అసమాపక క్రియలను గుర్తించండి.**

1) ధనలక్ష్మి టి.వి. చూస్తూ అన్నం తింటున్నది.

2) శ్రీవర్ధన్ నవ్వుతూ ఎగురుతున్నాడు.

3) వెన్నెల బడికి వెళ్ళి చదువుకున్నది.

**ఇ) కింది వాక్యాలలో క్రియాభేదాలను గమనించండి.**

- వేంకటేశ్వర్లు వెళ్ళాడు.
- పరమేశ్ వెళ్తున్నాడు.
- అంజయ్య వెళ్తాడు / వెళ్ళబోతున్నాడు.

పై వాక్యాలలో 'వెళ్ళాడు' అనే క్రియ జరిగిపోయిన పనిని తెలుపుతుంది. దీనిని 'భూతకాలం' అంటారు. 'వెళ్తున్నాడు' అనే క్రియ ప్రస్తుతం జరుగుతున్న పనిని తెలుపుతుంది దీనిని 'వర్తమానకాలం' అంటారు. 'వెళ్తాడు / వెళ్ళబోతున్నాడు' అనే క్రియాపదాలు జరుగబోయే పనిని తెలుపుతున్నాయి. కనుక దీనిని 'భవిష్యత్ కాలం' అంటారు.

**క్రియా పదాల ఆధారంగా కింది వాక్యాలు ఏ కాలంలో ఉన్నాయో గుర్తించండి.**

1) సీత పాట పాడుతున్నది.

2) సింధు వంట వండింది.

3) మామయ్య సంత నుండి కూరగాయలు తెస్తాడు.

4) దిలీప్ సైకిల్ తొక్కుతున్నాడు.

## II. అవగాహన-ప్రతిస్పందన

**అ) కింది పరిచయపత్రం (బయోడేటా) ను పరిశీలించండి.**

| బయోడేటా | | |
|---|---|---|
| అభ్యర్థి పేరు | : | పి. వేంకటేశ్వర్లు |
| తల్లిదండ్రులు | : | సూర్యనారాయణ - సుశీలమ్మ |
| పుట్టిన తేది | : | 21-08-1980 |
| విద్యార్హతలు | : | ఎం.ఏ. తెలుగు, బి.ఇడి. |
| అభిరుచులు | : | పుస్తక పఠనం, సంగీతం వినడం |
| తెలిసిన భాషలు | : | తెలుగు, హిందీ, ఆంగ్లం |
| చిరునామా | : | ఇంటి నెంబరు 2-4-445,<br>శాలివాహన నగర్ కాలనీ,<br>దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్. |

చూసారు కదా! ఈ విధంగా ఒక వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత, విద్యావిషయక వివరాలు రాయడాన్ని 'బయోడేటా' అంటారు. పై బయోడేటా ఆధారంగా మీ బయోడేటా రాయండి.

## III. వ్యక్తీకరణ-సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులను రాయండి.**

1) లక్ష్మీదేవమ్మ గుడ్డివానిని ఇంటికి తీసుకొని రమ్మనడానికిగల కారణమేమిటి?

2) "గుడ్డివాడు కొడుకులను సోమరులుగా మారుస్తున్నాడు" అనుటపై మీ అభిప్రాయం ఏమిటి?

3) రాముడు, అచ్యుతుడు ఈ ఇద్దరిలో ఎవరికి దానం చేయాలి? ఎందుకు?

4) ఈ పాఠానికి సత్పాత్రదానం అనే పేరు సరైనదేనా? ఎందుకు?

**ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబును రాయండి.**

1) సత్పాత్రదానం కథను మీ సొంతమాటల్లో రాయండి.



## సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది అంశాన్ని గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

1) ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని తెలియజేస్తూ ఇద్దరు మిత్రుల మధ్య సంభాషణను పది వాక్యాలలో రాయండి.

### నేను ఏయే సామర్థ్యాలు సాధించాను? (స్వీయమూల్యాంకనం)

| | | |
|---|---|---|
| 1) | ప్రకృతులు, వికృతులను గుర్తించగలను, జాతీయాలను వివరించగలను. | అవును / కాదు |
| 2) | సమాపక, అసమాపక క్రియలను, క్రియల ఆధారంగా కాలాలను గుర్తించి రాయగలను. | అవును / కాదు |
| 3) | బయోడేటాను అవగాహన చేసుకోగలను, బయోడేటాను రాయగలను. | అవును / కాదు |
| 4) | సత్పాత్రదానం కథను సొంతమాటల్లో రాయగలను. | అవును / కాదు |
| 5) | సంభాషణలను ఊహించి రాయగలను. | అవును / కాదు |

### సూక్తి

**తన ఆకలిని సహించుకునే తపోధనుడి శక్తికన్నా**

**ఇతరుల ఆకలి తీర్చే దానశీలి శక్తి మిన్న.**

# 4 అసామాన్యులు

– కావూరి పాపయ్యశాస్త్రి

## సాధించాల్సిన సామర్థ్యాలు – అభ్యసన ఫలితాలు

ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఈ కింది సామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలను సాధిస్తారు.

**I. భాషాంశాలు :**

అ) **పదజాలం** : ఇచ్చిన పదాలకు అర్థాలు, సొంతవాక్యాలు, రాయగలుగుతారు. ధ్వన్యనుకరణ పదాలతో వాక్యాలు రాయగలుగుతారు.

ఆ) **వ్యాకరణాంశాలు** : వచనాలు, విభక్తులు-ప్రత్యయాలు తెలుసుకొని సందర్భానుసారంగా గుర్తించడం, వినియోగించడం చేయగలుగుతారు.

**II. అవగాహన – ప్రతిస్పందన :**

అ) అపరిచిత గద్యం, ప్రకటనను చదివి అర్థం చేసుకొని ప్రతిస్పందించగలుగుతారు.

**III. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

అ) **స్వీయరచన** : సమాజాభివృద్ధికి అన్ని వృత్తుల వారి సేవ అవసరమనే అంశాన్ని సమర్థిస్తూ రాయగలుగుతారు.

ఆ) **సృజనాత్మకత** : గేయాన్ని పొడిగించి రాయగలుగుతారు.

## అభ్యాసకులకు సూచనలు

- పాఠాన్ని చదువండి. తెలియని పదాలను గుర్తించండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరి అకారాది పట్టికలో వెతుకండి.
- పాఠాన్ని మళ్ళీ చదివి అర్థం చేసుకోండి.
- పాఠంలో అర్థంకాని అంశాల గురించి మీ సమీపంలోని ఉపాధ్యాయులు లేదా కేంద్రంలో బోధించే వారితో చర్చించి తెలుసుకోండి.
- బాక్సులో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను పాఠంలో గుర్తించండి.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం గేయ ప్రక్రియకు చెందినది. గేయం / పాట రాగ, తాళ, లయలతో కూడుకొని పాడుకోవడానికి వీలుగా ఉంటుంది. ఇది మాత్రా ఛందస్సులో ఉంటుంది.

ఈ పాఠం డా॥ కావూరి పాపయ్యశాస్త్రి రాసిన 'అథోజగత్ సహోదరులు' అనే గేయ సంపుటిలోనిది.

## పాఠం ఉద్దేశం / నేపథ్యం

వివిధ వృత్తులు, వృత్తిపని వారి పట్ల గౌరవాన్ని పెంపొందింపజేస్తూ శ్రమ విలువను తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

సమాజంలో ప్రతి వృత్తి గొప్పదే. ప్రతి వృత్తిలోను కష్టం, నైపుణ్యం, శ్రమ, సేవా గుణాలు ఉంటాయి. సమాజంలో ప్రతి నిత్యం మనకనుల ముందు కనిపించే ఆయా వృత్తులలోని నైపుణ్యం, ఆ వృత్తిపనివారి కష్టం, శ్రమను తెలియజేయడం ఈ పాఠం నేపథ్యం.

## కవి పరిచయం



05-08-1952

23-06-2019

కావూరి పాపయ్యశాస్త్రి ఖమ్మం జిల్లా గొల్లపూడి గ్రామంలో కావూరి హైమావతి, సత్యనారాయణ దంపతులకు జన్మించాడు. ఎం.ఏ. తెలుగు, హిందీ చదివి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు ఉపన్యాసకుడుగా పనిచేశాడు.

'శ్రీమద్రామాయణ కల్పవృక్షము - శ్రీరాముని మనుజధర్మము' అనే సిద్ధాంత గ్రంథాన్ని రాసి కాకతీయ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేటు పట్టా పొందాడు. శివశతి, రంగులనది, నా గోదావరి, శ్రీశ్రీ శతకం, మహతి, కోటి రత్నాలవీణ, భాగవత కథాసుధ, అథోజగత్ సహోదరులు మొదలైన గ్రంథాలు రాశాడు.

పాపయ్యశాస్త్రి రచనాశైలి సరళంగా, చక్కని పోలికలతో, హృదయంగమంగా ఉంటుంది.



# I



## దర్జీవారు

పల్లెటూళ్ళు బస్తీల్లో
పట్టణాలు నగరాల్లో
కుట్టుమిషన్లపై దుస్తులు
కుట్టి బ్రతుకు టైలర్లు

పండుగలకు పబ్బాలకు
పెండ్లిండ్లకు పర్వాలకు
కొత్తకొత్త దుస్తులను
కుట్టియిస్తు ఉంటారు

## స్వర్ణకారులు

ఊపిరాగి పోవువరకు
ఊది ఊది పొగగొట్టం
సుత్తితోటి దిమ్మపైన
మెత్తగ కొడుతుంటారు

భగభగమండే దాక
పొగగొట్టం ఊదుకొనుచు
ధగధగలాడేట్టు నగల
నగిషీలను చెక్కుతారు



## చేనేతవారు



రాట్నం గిరగిర తిప్పుచూ
దారం కుదురుకు
చుడుతూ
చేనేతల పనివారు
జీవిస్తూ ఉంటారు

చీరలు ధోతులు
తుండ్లు
బారులుగా నేతనేసి
మగ్గాలాడించుకొనుచు

### మీరేమి అర్థం చేసుకున్నారు?

- చేనేత కార్మికుల పని గురించి తెలుపండి.
- నగలకు నగిషీలను చెక్కే వారెవరు? వారి పని గురించి తెలుపండి.



మనుగడ సాగిస్తారు

## II

### భవన నిర్మాణ కార్మికులు



ఆకాశాన్నంటుకునే
హర్మ్యాలను నిర్మిస్తూ
కార్మికులు, శ్రామికులు
కష్టపడుతుంటారు

నింగినంటు సౌధాలను
నిర్మించే మొనగాళ్ళు
అంతస్థులు కడుతున్నా
స్వంత యిల్లులేని వాళ్ళు

### రోడ్డు పనివారు



భగభగమండే మంటకు
సలసలకాగే తారును
జల్లులాగ రోడ్డుపైన
చల్లుతు పోతుంటారు

రగులుతున్న ఎండలలో
రహదారుల పనిచేస్తూ
వేలమంది కూలివాళ్ళు
వేగి పోవుచుంటారు

### పారిశుద్ధ్య పనివారు



వేకువనే నిద్రలేచి
వీధులన్ని ఊడుస్తూ
పారిశుద్ధ్య కార్మికులు
పనులను చేస్తుంటారు

నగరమ్ములు పట్టణాలు
నలుగురు నడిచేబాటలు
అద్దాల్లా తుడిచేందుకు
అహరహము శ్రమిస్తారు

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

- ఎండలో వేగిపోతున్నది ఎవరు? వారు చేస్తున్న పని ఏమిటి?
- పారిశుధ్య కార్మికులు ఏం చేస్తుంటారు?

# భాషాసామర్థ్యాలను సాధిద్దాం!

## I. భాషాంశాలు

### పదజాలం

అ) కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలను రాయండి.

1) అహరహము : ______________________

2) మనుగడ : ______________________

ఆ) కింది వాక్యాలలోని గీతగీసిన పదాలకు అర్థాలను రాయండి.

1) భోగినాడు వేకువనే నిద్రలేచి భోగిమంటలు వేస్తాము.

వేకువ = ______________

2) రాకెట్టు నింగిలోకి దూసుకుపోయింది.

నింగి = ______________

3) పూర్వం జమీందారులు, ధనవంతులు పెద్దపెద్ద సౌధాలలో నివసించేవారు.

సౌధము = ______________

ఇ) 'భగభగ, సలసల' ఇలాంటి పదాలను ధ్వన్యనుకరణ పదాలు అని తెలుసుకున్నారు కదా! ఇలాంటివే మరికొన్ని పదాలను రాయండి. వాటితో వాక్యాలు రాయండి.

### వ్యాకరణం

అ) కింది వాక్యాలలో గీతగీసిన పదాలు ఏ భాషాభాగమో తెలుపండి.

1) చల్లని గాలి వీస్తున్నది. (                    )

2) అహింసయే గాంధీ ఆయుధం. (                    )

3) ఆమె వీరవనిత. (                    )



## వచనాలు

**అ) కింది వాక్యాలను చదువండి. గీతగీసిన పదాలను గమనించండి.**

1) అమ్మ <u>బొమ్మ</u> తెచ్చింది.

2) అమ్మ <u>బొమ్మలు</u> తెచ్చింది.

మొదటి వాక్యంలో గీత గీసిన పదం (బొమ్మ) ఒకటే వస్తువు ఉన్నట్లు తెలుపుతున్నది. ఇలా ఒకటే ఉన్నట్లు వస్తువును తెలిపే పదాన్ని 'ఏకవచనం' అంటారు.

రెండవ వాక్యంలో గీతగీసిన పదం (బొమ్మలు) ఒక వస్తువుకంటె ఎక్కువ వస్తువులు ఉన్నట్లు తెలుపుతున్నది. అలా తెలిపే పదాన్ని 'బహువచనం' అంటారు.

ఉదా : కాయ–కాయలు, పలక–పలకలు, గీత–గీతలు. ఏకవచన పదాల చివర'లు' చేరుతుంది. అయితే కొన్ని ఏకవచన పదాలకు 'లు' చేరినప్పుడు 'లు'కు ముందున్న అక్షరంలో మార్పు జరుగుతుంది.

ఉదా : 'కాకి' అని ఉండగా బహువచనంలో 'లు' చేరి 'కాకిలు' అని కాకుండా 'కాకులు' అని ఏర్పడుతుంది. ఇలాంటివే మరికొన్ని పదాలు చూడండి.

బావి – బావులు, కోతి – కోతులు, కంకి – కంకులు, బంతి – బంతులు మొదలైనవి.

మరికొన్నిచోట్ల 'లు' ముందు అక్షరంలో కలిసిపోతుంది.

ఉదా : 'చెట్టు' అని ఏకవచనానికి 'లు' అనే బహువచనాన్ని తెలిపే అక్షరం చేరి 'చెట్టులు' అని కాకుండా 'చెట్లు' అనే రూపం ఏర్పడుతున్నది. మరికొన్ని ఉదాహరణలు చూడండి.

గట్టు – గట్లు, మెట్టు – మెట్లు, తిట్టు – తిట్లు, కట్టు – కట్లు ఈ విధంగా బహువచనంలో 'లు' చేరుతున్నప్పుడు జరిగే మార్పును గమనించి బహువచనాలు రాయాలి.

**ఆ) కింది ఏకవచనాలకు బహువచనాలు, బహువచనాలకు ఏకవచనాలు రాయండి.**

| ఏకవచనం | బహువచనం |
|---|---|
| సంచి | |
| | పుస్తకాలు |
| బడి | |
| | బొట్లు |
| మొక్క | |



## విభక్తులు - ప్రత్యయాలు

**అ) కింది వాక్యాలను చదువండి. గీతగీసిన అక్షరాలను, పదాలను గమనించండి.**

1) తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ పండుగ ప్రతీక.

2) నగలను బంగారంతో వెండితో తయారుచేస్తారు.

3) వాణి పూజ కొరకు పూలను కోసింది.

4) మాస్కు ధరించకపోవడం వలన వ్యాధి బారిన పడతాం.

పై వాక్యాలలో గీతగీసిన అక్షరాన్ని లేదా పదాన్ని తీసివేసి చదువండి.

ఉదా : **నగల బంగారం వెండి తయారుచేస్తారు.**

పై వాక్యంలో పదాల మధ్య సంబంధం సరిగా లేనట్లుగా అనిపిస్తున్నది కదా! ఇప్పుడు ఆ వాక్యంలో తీసేసిన అక్షరాలను చేర్చి చదువండి.

**నగలను బంగారంతో వెండితో తయారుచేస్తారు.**

ఇప్పుడు పదాల మధ్య సంబంధం ఏర్పడింది కదా! ఈ విధంగా పదాల మధ్య అర్థవంతమైన సంబంధాన్ని ఏర్పరచడానికి ఉపయోగించే అక్షరాలను, పదాలను విభక్తి ప్రత్యయాలు అంటారు. ప్రత్యయాలను బట్టి అవి ఏ విభక్తులో తెలుసుకోవచ్చు.

**ఆ) కింది పట్టిక చూడండి, చదువండి. ప్రత్యయాలనుబట్టి అవి ఏ విభక్తులో తెలుసుకోండి.**

| | ప్రత్యయాలు | విభక్తులు |
|---|---|---|
| 1) | డు, ము, వు, లు | ప్రథమా విభక్తి |
| 2) | ని(న్), ను(న్), ల(న్), కూర్చి, గురించి | ద్వితీయా విభక్తి |
| 3) | చేత(న్), చే(న్), తోడ(న్), తో(న్) | తృతీయా విభక్తి |
| 4) | కొరకు(న్), కై (కోసం) | చతుర్థీ విభక్తి |
| 5) | వలన(న్), కంటె(న్), పట్టి | పంచమీ విభక్తి |
| 6) | కి(న్), కు(న్), యొక్క, లో(న్), లోపల(న్) | షష్ఠీ విభక్తి |
| 7) | అందు(న్), న(న్) | సప్తమీ విభక్తి |
| 8) | ఓ, ఓరి, ఓయి, ఓసి | సంబోధన ప్రథమా విభక్తి |

**ఇ) కింది వాక్యాలలో లోపించిన విభక్తి ప్రత్యయాలు రాయండి.**

1) చెట్టు మీద కాకి ____________ చూశాడు.

2) అన్న చెల్లెలు ____________ బొమ్మలు తెచ్చాడు.

3) వర్షాలు పడకపోవడం ____________ పంటలు పండలేదు.



## II. అవగాహన-ప్రతిస్పందన

**అ) కింది పేరాను చదువండి. ప్రశ్నలకు జవాబులను రాయండి.**

తెలంగాణ కళలకు కాణాచి. ఇక్కడి కళలు దేశవ్యాప్తంగా, అంతర్జాతీయంగా ప్రసిద్ధిపొందాయి. ఒగ్గుకథ, బుర్రకథ, యక్షగానం, చిందుబాగోతం, పల్లెసుద్దులు (గొల్లసుద్దులు), పేరిణి నృత్యం తెలంగాణకు ప్రత్యేకతను తెచ్చిపెట్టాయి. ఒగ్గుకథ కళాకారుడు మిద్దెరాములు, చిందుబాగోతం కళాకారిణి చిందుఎల్లమ్మ, చిత్రకారుడు కాపురాజయ్య, పేరిణి నృత్య కళాకారుడు నటరాజ రామకృష్ణ వంటివారు తమ ప్రదర్శనల ద్వారా ఆయా కళలకు ఎంతో ఖ్యాతిని తీసుకువచ్చారు.

తెలంగాణ హస్తకళలు కూడా ఎంతో ప్రసిద్ధి చెందాయి. సన్నని వెండి దారాలతో వివిధ రూపాలలో బొమ్మలు చేసే వెండి నగిషీ కళను ఫిలిగ్రీ అంటారు. ఈ కళకు కరీంనగరు ప్రసిద్ధి. పెంబర్తి గ్రామం ఇత్తడి కళకు ప్రత్యేకం. ఇత్తడితో జ్ఞాపికలు, పూలకుండీలు, దేవాలయ ధ్వజస్తంభాల తొడుగులు వంటివి చేయడం ఈ కళాకారుల సృజనశక్తి. చేనేతబట్ట (కాన్వాసు) పై రామాయణ, మహాభారత బొమ్మలను చిత్రించే నకాషీ కళకు చేర్యాల గ్రామం ఆటపట్టుగా నిలిచింది. నిర్మల్ కొయ్యబొమ్మలకు, వర్ణచిత్రాలకు ప్రపంచస్థాయి గుర్తింపు ఉన్నది.

1) ఫిలిగ్రీ ప్రత్యేకత ఏమిటి?

2) మిద్దెరాములు ఏ కళను పోషించాడు?

3) నకాషీకళ అంటే ఏమిటి?

4) పేరిణి నృత్యానికి ఖ్యాతిని తెచ్చినవారు ఎవరు?

5) తెలంగాణ దేనికి కాణాచి?

**ఆ) ఈ కింది ప్రకటన చదువండి.**

### కరోనా వారియర్స్‌కు అభినందనలు

కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రజలందరూ ఇండ్లకే పరిమితమయ్యారు. ఆ సమయంలో వైరస్ సామూహిక వ్యాప్తిని నియంత్రించడానికి పోలీసులు, వైరస్ సోకిన వారికి చికిత్స అందించడానికి డాక్టర్లు, ఆరోగ్యసిబ్బంది, పరిశుభ్రతకై పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం పనిచేశారు. తమ కుటుంబాలకు దూరంగా గడిపారు. ప్రజలకు మనోధైర్యాన్ని కలిగించారు. విపత్కర పరిస్థితుల్లో భయపడకుండా తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి ప్రజలకు రక్షణ కవచాలై నిలిచారు. వారు కరోనా పోరాటయోధులు. ఆ కరోనా వారియర్స్ చేసిన సేవకు ప్రజలందరు అభినందనలు, ధన్యవాదాలు తెలియజేయాలని ప్రభుత్వం కోరుతున్నది. వారికి అభినందనలు తెలుపడానికి ఇంటిముందు దీపాలు వెలిగించాలని కోరనైనది.

సమాచార శాఖ,
తెలంగాణ రాష్ట్రం.

పై అంశం ఆధారంగా కింది వాటిలో తప్పు (✗), ఒప్పు (✓) లను గుర్తించండి.

1) ప్రజలు ఇండ్లకు పరిమితమవ్వడానికి కారణం డాక్టర్లు. (   )

2) పారిశుద్ధ్య కార్మికులు కరోనా వారియర్స్. (   )

3) ప్రజలు అభినందనలు తెలుపాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. (   )

4) సమాచార శాఖ ప్రకటనను విడుదల చేసింది. (   )

5) వైరస్ వ్యాప్తికి కారకులు పోలీసులు. (   )

## III. వ్యక్తీకరణ-సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులను రాయండి.**

1) అసామాన్యులు గేయంలో కవి 'సౌధాలను నిర్మించే మొనగాళ్ళు' అని ఎవరిని ఉద్దేశించి అన్నాడు? ఎందుకన్నాడు?

2) బాటలను అద్దాలవలె తుడిచేవారెవరు? వారి శ్రమ గురించి రాయండి.

**ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబును రాయండి.**

1) 'సమాజానికి అన్ని వృత్తుల వాళ్ళు అవసరం' దీనిని సమర్థిస్తూ రాయండి.

### సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది గేయాన్ని పొడిగించి రాయండి.**

శ్రమశక్తే జగతికి మూలం
శ్రమజీవే ప్రగతి కారణం
శ్రమలేనిదే జరుగదు కాలం
శ్రమయే నిత్యం మన నేస్తం



## నేను ఏయే సామర్థ్యాలు సాధించాను? (స్వీయమూల్యాంకనం)

| | | |
|---|---|---|
| 1) | సొంతవాక్యాలు, అర్థాలు, పర్యాయపదాలు, ధ్వన్యనుకరణ పదాలు రాయగలను. | అవును / కాదు |
| 2) | వచనాలు, విభక్తి ప్రత్యయాలను వినియోగించగలను. | అవును / కాదు |
| 3) | అపరిచిత గద్యం, గేయం చదివి అర్థం చేసుకొని ప్రతిస్పందించగలను. | అవును / కాదు |
| 4) | సమాజాభివృద్ధికి అన్ని వృత్తులవారి సేవ అవసరమని సమర్థిస్తూ రాయగలను. | అవును / కాదు |
| 5) | గేయాన్ని పొడిగించి రాయగలను. | అవును / కాదు |

### సూక్తి

శ్రమయే జగతికి మూలం.

ఎంతో మంది శ్రమ, త్యాగం వల్లనే మనం జీవిస్తున్నాం.

శ్రమను, శ్రామికులను గౌరవించాలి.

# 5 విహారయాత్ర

## సాధించాల్సిన సామర్థ్యాలు - అభ్యసన ఫలితాలు

ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఈ కింది సామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలను సాధిస్తారు.

### I. భాషాంశాలు :

అ) **పదజాలం** : పదాలకు అర్థాలను, ఇచ్చిన పదాలలో వేరుగాఉన్న పదాన్ని గుర్తించి రాయగలుగుతారు.

ఆ) **వ్యాకరణాంశాలు** : కర్త, కర్మ, క్రియలను గురించి తెలుసుకొని వాక్యాలలో గుర్తించగలుగుతారు.

### II. అవగాహన - ప్రతిస్పందన :

అ) పోస్టరును చదివి, అర్థం చేసుకొని ప్రశ్నలకు జవాబులు రాయగలుగుతారు.

ఆ) ప్రముఖ దేవాలయాల వివరాలను తెలిపే పట్టికను చదివి, ప్రశ్నలకు జవాబులు రాయగలుగుతారు.

### III. వ్యక్తీకరణ - సృజనాత్మకత :

అ) **స్వీయరచన** : ఇచ్చిన ప్రశ్నలకు సొంతమాటల్లో జవాబులను, విహారయాత్ర గురించి సొంతమాటల్లో రాయగలుగుతారు.

ఆ) **సృజనాత్మకత** : దినచర్య రాయగలుగుతారు.

## అభ్యాసకులకు సూచనలు

- పాఠాన్ని చదువండి. తెలియని పదాలను గుర్తించండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరి అకారాది పట్టికలో వెతుకండి.
- పాఠాన్ని మళ్ళీ చదివి అర్థం చేసుకోండి.
- పాఠంలో అర్థంకాని అంశాల గురించి మీ సమీపంలోని ఉపాధ్యాయులు లేదా కేంద్రంలో బోధించే వారితో చర్చించి తెలుసుకోండి.
- బాక్సులో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను పాఠంలో గుర్తించండి.



## పాఠం ఉద్దేశం / నేపథ్యం

తెలంగాణ రాష్ట్రంలో గిరిజన తెగలవారు కూడా ఉన్నారు. వీరు పూర్వపు ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో ఎక్కువగా ఉన్నారు. వీరు మాట్లాడేభాష, సంస్కృతి విభిన్నంగా ఉంటుంది. విభిన్న ప్రాంతాలను విహారయాత్రల ద్వారా సందర్శించడంతో విజ్ఞానం, వినోదం కలుగుతుంది. ఇతర సంస్కృతులు, భాషల గురించి అర్థమవుతుంది. పూర్వపు వరంగల్ జిల్లాలోని మేడారం సమ్మక్క సారక్క జాతర గురించి, ఆదిలాబాద్ జిల్లాలోని నాగోబా జాతర, గోండు, కొలామీ, తోటి, ప్రధాన్ మొదలగు గిరిజన తెగల వారి సంస్కృతి, జీవన విధానం గురించి తెలుసుకోవడమే ఈ పాఠం ఉద్దేశం.

### I

(ఉట్నూర్ పాఠశాల, సాయంత్రం 4 గంటలు)

జార్జి (టీచరు) : జంగూ, ఇస్రూ, సత్తుబాయి, జంగూబాయి మీరట్ లెక్కలు కీతిట్కి?

సత్తుబాయి : కీతిట్కి సార్!

జార్జి : నిమ్మె ఉద్ద! నేన్డ్ బతల్ కీకట్?

పిల్లలు : బద్‌తేరే వేసుడి వెహట్ సార్!

భీందేవ్ : రాం! రాం! సార్! మన బడి ముందు ఏదో బస్సు ఆగింది. బస్సు దిగి ఎవరో ఇటువైపే వస్తున్నారు సార్!

రఘు (టీచరు) : నమస్కారం సార్! మాది ములుగు జిల్లాలోని తాడ్వాయి. మా బడి పిల్లలతో విజ్ఞాన విహార యాత్రకు వచ్చాం.

జార్జి : ఓహో! అలాగా! నా పేరు జోసఫ్ జార్జి. ఈ బడిలోనే టీచరుగా పని చేస్తున్నాను. వీరు మా బడి పిల్లలు.

పిల్లలు : రాం! రాం! సార్!

జార్జి : మీకు నమస్కారం చెప్తున్నారు. గోండు భాషలో రాం! రాం! అంటే నమస్కారం.

❖❖❖

రఘు : మా అందరికి చక్కటి బస ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు. జార్జి సార్! మా పిల్లలంతా ఇక్కడి గిరిజనుల గురించి తెలుసుకోవాలని చాలా ఉత్సాహంగా ఉన్నారు. దయచేసి వారి గురించి చెబుతారా?

జార్జి : గోండు జాతి గిరిజనులు ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. వీరి వృత్తి వ్యవసాయం. వీరి భాష గోండు భాష. వీరు మర్యాదకు, క్రమశిక్షణకు మారుపేరు. నమ్మినవారికి ప్రాణమివ్వడానికైనా వెనుకాడరు. కొత్తవారెవరైనా గ్రామానికి వస్తే రాం! రాం! అని ఆహ్వానిస్తారు. చెప్పులు ధరించి ఇండ్లలోకి వెళ్లరు. ఎందుకంటే ఇళ్లను వీరు దేవతా గృహాలుగా భావిస్తారు.

రఘు : కానీ ఈ పిల్లలు తెలుగులో కూడా చక్కగా మాట్లాడుతున్నారే!

జార్జి : అవును. ఇప్పుడు వీరంతా చక్కటి తెలుగు మాట్లాడతారు. రాస్తారు కూడా! మొదట్లో వీరెవరూ తెలుగులో మాట్లాడేవారు కాదు.

వాసు (టీచర్) : మరి ఇప్పుడు తెలుగులో ఎలా మాట్లాడుతున్నారు?

జార్జి : మొదట నేనే గోండు భాషను నేర్చుకోవాలని నిశ్చయించుకున్నాను. తరచుగా వారి ఇళ్లకు వెళ్లేవాడిని. వారి పండుగలలో, ఉత్సవాలలో పాల్గొనేవాడిని. క్రమంగా వారిలాగే గోండు భాషలో మాట్లాడే నైపుణ్యాన్ని పెంచుకున్నాను. వాళ్లలో ఒకడిగా ఉంటూ వారి బెరుకునీ పోగొట్టాను. క్రమంగా వారికి వారి భాష ఆధారంగా తెలుగు నేర్పగలిగాను.

సత్తుబాయి : మొదట్లో మాకు సారంటే భయం అనిపించేది. కాని సారు మాలాగే గోండు భాషలో మాట్లాడేసరికి మాకు భలే సంతోషమన్పించేది.

జార్జి : గిరిజన పిల్లలు చాలా చురుకైనవారు. రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో, ఉపన్యాస, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో పాల్గొని ఎన్నో బహుమతులు గెల్చుకున్నారు.

ప్రేమలీల (టీచరు) : వీరికి చదువు చెప్పడం కోసం మీరు ఎంతో కష్టపడ్డారు. గోండు భాషను నేర్చుకుని వారితో కలిసిపోయారు. మీరు నిజంగా అభినందనీయులు.

మహేశ్ : వీరు ఏఏ దేవుళ్లను పూజిస్తారు?

జార్జి : పెర్సాపేన్, ఆకిపేన్, అవ్వల్‌పేన్ దేవుళ్లను పూజిస్తారు. వీళ్లంతా ఇక్కడి గ్రామ దేవతలు.

### మీరేమి అర్థం చేసుకున్నారు?

- గోండు భాషలో కొత్తవారిని ఎలా పలుకరిస్తారు?
- గోండు పిల్లలకు తెలుగును నేర్పడానికి ఉపాధ్యాయుడు ఏం చేశాడు?

## II

షణ్ముఖి (విద్యార్థిని) : మిగిలిన గిరిజన జాతుల గురించి కూడా చెప్పండి సార్!

జార్జి : మిగతావారిలో కొలాం, తోటి, ప్రధాన్ తెగలవారు ముఖ్యమైనవారు. కొలాంబు మాట్లాడే భాష 'కొలామీ'. వీరి వేషభూషణాలు సైతం ప్రత్యేకంగా ఉంటాయి. వెండి, రాగి ఆభరణాలు ధరిస్తారు. ఒంటినిండా పచ్చబొట్లు ఉండడం అందంగా భావిస్తారు. వెదురుతో తట్టలు, బుట్టలు, గుమ్ములు, తడికలు తయారుచేస్తారు. తేనె, జిగురు, ఇప్పపువ్వు, విస్తరాకులు సేకరించి అమ్ముతారు. వ్యవసాయం కూడా చేస్తారు. వీరు భీందేవుడు, పోలకమ్మ, బుర్రి దేవతలను పూజిస్తారు.

ప్రేమలీల : తోటి, ప్రధాన్ తెగలవారు ఏం చేస్తారు?

జార్జి : తోటి తెగవారు సంచార జీవనం గడుపుతుంటారు. జావి గింజలతో పచ్చబొట్లు పొడవడం వీరి ప్రత్యేకత. వీరిని పాండవరాజుల కథలు చెప్పేవారని కూడా అంటారు. గోండు భాష మాట్లాడతారు. ప్రధాన్ తెగవారు కూడా గోండు గ్రామాల్లోనే ఉంటారు. మరాఠి మాట్లాడతారు. సన్నాయి వాయించడం, డప్పుకొట్టడం వీరి ఆచారం. ప్రస్తుతం వీరు వ్యవసాయ వృత్తిని ఎన్నుకొన్నారు.

వాసు (టీచర్) : ఏఏ జాతరలు జరుపుకొంటారు?

జంగుబాయి : జంగుబాయి లోయలో జంగుబాయి జాతర, కేస్లాపూర్‌లో నాగోబా జాతర, శాంపూర్‌లో బుడుందేవ్ జాతర, నార్నూర్‌లో ఖాందేవ్ జాతర, సిర్పూర్(యు) లో మహాదేవ్ జాతరలు జరుపుకొంటారు. నాయక్ పోడువారు మందమర్రి సమీపంలో గాంధారి మైసమ్మ జాతరకు వెళ్తారు.



రఘు : నాగోబా జాతర ఇక్కడ చాలా ప్రసిద్ధమైంది కదా! దీన్ని ఎప్పుడు జరుపుకొంటారు?

జార్జి : ప్రతి ఏటా పుష్యమాసం అమావాస్య రోజున నాగోబా దేవాలయం వద్ద నిర్వహిస్తారు. ఇతర రాష్ట్రాల నుండి కూడా గిరిజనులు వస్తారు. ఇది గిరిజన సంస్కృతికి అద్దం పడుతుంది.

మహేశ్ : సార్! వీరంతా ఏఏ పండుగలు జరుపుకొంటారు?

సత్తుబాయి : చైత్ర మాసంలో 'చెంచు భీమన్నమెర్మి' పండుగ, వైశాఖ మాసంలో పెర్సాపేన్ పూజలను, జ్యేష్ఠ మాసంలో 'విదిరి మొహతుక్' పండుగను. ఆషాఢ మాసంలో ఆకిపేన్ పూజలను, శ్రావణం పూర్తయిన తర్వాత పొలాల పండుగను, భాద్రపద మాసంలో పెత్రమాస (పెద్దల పండుగ)ను, మార్గశిర మాసంలో పంటలు ఇంటికి వచ్చిన సందర్భంగా 'సెట్టి' పండుగను జరుపుకుంటారు. దసరా, దీపావళి, ఉగాది, హోళీ పండుగలు కూడా జరుపుకొంటారు. దసరా నుండి దీపావళి వరకు జరుపుకునే పండుగ 'దండారి'. ఈ సందర్భంగా గుస్సాడి నృత్యం చేస్తారు.

షణ్ముఖి : ఇక్కడి గిరిజనులు ఏఏ పంటలు పండిస్తున్నారు?

భీందేవ్ : మా దగ్గర గోధుమ, జొన్న, ప్రత్తి మొదలయిన పంటలను పండిస్తారు. మల్బరీ తోటలను, పండ్ల తోటలను, ఆముదం చెట్లను పెంచుతారు.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

- కొలామీల గురించి తెలుపండి.
- తోటి తెగవారు ఏం చేస్తారు?

## III

ఇస్రూబాయి : వరంగల్ జిల్లాలో జరిగే జాతర గురించి చెప్పండి.

రఘు : మా దగ్గర సమ్మక్క-సారలమ్మ జాతర ప్రసిద్ధమైంది. ఇది రెండు సంవత్సరాలకు ఒకసారి మేడారంలో జరుగుతుంది. ఇది తాడ్వాయి మండల కేంద్రం నుండి 15 కి.మీ. దూరంలో ఉంది. మన రాష్ట్రం వారేకాక మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలవారు కూడా ఈ జాతరకు వస్తారు. ఇది ప్రధానంగా కోయ గిరిజనులకు చెందిన జాతర. ఇతర గిరిజనులు, గిరిజనేతరులు కూడా రావడం దీని ప్రత్యేకత.

జంగుబాయి : జాతర ఎప్పుడు జరుగుతుంది?



ప్రేమలీల : మేడారం జాతర మాఘశుద్ధ పౌర్ణమికి జరుగుతుంది. మేడారంలో సమ్మక్క గద్దె, సారలమ్మ గద్దెలు ఉన్నాయి. ఇక్కడికి 2 కి.మీ. దూరంలో చిలకలగుట్టపైన సమ్మక్క భరిణె ఉంటుంది. గిరిజన పూజారులు దీనిని భక్తిశ్రద్ధలతో, సంప్రదాయ పద్ధతిలో తీసుకొనివస్తారు. ఈ భరిణెను సమ్మక్క గద్దెపై ఉంచుతారు. జాతర పూర్తయిన పిదప దీనిని చిలకలగుట్టపైకి తీసుకెళ్తారు. భక్తులు తమ మొక్కుల కోసం బరువుకుతగ్గ బెల్లం సమర్పించడం ఇక్కడి ఆచారం. దాదాపు 40 లక్షల మంది వస్తారు.



జంగుబాయి : ఇన్ని లక్షల మంది వస్తే ఇబ్బందులు ఏర్పడవా?

వాసు : అందుకే మేడారం వరకు రోడ్డు సౌకర్యం, బోర్ బావుల ద్వారా నీటి సౌకర్యం, అంటురోగాలు ప్రబలకుండా వైద్య శిబిరాలు ఏర్పరుస్తారు. ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటుచేస్తారు. మీరు కూడా మీ పిల్లలతో మేడారం జాతరకు రండి. మా బడిలోనే మీకు బస ఏర్పాటుచేస్తాం.

రఘు : అదిలాబాద్ గిరిజన సంస్కృతి గురించి, జాతరల గురించి చాలా విషయాలు చెప్పారు. కృతజ్ఞతలండీ! పిల్లలూ మీకు కూడా రాం! రాం!

పిల్లలు : రాం! రాం!

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

- సమ్మక్క సారక్క జాతర ఎక్కడ, ఎప్పుడు జరుగుతుంది?
- సమ్మక్క సారక్క జాతరకు ప్రభుత్వం ఎలాంటి ఏర్పాట్లు చేస్తుంది?



# భాషాసామర్థ్యాలను సాధిద్దాం!

## I. భాషాంశాలు

### పదజాలం

**అ) కింది గోండు పదాలకు తెలుగు పదాలు ఉన్నాయి. వీటి ఆధారంగా పాఠంలో ఉన్న గోండు వాక్యాలకు తెలుగు వాక్యాలు రాయండి.**

| | | |
|---|---|---|
| 1) మీరట్ = మీరు | 2) నిమ్మె = నీవు | 3) నేన్డ్ = ఈ రోజు |
| 4) బడ్‌తెరె = ఏదైనా | 5) వేసుడి = కథ | 6) కీతిట్కి = చేశారా |
| 7) వెహట్ = చెప్పండి | 8) బతల్ = ఏమి | 9) కీకట్ = చేద్దాం |
| 10) ఉద్ద = కూర్చో | | |

**ఆ) కింది పదాలలో ఒక పదం మిగిలినవాటికి భిన్నమైనది. ఆ పదాన్ని గుర్తించండి.**

| | | | |
|---|---|---|---|
| 1) ఆకిపేన్ | నాగోబా | అవ్వల్‌పేన్ | పెర్సాపేన్ |
| 2) బుర్రిదేవత | పోలకమ్మ | గాంధారిమైసమ్మ | భీందేవుడు |
| 3) శాంపూర్ | నార్నూర్ | కేస్లాపూర్ | మేడారం |
| 4) భీందేవ్ | జంగుబాయి | సత్తుబాయి | ఇస్రూబాయి |
| 5) గోధుమ | జొన్న | తేనె | పత్తి |

**ఇ) తెలుగు పదాలకు బ్రాకెట్లలో గోండు భాష పదాలు ఉన్నాయి. వీటి ఆధారంగా వీలైనన్ని వాక్యాలను తెలుగు, గోండు భాషలలో రాయండి.**

| | | |
|---|---|---|
| బాలుడు (కాండి) | బాలిక (పేకి) | పాట (పాట) |
| ఉన్నది (మంత) | బడి (సాడ) | పాడుతుంది (వార్‌సేర్‌మంత) |
| వెళ్ళాడు (సొత్తోర్) | వెళ్ళారు (దాంతేర్) | పొలానికి (వావుటె) |
| వారు (వోర్) | పుస్తకం (పుస్తక్) | చదివింది (వాచ్‌కీత) |
| ఈ రోజు (నేన్డ్) | ఆమె (అద్) | నీ (నీవ) |
| అతడు (ఓర్) | పేరు (పురల్) | ఆడుతున్నారు (కర్‌సేర్‌మంతేర్) |
| మేము (మమట్) | ఏమిటి (బతల్) | పోయినాము (సోత్తోం) |
| కొంటారు (ఎతాంతేర్) | | |

ఉదా : నీ పేరు ఏమిటి? – నీవ పురల్ బతల్?



## వ్యాకరణం

**అ) కింది వాక్యాలు చదువండి.**

1) రేవాంశ్ గుర్రం కళ్ళాన్ని చేత్తో పట్టుకున్నాడు.

2) ప్రజ్ఞ మొక్కలు నాటింది.

3) మన ముఖ్యమంత్రి పండితులను సత్కరించాడు.

**పై వాక్యాలకు సంబంధించిన ప్రశ్నార్థక వాక్యాలను చదువండి.**

1) గుర్రం కళ్ళాన్ని ఎవరు పట్టుకున్నారు?

2) మొక్కలు ఎవరు నాటారు?

3) పండితులను ఎవరు సత్కరించారు?

పిల్లలూ! పై వాక్యాలలో 'ఎవరు' అనే పదానికి సమాధానం వచ్చే వాటిని 'కర్త' అంటారు.

1) రేవాంశ్ దేన్ని పట్టుకున్నాడు?

2) ప్రజ్ఞ వేటిని నాటింది?

3) మన ముఖ్యమంత్రి ఎవరిని సత్కరించాడు.

ఈ ప్రశ్నలలో 'ఎవరిని, దేనిని' అనే పదాలకు సమాధానంగా వచ్చే పదాలను 'కర్మ' అంటారు. పనిని తెలిపే పదాలను క్రియలు అంటారని తెలుసుకదా!

**ఆ) కింది వాక్యాలను చదువండి. కర్త, కర్మ, క్రియలను గుర్తించి రాయండి.**

1) నితీష్ సింధూకు బహుమతి ఇచ్చాడు.

2) క్రికెట్ ఆటలో మన దేశం ఆస్ట్రేలియాను ఓడించింది.

3) రంజని సింహాన్ని చూసింది.

4) నిఖిల్ జామపండ్లు తిన్నాడు.

| కర్త | కర్మ | క్రియ |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |

## II. అవగాహన-ప్రతిస్పందన

అ) దేవాలయాలలో ఉత్సవాలు జరిగేటప్పుడు వివరాలు అందరికి తెలుపుటకు పోస్టర్లు అంటిస్తారు. అటువంటి పోస్టరు ఒకటి చూడండి.

**శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం**
**వేములవాడ, రాజన్న సిరిసిల్ల జిల్లా**
**మహాశివరాత్రి ఉత్సవాలు**

శ్రీరాజరాజేశ్వర దేవస్థానం వేములవాడలో తేది : 11-03-2021 రోజున మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీరాజరాజేశ్వరస్వామి కళ్యాణోత్సవం నిర్వహిస్తారు. కాబట్టి భక్తజనులందరూ పాల్గొని కళ్యాణాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించి భగవంతుని అనుగ్రహాన్ని పొందగలరని కోరడమైనది.

కళ్యాణం జరిగే తేది : 11-03-2021
సమయం : రాత్రి 12 గంటలకు
వేదిక : శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయం,
వేములవాడ, రాజన్న సిరిసిల్ల జిల్లా.

ఇట్లు
ఆలయకమిటి,
శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయం,
వేములవాడ

పైన ఇచ్చిన పోస్టరు ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులను రాయండి.

1) పై పోస్టరు ఏ దేవస్థానానికి సంబంధించినది?

________________________________

2) వేములవాడ ఏ జిల్లాలో ఉన్నది?

________________________________

3) శ్రీరాజరాజేశ్వరస్వామి కళ్యాణం ఏ తేదీన జరుగుతుంది?

________________________________

4) శ్రీరాజరాజేశ్వరస్వామి కళ్యాణం ఎన్ని గంటలకు జరుగుతుంది?

________________________________



ఆ) తెలంగాణలోని కొన్ని ప్రముఖ దేవస్థానాలు కింది పట్టికలో ఉన్నాయి. వాటిని చదువండి.

| క్ర.సం. | దేవస్థానం | ఉన్న ప్రదేశం | జిల్లా |
|---|---|---|---|
| 1. | కాళేశ్వరముక్తీశ్వర దేవాలయం | కాళేశ్వరం | జయశంకర్ భూపాలపల్లి |
| 2. | రామప్ప దేవాలయం | పాలంపేట | ములుగు |
| 3. | వేయి స్తంభాల గుడి | వరంగల్ (పట్టణం) | వరంగల్ |
| 4. | శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయం | వేములవాడ | రాజన్నసిరిసిల్ల |
| 5. | శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం | ధర్మపురి | జగిత్యాల |
| 6. | శ్రీసత్యనారాయణస్వామి దేవాలయం | గూడెం | మంచిర్యాల |
| 7. | సరస్వతీమాత దేవాలయం | బాసర | నిర్మల్ |
| 8. | జోగులాంబ దేవాలయం (శక్తిపీఠం) | అలంపురం | గద్వాల |
| 9. | శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం | యాదగిరి గుట్ట | యాదాద్రిభువనగిరి |
| 10. | కేతకి సంగమేశ్వర ఆలయం | ఝరాసంఘం | సంగారెడ్డి |
| 11. | శ్రీఅనంతపద్మనాభ స్వామి దేవాలయం | అనంతగిరి కొండలు | వికారాబాద్ |
| 12. | శ్రీవిద్యా సరస్వతీ దేవాలయం | వర్గల్ | సిద్ధిపేట |
| 13. | నాగోబా దేవాలయం | కేస్లాపూర్ | ఆదిలాబాద్ |
| 14. | శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం | భద్రాచలం | భద్రాద్రి కొత్తగూడెం |

పై పట్టిక ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1) నరసింహస్వామి దేవాలయాలు ఎక్కడెక్కడ ఉన్నాయి?

_______________________________________________

2) సరస్వతీ మాత దేవాలయాలు ఎక్కడెక్కడ ఉన్నాయి?

_______________________________________________

3) వరంగల్ అర్బన్ జిల్లాలో ఉన్న ప్రముఖ దేవాలయం ఏది?

_______________________________________________

4) శక్తిపీఠం కలిగిన దేవాలయం ఏది? అది ఎక్కడ ఉన్నది?

_______________________________________________

5) శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం ఏ జిల్లాలో ఉన్నది?

_______________________________________________

## III. వ్యక్తీకరణ-సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులను రాయండి.**

1) గోండు భాష గురించి తెలిసింది కదా! ఇతర భాషలను మనం ఎందుకు నేర్చుకోవాలి?

2) సంచార జీవనం అంటే మీకు ఏమి అర్థమయింది?

3) "మీరు నిజంగా అభినందనీయులు" అని ఎవరు ఎవరితో అన్నారు? ఎందుకు అన్నారు?

4) ఆదిలాబాద్ జిల్లాలో ఏఏ గిరిజన తెగలవారున్నారు? వారు ఏ పండుగలు జరుపుకుంటారు?

**ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబును రాయండి.**

1) విహారయాత్రలకు ఎందుకు వెళ్లాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

### సృజనాత్మకత

**అ) దినచర్య రాయండి.**

ఒక వ్యక్తి తన రోజువారీ కార్యకలాపాలను, అనుభవాలను, అనుభూతులను, విశేషాలను రాసుకునేదాన్ని డైరీ లేదా దినచర్య అంటారు. ఎంతోమంది ప్రముఖులకు దినచర్య రాసే అలవాటు ఉంటుంది. మీరు కూడా దినచర్య రాయడం అలవాటు చేసుకోండి. ఇందుకోసం ఏదైనా ఒకరోజు దినచర్య రాసి ప్రదర్శించండి.

### నేను ఏయే సామర్థ్యాలు సాధించాను? (స్వీయమూల్యాంకనం)

| | | |
|---|---|---|
| 1) | పదాలకు అర్థాలను, ఇచ్చిన పదాలలో వేరుగా ఉన్న పదాన్ని రాయగలుగుతాను. | అవును / కాదు |
| 2) | కర్త, కర్మ, క్రియలను అవగాహనచేసుకొని గుర్తించగలుగుతాను. | అవును / కాదు |
| 3) | పోస్టరును చదివి, అర్థం చేసుకొని ప్రశ్నలకు జవాబులను రాయగలుగుతాను. | అవును / కాదు |
| 4) | ప్రముఖ దేవాలయాల వివరాలను తెలిపే పట్టికను చదివి ప్రశ్నలకు జవాబులను రాయగలుగుతాను. | అవును / కాదు |
| 5) | ఇచ్చిన ప్రశ్నలకు మరియు విహారయాత్ర గురించి సొంతమాటల్లో జవాబులను రాయగలుగుతాను. | అవును / కాదు |
| 6) | దినచర్య రాయగలుగుతాను. | అవును / కాదు |

**సూక్తి**

**కలిసి జీవించడం మన సంస్కృతిలోని గొప్ప లక్షణం. ఇతరుల సంస్కృతిని, భాషలను గౌరవించడం కూడా మన సంస్కృతి లక్షణమే.**

# 6 మాతృదేశం

– కాళోజీ నారాయణ రావు

## సాధించాల్సిన సామర్థ్యాలు – అభ్యసన ఫలితాలు

ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఈ కింది సామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలను సాధిస్తారు.

**I. భాషాంశాలు :**

అ) **పదజాలం** : పదాలతో సొంతవాక్యాలు రాయగలుగుతారు. వాక్యం ఆధారంగా పదాలకు అర్థాలను, ప్రకృతులకు వికృతులు, వికృతులకు ప్రకృతులు రాయగలుగుతారు.

ఆ) **వ్యాకరణాంశాలు** : సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలను అర్థంచేసుకొని వాటిని గుర్తించగలుగుతారు.

**II. అవగాహన – ప్రతిస్పందన :**

అ) పరిచిత కవితలోని వాక్యాలను సరిచేసి రాయగలుగుతారు.

ఆ) అపరిచిత గేయాలను చదివి అర్థం చేసుకొని, ప్రశ్నలకు జవాబులను గుర్తించగలుగుతారు.

**III. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

అ) **స్వీయరచన** : కాళోజీ గురించి రాయగలుగుతారు. కవి ఆంతర్యాన్ని, ఉద్దేశాన్ని వివరించగలుగుతారు. స్వర్గమోక్షాలకంటే దేశం గొప్పది అనే విషయాన్ని రాయగలుగుతారు.

ఆ) **సృజనాత్మకత** : ఇచ్చిన వచన కవితను పొడిగించి రాయగలుగుతారు.

## అభ్యాసకులకు సూచనలు

- పాఠాన్ని చదువండి. తెలియని పదాలను గుర్తించండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరి అకారాది పట్టికలో వెతుకండి.
- పాఠాన్ని మళ్ళీ చదివి అర్థం చేసుకోండి.
- పాఠంలో అర్థంకాని అంశాల గురించి మీ సమీపంలోని ఉపాధ్యాయులు లేదా కేంద్రంలో బోధించే వారితో చర్చించి తెలుసుకోండి.
- బాక్సులో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను పాఠంలో గుర్తించండి.



## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం వచన కవిత ప్రక్రియకు చెందినది. దీనికి ఛందో నియమాలు ఉండవు. లయాత్మకమైన స్వేచ్ఛా కవిత్వం వచన కవిత. చెప్పేది వచనం అయినా అందులో కవిత్వం ఉండాలి. అలాగే భావప్రధానంగా, కవితాత్మకంగా ఉండాలి.

ఈ పాఠం కాళోజీ నారాయణరావు రాసిన 'నా గొడవ' కవితా సంకలనం లోనిది.

## పాఠం ఉద్దేశం / నేపథ్యం

స్వాతంత్రోద్యమంలో భాగంగా దేశభక్తిని ప్రేరేపిస్తూ ప్రబోధాత్మకంగా రాసిన కవిత ఇది.

'మాతా పృథ్వీ పుత్రోహం పృథివ్యాః' అని ఋగ్వేదంలో చెప్పినట్టు మనం జన్మించి నివసిస్తున్న భూమిని తల్లిగా ఆరాధించాలి. మనకు జన్మనిచ్చిన తల్లి నవమాసాలు మోస్తే జన్మభూమి మనలను జీవితాంతం మోస్తుంది. మన జీవితానికి ఆధారమవుతుంది. "మన జీవనానికి నెలవైన, మన అభివృద్ధికి కారణమైన మాతృభూమిని ఆరాధించడం ఈ గడ్డపై పుట్టిన ప్రతి ఒక్కరి కర్తవ్యం" అని కవి చెప్పిన సందేశమే ఈ పాఠం ఉద్దేశం.

## కవి పరిచయం

కాళోజీ నారాయణ రావు వరంగల్ జిల్లా మడికొండకు చెందినవాడు. ఈయన తల్లిదండ్రులు రమాబాయమ్మ – రంగారావు.



09-09-1914

13-11-2002

కాళోజీ తెలంగాణ అస్తిత్వపు ఉద్యమ కవి, నిత్యచైతన్యశీలి. బాల్యం నుంచే అన్యాయాన్ని ఎదిరించే మనస్తత్వం కలిగినవాడు. జీవితమే ఉద్యమంగా, ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి. తెలంగాణ ప్రజల ఆర్తిని, ఆవేదనను, ఆగ్రహాన్ని తన గొడవగా కవిత్వీకరించాడు. కాళోజీకి తెలుగుతోపాటు ఉర్దూ, పార్సీ, మరాఠీ, కన్నడ, బెంగాలీ, ఇంగ్లీష్ మొ॥న భాషల్లో ప్రావీణ్యం ఉంది. ఈ భాషల నుండి తెలుగులోకి ఎన్నో రచనలను అనువాదం చేసాడు.

ఈయన అణాకథలు, నా భారతదేశ యాత్ర, పార్థివ వ్యయము, కాళోజీ కథలు, నాగొడవ, జీవనగీత (ఖలీల్ జిబ్రాన్ రాసిన 'దిప్రాఫిట్' కు ఇది అనువాదం), తుది విజయం మనది, తెలంగాణ ఉద్యమ కవితలు, ఇదీ నా గొడవ, బాపూ! బాపూ! బాపూ! వంటి రచనలు చేసాడు.

ఈయన 1992లో భారత ప్రభుత్వంచే పద్మవిభూషణ్ పురస్కారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే జీవనగీతకు అనువాద పురస్కారం, కాకతీయ విశ్వవిద్యాలయం వారి గౌరవ డాక్టరేట్ వంటి ఎన్నో పురస్కారాలను అందుకున్నాడు. ప్రజాకవి అనే బిరుదును పొందాడు.

కాళోజీ మరణానంతరం కూడా తన భౌతిక దేహాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు రాసిచ్చి మరణంలో కూడా ఆదర్శాన్ని చూపిన ధన్యజీవి.

## I

మాతృదేశము మాట ముచ్చట
ముదము గూర్పదు మదికి ననియెడి
పరమ నీచుడు ధరణినంతట
గలయ వెదికిన గాన నగునా?

నీరులేని ఎడారియైనను
వానవరదల వసతియైనను
అగ్గికొండల అవనియైనను
మాతృదేశము మాతృదేశమే

దేశదేశము తిరిగి చూడుము
కొంత హాయియె కూర్చుమదికిని
నాల్గురోజులు నచ్చదేదియు
స్వర్గమే నపవర్గమేనియు

తల్లి ఏడుపు తండ్రి కోపము
భార్య బిడ్డల ప్రణయ పాశము
ఇంచుకైన గణింపనీయదు
మాతృదేశము మాతృదేశమే



### మీరేమి అర్థం చేసుకున్నారు?

- 'పరమ నీచుడు' అని కవి ఎవరిని అన్నాడు?
- మాతృదేశం దేనిని లెక్కపెట్టనీయదని కవి అన్నాడు?

## II

లాఠిదెబ్బల లక్ష్యమేమీ
కఠిన శిక్షయె కాదుకాదు
చావుకైనను జంకనీయదు
మాతృదేశము మాతృదేశమే

పొట్టకన్నము కట్టుబట్టయు
లేని బ్రతుకును లెక్కసేయక
యెచ్చటికి బోనిచ్చగింపము
మాతృదేశము మాతృదేశమే

స్వర్గమే అపవర్గమేనియు
చాటి చెప్పెడు జన్మభూమియె
పరుల వశమున నరకకూపము
కన్న హేయము కఠినతరము

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

- 'ఎచ్చటికి పోనిచ్చగింపము' అన్న కవి మాటలను బట్టి మీకేమి అర్థమైంది?
- 'ఇతరుల పాలనలో ఉండడం కన్న నరకం లేదు' అని అర్థం వచ్చే కవితా పంక్తులను గుర్తించి రాయండి.

## సారాంశం

### I

1 మాతృదేశానికి సంబంధించిన మాట, ముచ్చట మనసుకు సంతోషాన్ని ఇవ్వవు అనే నీచుడు ఈ భూమిపై ఎక్కడ వెతికినా కనబడుతాడా?

2) నీరు లేని ఎడారి అయినా, వర్షాలు, వరదలతో నిండిన ప్రదేశమైనా, అగ్ని పర్వతాలతో కూడిన భూమి అయినా మాతృదేశం మాతృదేశమే.

3) ఎన్ని దేశాలు తిరిగి చూసినా మనస్సుకు కొద్ది సంతోషం మాత్రమే కల్గుతుంది. స్వర్గమైనా, మోక్షమిచ్చేవైనా కానీ నాలుగు రోజుల తర్వాత అవి నచ్చవు. కేవలం మాతృదేశమే శాశ్వత ఆనందాన్నిస్తుంది.

4) మాతృదేశంపట్ల భక్తి తల్లి ఏడుపును, తండ్రి కోపాన్ని, భార్యాపిల్లల బంధాన్ని కొంచమైనా లెక్క పెట్టనీయదు.

### II

5) మాతృదేశ స్వేచ్ఛ కోసం లాఠీ దెబ్బలను, కఠిన శిక్షలను లక్ష్యపెట్టనీయదు. తుదకు చావుకు కూడా భయపడనీయదు.

6) తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట లేకున్నా మన దేశాన్ని వదిలి వెళ్లడానికి ఇష్టపడం.

7) జన్మభూమి స్వర్గమోక్షాలతో సమానమైనది. పరాయి పాలనలో బ్రతకడం నరకానికన్నా హీనమైనది, కఠినమైనది.



# భాషాసామర్థ్యాలను సాధిద్దాం!

## I. భాషాంశాలు

### పదజాలం

**అ) కింది పదాలకు అర్థాలు రాసి సొంతవాక్యంలో ప్రయోగించండి.**

ఉదా : వసతి = సౌకర్యం

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉంటాయి.

1) మాటముచ్చట : ______________________

2) మాతృదేశం : ______________________

3) లక్ష్యం : ______________________

**ఆ) కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు అర్థాలను రాయండి.**

1) ఈ ధరణి పై సర్వజీవులు నివసిస్తున్నాయి. ____________

2) నేను అనుకున్నది సాధించడంతో ముదంతో ఉప్పొంగిపోయాను. ____________

3) మన మదినిండా మంచి ఆలోచనలు నింపాలి. ____________

**ఇ) కింది వాక్యాలలోని ప్రకృతి వికృతులను గుర్తించండి.**

1) అగ్నితో ఆటలు మంచివి కావు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ఆ అగ్గే మనల్ని దహిస్తుంది.

2) పుస్తకం మనకు స్నేహితుడితో సమానం. అందుకే రోజుకొక పొత్తం చదువాలి.

### వ్యాకరణాంశాలు

**అ) ఈ కింది వాక్యాలలోని సమాపక, అసమాపక క్రియలను గుర్తించండి.**

1) మాధవి అన్నం తిని, పాఠశాలకు వెళ్లింది.

అసమాపక : ____________ సమాపక : ____________

2) సతీష్ పరీక్షరాసి, ఇంటికి వచ్చాడు.

అసమాపక : ____________ సమాపక : ____________

3) భావన గుడికి వెళ్ళి, దేవునికి మ్రొక్కింది.

అసమాపక : ______________________ సమాపక : ______________________

**ఆ) కింది వాక్యాలలో కర్త, కర్మ, క్రియలను గుర్తించండి.**

1) భాగవతాన్ని పోతన రాసాడు.

కర్త : ________________ కర్మ : ________________ క్రియ : ________________

2) వేద కళాశాలకు వెళ్లింది.

కర్త : ________________ కర్మ : ________________ క్రియ : ________________

3) సాత్విక పాఠం చదివింది.

కర్త : ________________ కర్మ : ________________ క్రియ : ________________

## వాక్యాలు - రకాలు

**అ) కింది వాక్యాలను పరిశీలించండి. వాటి మధ్య భేదం గుర్తించండి.**

సంహిత పాఠం చదివింది. ఆమె టీచరు.

పై వాక్యాలను పరిశీలిస్తే,

మొదటి వాక్యంలో క్రియ ఉంది కదా! రెండవ వాక్యంలో క్రియ లేదు కదా! కానీ రెండు వాక్యాలు కూడా అర్థవంతంగానే ఉన్నాయి కదా! ఇలా పదాల కూర్పు అర్థవంతంగా ఉంటే ఆ వాక్యాన్ని 'సామాన్య వాక్యం' అంటారు.

కర్త (సంహిత)

కర్మ (పాఠం)

క్రియ (చదివింది) ఉన్నాయి.

వాక్యాలలోని రకాలను బట్టి వాక్యాలను మూడు రకాలుగా విభజించారు.

1. సామాన్య వాక్యాలు
2. సంశ్లిష్ట వాక్యాలు
3. సంయుక్త వాక్యాలు

పైన మనం సామాన్య వాక్యం అంటే ఏమిటో తెలుసుకున్నాం. సామాన్యవాక్యంలో ఒక క్రియ మాత్రమే ఉంటుంది. వీటిని క్రియాసహిత వాక్యాలు అంటారు. ఒక్కొక్కసారి క్రియ లేకుండా కూడా అర్థవంతమైన భావాన్ని అందించే వాక్యాలు కూడా ఉంటాయి. వీటిని 'క్రియారహిత వాక్యాలు' అంటారు.

ఉదా :- ఆమె టీచర్, అది గుడి

ఒక్కొక్కసారి ఏకపదం కూడా సామాన్య వాక్యంగా పరిగణించబడ్తుంది.

ఉదా:- మీరు అన్నం తిన్నారా? సామాన్యవాక్యం.

ఆ!! అని సమాధానం చెప్తాం. 'ఆ' అనే ఏక అక్షరం కూడా వాక్యంగా పరిగణించబడ్తుంది.

**అ) ఈ కింది వాటిలో క్రియాసహిత వాక్యాలేవో, క్రియా రహిత వాక్యాలేవో గుర్తించండి.**

1) రామయ్య అడవికి వెళ్లాడు

2) లతకు ఆటలంటే ఇష్టం

3) అతను డాక్టర్

4) సలీమా రొట్టెలు చేస్తున్నది.

## సంశ్లిష్ట వాక్యం

**ఇ) కింది వాక్యాలను చదువండి. కలిపి రాసిన విధానం పరిశీలించండి.**

ఉదా : గీత బజారుకు వెళ్ళింది. గీత కూరగాయలు కొన్నది.

గీత బజారుకు వెళ్ళి, కూరగాయలు కొన్నది.

**ఈ) కింది వాక్యాలను కలిపి రాయండి.**

1) విమల వంట చేస్తుంది. విమల పాటలు వింటుంది.

_______________

2) అమ్మ నిద్ర లేచింది. అమ్మ ముఖం కడుక్కుంది.

_______________

3) రవి ఊరికి వెళ్ళాడు. రవి మామిడి పండ్లు తెచ్చాడు.

_______________

పై వాక్యాలను కలిపి రాసినప్పుడు ఏం జరిగిందో చెప్పండి.

మొదటి వాక్యంలోని సమాపక క్రియ అసమాపక క్రియగా మారింది. కర్త పేరు రెండవసారి రాలేదు. అంటే కర్త పునరుక్తం కాలేదు.

ఇట్లా రెండు లేక మూడు వాక్యాలు కలిపి రాసేటప్పుడు చివరి వాక్యంలోని సమాపక క్రియ అలాగే ఉంటుంది. ముందు వాక్యాల్లోని సమాపక క్రియలు, అసమాపక క్రియలుగా మారుతాయి. కర్త పునరుక్తం కాదు. వీటినే **'సంశ్లిష్ట వాక్యాలు'** అంటారు.

**ఉ) కింది వాక్యాలను సంశ్లిష్ట వాక్యాలుగా రాయండి.**

1) రజిత అన్నం తిన్నది. రజిత బడికి వెళ్ళింది.

2) వాళ్ళు రైలు దిగారు. వాళ్ళు ఆటో ఎక్కారు.

3) రాజన్న లడ్డూలు తెచ్చాడు. రాజన్న అందరికీ పంచాడు.

## సంయుక్త వాక్యం

**ఊ) కింది వాక్యాలను చదువండి. కలిపి రాసిన విధానం పరిశీలించండి.**

ఉదా :రైలు వచ్చింది. చుట్టాలు రాలేదు.

రైలు వచ్చింది కానీ చుట్టాలు రాలేదు.

**ఎ) కింది వాక్యాలను కలిపి రాయండి.**

1) వర్షాలు కురిసాయి. పంటలు బాగా పండాయి.

2) అతనికి కనిపించదు. అతడు చదువలేడు.

పై వాక్యాలను కలిపి రాసినప్పుడు ఏం జరిగిందో చెప్పండి.

పై వాక్యాలను కలిపి రాసేటప్పుడు క్రియలలో మార్పురాలేదు. వాక్యాలమధ్య కొన్ని అనుసంధాన పదాలు వచ్చాయి. ఇట్లా రెండు వాక్యాలను కలిపి రాసేటప్పుడు క్రియలలో మార్పు లేకుండా మధ్యలో అనుసంధాన పదాలు రాస్తే అవి 'సంయుక్త వాక్యాలు' అవుతాయి. అనుసంధాన పదాలు అంటే 'కావున', 'కానీ', 'మరియు', 'అందువల్ల' మొదలైనవి.

**ఏ) సంయుక్తవాక్యంగా మారేటప్పుడు వాక్యాల్లో వచ్చే మరికొన్ని మార్పులు ఎట్లా ఉంటాయో గమనించండి.**

1) వనజ చురుకైనది. వనజ అందమైనది.

వనజ చురుకైనది, అందమైనది. రెండు నామవాచక పదాల్లో ఒకటి లోపించడం.

2) దివ్య అక్క, శైలజ చెల్లెలు.

దివ్య, శైలజ అక్కాచెల్లెళ్ళు - రెండు నామవాచక పదాలు ఒకేచోట చేరి చివర బహువచనం చేరడం.

3) రామయ్య వ్యవసాయదారుడా? రామయ్య ఉద్యోగస్తుడా?

రామయ్య వ్యవసాయదారుడా? ఉద్యోగస్తుడా? - రెండు నామవాచకాలలో ఒకటి లోపించడం.

4) ఆయన డాక్టరా? ఆయన ప్రొఫెసరా?

ఆయన డాక్టరా? ప్రొఫెసరా? - రెండు సర్వనామాలలో ఒకటి లోపించటం.

**ఐ) కింది సామాన్య వాక్యాలను సంయుక్త వాక్యాలుగా మార్చి రాయండి.**

1) వారు గొప్పవారు. వారు తెలివైనవారు.

2) సుధ మాట్లాడదు. సుధ చేసి చూపిస్తుంది.

3) మేము రాము. మేము తేలేము.

## II. అవగాహన-ప్రతిస్పందన

**అ) మాతృదేశము కవితను కంఠస్థం చేయండి.**

**ఆ) కింది కవితా పంక్తులను సరిచేసి రాయండి.**

స్వర్గమే నపవర్గమేనియు
కొంత హాయియె కూర్చుమదికిని
దేశదేశము తిరిగి చూడుము
నాల్గు రోజులు నచ్చదేదియు.

**ఇ) గురజాడ అప్పారావు రాసిన కింది 'దేశభక్తి' గేయపంక్తులను చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

దేశమును ప్రేమించుమన్నా
మంచి యన్నది పెంచుమన్నా
వొట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్

సొంత లాభం కొంతమానుకు
పొరుగువాడికి తోడుపడవోయ్
దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్

1) ఈ గేయాన్ని రాసింది ఎవరు?

___

2) దేశానికి ఎలాంటి మేలు చేయాలి?

___

3) దేశంలో పెంపొందించాల్సినదేమిటి?

4) దేశమంటే ఏమిటి?

5) పొరుగువారికి ఎలా తోడ్పడాలి?

## III. వ్యక్తీకరణ-సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులను రాయండి.**

1) కాళోజీ గురించి రాయండి.

2) మాతృదేశం అంటే ఇష్టపడని వారిని కవి ఎవరితో పోల్చాడు. ఎందుకు?

3) నీళ్ళు లేని ఎడారి అయినా, వానవరదల ప్రదేశమైన మాతృదేశం మాతృదేశమే అన్న కవి మాటలలోని ఆంతర్యమేమిటి?

4) 'దేశం కోసం చావుకైనా భయపడం' అన్న కవి మాటలనుబట్టి మీరేమి అర్థం చేసుకొన్నారు?

**ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబును రాయండి.**

1) 'స్వర్గ మోక్షాలకంటే కూడా మాతృదేశమే చాలా గొప్పది' సమర్థిస్తూ రాయండి.

### సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది ప్రశ్నకు జవాబును సృజనాత్మకంగా రాయండి.**

**కింది వచన కవితను పొడిగించి రాయండి.**

అందమైనది నా దేశం

బహు సుందరమైనదీ దేశం



## నేను ఏయే సామర్థ్యాలు సాధించాను? (స్వీయమూల్యాంకనం)

| | | |
|---|---|---|
| 1) | వాక్యం ఆధారంగా నూతన పదాలకు అర్థాలను రాయగలను. | అవును / కాదు |
| 2) | పదాలను సొంతవాక్యంలో ప్రయోగించగలను. | అవును / కాదు |
| 3) | ప్రకృతికి వికృతి, వికృతికి ప్రకృతి పదాలను గుర్తించగలను. | అవును / కాదు |
| 4) | పాఠ్యభాగ కవితను కంఠస్థం చేయగలను. | అవును / కాదు |
| 5) | అపరిచిత గేయాలను చదివి ప్రశ్నలకు జవాబులను, గుర్తించగలను. | అవును / కాదు |
| 6) | కాళోజీ గురించి, దేశం గొప్పతనం గురించి రాయగలను. | అవును / కాదు |
| 7) | ఇచ్చిన కవితను పొడిగించి రాయగలను. | అవును / కాదు |

## సూక్తి

'అపి స్వర్ణమయీ లంకా – నమే రోచతే! లక్ష్మణ!

'జననీ జన్మభూమిశ్చ – స్వర్గాదపి గరీయసీ'

భావం : లక్ష్మణా! లంకా నగరం స్వర్ణమయమై శోభించినా, నన్నాకర్షించుట లేదు. అది మన మాతృభూమి కాదు. జనని, జన్మభూమి స్వర్గం కంటే గొప్పవి కదా!

# 7 నా చదువు

- సంగం లక్ష్మీబాయి

## సాధించాల్సిన సామర్థ్యాలు - అభ్యసన ఫలితాలు

ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఈ కింది సామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలను సాధిస్తారు.

### I. భాషాంశాలు :

అ) **పదజాలం** : కొత్త పదాలకు అర్థాలను / పర్యాయపదాలను రాయగలుగుతారు.

ఆ) **వ్యాకరణాంశాలు** : వాక్యభేదాలను అర్థంచేసుకొని గుర్తించగలుగుతారు.

### II. అవగాహన - ప్రతిస్పందన :

అ) అపరిచిత గద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలుగుతారు, ఖాళీలు పూరించగలుగుతారు.

### III. వ్యక్తీకరణ - సృజనాత్మకత :

అ) **స్వీయరచన** : ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయగలుగుతారు.

ఆ) **సృజనాత్మకత** : స్వీయ అనుభవాన్ని లేదా సంఘటనను ఆత్మకథ రూపంలో రాయగలుగుతారు.

## అభ్యాసకులకు సూచనలు

- పాఠాన్ని చదువండి. తెలియని పదాలను గుర్తించండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరి అకారాది పట్టికలో వెతుకండి.
- పాఠాన్ని మళ్ళీ చదివి అర్థం చేసుకోండి.
- పాఠంలో అర్థంకాని అంశాల గురించి మీ సమీపంలోని ఉపాధ్యాయులు లేదా కేంద్రంలో బోధించే వారితో చర్చించి తెలుసుకోండి.
- బాక్సులో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను పాఠంలో గుర్తించండి.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'ఆత్మకథ' అనే ప్రక్రియకు చెందినది. ఒక వ్యక్తి తన జీవిత అనుభవాలను, విశేషాలను గ్రంథరూపంలో రచిస్తే అది ఆత్మకథ అవుతుంది. దీనిని 'స్వీయచరిత్ర' అని కూడా పిలుస్తారు. ఇందులో రచయిత అనుభవాలే కాకుండా ఆ కాలంనాటి సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయి. చదివిన వారికి కొత్త అనుభవాన్ని, జ్ఞానాన్ని, స్ఫూర్తిని కలిగిస్తాయి. 'ఆత్మకథ' ఉత్తమ పురుష కథనంలో 'నేను' అని విషయాలను వివరిస్తుంది. ప్రస్తుత పాఠ్యభాగం సంగం లక్ష్మీబాయి రాసిన 'నాజైలు జీవితం జ్ఞాపకాలు, అనుభవాలు' అనే ఆత్మకథ నుండి గ్రహించబడింది.

## పాఠం ఉద్దేశం / నేపథ్యం

లక్ష్మీబాయి రెండేళ్ళ పసివయసులోనే తల్లిని కోల్పోయి పదవ ఏటనే భర్తను పోగొట్టుకుని జీవితాంతం వితంతువుగా గడిపింది. అనేక కష్టాలు, విషాదాలు చుట్టుముట్టినా నిరాశపడకుండా పట్టుదలతో చదువుకుంది. స్వాతంత్రోద్యమంలో పాల్గొని ఒక సంవత్సరం జైలు జీవితం గడిపింది. జైలులోనూ తన స్ఫూర్తిని, చైతన్యాన్ని కోల్పోకుండా పోరాడింది. స్త్రీల అభ్యున్నతి కోసం కృషి చేసింది. లక్ష్మీబాయి జీవితం ఈ తరానికి ఆదర్శనీయం, మార్గదర్శకం. నాటితరం దేశభక్తుల నిస్వార్థ త్యాగానికి, మహిళా సాధికారతకు ప్రతీకగా నిలిచిన లక్ష్మీబాయి కొన్ని అనుభవాలను ఈ పాఠం ద్వారా తెలుసుకుందాం.

## రచయిత్రి పరిచయం



**27-07-1911**
**13-11-2002**

*జీవితమే ప్రజాసేవగా బతికిన శ్రీమతి సంగం లక్ష్మీబాయి 1911 వ సం. జులై 27న హైదరాబాదులోని ఘటకేశ్వర్‌లో జన్మించింది. తల్లిదండ్రులు సీతమ్మ, దొంతుల రామయ్యలు. గాంధీజీ ఆదర్శాలతో ప్రేరేపితమై జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొన్నది. నిజాం వ్యతిరేక పోరాటోద్యమం, హైదరాబాదు విమోచనోద్యమంలోనూ చైతన్యవంతంగా పనిచేసింది. గాంధీజీ నడిపిన ఉప్పు సత్యాగ్రహంలో, వినోబాభావే భూదానోద్యమంలో పాల్గొన్న తొలి తెలంగాణ మహిళగా లక్ష్మీబాయిని తలచుకుంటాం. స్వాతంత్ర్యానంతరం 1952లో బాన్సువాడ అసెంబ్లీ నియోజక వర్గం నుండి శాసన సభ్యురాలిగా ఎన్నికైంది. 1957, 62, 67 సంవత్సరాలలో వికారాబాద్, మెదక్ ప్రాంతాల నుండి లోక్‌సభకు ఎన్నికైన తొలి మహిళగాను గుర్తింపు పొందింది. 1954-56 సంవత్సరాలలో ఆనాటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో విద్యాశాఖ ఉపమంత్రిగా పనిచేసింది. 1952లో తన 50 ఎకరాల పొలాన్ని నిస్సహాయ స్త్రీల సంక్షేమం కోసం దానం చేసి 'ఇందిరా సేవాసదన్' స్థాపించిన త్యాగమూర్తి జూన్ 3, 1979న తుదిశ్వాస విడిచింది.*

## I

నేను ఘటకేశ్వరంలో పుట్టి పెరిగాను. నైజాంలో కాంగ్రెసు ఉద్యమ జ్వాలలు రగులుకోలేదు కనుక, రగులుకునే అవకాశమూ లేదు కనుక దేశమంతా అట్టుడికినట్లావేశంతో వెర్రెత్తిపోయేవేళ నైజాం రాష్ట్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ప్రశాంతంగా ఉండేది. ఎక్కడో పల్లెటూరులో పుట్టి పెరుగుతూ, పెద్దగా విద్యా గంధంలేని నాకు దేశ పరిస్థితులు తెలిసి ఉండకపోవును. కాని నాకు చిన్నప్పటి నుంచీ ఆసక్తి అధికం. నా చుట్టూ పరిసరాల్ని, నా జీవితాన్ని ఏ విధంగా ఉంచుకోవాలో, ఏ విధంగా ఉంచకూడదో వాటి గురించి నాకు చిన్నప్పటి నుండి కొన్ని ఊహలు, ఉద్దేశాలు ఉండేవి. నా వైవాహిక జీవిత వైఫల్యంతో నా ఊహాపోహలు విప్లవ భావాలతో వర్ధిల్లాయి. పదేళ్ల పిల్లలకు భావ విప్లవమేమిటని మీరనుకోవచ్చు. ఇప్పుడంటే పదేళ్ల పిల్ల ఇంకా పసిపిల్ల కిందే జమ. కాని అప్పుడు పరిసరాల కారణంగానో, అట్టే బడికిపోయి చదువుసంధ్యలు నేర్వకపోవటంవల్లనో, అమ్మలక్కల బాహాటమైన సంభాషణల మూలంగానో పదేళ్లకే మాకెన్నో విషయాలు తెలిసేవి. ఎంతో మాటకారితనం వచ్చేది. ఎంతో పెద్దరికమూ వచ్చేది.



నా భావ విప్లవానికి మరింత ఊతమిచ్చిన విషయం మరొకటి ఉంది. మా నాయన చదువురాని వాడైనా, మేనమామలు మంచి విద్యావంతులు. నా మేనమామ శ్రీ సంగం సీతారామయ్య ఆ రోజులలో హైదరాబాదులో శ్రీ మాడపాటి హనుమంతరావుగారితో పాటుగా శ్రీ కృష్ణరాయ ఆంధ్రభాషా నిలయాన్ని స్థాపించటానికి కారకుడైనాడు. ఆయన దానికి కోశాధికారిగా ఉండేవాడు. నగరంలో ఎన్నో సేవాసంస్థలతో సంస్కరణ సంఘాలతో సంబంధం ఉన్న ఆయన ఇంటికి ఎన్నెన్నో దిన, వార, మాస పత్రికలు వచ్చేవి. ఎన్నో ఉత్తమ గ్రంథాలుండేవి.



నేను హైదరాబాదు వెళ్ళినప్పుడల్లా పుస్తకాల పురుగునై పోయేదానిని. అవి పఠించటంవల్ల నాలో జ్ఞానం అధికమవటమేకాక, నైజాం వెలుపల జరుగుతున్న ఉద్యమం, కల్లోలం అవగాహన అయింది. అప్పుడు నాకు రెండే రెండు కోరికలుండేవి. ఒకటి : బాగా చదువుకోవాలి. రెండు : బాపూజీ స్వాతంత్ర్య సమరంలో నేనూ ఒక సమిధనైపోవాలి. చదువుకుని జన్మ సార్థకత పొందాలన్న నా కోరిక మా నాయన కెంతమాత్రమూ అంగీకారం కాలేదు. ఆయన సత్యకాలం వాడు. పరమ సాత్త్వికుడు. మార్పు అంటేనే భయపడే తత్త్వం కలవాడు. 'అందరిలా కూతురికి పెళ్ళి చేసాను. అదృష్టం వక్రించింది. అతను పోయాడు. చేసేదేముంది? జీవితం కష్టమో, సుఖమో ఎట్లాగో వెళ్లబుచ్చుకోవాలి కాని – చదువులనీ, సంధ్యలనీ వంశంలోలేని పద్ధతులు ప్రారంభించి ఒకరిచేత వేలెత్తి చూపించుకోవటమెందుకు?" అని ఆయన అభిప్రాయం. 'ఇంతవరకు వితంతువులైన ఆడవాళ్లకు చదువుకుంటేనే జీవితం గడిచిందా? లేకపోతే గడవలేదా?' ఇది ఆయన ఘాటు ప్రశ్న.

ఈ భయాలకు, అనుమానాలకు నేనేమని సమాధానం చెప్పగలను? ఆయన భయాలు, సందేహాలు అసత్యమని నేను నిరూపిస్తానన్నా ఆయనకు నమ్మకం కలగాలి కదా! నేనేమి చేసి ఆయనను నమ్మించగలను? ఏమైనా చేయటానికైనా అసలు అవకాశమివ్వాలి కదా!

నేను మా బడిలో నాలుగవ తరగతి దాకా చదువుకున్నాను. నా విద్యాభ్యాసానికి ఒకసారి అంతరాయం కలిగింది. ఎట్లాగంటే, మా నాయన ఎంత ప్రతిఘటిస్తున్నా, నా మేనమామ నా కోసం గుంటూరు శారదానికేతనానికి ఉత్తరం రాసాడొకసారి. శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారు నన్ను నికేతనంలో చేర్చుకుంటామని, అయితే నేను ఫలానా సంగం సీతారామయ్యగారి మేనకోడలిని కనుక కొంచెం స్థితిగల దానినే కనుక సంవత్సరానికి డబ్బు కట్టవలసి ఉంటుందని రాసినప్పుడు సీతారామయ్యగారి మేనకోడలిని కావటం నిజమే కాని స్థితి కొరవడిన దానిని కావటం చేత నా భారం వహించేందుకెవరూ ముందుకు రాకపోవటం చేత తిరిగి ఘటకేశ్వరం చేరుకోవలసి వచ్చింది.

అప్పుడు దేశపు అనిశ్చిత స్థితి మాట ఎట్లా ఉన్నా, నా జీవితం అంతులేని అయోమయావస్థలో ఉండేది. నేనేమి చేయాలి? ఏం చేయగలను? నాలో ఎన్నో భావాలున్నాయి. ఆవేశముంది. చురుకుతనమూ, జిజ్ఞాసా ఉన్నాయి. ఏదో చేయాలని ఉన్నా, ఏది చేయాలి? ఏం చేయాలి? అని సంఘర్షణ.

ఇట్లా రెండేళ్ళ అంతస్సంఘర్షణ అనంతరం నేను శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారికి మళ్ళీ ఒక ఉత్తరం రాసాను, అవుతే ఈసారి సంగం సీతారామయ్యగారి మేనకోడలుగా కాదు. అట్లా అయితే డబ్బు కట్టమంటారు. డబ్బులేని పేద మా నాయన. అందుకని నన్ను నేనొక అనాథగా, నిరుపేదగా ఉన్న పరిస్థితి కంటే ఇంకొంచెం హీనంగా, చదివేవారి హృదయాలు కదిలిపోయేటట్లుగా వర్ణించి వ్రాసి, చివర ఈ పరిస్థితులలో నా భవిష్యత్తు కొక దారి చూపే బాధ్యత మీదేనంటూ ముగించాను.

నా ఉత్తరానికి లక్ష్మీనారాయణగారు వెంటనే జవాబిచ్చారు. జీతనాతాలూ కట్టవలసిన అవసరం లేకుండా శారదా నికేతనంలో చేర్చుకుంటామని, బయలుదేరి రమ్మనమని రాశారు.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

- లక్ష్మీబాయికి పుస్తక పఠనంపై ఆసక్తి ఎలా కలిగింది?
- లక్ష్మీబాయికి గల రెండు కోరికలేవి?



## II

నా జీవితంలో అది ఒక సువర్ణావకాశం. నాలో సన్నని వణుకు ప్రారంభమైంది. వెంటనే నేను నా పెద్ద మేనమామ లింగయ్యగారికి మహబూబ్‌నగర్‌కు ఉత్తరం రాసాను. నన్ను జీతం కట్టనవసరం లేకుండా శారదానికేతనం వాళ్ళు చేర్చుకునేందుకు అంగీకరించారని, కాని ఈ విషయం నాన్నకి తెలిస్తే పంపడు కనుక దయచేసి ఎట్లాగో నన్నక్కడికి పంపే ఉపాయం చూడమనీ అర్థిస్తూ వ్రాసాను. దానికి జవాబుగా నా మేనమామ కొడుకు దిగాడు. అతనితో హైదరాబాదుకు చిన్న మేనమామ ఇంటికి వెళ్తున్నానని మా నాయన అనుమతి తీసుకుని బయలుదేరి గుంటూరు వచ్చాను.

ఆ రావటంతో మా నాయనకీ, నాకు ఉండే బంధం తెగిపోయింది. తెగిపోతుందనే చాలా రోజులు నా ఊహ. ఎందుకంటే మా నాయన ఎంత అమాయకుడో వంశ ప్రతిష్ఠకూ, మర్యాదకూ అంత విలువనిచ్చే మనిషి. నేనాయనకు చెప్పకుండా నా మేనమామల ద్వారా నా భవిష్యత్తు నిర్ణయించుకుంటే విద్యా వ్యాసంగమే పనికి రాని ఆయనకు నా ఈ చర్య ఆమోదదాయకం ఎట్లా అవుతుంది?

కనుక జీవితంలో పురోగమించదలచుకుంటే ఈ బంధాలు, మమతలు మరచిపొమ్మంది మనసు. మరచిపోయాను. నా తల్లి నాకు ఏరి కోరి పెట్టిన పేరు సత్యవతి. ఇంకా ఆడపిల్లలు పరాయి ఇంటికి పోయే పిల్లలనీ, మగబిడ్డలే తమ బిడ్డలనీ భావించే కాలంలో మా అమ్మ ఆడపిల్ల కోసం ప్రతి నిత్యం సత్యనారాయణ వ్రతం చేసేదట. అట్లా వ్రతాలు చేసి కన్నది కనుక నా పేరు సత్యవతి అని పెట్టింది. నా మేనమామ సంగం సీతారామయ్యగారు 'సత్యవతి' కోసం శారదా నికేతనంలో ప్రయత్నించారు. ఇప్పుడదే పేరు చెబితే మళ్ళీ డబ్బు ప్రశ్న. దాంతోపాటు నేను వ్రాసిన అబద్ధాలూ అన్నీ బయటికి వస్తాయి. కనుక సత్యవతి పేరు చెప్పలేను. నా అత్తవారు నాకు పెట్టిన పేరు లక్ష్మీబాయి. ఆ పేరు చెప్పాను శారదా నికేతనం నిర్వాహకులతో ఆ పేరుతోనే లక్ష్మీనారాయణగారికి వ్రాసిన ఉత్తరంలోనూ సంతకం చేశాను.

'మీ ఇంటి పేరేమిటి?' అని నిర్వాహకులడిగినప్పుడు, నా మేనమామ కొడుకు 'సంగం వారు' అని చెప్పాడు. అతని చెల్లెలుగా పరిచయం కాబడిన నా ఇంటి పేరు అదే వ్రాసుకున్నారు నిర్వాహకులు. చాలా చిక్కులున్నాయి. ముఖ్యంగా సంగం సీతారామయ్యగారి ప్రథమ ప్రయత్నమూ, నా అబద్ధాలూ బయటికి పొక్కుతాయి. కనుక మౌనంగా ఉండటమే ఉత్తమంగా భావించాను. నేను శారదా నికేతనంలో చేరే నాటికి నా భర్త ఆస్తి అంతా ఆయన మరణానంతరం వ్యాజ్యాలలో ఇరుక్కుపోయి ఉంది. నేను పేరుకు ఆస్తిపరురాలినే కాని, దమ్మిడీ చేతలేనిదానను. నేను గుంటూరు వచ్చి శారదానికేతనంలో చేరటంతో తండ్రితో నాకున్న అనుబంధమూ తెగిపోయింది.

శారదా నికేతనంలో శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ గారిని బాబుగారని, లక్ష్మీబాయమ్మ గారిని అమ్మగారని నేను పిలుస్తూ ఉండేదానిని. లక్ష్మీబాయమ్మ గారికి నాకు ఆయుర్వేదంగానీ, పెయింటింగుగానీ నేర్పించాలని ఉండేది. అయితే నేనా తరువాత మద్రాస్ ఆర్ట్ స్కూల్లో డిప్లొమా తీసుకోవటమూ, బి.ఏ. పాసవటమూ జరిగాయి.

### మీరేమి అర్థం చేసుకున్నారు?

- లక్ష్మీబాయి ఉన్నవ లక్ష్మీనారాయణకి రాసిన ఉత్తరంలో తన గురించి ఏమని చెప్పుకుంది?
- లక్ష్మీబాయి ఎవరిని తల్లిదండ్రులుగా భావించింది?



# భాషాసామర్థ్యాలను సాధిద్దాం!

## I. భాషాంశాలు

### పదజాలం

**అ) కింది పదాలకు అర్థాలను రాయండి.**

1) నిరాశ్రయులు = ______________________

2) వైఫల్యం = ______________________

3) జమ = ______________________

4) బాహాటం = ______________________

5) జిజ్ఞాస = ______________________

**ఆ) 'అవని' అనగా భూమి, ధరణి, ధాత్రి అనే అర్థాలున్నాయి. ఇలా ఒక పదానికి సమానార్థాన్నిచ్చే పదాలను 'పర్యాయపదాలు' అంటారు. ఈ కింది పదాలకు పర్యాయపదాలను రాయండి.**

1) ఆరాటం = ______________________________________________

2) ఊతం = ______________________________________________

3) సమరం = ______________________________________________

4) ప్రయత్నం = ______________________________________________

5) అంతరాయం = ______________________________________________

### వ్యాకరణాంశాలు

**అ) ఈ కింది వాక్యాలను చదివి అర్థం చేసుకోండి.**

1) ఆహా! ఎంత బాగుందో!

2) చేతులు కడుక్కో

3) చాలాసేపు టి.వి. చూడొద్దు

4) లోపలికి రావచ్చు

5) గోపాల్ చెట్టు ఎక్కగలడు

❖ 'ఆహా! ఎంత బాగుందో!" ఈ వాక్యం ఆశ్చర్యానికి సంబంధించిన అర్థాన్ని సూచిస్తుంది. కనుక ఈ వాక్యం 'ఆశ్చర్యార్థక వాక్యం' అంటాము.

❖ రెండో వాక్యం 'చేతులు కడుక్కో'. ఇది విధిగా చేయాలి అనే అర్థాన్ని సూచిస్తున్నది. అంటే చేయాల్సిన పనిని విధిగా చేయాలి అనే అర్థాన్ని సూచిస్తున్నది కనుక దీనిని 'విధ్యర్థక వాక్యం' అంటాము.

❖ తరువాత వాక్యం చూడండి 'చాలా సేపు టి.వి. చూడొద్దు'. ఈ వాక్యం ఎక్కువసేపు టి.వి. చూడవద్దని చెబుతున్నది. అంటే టి.వి. చూడటాన్ని నిషేధిస్తున్నది కదా! అంటే ఒక పనిని చేయవద్దని చెబుతున్నది కనుక దీనిని 'నిషేధార్థక వాక్యం' అంటాము.

❖ ఇక నాలుగో వాక్యం 'లోపలికి రావచ్చు'. ఈ వాక్యం ఒక వ్యక్తికి అనుమతి ఇస్తున్నట్లు సూచిస్తున్నది కదా! అంటే ఇది 'అనుమత్యర్థక వాక్యం'. ఏదైనా ఒక పనిని చేయడానికి అనుమతినిచ్చే అర్థాన్ని సూచించే వాక్యం అనుమత్యర్థక వాక్యం.

ఇక చివరి వాక్యం

❖ 'గోపాల్ చెట్టు ఎక్కగలడు'. ఈ వాక్యం గోపాల్ చెట్టు ఎక్కగల సామర్థ్యం కలవాడని సూచిస్తున్నది. ఒక వ్యక్తిని గాని, వ్యవస్థకు గాని లేదా యంత్రానికి గాని ఉన్న సమర్థతను సూచించే అర్థంగల వాక్యాన్ని 'సామర్థ్యార్థక వాక్యం' అంటాము.

ఇప్పటివరకు క్రియను బట్టి వాక్యాలలో భేదాలు తెలుసుకున్నారు కదా! ఇప్పుడు ఈ కింది వాక్యాలలోని భేదాలను గుర్తించండి.

1) మాస్కు లేకుండా ఇంటి బయటకు వెళ్లవద్దు.

2) పరీక్షకు హాజరు కావచ్చు.

3) అందరూ నిశ్శబ్దాన్ని పాటించండి.

4) బాలు చాలా బాగా పాడతాడు.

5) అబ్బా! వడలు ఎంత రుచిగా ఉన్నాయో!

## II. అవగాహన-ప్రతిస్పందన

### అ) కింది అపరిచిత గద్యాన్ని చదువండి. ప్రశ్నలకు జవాబులను రాయండి.

తెలంగాణ రైతాంగ పోరాటంలో మహిళల పోరాటశక్తికి నిదర్శనం చాకలి ఐలమ్మ. ఈమె 1895 సెప్టెంబరు 26న వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కృష్ణాపురం గ్రామంలో ఓరుగంటి మల్లమ్మ, సాయిలుకు జన్మించింది. బట్టలుతికే వృత్తి వారి జీవనాధారం. పాలకుర్తి గ్రామానికి చెందిన చిట్యాల నర్సయ్యతో ఐలమ్మ వివాహం జరిగింది. చాకలి వృత్తిలో ఉండటంవల్ల చాకలి ఐలమ్మగానే ఆమె పేరు స్థిరపడింది. ఐలమ్మ బాల్యం నుండే చురుకైన మహిళగా, ధైర్యవంతురాలిగా గుర్తింపు పొందింది. పాలకుర్తిలో నాలుగు ఎకరాల కౌలు భూమిని సాగుచేసుకుంటూ ఐలమ్మ కుటుంబం బతుకుతుండేది. స్థానిక దొరలు, భూస్వాముల దౌర్జన్యం, ఆధిపత్యం, దోపిడీ విధానాలతో ఐలమ్మ విసిగిపోయింది. ఆంధ్ర మహాసభలో సభ్యురాలైంది. విసునూర్ దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి ఐలమ్మ కౌలుభూమిని స్వాధీనం చేసుకుని పంటను తమ గడీకి తరలించే ప్రయత్నం చేశాడు. ఐలమ్మ తీవ్రంగా ప్రతిఘటించింది. దేశ్‌ముఖ్ గూండాలు ఐలమ్మ ఇంటిని తగులబెట్టారు. అయినా ఆమె ధైర్యాన్ని కోల్పోలేదు. తనకున్న కొద్దిపాటి శక్తితో రోకలిబండ చేతబూని దేశ్‌ముఖ్ గూండాలపై, రజాకార్లపై



ఎదురుదాడిచేసి తరిమికొట్టింది. 1940-44 మధ్యకాలంలో మహిళ ప్రజాపోరాట మార్గానికి దారి చూపిన సాహస ఉద్యమకారిణి చాకలి ఐలమ్మ., ఈ వీరవనిత 1985 సెప్టెంబరు 10న అనారోగ్యంతో మరణించింది.

1) చాకలి ఐలమ్మ ఎప్పుడు జన్మించింది?

______________________________

2) చాకలి ఐలమ్మకు ఎవరితో వివాహం జరిగింది?

______________________________

3) ఐలమ్మ ఆగ్రహానికి, ప్రతిఘటనకు కారణమేమిటి?

______________________________

4) ఐలమ్మ ఎవరిని తరిమికొట్టింది?

______________________________

**ఆ) కింది అపరిచిత గద్యాన్ని చదువండి. ఖాళీలను పూరించండి.**

భారతీయ మహిళా సంఘసంస్కర్తల్లో సావిత్రీబాయి పూలే పాత్ర అత్యంత ప్రభావశీలమైంది. ఈమె మహారాష్ట్రలోని సతారా జిల్లాలో నయాగావ్ గ్రామంలో 1831 జనవరి 3న రైతుకుటుంబంలో జన్మించింది. వెనుకబడిన అస్పృశ్య కులాల, వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేసిన మహాత్మా జ్యోతీరావ్ పూలే భార్యగానే కాకుండా, తనదైన అస్తిత్వాన్ని నిలుపుకున్న గొప్ప మహిళ. సావిత్రిబాయి చదువుపై ఇష్టంతో, పట్టుదలతో ఇంట్లోనే ప్రాథమిక విద్యాభ్యాసాన్ని ప్రారంభించింది. ఉపాధ్యాయ శిక్షణను పూర్తిచేసింది. 1848 జనవరి 1న పూలేతో కలిసి నిమ్నకులాల బాలికల కోసం పూణేలో మొదటి పాఠశాలను ఆరంభించింది. 1855లో కార్మికులు, రైతుల కోసం రాత్రి పాఠశాలను, 1863లో సంఘ బహిష్కృతులైన తల్లీ పిల్లల కోసం శరణాలయాన్ని స్థాపించింది. 1873లో సామాజిక, ఆధ్యాత్మిక సమాజం 'సత్యశోధక్'లో క్రియాశీలంగా పనిచేసింది. అవసరమైనప్పుడు కరువు ప్రాంతాలలో పర్యటిస్తూ అనేక సహాయ కార్యక్రమాలను నిర్వహించింది. ఒక వితంతువు కొడుకు యశ్వంతను దత్తత తీసుకుని పెంచుకుంది. 10 మార్చి 1897న ప్లేగు వ్యాధి బాధితులకు సేవచేస్తూ ఆ వ్యాధి సోకి మరణించింది. భారతదేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయినిగాను, స్త్రీల పురోభివృద్ధి, సామాజిక, ఆరోగ్యరంగాలలో గొప్ప సేవ చేసిన మరపురాని అద్భుత మహిళా ఉద్యమ స్వరూపిణి సావిత్రీబాయి పూలే.

1) సావిత్రీబాయి పూలే ______________ న జన్మించింది.

2) వెనకబడిన, అస్పృశ్య ______________, ______________ అభ్యున్నతి కోసం సావిత్రీబాయి తన జీవితాన్ని అంకితం చేసింది.

3) నిమ్న కులాల బాలికల కోసం ______________ లో మొదటి పాఠశాల ఆరంభించింది.

4) సామాజిక, ఆధ్యాత్మిక సమాజం ______________ లో సావిత్రీబాయి క్రియాశీలకంగా పనిచేసింది.

5) వితంతువు కొడుకైన యశ్వంతును ______________ తీసుకుని పెంచుకుంది.



## III. వ్యక్తీకరణ-సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులను రాయండి.**

1) లక్ష్మీబాయి విద్యార్జన కోసం చేసిన ప్రయత్నాల గురించి తెలుపండి.

2) లక్ష్మీబాయి బాల్యంలో విద్యాభ్యాసానికి దూరమైన కారణాలు రాయండి.

3) జీవితంలో పురోగమించడానికి బంధాలు, మమతలను మరిచిపోవాలని లక్ష్మీబాయి అనుకోవడం సరైనదేనా? ఎందుకు?

**ఆ) ఈ కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబును రాయండి.**

1) లక్ష్మీబాయికి విద్యపట్లగల ఇష్టాన్ని తెలిపి, ఆమె ఎలా పట్టభద్రురాలయ్యిందో వివరించండి.

### సృజనాత్మకత / ప్రశంస

**అ) ఈ కింది అంశాన్ని గురించి సృజనాత్మకంగా రాయండి.**

ఈ పాఠం 'ఆత్మకథ' ప్రక్రియలో ఉంది కదా! మీకు సంబంధించిన ఏదైనా ఒక అనుభవాన్ని లేదా సంఘటనను 'ఆత్మకథ' రూపంలో రాయండి.

### నేను ఏయే సామర్థ్యాలు సాధించాను? (స్వీయమూల్యాంకనం)

| | | |
|---|---|---|
| 1) | పదాలకు అర్థాలను, పర్యాయపదాలను రాయగలను. | అవును / కాదు |
| 2) | వాక్యభేదాలను అర్థం చేసుకొని గుర్తించగలుగుతాను. | అవును / కాదు |
| 3) | అపరిచిత గద్యాలను చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలను. | అవును / కాదు |
| 4) | ఇచ్చిన అపరిచిత గద్యం ఆధారంగా ఖాళీలు పూరించగలను. | అవును / కాదు |
| 5) | ఇచ్చిన ప్రశ్నలకు స్వంత మాటలలో జవాబులు రాయగలను. | అవును / కాదు |
| 6) | అనుభవాలను / సంఘటనను ఆత్మకథ రూపంలో రాయగలను. | అవును / కాదు |

### సూక్తి

**మానవులకు విద్యయే సౌందర్యము. అదియే గుప్త ధనము.**
**విద్యయే గురువులకు గురువైనది.**
**పరదేశములలో విద్యయే బంధువు.**
**అదియే మరొక కన్ను వంటిది.**

# 8 బాల్యక్రీడలు

- బమ్మెర పోతన

## సాధించాల్సిన సామర్థ్యాలు - అభ్యసన ఫలితాలు

ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఈ కింది సామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలను సాధిస్తారు.

**I. భాషాంశాలు :**

అ) **పదజాలం** :
- వాక్యాల్లో ఇచ్చిన పదాలకు సరైన అర్థాలు రాయగలుగుతారు.
- ఇచ్చిన పదాలకు పర్యాయపదాలు రాయగలుగుతారు.
- ఇచ్చిన పదాలకు నానార్థాలు రాయగలుగుతారు.
- ఇచ్చిన ప్రకృతి పదాలకు వికృతి పదాలను రాయగలుగుతారు.

ఆ) **వ్యాకరణాంశాలు** : 'సంధి' అంటే ఏమిటో తెలుసుకొంటారు. పదాలను కలుపగలుగుతారు, విడదీయగలుగుతారు.

**II. అవగాహన - ప్రతిస్పందన :**

అ) పరిచిత పద్యానికి తాత్పర్యం రాయగలుగుతారు.

ఆ) పరిచిత పద్యపాదాలను సరైన వరుస క్రమంలో అమర్చగలుగుతారు.

ఇ) అపరిచిత పద్యాన్ని అర్థం చేసుకొని అడిగిన ప్రశ్నలకు తప్పొప్పులను చెప్పగలుగుతారు.

ఈ) అపరిచిత గద్యాన్ని అర్థం చేసుకొని ప్రశ్నలను తయారుచేయగలుగుతారు.

**III. వ్యక్తీకరణ - సృజనాత్మకత :**

అ) **స్వీయరచన** : ఆటల ఆంతర్యాన్ని, ప్రయోజనాలను రాయగలుగుతారు.

ఆ) **సృజనాత్మకత** : ఆటల గురించి సంభాషణను రాయగలుగుతారు.

## అభ్యాసకులకు సూచనలు

- పాఠాన్ని చదువండి. తెలియని పదాలను గుర్తించండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరి అకారాది పట్టికలో వెతుకండి.
- పాఠాన్ని మళ్ళీ చదివి అర్థం చేసుకోండి.
- పాఠంలో అర్థంకాని అంశాల గురించి మీ సమీపంలోని ఉపాధ్యాయులు లేదా కేంద్రంలో బోధించే వారితో చర్చించి తెలుసుకోండి.
- బాక్సులో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను పాఠంలో గుర్తించండి.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం పద్య ప్రక్రియకు చెందినది. 'పాదబద్ధమైనది పద్యము'. పాదమనగా కొన్ని పదాల సమూహం లేదా లఘు, గురువుల అక్షరగణాల చేతగాని, కొన్ని మాత్రలు లేదా మాత్రాగణాల చేత నియతమైన పంక్తి. సాధారణంగా నాలుగు పాదాల మొత్తమును పద్యమని వ్యవహరిస్తారు. పద్యము 'పాదము, గణము, యతి, ప్రాస'లతో కూడి ఉంటుంది. ఈ పద్యం వృత్తములు, జాతులు, ఉపజాతులు అన్న మూడు విధాలుగా ఉంటుంది.

ప్రస్తుత పాఠ్యభాగం శ్రీమద్భాగవతం దశమ స్కంధంలోనిది.

## పాఠం ఉద్దేశం / నేపథ్యం

బృందావనంలో బాలకృష్ణుడు గోపబాలురతో కలిసి విహరిస్తున్నాడు. తాను గొప్ప ఇంటి బిడ్డడయినా, అహంకారంలేకుండా అందరితో కలిసిమెలిసి ఆడుకొంటున్నాడు. పశువులను మేపే సమయంలో వాళ్ళంతా రకరకాల ఆటపాటల్లో మునిగి తేలుతున్నారు. ఈ కథను శుకమహర్షి పరీక్షిత్తు మహారాజుకు చెప్పే సందర్భంలోనిది.

బాల్యంలో పిల్లల ఆటల జోరును, హుషారును, అంతరాలను పట్టించుకోని స్నేహపు తీరును పరిచయం చేయడమే ఈ పాఠం ఉద్దేశం.

## కవి పరిచయం



15వ శతాబ్దం

బమ్మెరపోతన పూర్వపు వరంగల్లు జిల్లా, ప్రస్తుత జనగామ జిల్లాలోని బమ్మెర గ్రామ నివాసి. తల్లి లక్కమాంబ, తండ్రి కేసన.

'సహజ పండితుడు'గా కీర్తిపొందిన పోతన 'వీరభద్ర విజయము, భోగినీ దండకము, నారాయణ శతకము, భాగవతము' రచించాడు. భాగవతం అనగానే పోతన మదిలో మెదలుతాడు. వ్యాసుడు సంస్కృతంలో రచించిన భాగవత పురాణాన్ని తెలుగులో మధురంగా అనువదించాడు పోతన.

తెలుగు పద్యపు అందాన్ని, భక్తి మకరందాన్ని జాతికి అందించాడు. పోతన రచనలో శబ్దాలంకారాలు ప్రత్యేక ఆకర్షణ. అంత్యానుప్రాసను, వృత్త్యనుప్రాసను ఇంత అందంగా నడిపిన కవిలేడంటే అత్యుక్తి కాదు. భాగవతంలోని 'గజేంద్రమోక్షణం, ప్రహ్లాదచరిత్ర, వామన చరిత్ర, శ్రీకృష్ణలీలలు, రుక్మిణీకల్యాణం' వంటివి బహుళ ప్రాచుర్యం పొందాయి. పోతన కలం నుండి వెలువడిన "ఊరకరారు మహాత్ములు", "ఇంతింతై" వంటి పంక్తులను నేటికీ సందర్భానుసారంగా ఎందరో ఉటంకిస్తుంటారు. నిరక్షరాస్యుల నాల్కలపై కూడా పోతన పద్యాలు నర్తించడం ఆయన పద్యాల గొప్పతనానికి నిదర్శనమని చెప్పవచ్చు.

పోతన అక్షర సంపన్నుడే కాదు, వినయ సంపన్నుడుకూడా. ఆత్మాభిమానియైన పోతన జీవనం కోసం వ్యవసాయం చేసాడే తప్ప రాజాశ్రయాన్ని కోరలేదు. సరికదా రాజనిరసనను ప్రకటించాడు. తన భాగవతాన్ని ప్రభువుకు కాక జగత్ప్రభువైన శ్రీరామచంద్రునకు అంకితం చేసాడు.

పోతన వంటి మరో సహజ కవి తెలుగులో లేడు. పోతన పద్యం తెలియని తెలుగువారు ఉండరు.



I

సీ. వేణువు లూఁదుచు వివిధ రూపములతో
గంతులు వైతురు కౌతుకమున
గురుకంబళాదుల గోవృషంబులఁ బన్ని
పరవృషభములని ప్రతిభటింతు
రల్లులు దట్టించి యంఘ్రుల గజ్జెలు
మొరయఁ దన్నుదు రోలి ముమ్మరముగఁ
బన్నిదంబులు వైచి ఫలమంజరులఁ గూల్చి
వ్రేటులాడుదురు ప్రావీణ్యమొప్ప

తే. వన్యజంతు చయంబుల వాని వాని
పదురు పదురుచు వంచించి పట్టఁబోదు
రంబుజాకరములఁ జల్లులాడఁ జనుదు
రా కుమారులు బాల్య విహారులగుచు 1

కం. పోరుదురు గికురు వొడుచుచుఁ
దూఱుదురు భయంబులేక తోరపుటిరవుల్
జాఱుదురు ఘనశిలాతటి
మీఱుదు రెన్నంగరాని మెలఁకువల నృపా! 2

వ. .... ఆ రామకృష్ణులు క్రేపులం గాచుతఱి 3

సీ. కపులమై జలరాశిఁ గట్టుదమా యని
కట్టుదు రడ్డంబు గాలువలకు
మునులమై తపములు మొనయుదమా యని
మౌనులై యుందురు మాటలేక
గంధర్వవరులమై గాన విద్యలు మీఱఁ
బాడుదమా యని పాడఁజొత్తు
రప్సరోజనులమై యాడుదమా యని
యాఁడు రూపులఁ దాల్చి యాడఁజనుదు

ఆ. రమర దైత్యవరులమై యబ్ధిఁ ద్రత్తమా
యని సరోవరముల యందు హస్త
దండచయముఁ ద్రిప్పి తరుతురు తమయీడు
కొమరు లనుసరింపఁ గొమరు మిగుల 4

### మీరేమి అర్థం చేసుకున్నారు?

- "పాడుతూ, ఆడుతూ, వేడుతూ"... వీటిని ప్రాసపదాలంటారు. ఇలాంటివి ఏ పద్యంలో ఉన్నాయో గుర్తించి కింద గీత గీయండి.
- పందెంవేసుకొని పూల, పండ్ల గుత్తులను నేల రాలుస్తున్నారు అన్న భావం వచ్చే పద్యపాదమేది?

## II

*కం. ఒకనొకని చల్దికావడి
నొకఁ డొకఁ డడకించి దాఁచు, నొకఁ డొకఁ డది వే
ఱొకఁ డొకని మొఱఁగి కొని చన
నొకఁ డొకఁ డది దెచ్చి యిచ్చు నుర్వీనాథా! 5

కం. ఒక్కఁడు మున్నేమఱి చన
నొక్కఁడు బలుబొబ్బ వెట్టు నులికిపడన్, వే
ఱొక్కఁడు మిట్టి తటాలున
నొక్కని కనుదోయి మూయు నొక్కఁడు నగఁగన్ 6



కం. తీపుగల కజ్జ మన్యుఁడు
గోపింపంగ నొడిసి పుచ్చుకొని త్రోపాడం
బైపడి యది గొని యొక్కఁడు
క్రేపులలో నిట్టునట్టుఁ గికురించు నృపా! 7

కం. వనజాక్షుఁడు ము న్నరిగిన
'మునుపడఁగా నతని నేనె ముట్టెద' ననుచుం
జని మును ముట్టని వానిన్
మును ముట్టినవాఁడు నవ్వు మొనసి నరేంద్రా! 8

*ఉ. ఎన్నఁడునైన యోగివిభు లెవ్వని పాదపరాగ మింతయుం
గన్నులఁ గాన రట్టిహరిఁ గౌఁగిటఁ జేర్చుచుఁ జెట్టఁ బట్టుచుం
దన్నుచుఁ గ్రుద్దుచున్ నగుచుఁ దద్దయుఁ బైపడి కూడి యాడుచున్
మన్నన సేయు వల్లవకుమారుల భాగ్యము లింత యొప్పునే? 9

### మీరేమి అర్థం చేసుకున్నారు?

- 6వ పద్యంలో 'ఒక్కడు' అన్న పదం ఎన్నిసార్లు వచ్చింది?
- "గోపబాలుర అదృష్టం ఎంతగొప్పది" అన్న భావాన్నిచ్చే పద్యపాదం ఏది?

### తాత్పర్యాలు

1. బలరామకృష్ణులు గోపబాలురతో కలిసి అనేక రకాలుగా ఆడుకొంటున్నారు. పిల్లనగ్రోవిని ఊదుతున్నారు. ఉత్సాహంతో అనేక విధాలుగా నృత్యం చేస్తున్నారు. పెద్ద పెద్ద గొంగడులతో ఆబోతుల రూపాలను తయారుచేసి అవి శత్రువుల ఆబోతులంటూ వాటితో తలపడుతున్నారు. గుడ్డలతో బొమ్మలను చేసి, వాటిని కాళ్ళతో గట్టిగా తన్నుతుంటే వారి కాళ్ళగజ్జెలు ఘల్లుమంటున్నాయి. పందెములు కాసి పూల, పండ్ల గుత్తులను నేర్పుతో నేలరాల్చి, వాటితో కొట్టుకొంటున్నారు. అడవి జంతువులవలే అరుస్తూ, వాటిని మోసం చేస్తూ పట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారు. సరస్సులలోకి దిగి ఒకరిపై ఒకరు నీళ్ళు చల్లుకొంటున్నారు.

2. ఓ రాజా! ఈ బాలురు ఒకరినొకరు మోసగిస్తూ పోరాడుతున్నారు. దట్టమైన పొదరిండ్లలోకి ఏమాత్రం భయం లేకుండా ప్రవేశిస్తున్నారు. పెద్ద బండరాళ్ళ మీది నుండి కిందికి జారుతున్నారు. ఈ విషయాలలో ఒకరిని మించి ఒకరు నైపుణ్యాన్ని చూపుతున్నారు.

3. ఆ బలరామకృష్ణులు దూడలను మేపుతున్న సమయంలో

4. "మనము వానరులవలే సముద్రానికి వారధి కడుదామా" అంటూ అక్కడ ఉండే కాలువలకు అడ్డుకట్టలు కడుతున్నారు. "మునులవలే తపస్సు చేసుకొందామా" అంటూ మౌనంగా కూర్చొంటున్నారు. "గంధర్వ శ్రేష్ఠులవలే పాడుదామా" అంటూ గానకళను ప్రదర్శిస్తున్నారు. "దేవతలు, రాక్షసులవలే సముద్రాన్ని చిలుకుదామా" అంటూ సరస్సుల్లోకి దిగి తమ చేతులతో చిలుకుతున్నారు.

5. ఓ రాజా! ఒకడు తెచ్చుకొన్న సద్దిమూటను ఇంకొకడు ఎత్తుకెళ్ళి దాస్తున్నాడు. ఇంకొకడు దాన్ని చూసి వేరొకనికి అందిస్తే వాడు దాచిపెడుతున్నాడు. దాన్ని మరొకడు తీసుకువచ్చి అసలువానికి (ఆ మూట ఎవరిదో వానికి) అందజేస్తున్నాడు.

6. ఒకడు ఏదో ఆలోచించుకొంటూ వెళుతుంటే వెనకనుండి వేరొకడు వచ్చి ఒక్కసారిగా గట్టిగా అరచి, వాణ్ణి భయపడేలా చేస్తున్నాడు. ఒకడు మెల్లిగా వచ్చి హఠాత్తుగా కళ్ళుమూస్తుంటే పక్కనున్నవాడు నవ్వుతున్నాడు.

7. ఒకడు తెచ్చుకొన్న తీపి పదార్థాన్ని ఇంకొకడు లాగుకొన్నాడు. దానితో తెచ్చుకొన్నవానికి కోపం వచ్చింది. వాడు తీసుకొనే ప్రయత్నం చేయగా లాగుకొన్నవాడు ఆ పదార్థాన్ని పైకి విసిరాడు. దాన్ని ఇంకొకడు అందుకొని దొరకకుండా దూడల మధ్యకు పరుగెత్తి మోసగిస్తూ తిరుగుతున్నాడు.

8. ఓ రాజా! కృష్ణుడు ముందు వెళుతుంటే గోపబాలురు "నేనే కృష్ణుణ్ణి ముందు ముట్టుకొంటాన"ని పరుగెత్తారు. ముందుగా ముట్టుకొన్నవాడు, ముట్టుకోలేని వాణ్ణి చూసి ఎగతాళిగా నవ్వుతున్నాడు.

9. యోగీశ్వరులు ఎంతో తీవ్రమైన తపస్సుచేసినా శ్రీకృష్ణుని పాదధూళిని కూడా కళ్ళతో చూడలేరు. అలాంటిది ఈ గోపబాలకులు శ్రీకృష్ణుని కౌగిలించుకొంటున్నారు. చేతులు పట్టుకొంటున్నారు. తంతున్నారు. గుద్దుతున్నారు. అతనితో హాస్యమాడుతున్నారు. మీద పడుతున్నారు. కలిసి ఆడుకొంటున్నారు. ఆహా! కృష్ణుని వల్ల కీర్తిపొందిన వీళ్ళు ఎంత అదృష్టవంతులో కదా!



# భాషాసామర్థ్యాలను సాధిద్దాం!

## I. భాషాంశాలు

### పదజాలం

**అ) కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి.**

ఉదా: గుడిలో తీర్థ, ప్రసాదాలు పుచ్చుకొనుట సంప్రదాయం.

పుచ్చుకొను = తీసుకొను

1) పొద్దున్నే లేవగానే తల్లిదండ్రుల అంఘ్రులకు మొక్కాలి.

2) ఆవు వద్దకు పరుగెత్తి క్రేపు పాలు తాగుతున్నది.

3) కపి ఈ కొమ్మ నుండి ఆ కొమ్మమీదకు దూకుతున్నది.

4) నమ్మిన వాణ్ణి వంచన చేయడం మహాపాపం.

**ఆ) కింది పదాలకు పర్యాయపదాలను రాయండి.**

| | | | |
|---|---|---|---|
| ఉదా: | అమరులు | దేవతలు | అనిమిషులు |
| 1) | కన్ను | | |
| 2) | కుమారుడు | | |
| 3) | శిల | | |
| 4) | ఉర్వి | | |

**ఇ) ఒక పదానికి వేరు వేరు అర్థాలను ఇచ్చే పదాలను నానార్థాలు అంటారు.**

| | | | |
|---|---|---|---|
| ఉదా: | పాదము | అడుగు | పద్యములోని ఒక పంక్తి |

**కింది పదాలకు నానార్థాలను రాయండి.**

| | | | |
|---|---|---|---|
| 1) | హరి | | |
| 2) | రూపం | | |

**ఈ) కింది ప్రకృతి పదాలకు వికృతి పదాలను రాయండి.**

| | | |
|---|---|---|
| 1) | విద్య | |
| 2) | యోగి | |

## వ్యాకరణాంశాలు

### సంధి

**అ) కింది వాటిని పరిశీలించండి.**

1) వారు + ఉండిరి = వారుండిరి

2) ఎవరికి + ఎంత = ఎవరికెంత

3) ఇంక + ఒకరు = ఇంకొకరు

పై ఉదాహరణల్లో రెండేసి పదాలు కలిసి ఒకే పదంగా ఏర్పడటం గమనించారు కదా! ఇట్లా రాయడాన్ని 'కలిపిరాయడం' అంటారు. దీనికే 'సంధి' అని పేరు.

**ఆ) కింది పదాలను కలిపి రాయండి.**

1) ఒకడు + ఒకడు = ______________________

2) భాగ్యములు + ఇంత = ______________________

3) కొమరులు + అనుసరింప = ______________________

**ఇ) కింది పదాలను విడదీసి రాయండి.**

1) పాదపరాగమింత = ____________ + ____________

2) వనజాక్షుడు = ____________ + ____________

3) వేఱొక్కడు = ____________ + ____________

## II. అవగాహన-ప్రతిస్పందన

**అ) ఈ పాఠంలోని చుక్కపెట్టిన పద్యాలను కంఠస్థం చేయండి. వాటి తాత్పర్యాలను సొంతమాటల్లో రాయండి.**

**ఆ) ఈ పాఠంలో మీరు చదివిన పద్యాలలో ఒక పద్యానికి సంబంధించిన పాదాలు కింద ఉన్నాయి. అవి తారుమారుగా ఉన్నాయి. వాటిని సరైన క్రమంలో రాయండి.**

బైపడి యదిగొని యొక్కడు
గోపింపఁగ నొడిసి పుచ్చుకొని త్రోపాడం
తీపుగల కజ్జమన్యుడు
క్రేపులలో నిట్టు నట్టుఁ గికురించు నృపా!



**ఇ) 'అభినవ పోతన'గా కీర్తింపబడ్డ డా॥ వానమామలై వరదాచార్యుల 'పోతన చరిత్రము'లోని ఈ పద్యాన్ని చదువండి, అర్థం చేసుకోండి.**

చ. గురినిడి కొట్టనేని యొక గోలియుఁ దప్పదు, కచ్చగట్టి బొం
గరమును వేయ వ్రేటుకొక కాయ పటుక్కను, బందెమూని తా
నుఱికిన లేడిపిల్లవలె నొక్కని యయ్యకుఁ జిక్కడద్దిరా!
చిఱుతఁ డసాధ్యుఁ డంచు నెదఁ జేయిడి విస్మయమంద నందఱున్

**పద్యాన్ని చదివి అర్థం చేసుకొన్నారు కదా! పై విషయాలకు సంబంధించి తప్పొప్పులను గుర్తించండి.**

| | తప్పు | ఒప్పు |
|---|---|---|
| 1) ఈ పద్యంలో పోతన కవిత్వం గురించి చెప్పబడింది. | ☐ | ☐ |
| 2) కచ్చగట్టకుండానే బొంగరం వేయగలడు. | ☐ | ☐ |
| 3) పరుగెత్తితే ఎవరికీ దొరకడు. | ☐ | ☐ |
| 4) బమ్మెర పోతనకు 'అభినవ పోతన' అన్న బిరుదున్నది. | ☐ | ☐ |
| 5) 'పోతన చరిత్రము' ను డా॥ వానమామలై వరదాచార్యులు రాసారు. | ☐ | ☐ |

**ఈ) కింది విషయాన్ని చదివి ఐదు ప్రశ్నలను తయారుచేయండి.**

భారతము 'ఇతిహాసము'. ఇతిహాసం అంటే జరిగిన కథ. భారతాన్ని సంస్కృతభాషలో వ్యాసుడు రచించాడు. దీన్ని తెలుగులోకి అనువదించిన వారు నన్నయ్య, తిక్కన, ఎఱ్ఱన. వీరు 'కవిత్రయం'గా కీర్తింపబడ్డారు.

భారతంలో 18 పర్వాలున్నాయి. ఇందులో మొదటి రెండున్నర పర్వాలను నన్నయ్య, 4 నుండి 18వ పర్వం వరకు తిక్కన, మూడవ పర్వంలో నన్నయ్య వదలిన భాగాన్ని ఎఱ్ఱన పూర్తిచేసారు. చిత్రమేమిటంటే వీళ్ళు ఒకే కాలంలో, ఒకే ప్రాంతంలో ఉన్నవాళ్ళు కాదు. నన్నయ్యకు 'వాగనుశాసనుడు' అని, తిక్కనకు 'కవిబ్రహ్మ', 'ఉభయ కవిమిత్రుడు' అని, ఎఱ్ఱనకు 'శంభుదాసుడు', 'ప్రబంధ పరమేశ్వరుడు' అని బిరుదులున్నాయి. వీరి భారత పద్య రచన తరువాతి కవులకు మార్గదర్శకంగా నిలిచింది.

1) ______________________________

2) ______________________________

3) ______________________________

4) ______________________________

5) ______________________________

## III. వ్యక్తీకరణ-సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులను రాయండి.**

1) 'గోపబాలురు ఎంతో అదృష్టవంతులు' అని కవి అనడంలో ఉద్దేశమేమిటి?

2) బమ్మెర పోతనను గురించి రాయండి.

3) ఆటలవల్ల కలిగే లాభాలను తెలుపండి.

4) కృష్ణుణ్ణి ముందుగా ముట్టుకొన్నవాడు, ముట్టుకోనివాణ్ణి చూసి ఎగతాళిగా నవ్వాడు కదా! ఎగతాళి చేయడం మంచిదా? కాదా? ఎందుకో రాయండి.

**ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబును రాయండి.**

1) 'బాల్యక్రీడలు' పాఠం ద్వారా మీరు ఏయే విషయాలను గ్రహించారో వివరించండి.

### సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది ప్రశ్నకు జవాబును సృజనాత్మకంగా రాయండి.**

రాము, సోము బాల్యమిత్రులు. పెరిగి పెద్దవారయ్యాక వేరు వేరు ఉద్యోగాలలో, వేరు వేరు ప్రాంతాలలో స్థిరపడ్డారు. చాలా సంవత్సరాల తరువాత కలుసుకొన్న వారు తమ చిన్ననాటి ఆటల గురించి ముచ్చటించుకొన్న విషయాలను సంభాషణగా రాయండి.

### నేను ఏయే సామర్థ్యాలు సాధించాను? (స్వీయమూల్యాంకనం)

| | | |
|---|---|---|
| 1) | వాక్యాల ఆధారంగా పదాలకు అర్థాలను రాయగలను. నానార్థాలు, పర్యాయపదాలు రాయగగలను. | అవును / కాదు |
| 2) | పదాలను కలుపగలను, విడదీయగలను. | అవును / కాదు |
| 3) | చుక్కగుర్తున్న పద్యాన్ని నోటికి చెప్పగలను, తాత్పర్యం రాయగలను. | అవును / కాదు |
| 4) | అపరిచిత పద్యాన్ని అర్థంచేసుకొని తప్పొప్పులను గుర్తించగలను. | అవును / కాదు |
| 5) | అపరిచిత గద్యాన్ని అర్థంచేసుకొని తప్పొప్పులను గుర్తించగలను. | అవును / కాదు |
| 6) | ఆటల ఆంతర్యాన్ని, ప్రయోజనాలను రాయగలను. | అవును / కాదు |
| 7) | ఆటల గురించి సంభాషణ రూపంలో రాయగలను. | అవును / కాదు |

**సూక్తి**

**ఆటలకు సమయమివ్వకపోతే,**
**అనారోగ్యానికి సమయమివ్వవలసి వస్తుంది.**

# 9 బడి

– మాదిరెడ్డి సులోచన

## సాధించాల్సిన సామర్థ్యాలు – అభ్యసన ఫలితాలు

ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఈ కింది సామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలను సాధిస్తారు.

### I. భాషాంశాలు :

అ) **పదజాలం** : ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలను, ఇచ్చిన పదానికి అర్థాలు, సంబంధించిన పదాలను రాయగలుగుతారు.

ఆ) **వ్యాకరణాంశాలు** : ఇచ్చిన ఉదాహరణల ఆధారంగా ఇకార, ఉకార సంధుల గురించి తెలుసుకోగలుగుతారు. పదాలను గుర్తించగలుగుతారు.

### II. అవగాహన – ప్రతిస్పందన :

అ) కరపత్రం అంటే ఏమిటో తెలుసుకుని చదివి అర్థం చేసుకోగలుగుతారు.

ఆ) అపరిచిత గద్యాన్ని చదివి అర్థం చేసుకొని, ప్రశ్నలు తయారుచేయగలుగుతారు.

### III. వ్యక్తీకరణ – సృజనాత్మకత :

అ) **స్వీయరచన** : ఇచ్చిన ప్రశ్నలకు సొంతమాటల్లో జవాబులు రాయగలుగుతారు.

ఆ) **సృజనాత్మకత** : ఇచ్చిన గేయాన్ని పొడిగించగలుగుతారు.

## అభ్యాసకులకు సూచనలు

- పాఠాన్ని చదువండి. తెలియని పదాలను గుర్తించండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరి అకారాది పట్టికలో వెతుకండి.
- పాఠాన్ని మళ్ళీ చదివి అర్థం చేసుకోండి.
- పాఠంలో అర్థంకాని అంశాల గురించి మీ సమీపంలోని ఉపాధ్యాయులు లేదా కేంద్రంలో బోధించే వారితో చర్చించి తెలుసుకోండి.
- బాక్సుల్లో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను పాఠంలో గుర్తించండి.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం కథానిక ప్రక్రియకు చెందినది. క్లుప్తత, సరళత, వర్తమాన విషయాలు, పాత్రలకు తగిన సంభాషణలు, ఆకట్టుకునే కథనం కథానిక ప్రత్యేకత. బడి ఆవశ్యకతను, సామాజికంగా పౌరుల బాధ్యతను తెలియజెప్పే కథానిక ఇది.

ప్రస్తుత పాఠ్యాంశం శ్రీమతి మాదిరెడ్డి సులోచన రచించిన 'భార్యాకోపవతీ' అనే కథల సంపుటిలోనిది.

## పాఠం ఉద్దేశం / నేపథ్యం

తెలంగాణాలో స్వాతంత్ర్యానంతరం అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో ప్రాంతీయస్పృహ, అస్తిత్వపరమైన దృక్పథంతో స్థానికంగా ఉన్న ఆధిపత్య శక్తుల భావనలలో పరివర్తన కలిగించిన ఒక ఉపాధ్యాయిని సాధించిన విజయాన్ని సందేశాత్మకంగా తెలియజేస్తుంది కథానిక.

నాలుగు గోడల తరగతి గదిలో నిర్మాణమయ్యే కొత్త తరానికి బడి మూలకేంద్రం. జ్ఞాన పరిణామ వికాసం కలిగించే బడిని సామాజిక ఆస్తిగా కాపాడుకోవలసిన నైతిక బాధ్యతను గుర్తుచేయడమే ఈ పాఠం ఉద్దేశం.

## కవి పరిచయం



26-10-1936

05-02-1983

శ్రీమతి మాదిరెడ్డి సులోచన రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్‌లో జన్మించింది.

నవలా రచనలో అగ్రగామిగా నిలిచిన రచయిత్రి. ఈమె స్వయంకృషితో ఎం.ఏ.; బి.ఇడి. చేసి ఉపాధ్యాయవృత్తిని చేపట్టింది. 1965లో 'జీవనయాత్ర' అనే నవలతో రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టింది. గాజు బొమ్మ, సంధ్యారాగం, భిన్నధృవాలు, పూలమనసులు, దేవుడిచ్చిన వరాలు, వాడనివాడ, తరంమారింది. అంతం చూసిన అసూయ, ప్రేమలు–పెళ్ళిళ్ళు లాంటి 73 నవలలు, 150 కథలు, 10 ఏకాంకికలు రచించింది. 1977లో తరం మారింది నవల చలనచిత్రంగా రూపుదాల్చి రాష్ట్ర ప్రభుత్వం నుండి నంది అవార్డు పొందింది. ఈమెకు గృహలక్ష్మి స్వర్ణకంకణ పురస్కారం కూడా లభించింది. ఈమె రచనాశైలి సులభంగా అర్థం చేసుకునే విధంగా సరళమైన భాషతో ఉంటుంది. జీవన వాస్తవికత, కుటుంబ విలువల పరిరక్షణ, స్త్రీ, పురుష సమానత్వం, సామరస్యం అనేవి సులోచన రచనల్లో ప్రధానంగా కనిపించే గుణాలు.

## I

ఆకాశము చిల్లులుపడినట్టు కుండపోతగా వర్షం కురుస్తుంది. ఉత్సాహంగా గోనెపట్టాలు, గడ్డిగొడుగులు మోసుకుని వెడుతున్న శ్రామికులను చూస్తూ కిటికీ దగ్గర నిలబడింది సుశీల. నెత్తిన టప్పుమని పెద్ద నీటిబొట్టు పడేసరికి తలయెత్తి చూచింది. అక్కడ కురుస్తుంది. బయటి వరండాలో నిలబడిన విద్యార్థులు ఇవేవీ పట్టించుకోకుండా నీటిలో తడుస్తూ, నీటితో ఆడుతున్నారు.

"ఏముందీ వర్షం తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. విద్యార్థులను ఇంటికి వెళ్ళమనేదా? – వాళ్లున్నా లాభం లేదు. కూర్చోవడానికి స్థలం లేదు." అసిస్టెంటుగా పనిచేస్తున్న వరలక్ష్మి అడిగింది సుశీలను.

'ఊ... వర్షం తగ్గనియ్యండి' అన్నది.

వరలక్ష్మీ గారూ! 'ఆ బంగళా యెవరిదండీ?'

'అదా! భూస్వామి చంగయ్యగారిదండి.'

'అలాగా! ఆ యింట్లో యెవరుంటారు!'

"ఇప్పుడు యెవరూ ఉండరండి. తాళమే! అతని కొడుకులిద్దరూ అమెరికాలో సెటిల్ అయ్యారట. కూతుళ్ళు యెక్కడెక్కడో ఉంటారు. సంవత్సరానికి వారం పదిరోజులు వచ్చి ఉండి వెళ్ళిపోతారు.

"సంవత్సరానికి ఒక్కవారం ఉండటానికి అంత పెద్ద బంగళా కావాలా?"

"డబ్బున్నవారు మరి..."

ఆమె మాట పూర్తి కాకమునుపే బయట పిల్లల దెబ్బలాట వినిపించింది. వరలక్ష్మి గొణుక్కుంటూ వెళ్ళింది. సుశీల ఆలోచిస్తూ బయటికి వచ్చింది. సన్నగా చినుకులు పడుతున్నాయి. కుండపోత వర్షం మాత్రం తగ్గింది.

"మీరందరూ ఇంటికి వెళ్లిపోండి." పిల్లలకు చెప్పిందామె.

"రేపు వర్షం ఇలాగే ఉంటే ఇంటిదగ్గరే ఉండిపోవాలా?" ఓ గడుగ్గాయి అడిగాడు.

"లేదు బడికి రావాలి" ఖచ్చితంగా చెప్పింది సుశీల.

వర్షంవల్ల బడి ఊరుస్తుంది. విద్యార్థులు బయటికి వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడుతుందని ఊహించలేదు.

అందరూ వెళ్ళిపోయాక హెల్పర్‌గా వచ్చిన రంగదాసును వెంటబెట్టుకుని, పాత బంగళావైపు వెళ్లింది. వరండాలోనే దాదాపు వెయ్యిమంది కూర్చోవచ్చు. ఒక పెద్ద రేకుల షెడ్డది. ఇంట్లో కొంత భాగం గారాజ్‌లా కట్టారు. మిగతాదాంట్లో శిథిలావస్థలో ఉన్న గుర్రపు బండి ఉంది. అవి కురుస్తున్న సూచనలేం కనిపించలేదు.

ఆమె ఆ రాత్రంతా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చింది.

మర్నాడు చంగయ్యగారి వరండాలో రెండు క్లాసులు, అతని మోటార్ గారాజు, రేకుల షెడ్డులో మరి రెండు క్లాసులు తీసుకోవాలని నిర్ణయించింది. వరండా మధ్యలో నాల్గవ తరగతి పిల్లలను తీసుకొని తను పాఠాలు మొదలుపెట్టింది. అమాయకులయిన తల్లిదండ్రులు ఆమె సాహసానికి అచ్చెరువొందారు.

"ఆయనగారి అనుమతి లేకుండా!" వరలక్ష్మి గొణుక్కుంది. "మనమేం బిల్డింగ్‌ను తినటంలేదు టీచర్. పాడుబడిన పరిసరాలు చూడు ఎంత శుభ్రంగా తయారయ్యాయో!" తృప్తిగా చూచింది.

వరుసగా వారం రోజులు ముసురుపట్టి, ఆఖరు రోజున పెద్ద వర్షం పడింది. బడి బిల్డింగ్ ఒకవైపు నుండి కూలిపోయింది. అది చూచి తల్లిదండ్రులు సుశీలను మరోసారి మనసులోనే మెచ్చుకున్నారు. ఆ సమయానికి పిల్లలే ఉంటే!

వారం రోజులు గడిచాయి. బడిని గూర్చి సుశీల పైకి రిపోర్టు పంపింది. అధికారులు వచ్చి చూసుకుని వెళ్లారు.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

- బడి ఎలా ఉంది?
- తల్లిదండ్రులు సుశీల టీచరును ఎందుకు మెచ్చుకొన్నారు?

## II

ఆమె పిల్లలకు లెక్కలు చెబుదామని పుస్తకం తియ్యగానే, వాకిట్లో జీపు ఆగిన శబ్దం అయింది. దిగుతున్నది చంగయ్యగారని గ్రహించి విద్యార్థులను నిశ్శబ్దంగా కూర్చుండమని చెప్పి, యెదురువెళ్లి నమస్కరించింది. అతను ప్రతినమస్కారం కూడా చెయ్యలేదు.





"నువ్వేనా మా ఇంటి తాళం విరగ్గొట్టి నానా ఆగం చేసింది?" తీక్షణంగా అడిగాడు.

"మీ ఇంటి తాళం విరగగొట్టలేదు, ఆగమూ చెయ్యలేదు. కూలిపోయిన బడి మూలాన మీ వరండాలో తలదాచుకున్నాము. విద్యార్థులు చక్కగా చదువుకుంటున్నారు" అన్నది.

అతను వింతగా, విస్ఫారిత నేత్రాలతో చుట్టూ పరికించాడు. గడ్డి, ముళ్ళకంపతో ఉండే ఆవరణమంతా శుభ్రంగా ఉంది. అక్కడక్కడ నాటిన మొక్కలు చుట్టూ తడికెల గుమ్మి పెట్టి ఉంది. వెగటు వాసనతో ఉండే హాలు పిల్లలతో కళ, కళలాడుతుంది. శిథిలమైన ఆవరణ ప్రాణం పోసుకుని సజీవంగా కదులుతున్నట్టు అనుభూతి చెందాడు.

"తాళం విరగగొట్ట లేదన్నమాట!" అతను సంతోషంగా చూచాడు.

"ఒకరింటి తాళం విరగగొట్టేటంత కుసంస్కారిని కాదండీ."

"ఊ..." అన్నాడు దూరంగా కనిపించే పిల్లలవంక చూస్తూ.

ఆయన తాళం తీయించి ఇంట్లోకి వెళ్ళాడు. బూజుతెర రెప్పనవచ్చి అతని ముఖాన్ని ముట్టుకుంది. అది తుడుచుకుని లోపలికి వెళ్ళి చుట్టూ చూచాడు. గబ్బిలాలు, ఎలుకలు కనిపించాయి.

"నీవు వయసులో చిన్నదానివయినా, నీ పనితీరు నచ్చింది. ఈ బడిని మిషనరీ స్పిరిట్‌తో నడుపుతానంటే, ఈ బంగళా ఇచ్చివేస్తానమ్మా"

"చంగయ్యగారు!"

"అవునమ్మా! అవసరం లేనివారికి వారసత్వం పేరుతో అంటగట్టడం నా అభిమతం కాదు."

"కానీ చంగయ్యగారూ! నేను యెప్పుడూ ఇక్కడే ఉంటానన్న నమ్మకం లేదు."

"ఉండాలమ్మా, ఊరికి ఒకరిద్దరు ఉత్సాహవంతులైన నీలాంటివారు, పదేళ్ళపాటు ఉండాలి."

"ప్రభుత్వ ఉద్యోగులం, ఈ రోజు ఇక్కడ, రేపు మరేదోచోట" అన్నది.

"యెక్కడున్నా మీరు వెలిగించిన దీపం దేదీప్యమానంగా వెలగాలని నా ఆకాంక్ష. లక్షరూపాయలు విలువ చేసే బంగళా ఇస్తూ, నా చిన్న కోర్కె తీర్చమని ప్రభుత్వాన్ని అర్థిస్తాను."

"మీ చిన్న కోరికా!"

"అవునమ్మా, నిన్నీ బడికి పర్మినెంట్ హెడ్ మిస్ట్రెస్‌గా ఉంచమని కోరతాను, తప్పక నా మాట మన్నిస్తుంది ప్రభుత్వం."

అతని మాటలు వింటూ తనకు మాటలు రానట్టు నిలబడిపోయిందామె. భూస్వాములంతా చంగయ్యగారిలా ఉంటే? దేశం సస్యశ్యామలముగా ఉంటుంది.

### మీరేమి అర్థం చేసుకున్నారు?

- 'కుసంస్కారిని' కాదు అని ఎవరు అన్నారు? ఎవరితో అన్నారు. ఎందుకు అన్నారు?
- చంగయ్య గారు ప్రభుత్వాన్ని ఏమని అర్థిస్తానన్నాడు? ఎందుకు?

# భాషాసామర్థ్యాలను సాధిద్దాం!

## I. భాషాంశాలు

### పదజాలం

**అ) కింది పదాలతో సొంతవాక్యాలను రాయండి.**

1) చిల్లులు పడినట్లు = ______________________

2) గొణుక్కుంటూ = ______________________

3) మెచ్చుకొను = ______________________

4) తలదాచుకొను = ______________________

5) విప్పారిన నేత్రాలు = ______________________

**ఆ) 'బడి'కి సంబంధించిన పదాలను రాయండి.**




### వ్యాకరణాంశాలు

### ఇకారసంధి, ఉకారసంధి

**అ) కింది పదాలను కలిపి రాయండి.**

ఉదా: రావాలి + అని = రావాలని

1) ఏమి + అది = ______________

2) ఎవరికి + ఎంత = ______________

3) మరి + ఇప్పుడు = ______________

4) అవి + ఏవి = ______________

పై పదాలను విడదీసిన విధానం, కలిపిన క్రమాన్ని గమనించండి. మొదటిపదం చివరి అచ్చు 'ఇ'కారం (ఇత్తు) రెండవ పదాల మొదట్లో అన్నీ అచ్చులే వచ్చినవి.

ఈ విధంగా ఏమి మొదలైన పదాల 'ఇ' కారానికి (ఇత్తునకు) అచ్చు పరమైనపుడు సంధి జరుగుతుంది. కొన్ని చోట్ల ఇట్లా సంధికార్యం జరుగదు. ఆ పదాలను చూద్దాం.

ఉదా: ఏమి + అయ్యె = ఏమయ్యె – సంధి జరిగింది

ఏమి + అయ్యె = ఏమియయ్యె – సంధి జరగక యడాగమం వచ్చింది.

ఒకసారి సంధి (నిత్యము) జరిగి, మరొకసారి సంధి జరుగక (నిషేధము) పోవడాన్ని వ్యాకరణ పరిభాషలో 'వికల్పము' (వైకల్పికము) అంటారు.

'ఏమి' మొదలైన పదాలకు అచ్చుపరమైతే సంధి వైకల్పికము అని తెలుస్తుంది కదా! దీనినే 'ఇత్వసంధి' అంటారు.

ఏమ్యాదులందు 'ఇత్తు'నకు అచ్చుపరమైతే సంధి వైకల్పికంగా జరుగుతుంది.

**ఆ) కింది పదాలను విడదీసి సంధి పేరు రాయండి.**

1) చెప్పాలంటే = ________ + ________

2) రానిదని = ________ + ________

3) వచ్చిరపుడు = ________ + ________

### ❖ ఉకార సంధి – పరిచయం – అభ్యాసాలు

**ఇ) కింది పదాలను గమనించండి.**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1) | రాముడు + అతడు | = | రాముడతడు | = | ఉ + అ = అ |
| 2) | సోముడు + ఇతడు | = | సోముడితడు | = | ఉ + ఇ = ఇ |
| 3) | మనము + ఉంటిమి | = | మనముంటిమి | = | ఉ + ఉ = ఉ |
| 4) | అతడు + ఎక్కడ | = | అతడెక్కడ | = | ఉ + ఎ = ఎ |

మొదటి పదములోని చివరి అచ్చు 'ఉ' రెండవ పదములోని మొదటి అచ్చుతో కలిసినప్పుడు మొదటి పదములోని అచ్చు (ఉ) లోపిస్తుంది. రెండో పదంలోని మొదటి అచ్చు అట్లాగే నిలిచి ఉంటుంది. అనగ ఉకారం మీద ఏదైనా అచ్చు వచ్చి చేరితే సంధి తప్పక జరుగుతుంది. దీనినే 'ఉకారసంధి' లేదా 'ఉత్వసంధి' అంటాము.

'ఉ' కారాన్ని ఉత్తు అంటారు.

ఉత్తునకు అచ్చుపరమైతే సంధి తప్పక జరుగుతుంది.

**ఈ) కింది పదాలను కలిపి రాయండి.**

ఉదా: రావాలి + అని = రావాలని

1) చెట్టు + ఎక్కి = ________

2) వాడు + ఎక్కడ = ________

3) ఎదురు + ఏగి = ________

**ఉ) కింది పదాలను విడదీసిరాయండి.**

1) నూకలేసుకొని = __________ + __________

2) చూరెక్కి = __________ + __________

3) ఎట్లున్నది = __________ + __________

## II. అవగాహన-ప్రతిస్పందన

**అ) కరపత్రం అంటే ఏమిటో తెలుసుకొని. కింది కరపత్రాన్ని చదివి ప్రశ్నలకు జవాబులను రాయండి.**

కరపత్రం అనగా చేతిలో అనువుగా ఒదిగి ఏదైనా ఒక విషయానికి సంబంధించిన వివరణను ఇచ్చే కాగితాన్ని కరపత్రం అంటారు. కరపత్రం అనేది సంస్కృత భాషాపదం. చేతిలో కాగితం అని అర్థం. దీనిని ఆంగ్లంలో 'పాంప్లెట్' అంటారు. ఏదైనా సమాచారాన్ని లేదా అంశాన్ని అందరికీ తెలియజేయడమే కరపత్రం యొక్క ముఖ్య ఉద్దేశం. బడి ఆవశ్యకతపై కింది కరపత్రాన్ని చదువండి.

### ప్రభుత్వ బడిని కాపాడుకుందాం!

ప్రభుత్వ బడిలో చేర్పించండి | ప్రయోజనాలను పొందండి

గౌరవనీయులైన తల్లిదండ్రులూ! బాధ్యతాయుతమైన పౌరులారా!

- బడి అంటే కేవలం భౌతికంగా కనిపించే భవనం కాదు. జాతి నిర్మాణ కేంద్రం. భావి పౌరులను రూపొందించే సామాజిక కేంద్రం. ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు, సమాజ సభ్యులను సంఘటితపరిచే ప్రదేశం. మానవ సంబంధాలను నెలకొలిపే స్థలం. భిన్నత్వంలో ఏకత్వానికి, ఏకత్వంలో భిన్నత్వానికి చిహ్నంగా కనిపించే మరో రూపమే బడి.
- పేద ధనిక వర్గాల తేడా లేకుండా కుల మత వర్గాలకు అతీతంగా బడి ఈడు పిల్లలందరిని చేర్చుకొని విద్యనందించే వికాసకేంద్రం ప్రభుత్వ బడి. విశాలమైన తరగతులు, పచ్చటి ఆహ్లాదకరమైన పరిసరాలుంటాయి. ఆత్మీయతతో పలకరించి, పిల్లలకు బోధించే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ప్రభుత్వ బడిలోనే ఉంటారు. ఆట పాటలు, మాట ముచ్చట్లతో పిల్లలకు ఆహ్లాదం కలిగే రీతిలో పాఠాలను బోధిస్తారు.
- ప్రతి విద్యార్థికి ఏకరూప దుస్తులు (యూనిఫారాలు), ఉచిత పాఠ్యపుస్తకాలను ప్రభుత్వమే అందిస్తున్నది. నాణ్యమైన పోషక విలువలతో కూడిన మధ్యాహ్నభోజనాన్ని అందజేస్తున్నారు. ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తుంది.
- ఎంతోమంది ప్రభుత్వ బళ్ళలో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకొన్నారు. ఇప్పుడున్న గొప్పగొప్ప వారందరూ ప్రభుత్వ బళ్ళలోనే చదువుకొన్నారనే విషయాన్ని మరచిపోవద్దు. అందుకే ప్రభుత్వ బడిని మనం కాపాడుకోవాలి. ఇందుకోసం పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించండి. ప్రభుత్వ బడి ద్వారా లభించే ప్రయోజనాలను పొందండి.

తేది : 24-02-2021    పాఠశాల విద్యాశాఖ

స్థలం : హైదరాబాదు    తెలంగాణ రాష్ట్రం

ప్రచురణ : రమ్య ప్రింటింగ్ ప్రెస్



**కింది ప్రశ్నలకు జవాబులను రాయండి.**

1) ఈ కరపత్రాన్ని ఎవరు జారీచేశారు?

______________________________

2) ఈ కరపత్రంలో దేని గురించి చెప్పబడింది?

______________________________

3) ప్రభుత్వ బడిలోని ఉపాధ్యాయుల గొప్పదనం ఏమిటి?

______________________________

4) ప్రభుత్వ బడిలో లభించే సౌకర్యాలు ఏమిటి?

______________________________

5) కరపత్రంలోని విషయం ఆధారంగా దీనికి మరొక శీర్షికను సూచించండి.

______________________________

**ఆ) పట్టు వదలకుండా శ్రమిస్తే వైకల్యాలు ఏ మాత్రం అడ్డురావని ఋజువు చేసిన ఇద్దరు స్ఫూర్తిదాతల గురించి కింది పేరాలలో చదువండి. ప్రశ్నలు తయారుచేయండి.**

సంకల్పాన్ని ఆయుధంగా చేసుకుని పట్టుదలను పెట్టుబడిగా పెడితే వైకల్యం తోక ముడుచుకుని పారిపోతుంది. విజయం వినమ్రంగా మోకరిల్లుతుందనడానికి నిలువెత్తు సాక్ష్యం మహారాష్ట్రకు చెందిన ప్రాంజిల్‌పాటిల్ అనే అంధయువతి సాధించిన విజయం. ప్రాంజిల్‌పాటిల్ మహారాష్ట్రలోని ఉల్లాస్ నగర్‌కు చెందిన మహిళ. ఆరేళ్ళ వయసులోనే కంటిచూపు కోల్పోయినా ఐ.ఏ.ఎస్. కావాలన్న ఆమె లక్ష్యానికి అంధత్వం ఏమాత్రం అడ్డుకాలేదు. 2017లో సివిల్ పరీక్షలో ప్రాంజిల్ 124వ ర్యాంకు సాధించింది. తర్వాత 2018లో కేరళలోని ఎర్నాకుళం అసిస్టెంట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టింది. భారతదేశపు మొట్టమొదటి మహిళా అంధ ఐ.ఏ.ఎస్.గా చరిత్రపుటల్లోకి ఎక్కింది.

అలాగే మరో మహిళామూర్తి నాట్యమయూరి సుధాచంద్రన్. సుధాచంద్రన్ భరతనాట్య నృత్య కళాకారిణి. పదిహేడేళ్ళ వయసులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కుడికాలును పోగొట్టుకుంది. జైపూర్ వైద్యులు ఆమెకు కృత్రిమ కాలును అమర్చారు. ఆమె సడలని ఆత్మవిశ్వాసంతో కృత్రిమ కాలుతోనే నాట్యాన్ని అభ్యసించింది. ఆ కాలుతోనే అనేక నృత్య ప్రదర్శనలు ఇచ్చి యావత్ భారతదేశాన్ని అబ్బురపరిచింది. వైకల్యం ఉన్న ఎందరికో ఆమె స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

మనసా వాచా కర్మణా ఏమైనా సాధించాలని కోరుకుని, పట్టు వదలకుండా శ్రమిస్తే వైకల్యాలు ఏమాత్రం అడ్డుకావని స్ఫూర్తిదాతలైన ఈ మహిళలు ఇద్దరూ ఋజువు చేశారు.

పై విషయాలు చదివారు కదా! వాటిపై ఐదు ప్రశ్నలు తయారుచేయండి.

1) ______________________________

2) ______________________________

3) ______________________________

4) ______________________________

5) ______________________________

## III. వ్యక్తీకరణ-సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులను రాయండి.**

1) మాదిరెడ్డి సులోచన గురించి రాయండి.

2) సుశీల టీచర్ గురించి తెలుసుకున్నారు కదా! మీకు నచ్చిన ఒక టీచర్ గురించి రాయండి.

3) సుశీల చంగయ్యగారి మధ్య జరిగిన సంభాషణ ద్వారా మీరు ఏం తెలుసుకున్నారు?

4) చంగయ్యగారి మనసు మారడానికి దారి తీసిన పరిస్థితులు ఏమిటి?

**ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబును రాయండి.**

1) 'సుశీల ఆదర్శ ఉపాధ్యాయిని' అని పాఠం ఆధారంగా వివరించి రాయండి.

### సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది గేయాన్ని పొడిగించండి.**

ఎంతో చక్కని మాబడి

ఎన్నో విలువలు నేర్పేగుడి

______________________________

______________________________

______________________________



## నేను ఏయే సామర్థ్యాలు సాధించాను? (స్వీయమూల్యాంకనం)

| | | |
|---|---|---|
| 1) | ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు, ఇచ్చిన పదానికి సంబంధించిన పదాలను రాయగలను. | అవును / కాదు |
| 2) | ఇకార, ఉకార సంధులను అవగాహన చేసుకోగలిగాను. | అవును / కాదు |
| 3) | కరపత్రం చదివి అవగాహన చేసుకోగలుగుతాను. | అవును / కాదు |
| 4) | అపరిచిత గద్యం చదివి ప్రశ్నలు తయారుచేయగలను. | అవును / కాదు |
| 5) | ఇచ్చిన ప్రశ్నలకు సొంతమాటల్లో జవాబులను రాయగలను. | అవును / కాదు |
| 6) | గేయాన్ని పొడిగించగలను. | అవును / కాదు |

## సూక్తి

పాఠశాల అంటే అది కేవలం ఒక భౌతిక ప్రదేశంకాదు. అది పిల్లల ఆకాంక్షలకూ, అభివృద్ధికీ సంగమం. వారికిష్టమైన ప్రతి ప్రాణితో, ప్రతి వస్తువుతో, ప్రతి వాస్తవికాంశంతో సాన్నిహిత్యం నెరపుకొనగల ఒక బహిరంగ ప్రపంచం. పాఠశాలకు కావలసింది బోధకులూ మహోపాధ్యాయులే కాదు, కోరినప్పుడు స్నేహ హస్తం అందించగల మంచి మిత్రులు కూడా.

– అరవిందుడు

# 10 గోలకొండ కోట

– వేముగంటి నరసింహాచార్యులు

## సాధించాల్సిన సామర్థ్యాలు – అభ్యసన ఫలితాలు

ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఈ కింది సామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలను సాధిస్తారు.

### I. భాషాంశాలు :

అ) **పదజాలం** : ఇచ్చిన వాక్యాలలో గీత గీసిన పదాలకు అర్థాలను, వాక్యాల్లోని పర్యాయపదాలను, ప్రకృతులకు వికృతులను; వికృతులకు ప్రకృతులను గుర్తించగలుగుతారు.

ఆ) **వ్యాకరణాంశాలు** : సవర్ణదీర్ఘసంధి అవగాహన చేసుకొని, పదాలను విడదీసి సంధిని గుర్తించగలుగుతారు.

### II. అవగాహన – ప్రతిస్పందన :

అ) పరిచిత పద్యాన్ని కంఠస్థంచేసి, పూరించి, తాత్పర్యం రాయగలుగుతారు.

ఆ) అపరిచిత పద్యం చదివి తప్పొప్పులను, అపరిచిత గద్యం చదివి ప్రశ్నలకు జవాబులను రాయగలుగుతారు.

### III. వ్యక్తీకరణ – సృజనాత్మకత :

అ) **స్వీయరచన** : గోలకొండ కోట వైభవాన్ని సొంతమాటల్లో వివరించగలుగుతారు.

ఆ) **సృజనాత్మకత** : ఇచ్చిన అంశం గురించి లేఖను రాయగలుగుతారు.

## అభ్యాసకులకు సూచనలు

- పాఠాన్ని చదువండి. తెలియని పదాలను గుర్తించండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరి అకారాది పట్టికలో వెతుకండి.
- పాఠాన్ని మళ్ళీ చదివి అర్థం చేసుకోండి.
- పాఠంలో అర్థంకాని అంశాల గురించి మీ సమీపంలోని ఉపాధ్యాయులు లేదా కేంద్రంలో బోధించే వారితో చర్చించి తెలుసుకోండి.
- బాక్సులో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను పాఠంలో గుర్తించండి.



## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం పద్యప్రక్రియకు చెందింది. పద్యం ఛందోబద్ధమై ఉంటుంది. పఠించడానికి, ఆలపించడానికి వీలైనది. పద్యం ద్వారా రసానుభూతి కలుగుతుంది.

డా॥ వేముగంటి నరసింహాచార్యులు రచించిన 'పసిడి మువ్వలు' అనే పద్య కవితా సంపుటిలోనిది ఈ గోలకొండ కోట పాఠం.

## పాఠం ఉద్దేశం / నేపథ్యం

తెలంగాణ చారిత్రక వైభవం చాటిచెప్పడంలో భాగంగా, గోలకొండను రాజధానిగా చేసుకొని పరిపాలించిన కుతుబ్‌షాహీల ఘనత, గోలకొండ పాలకుల సాహిత్య సాంస్కృతిక విశేషాలను తెలియజెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

## కవి పరిచయం



**30-06-1930**

**29-10-2005**

వేముగంటి నరసింహాచార్యులు సిద్ధిపేటలో జన్మించాడు. ఈయన తల్లిదండ్రులు రామక్క రంగాచార్యులు. బాల్యం నుంచి సాహిత్యంపై మక్కువ ఏర్పరచుకున్నాడు. లబ్ధప్రతిష్ఠులైన పద్యకవిగా సాహిత్య చరిత్రలో స్థానం సంపాదించుకున్నాడు. 'సాహితీ వికాస మండలి' సంస్థను, 'మెదకు జిల్లా రచయితల సంఘం'ను స్థాపించి సాహిత్యవికాసానికి కృషిచేశాడు. 'తిక్కన', 'రామదాసు' అన్న పద్య కావ్యాలను, 'మంజీరనాదాలు' అన్న గేయకావ్యాన్ని 'వివేక విజయం' అన్న ఖండకావ్యాన్ని రచించాడు. ఈయన రచనలు సాంస్కృతిక వైభవాన్ని మనకళ్ళ ముందుంచుతాయి.

'కవికోకిల', 'కావ్యకళానిధి', 'విద్వత్కవి' ఆయన బిరుదులు. వేముగంటి సాహిత్యకృషికి తెలుగు విశ్వవిద్యాలయం వేముగంటిని గౌరవడాక్టరేట్‌తో సత్కరించింది.

వేముగంటి రచనలన్నీ చక్కని ధారతో, సరళమైన తెలుగు పదాలతో శోభిల్లుతాయి. ఈయన కలం నుండి జాలువారే తెలంగాణ పదజాలం ఇంపుసొంపులతో అలరారి పాఠకులను పరవశింపజేస్తుంది.



I



సీ. భద్రాద్రిరామ వివాహమహోత్సవమునకు
ముత్యాల తలబ్రాల మూటలంపి,
అద్దంకి గంగాధరాది కవీంద్రుల
కృతులందు కొనుటకు కేలుసాచి,
శేముషీ చతురతాశ్రీకి పేరొందిన
తెలుగు మంత్రిత్వపు కలిమివలచి,
నెఱజోదు తనము పండిన తెలంగాణ
భూమికి క్రొత్త మగటిమి మెరుగువెట్టి.

తే.గీ. మత విభేదజాడ్యము లేని కుతుబుషాహి
పాదుషాలు సాగించిన పాలనమున
ఆంధ్రతాముద్ర మౌళిపై నవధరించి
కొలువు దీర్చిన దీ గోలకొండ కోట! 1

తే.గీ. వైరి రక్తము కత్తికి చూరలిచ్చు
దండ నాథుని రసికత పిండుకొన్న
అచ్చ తెలుగు కవిత్వపు పచ్చితేనె
చవులెరింగెను సరసాంధ్ర జనములచట! 2

## మీరేమి అర్థం చేసుకున్నారు?

- ముత్యాల తలంబ్రాలు ఎందుకు పంపించేవారు?
- కుతుబ్‌షాహి పాదుషాల పాలనలోని ప్రత్యేకత ఏమిటి?



## II



*సీ. అక్కన్న మాదన్న లెక్కి వచ్చిన, గుఱ్ఱ
 ములు తిరుగాడిన భూములిచట,
కంచర్ల గోపన్న గానామృతమునకు
 శిలలు ద్రవించిన తలములిచట,
శ్రీరామ పదసరసిజ రజఃపాళి పు
 న్నెములు పూయించిన నెలవులిచట,
భోగభాగ్యమ్ములు మూడుపూలారుకా
 యలుగ వర్ధిలిన చిహ్నమ్ములిచట.

తే.గీ. కలవు కలవంచు ఘోషించు కంఠమెత్తి
ప్రత్యణువు నాటి గాథలు త్రవ్విపోయు!
ఈ చరిత్ర ప్రదేశ మీక్షించి నంత
తనువు పులకించు మదికి మోదము ఘటించు! 3

ఆ.వె. పునుగు పరిమళములు మొగిలిపూటత్తరు
కమ్మదనము పచ్చ కప్పురంపు
వీడియమ్ము తావి వీడక, గుమగుమ
లాడునేమొ? ఇపుడు గూడ నిచట! 4

## III



*ఉ. మానస వీధిలో మధుర మంజుల నాదవిపంచి మ్రోయు, మూ
సానదిసాని క్రొందరగ చాలుల చల్లదనమ్ముగూర్చి, మం
దానిల చామరమ్ము చెలువారగ వీచుచు గోలకొండ సు
ల్తానుల రాజ్యలక్ష్మికి విలాస వినోదమొసంగె నెంతయున్! 5

### మీరేమి అర్థం చేసుకున్నారు?

- కంచెర్ల గోపన్న ప్రత్యేకత ఏమిటి?
- గోలకొండలో ఇప్పటికీ ఏమి పరిమళిస్తున్నాయి?



ఆ.వె. చెలగు తెలుగు తల్లిసిగలోని జాజిపూ
దండ వోలె గోలకొండ కోట!
అలరు దిటవు జారనట్టి తెలుగువాని,
గుండెవోలె గోలకొండ కోట! 6



**మీరేమి అర్థం చేసుకున్నారు?**

- మూసానది తరగలు ఎలా ఉన్నాయి?
- గోలకొండ కోట ప్రత్యేకత ఏమిటి?

### తాత్పర్యాలు

1) కుతుబ్‌షాహి పాదుషాలు గోలకొండను రాజధానిగా చేసుకొని పరిపాలించారు. తెలుగుదనం ఉట్టిపడేలా, అన్ని మతాల వారిని గౌరవిస్తూ తమ పాలన కొనసాగించారు.

భద్రాద్రి సీతారామ చంద్రస్వామి కళ్యాణ మహోత్సవాలకు ఈ గోలకొండ కోట నుండి ముత్యాల తలంబ్రాలను పంపించేవారు. అద్దంకి గంగాధరుడు మొదలైన కవులను పోషించి వారి రచనలను అంకితం తీసుకున్నవారు గోలకొండ పాలకులే! అపారమైన తెలివితేటలు, చాతుర్యం గలిగిన తెలుగుమంత్రులెందరినో గోలకొండ కోట ఆదరించింది. వీరత్వానికి పుట్టినిల్లైన తెలంగాణ నేలకు కొత్త పౌరుషాల మెరుపులను అద్దిందీకోట! కుతుబ్‌షాహీలు తెలుగుదనంతో పాలన సాగించడానికి గోలకొండ కోట కొలువుదీర్చింది.

2) శత్రువుల రక్తంతో తమ కత్తులను శక్తివంతం చేసుకొన్న దండనాథులు గోలకొండ కోటలోనున్నారు. సాహిత్యాభిమానులైన దండనాథుల రసజ్ఞత నింపుకొని అచ్చతెలుగు కవిత్వసుధను ఆస్వాదించిన తెలుగు ప్రజలు ఈ గోలకొండ ప్రాంతంలో ఉన్నారు. అంటే అచ్చ తెనుగు రచనలను రాజులు, ప్రజలు బాగా అభిమానించారని భావం.

3) తానీషా కొలువులో మంత్రులుగా సేవలందించిన అక్కన్న మాదన్నలు అపారమైన తెలివితేటలు గలవారు. వీరి గుర్రాలు తిరిగిన నేల యీ ప్రాంతం. అంటే వీరి శౌర్యం ఈ నేల అంతటా వాసికెక్కిందని భావం.



రామదాసుగా పేరొందిన కంచర్ల గోపన్న శ్రీరామునిపై అనేక కీర్తనలు రచించి ఆలపించాడు. ఆ రాగాలకు శిలలు కరిగిపోయాయి. అట్లాంటి ప్రసిద్ధ ప్రాంతమిది.

కమలాల వంటి శ్రీరాముని పాదాల నుండి రాలిన ధూళి పున్నమి వెన్నెలలో వెలుగును నింపింది. రామశక్తిని అణువణువున నింపుకొన్న నేలగా ఈ ప్రాంతం పేరుపొందింది.

సుఖసంతోషాలు మూడు పూవులు ఆరుకాయలుగా వికసించిన ఆనవాళ్ళెన్నో ఈ ప్రాంతంలో ఉన్నాయి. వాటిని గొంతెత్తి పాడుకుంటే అనేక కథలు కళ్ళ ముందు నిలుస్తాయి. ఇంత ప్రశస్తి కెక్కిన గోలకొండ కోటను చూస్తేనే శరీరం ఆనందంతో పులకరిస్తుంది. మనస్సుకు ఆహ్లాదం కలుగుతుంది.

4) పునుగు పిల్లి నుండి సేకరించిన సుగంధ ద్రవ్యం, మొగలిపూల అత్తరు పరిమళాలు, పచ్చకర్పూరం వేసిన తాంబూలం కమ్మదనపు సువాసనలు ఇంకా ఈ గోలకొండ ప్రాంతంలో ఇప్పుడుకూడా పరిమళిస్తున్నాయేమో? గోలకొండ ప్రాంతం భోగభాగ్యాలతో అలరారిందనడానికి, పాలకుల జీవన శైలికి ఇది నిదర్శనం!

5) మూసీనదీ పరివాహక ప్రాంతం ఈ గోలకొండ. మూసీనది తరంగాల సవ్వడి మనోహరమైన వీణానాదాన్ని మోసుకువస్తుంది. మనసుకు ఆహ్లాదాన్నందిస్తుంది. ఈ తరంగాల చల్లదనంతో కూడిన గాలి గోలకొండ రాజ్యలక్ష్మికి వింజామరలు వీచినట్లుగా శోభించింది. ఈ చల్లని గాలులు, మూసీనది సుల్తానుల రాజ్యసంపదకు విలాసవినోదాలను అందించాయి.

6) భాషామతల్లి సిగలో జాజిపూదండవలె గోలకొండ కోట విలసిల్లింది. ఏ మాత్రం ధైర్యం కోల్పోని తెలుగువాని గుండెవలె గోలకొండ కోట అలరారింది. అంటే పాలన కుతుబుషాహీలదైనా గోలకొండ ప్రాంతమంతా తెలుగుదనంతోనే ప్రకాశించిదని భావం.

# భాషాసామర్థ్యాలను సాధిద్దాం!

## I. భాషాంశాలు

### పదజాలం

**అ) కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి.**

1) కష్టాలు వచ్చినప్పుడే గుండె <u>దిటవు</u> చేసుకోవాలి. ____________________

2) సరస్వతీదేవి చేతిలో <u>విపంచి</u> రాగాలను పలికిస్తుంది. ____________________

3) మల్లెల <u>తావి</u> మనసుకు సంతోషాన్నిస్తుంది. ____________________

4) సముద్రంలో <u>తరగలు</u> ఎగసిపడుతున్నాయి. ____________________



ఆ) పదంలోని ప్రతి అక్షరంతో ఒక పదం రాయండి.

| గో | ల | కొం | డ | కో | ట |
|---|---|---|---|---|---|

గో ____________________ ల ____________________

కొం ____________________ డ ____________________

కో ____________________ ట ____________________

## వ్యాకరణాంశాలు

### సవర్ణదీర్ఘ సంధి

❖ కింది పదాలు పరిశీలించండి. సంధి జరిగిన విధానం గమనించండి.

1) శివాలయం = శివ + ఆలయం → అ + ఆ = ఆ

2) మునీంద్రుడు = ముని + ఇంద్రుడు → ఇ + ఇ = ఈ

3) భానూదయం = భాను + ఉదయం → ఉ + ఉ = ఊ

4) మాతౄణం = మాతృ + ఋణం → ఋ + ఋ = ౠ

పై పదాలను విడదీసినప్పుడు మొదటి (పూర్వ), రెండవ (పర) పదాల్లో ఒకే రకమైన అచ్చులున్నాయి గదా! అట్లా ఆ రెండు అచ్చులు కలిసినప్పుడు వాటి వాటి దీర్ఘాలు వచ్చాయని గ్రహించారు కదా!

అ/ఆ + అ/ఆ = ఆ     ఇ/ఈ + ఇ/ఈ = ఈ

ఉ/ఊ + ఉ/ఊ = ఊ     ఋ/ౠ + ఋ/ౠ = ౠ

| అ, ఇ, ఉ, ఋ లకు సవర్ణాలు పరమైతే దీర్ఘం ఏకాదేశంగా వస్తుంది. |
|---|
| ఏకాదేశం అంటే ఒక వర్ణం స్థానంలో మరొక వర్ణం వచ్చి చేరడం. |

అ) కింది పదాలను విడదీసి సంధిని గుర్తించండి.

1) గానామృతం = ____________ + ____________ = ____________

2) గంగాధరాది = ____________ + ____________ = ____________

3) సరసాంధ్ర = ____________ + ____________ = ____________

4) గురూపదేశం = ____________ + ____________ = ____________

5) రవీంద్రుడు = ____________ + ____________ = ____________

## II. అవగాహన-ప్రతిస్పందన

అ) కింది లేఖను చదువండి. లేఖలు రాసేటప్పుడు పాటించాల్సిన నియమాలను పరిశీలించండి. అర్థం చేసుకొని కింద ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి.

సంగారెడ్డి,
05-10-2020.

ప్రియమైన నిఖితకు,

నీవెలా ఉన్నావు? నేనిక్కడ క్షేమం. ఈ మధ్యకాలంలో కథల పుస్తకాలు, చరిత్ర పుస్తకాలు ఇలా దొరికిన ప్రతి పుస్తకాన్నీ చదివాను. ఒక పుస్తకం చదువుతుంటే చాలా ఆశ్చర్యకర విషయాలు తెలుసుకున్నాను. అవి నీతో పంచుకోవాలని ఈ లేఖ రాస్తున్నాను.

మన గోలకొండను పరిపాలించిన మహ్మదీయ రాజులు ఉర్దూ అధికారభాషగా పాలన కొనసాగించారన్న విషయం నీకు తెలుసుకదా! అయితే వారు తెలుగు భాషను, సాహిత్యాన్ని ఆదరించారని చదివి ఆశ్చర్యపోయాను. మహ్మదీయ రాజుల్లో ఇబ్రహీం కుతుబ్‌షా విద్యాప్రియుడని, తన ఆస్థానంలో కవులను పండితులను పోషించాడని తెలుసుకున్నాను. విజయనగర రాజుల ఆదరణలో ఈ కుతుబ్‌షా పెరిగినవాడు కాబట్టి ఈయనకు తెలుగు భాషపై మక్కువ ఏర్పడిందట. అందుకే తన ఆస్థానంలో తెలుగు కవులను గౌరవించాడట. అద్దంకి గంగాధర కవి రచించిన తపతీ సంవరణోపాఖ్యానం ఇబ్రహీంకుతుబ్‌షా అంకితం పొందినాడని తెలుసుకున్నాను. ఈయన సేనాని అమీన్‌ఖాన్ కూడా తెలుగుసాహిత్యం అంటే చెవికోసుకునేవాడట. పొన్నగంటి తెలగనార్యుడనే కవి సంస్కృత పదాలు వాడకుండా అచ్చతెలుగులోనే యయాతి చరిత్ర రాశాడనీ, దీనిని అమీన్‌ఖాన్‌కే అంకితమిచ్చాడని తెలుసుకున్నాను.

ఇట్లా గోలకొండ పాలకులు తెలుగు భాషా సాహిత్యాలను ఆదరించి గౌరవించడం నాకు సంతోషంతో పాటు ఆశ్చర్యాన్ని కల్గించింది. నువ్వేమైనా పుస్తకాలు చదివినావా? వాటి విశేషాలు తెలుపుతూ లేఖ రాయగలవు. అమ్మానాన్నలకు నమస్కారాలు. నీ ఉత్తరం కోసం ఎదురు చూస్తుంటా! సెలవామరి!

ఇట్లు
నీ ప్రియ మిత్రురాలు,
శివాని

చిరునామా :

నిఖిత,
పదోతరగతి, జి.ప.ఉ.పా. కామారెడ్డి,
మం|| & జి|| కామారెడ్డి.
తెలంగాణ - 503 111

1) పై లేఖను ఎవరు ఎవరికి రాశారు?

______________________________

2) యయాతి చరిత్రను రచించిన కవి పేరేమిటి?

______________________________

3) పై లేఖలో పేర్కొన్న గోలకొండ పాలకుడెవరు?

______________________________

ఆ) కింది పద్యాన్ని పాదభంగం లేకుండా పూరించండి. తాత్పర్యం రాయండి.

మానస వీథిలో ______________________________

______________________________

______________________________

______________________________ నెంతయున్!

## III. వ్యక్తీకరణ-సృజనాత్మకత

### స్వీయరచన

అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులను రాయండి.

1) వేముగంటి నరసింహాచార్యుల గురించి రాయండి.

2) గోలకొండ పాలకులు తెలుగు సంస్కృతిని గౌరవించారని ఎలా చెప్పగలరు?

3) మూసీనది ప్రత్యేకతను తెలుపండి.

4) గోలకొండ ప్రాంతాన్ని దర్శిస్తే 'తనువు పులకరిస్తుందని' కవి ఎందుకన్నాడు?

ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబును రాయండి.

1) వేముగంటి వర్ణించిన గోలకొండ వైభవాన్ని వివరించండి.

### సృజనాత్మకత / ప్రశంస

అ) కింది ప్రశ్నకు జవాబును సృజనాత్మకంగా రాయండి.

మీరు దర్శించిన యాత్రావిశేషాలు వివరిస్తూ మిత్రునికి లేఖ రాయండి.

(లేదా)

మన సంస్కృతి విశిష్టతను తెలుపుతూ మిత్రునికి లేఖ రాయండి.

## నేను ఏయే సామర్థ్యాలు సాధించాను? (స్వీయమూల్యాంకనం)

1) ఇచ్చిన వాక్యాల్లోని పదాలకు అర్థాలు, పదంలోని అక్షరాలతో పదాలను, ప్రకృతి వికృతులు గుర్తించగలను. అవును / కాదు

2) సవర్ణదీర్ఘసంధి అవగాహన చేసుకొని, పదాలను విడదీసి సంధి గుర్తించగలను. అవును / కాదు

3) లేఖను చదివి అర్థం చేసుకోగలను. ప్రశ్నలకు జవాబులు రాయగలను.

4) పరిచిత పద్యాన్ని పాదభంగం లేకుండా పూరించి తాత్పర్యం రాయగలను. అవును / కాదు

5) గోలకొండ వైభవాన్ని సొంతమాటల్లో వివరించగలను. అవును / కాదు

6) ఇచ్చిన అంశం గురించి లేఖను రాయగలను అవును / కాదు

## సూక్తి

శ్రద్ధ, చిత్తశుద్ధితో మంచి పనులు చేస్తే మేలు కలుగుతుంది.
చిన్నపనినైనా సవ్యంగా చేస్తే మహాద్భుత ఫలితం లభిస్తుంది.
కాబట్టి కార్య నిర్వహణకు అంకితభావం అత్యంత ప్రధానం.
అట్లా చేసిన కార్యాలే శాశ్వతంగా నిలుస్తాయి.

– స్వామి వివేకానంద

# 11 సాహితీమూర్తి

– బి.ఎన్. శాస్త్రి

## సాధించాల్సిన సామర్థ్యాలు – అభ్యసన ఫలితాలు

ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఈ కింది సామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలను సాధిస్తారు.

**I. భాషాంశాలు :**

అ) **పదజాలం** : ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు, వ్యతిరేకార్థక పదాలు మొదలైనవి రాయగలుగుతారు.

ఆ) **వ్యాకరణాంశాలు** : గుణసంధి గురించి తెలుసుకుంటారు, విడదీసి రాయగలుగుతారు.

**II. అవగాహన – ప్రతిస్పందన :**

అ) వ్యాసం గురించి అర్థం చేసుకొంటారు. చదివి అవగాహన చేసుకోగలుగుతారు.

**III. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

అ) **స్వీయరచన** : పి.వి.నరసింహారావు గురించి తెలుసుకొని, సొంతంగా రాయగలుగుతారు.

ఆ) **సృజనాత్మకత** : వ్యాసం లక్షణాలు, అందులోని భాగాలను గురించి తెలుసుకొని వ్యాసం రాయగలుగుతారు.

## అభ్యాసకులకు సూచనలు

- పాఠాన్ని చదువండి. తెలియని పదాలను గుర్తించండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరి అకారాది పట్టికలో వెతుకండి.
- పాఠాన్ని మళ్ళీ చదివి అర్థం చేసుకోండి.
- పాఠంలో అర్థంకాని అంశాల గురించి మీ సమీపంలోని ఉపాధ్యాయులు లేదా కేంద్రంలో బోధించే వారితో చర్చించి తెలుసుకోండి.
- బాక్సులో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను పాఠంలో గుర్తించండి.



## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం వ్యాస ప్రక్రియకు చెందింది. వ్యాసం అంటే వివరించి చెప్పడమని అర్థం. సమగ్రత, సూటిదనం, స్పష్టత, సులభంగా అర్థమవడం అనేవి వ్యాస లక్షణాలు. ప్రస్తుత పాఠ్యభాగం "అప్పాజోస్యుల విష్ణుభొట్ల కందాళం ఫౌండేషన్ (AVKF) వారు ప్రచురించిన "ప్రతిభా వైజయంతి-2002" అనే సంచికలో పి.వి.నరసింహారావు గురించి బి.ఎన్. శాస్త్రిగారు రాసిన వ్యాసం ఇది.

## పాఠం ఉద్దేశం / నేపథ్యం

దక్షిణ భారతదేశం నుండి మొట్టమొదటిసారిగా భారత ప్రధాన మంత్రి పదవిని అధిష్టించిన తెలుగువాడు పి.వి. నరసింహారావు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా పనిచేశాడు. మన దేశానికి ప్రధానమంత్రి స్థాయికి ఎదిగిన రాజకీయ దురంధరుడు. బహుభాషా వేత్త, కవి, రచయిత కూడా! పి.వి. నరసింహారావు మహోన్నత జీవితం ఆదర్శవంతమైంది. మన దేశంలోనే కాకుండా 50 దేశాలలో జరుగుతున్న పి.వి. శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆయన చేసిన సాహితీ సేవను, ఆయన జీవితం గురించి తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

## కవి పరిచయం



**10-12-1932**

**04-04-2002**

బి.ఎన్.శాస్త్రి పూర్తి పేరు భిన్నూరి నరసింహశాస్త్రి, 1932లో యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ గ్రామంలో జన్మించారు. భువనగిరి, హైదరాబాద్‌లో విద్యాభ్యాసం చేశారు. తన తొమ్మిదవ యేటనే పరిశోధనపై దృష్టి మళ్ళింది. 1980లో మూసీ పత్రికను స్థాపించాడు.

"భారతదేశ చరిత్ర సంస్కృతి" - అనే అంశంపై 21 భాగాల పరిశోధనాత్మక గ్రంథాలు రచించారు. శాసన సంపుటి (1, 2 భాగాలు), కందూరు చోడుల శాసనాలు - చరిత్ర - సంస్కృతి, త్రిపురాంతక దేవాలయ శాసనాలు, బెజవాడ దుర్గామల్లీశ్వరాలయ, ముఖలింగ దేవాలయ చరిత్ర, రేచర్ల రెడ్డి వంశచరిత్ర, గోలకొండ చరిత్ర - సంస్కృతి, చెరుకురెడ్డి వంశచరిత్ర. రేచర్ల పద్మనాయకులు, కాయస్థ రాజులు, వేములవాడ చరిత్ర మొదలైన శాసనాలు, మహబూబ్ నగర్ జిల్లా సర్వస్వం, నల్లగొండ జిల్లా కవులు - పండితులు, మల్యాల వంశచరిత్ర - శాసనాలు, రెడ్డి రాజ్య సర్వస్వము, 2001 పానగల్లు పచ్చల తోరణము, బ్రాహ్మణ రాజ్య సర్వస్వము, షబ్నవీస్ శతజయంతి సంచిక, విజయనగర శాసనాలు సాహిత్య సాంస్కృతిక విశేషాలు మొదలైన గ్రంథాలను పరిశోధనాత్మకంగా విశ్లేషిస్తూ రచించాడు. 1997లో తెలుగు విశ్వవిదాయలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారం పొందాడు.

## I




అసాధారణమైన మేధాసంపత్తి అద్వితీయ ప్రతిభా వ్యుత్పత్తులు. బహుభాషా కోవిదత్వము, సమస్త సంస్కృతీ వికాస పరిణామ పరిజ్ఞానము, తెలుగు భాషాభిమానము. జాతీయతావాద సమన్వయత్వము, సర్వమానవ సౌభ్రాతృత్వము, భారతీయ సంస్కృతీ పరిరక్షణ, తెలుగుదనము మూర్తీభవించిన మహనీయుడు శ్రీ పి.వి.నరసింహారావు గారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యామంత్రిగా జ్ఞాన సరస్వతీ క్షేత్రమైన శ్రీ బాసర క్షేత్రమున ఆయన తన మొట్టమొదటి ఉత్తర్వు వేసినారు. అటువంటి వారిని సంప్రదాయులు అందుమా? సంస్కార వాదులు అందుమా?

పి.వి. విద్యార్థిగా ఉన్న రోజుల్లో కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ వ్రాసిన 'వేయిపడగలు' ఆంధ్రపత్రికలో చదివినప్పుడు వారి హృదయాన్నది ఎంతగానో ఆకర్షించినది. విద్యామంత్రిగా ఆయన దానిని హిందీలోనికి అనువాదము చేసినారు. హిందీ భాషాకోవిదుల మెప్పును పొందినారు.

విశ్వనాథ వారికి జ్ఞానపీఠం అవార్డు లభించడానికి కొద్దినెలల ముందే పి.వి.కి. 'వేయిపడగలు'ను హిందీలో 'సహస్రఫణ్'గా అనువదించినందుకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించినది. అంతయే కాదు. కవి సమ్రాట్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆస్థాన కవిగా నియమించినారు.

పి.వి. విద్యామంత్రిగా ఉన్నప్పుడు కళాశాల స్థాయిలో తెలుగు బోధనా భాషగా నిలుపుటకు శాసనసభల్లోనూ, శాసన మండలిలోనూ ఎంతేని పట్టుదలతో పనిచేయవలసి వచ్చినది. శాస్త్రపరిజ్ఞానము, పారిభాషిక పదజాలము తెలుగులో లేదని ఎందరో పెద్దల ఆక్షేపణలు తొలగించుటకు కళాశాల స్థాయిలో పాఠ్యపుస్తకాల ప్రచురణకు తెలుగు అకాడమీని ఏర్పాటుచేయవలసిన బాధ్యత కూడా నరసింహారావుగారికి సంబంధించినది. ఇది యేర్పడి తన కార్యక్రమాలను సాగిస్తూ ముందుకు నడుస్తున్నది. ఎన్నో ఉత్తమ గ్రంథాలను ప్రచురిస్తున్నది.

తెలుగును అధికార భాషగానూ, కళాశాల విద్యాబోధనా భాషగానూ చేయుటకు పి.వి. చేసిన కృషి శ్లాఘనీయమైనది. ఇందుకు తెలుగుజాతి వారికి ఎంతగానో ఋణపడి యున్నది. శాసనసభలో ఈ విషయమై వారు చేసిన ప్రసంగము – శ్వేతపత్రము – పండిత పరిశోధకులకు అబ్బురము కలిగించినది. ఆ శ్వేతపత్రము వారి పాండిత్యానికి, సునిశిత ప్రజ్ఞకు, బహుముఖ విజ్ఞానానికి నిదర్శనము.

పి.వి. సారస్వత వ్యాసంగము, విద్యార్థి దశనుండియే కొనసాగుతూ వచ్చినది. వారి చిన్ననాటి కవిత్వములోనూ చక్కని భావనాశక్తి అగుపడెడిది. ద్విపదలు, గీతాలు, వృత్తాలు అనేకము రచించినారు. తెలుగులోనే కాక ఇంగ్లీషులో కూడా చెప్పుకోదగ్గ గద్య పద్య రచనలు చేసినారు. జయచంద్రునిపై 'జయచంద్ర – హైందవ విధ్వంసక' అనే మకుటముతో వ్రాసిన పద్యములు వరంగల్ భజనమండలి సభలలో విరివిగా ప్రచారము పొందినాయి.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

- పి.వి. గారి గురించి మొదటి పేరాలో ఏమని పేర్కొన్నారు?
- పి.వి. గారు విద్యామంత్రిగా ఏమి చేశాడు?

## II

**గార్లపాటితో సహచర్యం :**

ఆ రోజుల్లో పి.వి గారికి వరంగల్లులో గార్లపాటి రాఘవరెడ్డి గారితో పరిచయమైంది. తరచు ఆయన ఆశ్రమానికి వెళ్ళి కాలక్షేపము చేసెడివారు. రాఘవరెడ్డి గారికి ఆంగ్లభాషా సాహిత్యముతో పరిచయము లేదు. పి.వి. ఆయనకు వర్డ్స్ వర్త్, షెల్లీ, కీట్స్, బైరన్, షేక్స్పియర్ నాటకాలు, థాకరే, డికెన్స్, హార్డీ నవలలు మొదలగు వాని వైశిష్ట్యము గూర్చి శ్రుతపాండిత్యము కలిగించినారు. అదే విధముగా రాఘవరెడ్డిగారు కూడా పి.వి.కి మనుచరిత్ర, నైషధంవంటి మహాప్రబంధములు,





కాళిదాసు, భవభూతి వంటి కవుల శైలీవిన్యాసముపై ఆసక్తి కలిగించినారు. 'ప్రాచీనత – ఆధునికత' అనునవి రెండు పెనవేసుకొని ఉభయుల్లోనూ సమంగా పెంపొందించిన భావసరళికి వారి స్నేహము చిహ్నము. పోలీసుచర్యకు కొంతకాలము ముందు అంటే 1945–46 లలో పి.వి. వరంగల్‌లో 'కాకతీయ సారస్వత సంకలనము' అను పేరుతో ప్రచురణలను నిర్వహించెడివారు. అప్పటికే పి.వి. సాహిత్యరత్న పూర్తిచేసినారు. ఆ రోజులలో మహాదేవివర్మ కవితలపై తన సుదీర్ఘ సమీక్షకు లిఖిత రూపమిచ్చుట, హిందీ సాహిత్యము నుండి అనేక కవితలను తెలుగులోకి అనువదించుట వంటి ప్రయోజనాలు చేకూరినవి.

**రామవ్వ :**

రజాకార్ల కాలములో పి.వి. 'రామవ్వ' అనే ఒక విప్లవ కథను వ్రాసినారు. కాంగ్రెస్ గెరిల్లా వీరుని సాహసగాథయే రామవ్వ కథ. రామవ్వ ఇంటిలో తలదాచుకొన్న ఆ గెరిల్లా వీరుని జాడను తెలుసుకుని సాయుధ పోలీసులు వెన్నాడుతారు. అతడు ప్రాణభయంతో పరుగెత్తి ఒకానొక ఇంట్లో దాగి ఉంటాడు. ఆ ఇల్లే రామవ్వది. ఆ గొల్ల రామవ్వ అనే అమాయక స్త్రీ ప్రాణాలకు తెగించి తన గుడిసెలో గెరిల్లా వీరునికి రక్షణ ఇచ్చుట ఇతివృత్తము. ఒకవంక పోలీసుల భయము మరొక వంక రక్షణ ఇచ్చుటలో గల భయము ఈ రెండు ద్వంద్వ భావాల సంఘర్షణ ఆ కథలో నాటకీయముగా చిత్రితమైనది. రామవ్వ నిజాం పోలీసుల కళ్ళల్లో కారం కొట్టి గెరిల్లా వీరుణ్ణి కాపాడినది.

> **మీరేమి అర్థం చేసుకున్నారు?**
>
> - *పి.వి. గారికి గార్లపాటి గారికి మధ్య సంబంధాన్ని తెలుపండి.*
> - *'రామవ్వ' కథను ఎవరు రాశారు? దాంట్లో ఏముంది?*

### III

**కాకతీయ పత్రిక :**

పి.వి. సాహిత్య జీవితంలో కాకతీయ పత్రిక ప్రచురణ అత్యంత ముఖ్యమైనది. గార్లపాటి రాఘవరెడ్డి, కాళోజీల సహాయము ఈ పత్రికకు ఉండెడిది. పత్రిక నిర్వహణలో పి.వి. అన్ని రంగాలలో అన్ని రకాల బాధ్యతలను నిర్వహించవలసి వచ్చినది. ప్రకటనలు సేకరించుట, చందాదారులను చేర్పించుట, రచనలు సమకూర్చుట, ప్రూఫులు దిద్దుట వంటి నానా చాకిరీ చేయవలసిన అవసరమైనది.

మొత్తానికి పత్రిక సామాన్య ప్రజల ఆదరమును, విజ్ఞలోక ఆమోదమును పొందగలిగినది. కాకతీయ పత్రిక రాజకీయముగా ప్రజాస్వామ్య, సామ్యవాద సిద్ధాంత వ్యాప్తికి కృషిచేసినది. అనేక ప్రత్యేక సంచికల ద్వారా వ్యవసాయ, సహకార, విద్యా, సంక్షేమ రంగములపై దృష్టిని కేంద్రీకరించి పీడిత ప్రజానీక ప్రయోజనాలను బలపరిచినది. పలు హాస్య, వ్యంగ్య రచనల ద్వారా అభివృద్ధి నిరోధక కుట్రలు, కుతంత్రాలను బట్టబయలు చేసినది. పురోగాముక గద్య – పద్య సాహితీ రీతులను ప్రోత్సహించినది. నైతిక, ఆధ్యాత్మిక,



సాంస్కృతిక పునరుజ్జీవనావశ్యకతలను ప్రబోధించినది. జాతీయ, అంతర్జాతీయ సంఘటనలను సవివరముగా, నిష్పాక్షికముగా వ్యాఖ్యానించినది.

ఆ రోజులలో పి.వి. అనేక రాజకీయ వ్యాసాలు, విమర్శలు, దీర్ఘ కథలు, కథానికలు, గేయాలు, వ్యాఖ్యలు వ్రాయుచుండెడివారు. అయితే కాకతీయ పత్రికకు ఆర్థికముగా బలము లేదు. నిర్వాహకులలో వ్యాపార దృక్పథము లేదు. కేవలము నిస్వార్థ సేవ దృష్టితో వ్యవహరించినదే కాని వేరే కాదు. అందువలన పత్రిక అకస్మాత్తుగా అనుకోని రీతిలో ప్రారంభమైనదో, హఠాత్తుగా అనుకోని రీతిలోనే ఒకానొక అశుభ దినమున నిల్చిపోయినది.

పి.వి. మంత్రి కాకముందే కే.ఎం. మున్షీ విద్యాభవన్ కార్యకలాపాల పట్ల ఆకర్షితులయినారు. అందుకు పరిణామముగానే హైదరాబాద్‌లో విద్యాభవన్ శాఖను నెలకొల్పి దానికొక సాహితీ సాంస్కృతిక కేంద్రముగా తీర్చిదిద్దాలను సంకల్పము నిర్ణయాత్మక రూపము దాల్చినది. దీని ఫలితముగానే భారత అధ్యక్షుడు డా॥ రాధాకృష్ణన్ ఆశీస్సులతో విద్యాభవన్ శాఖ ప్రారంభించుట జరిగినది. ఆ రోజుల్లో పి.వి. నేషనల్ బుక్ ట్రస్టుతో సంబంధాలను నెలకొల్పుకున్నారు. మరాఠీ సాహిత్యంలోని సుప్రసిద్ధమైన 'అబల' అనే నవలను తెలుగులోనికి అనువదించారు.

1968 హైదరాబాద్‌లో ఏ.ఐ.సి.సి. మహాసభలు జరిగినవి. ఆ సందర్భముగా వెలువడిన ప్రత్యేక సంచిక సంపాదకత్వ బాధ్యతలను పి.వి. నిర్వహించినారు. ఆ సంచికకు 'నేటి పార్టీ ఫిరాయింపులు పాపయాత్రలు', 'ఆపద్ధర్మ ప్రభుత్వ నిర్మాణ పొత్తు సూత్రాలు', 'మంత్రివరుల దినచర్యానుభవాలు' అనే హాస్య, వ్యంగ్య రచనలు ఇంగ్లీషులో స్వయముగా వ్రాసి ప్రచురించినారు. ఇటీవల పి.వి. రచించిన ఇన్‌సైడర్ (లోపలి మనిషి) నవల ఆయన రాజకీయ అనుభవాల వ్యంగ్య సారాంశమే.

రాజకీయవేత్తగా ఉంటూ, సాహిత్య రంగములో రాణించిన వారు అతికొద్ది మంది మాత్రమే ఉన్నారు. అటువంటి వారి కోవకు చెందిన ముఖ్యులు, ప్రముఖులు, భారతదేశమున అత్యున్నత పదవులను నిర్వహించి దేశప్రతిష్ఠలను, దేశ సాహిత్యమును ప్రపంచమునకు అందజేసిన సాహితీ చిద్విలాసమూర్తి – పి.వి.నరసింహారావు గారు.

### మీరేమి అర్థం చేసుకున్నారు?

- కె.ఎం. మున్షీ విద్యాభవన్ కార్యకలాపాలకు ఆకర్షితులై పి.వి. చేసిన కృషిని తెలుపండి.
- ఏ.ఐ.సి.సి. మహాసభల సందర్భంలో కాకతీయ పత్రికలో సంపాదకుడుగా పి.వి. రాసిన రచనలు తెలుపండి.



# భాషాసామర్థ్యాలను సాధిద్దాం!

## I. భాషాంశాలు

### పదజాలం

అ) కింది పదాలనుపయోగించి సొంతవాక్యాలను రాయండి.

1) తార్కాణము : ______________________

2) సంఘర్షణ : ______________________

3) హఠాత్తుగా : ______________________

4) అబ్బురము : ______________________

ఆ) కింది వ్యతిరేక అర్థాన్నిచ్చే పదాలను జతచేయండి.

| | | | | |
|---|---|---|---|---|
| 1) | సాధారణ | (      ) | ఎ) | అసంకల్పము |
| 2) | శుభము | (      ) | బి) | అనాదరణ |
| 3) | సంకల్పము | (      ) | సి) | అసాధారణ |
| 4) | ఆదరణ | (      ) | డి) | అశుభము |

### వ్యాకరణాంశాలు

### గుణసంధి

అ) కింది పదాలను విడదీయండి.

ఉదా: నరేంద్రుడు = నర + ఇంద్రుడు (అ + ఇ = ఏ)

1) ఉపేంద్రుడు = __________ + __________ (   +   =   )

2) పురుషోత్తముడు = __________ + __________ (   +   =   )

3) మహర్షి = __________ + __________ (   +   =   )

ముందు పేజీలోని పదాలను పరిశీలించండి. అవి మూడు రకాలుగా ఉన్నాయి. విడదీసినప్పుడు ప్రతిసారి పూర్వపదం చివర 'అ' కారం ఉంది. ఉత్తర పదం చివర 'ఇ, ఉ, ఋ' లు ఉన్నాయి కదా! ఇలా కలిసిన తర్వాత ఏ, ఓ, అర్ లు ఆదేశంగా వచ్చి చేరాయి.

| | | | |
|---|---|---|---|
| అ | ఇ | = | ఏ |
| | ఉ | = | ఓ |
| | ఋ | = | ర్ |

ఏ, ఓ, ర్ లను 'గుణములు' అంటారు. గుణములు ఆదేశంగా వస్తాయి కాబట్టి దీనికి 'గుణ సంధి' అని పేరు.

**సూత్రం : 'అ' కారానికి 'ఇ, ఉ, ఋ' లు పరమైతే 'ఏ, ఓ, ర్' లు ఆదేశమగును.**

**అ) కింది పదాలను కలిపి, సంధి ఏర్పడిన విధానాన్ని తెలుపండి.**

ఉదా: గణ + ఈశుడు = గణేశుడు, అ + ఈ = ఏ

1) దేవ + ఇంద్రుడు = ________________, ________ + ________ = ______________

2) నర + ఉత్తముడు = ________________, ________ + ________ = ______________

3) బ్రహ్మ + ఋషి = ________________, ________ + ________ = ______________

## II. అవగాహన-ప్రతిస్పందన

**అ) ఏదైనా ఒక విషయం గురించి వివరించడమే వ్యాసం. ఆ విషయం పేరాలుగా విభజింపబడుతుంది. వ్యాసంలో - 1) పరిచయం, 2) విషయ విశ్లేషణ, 3) లాభాలు / నష్టాలు (ఇవి కొన్ని వ్యాసాలకు మాత్రమే ఉంటాయి), 4) ముగింపు అనేవి ప్రధాన భాగాలుంటాయి.**

గిరిజనుల హక్కుల సాధనకు తన జీవిత పర్యంతం పోరాడి అసువులు బాసిన గోండు వీరుడు కుంరం భీం గురించిన వ్యాసాన్ని పరిశీలిద్దాం. ఇది వ్యాస రచనకు సంక్షిప్త ఉదాహరణ మాత్రమే.

### కుంరం భీం

**పరిచయం :**

పూర్వపు ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో ఉదయించిన గొప్ప యుద్ధవీరులు గోండులు. అట్లాంటి గోండు వీరుల్లో కుంరం భీం ఒకడు. భీం 22/10/1901లో జన్మించాడు. భీం తండ్రి పేరు చిన్ను. ఈయన గూడెం పెద్ద (పటేలు). భీంకు కుర్దు, యేసు అనే ఇద్దరు సోదరులున్నారు. కుంరం భీం బాల్యం నుండి తెలివైనవాడు. సాహసవంతుడు, నాయకత్వ లక్షణాలున్నవాడు, పట్టుదలగలవాడు. న్యాయం కొరకు పోరాడేవాడు. అడవిలో పుట్టాడు. అడవిలో పెరిగాడు. సమస్త ప్రకృతి అతడిని పోరాట యోధుడిగా తీర్చి దిద్దింది.

**కుంరం భీం జీవిత విశేషాలు :**

భీం తన మిత్రులతో కలిసి అడవంతా తిరిగేవాడు. ఒకరోజు మేకల మేతకు చెట్టెక్కి మండలు నరికినప్పుడు జంగ్లాత్ జవాన్లు వాళ్లందరినీ కొట్టారు. హెచ్చరించారు. అడవిలోని చెట్లూ చేమను ముట్టొద్దన్నా వినలేదని, కొమ్మలు

నరికినందుకు గోండు యువకుడి చేతివేళ్లు నరికారు. గూడెం పటేల్ కూడా ఏమీ అనలేకపోయాడు. ఎవరూ నోరు మెదపలేదు. ప్రతిఘటించలేదు. కానీ భీం గుండెలో అగ్నిపర్వతం బద్ధలైంది. కోపం కట్టలు తెంచుకుంది. కానీ ఆయనను వదినె కూకూబాయి, తండ్రి ఆపారు.

గాలి, నీరు, నిప్పు, భూమి, ఆకాశం అందరివి. మరి "ఈ భూమి మీదున్న చెట్లు అందరివెందుకు కావు?" అనే ఆలోచనలు ఎల్లప్పుడు అతణ్ణి కలిచివేశాయి. భీం స్వతంత్రంగా పోరాటం మొదలు పెట్టాడు. ఆదిలాబాద్ అడవుల్లో నివసించే గోండు, కొలామి, పరదాన్, కోయ, అందాల్, చెంచు, భిల్లులు మొదలైన గిరిజనులలో చైతన్యం కలిగించాడు. అందరికి యుద్ధవిద్యలు నేర్పించి, వీరులుగా తీర్చిదిద్దాడు. అప్పటి నిజాం ప్రభుత్వాన్ని ఎదిరించాడు. గిరిజనుల హక్కుల కొరకు పోరాడాడు. సొంతవాళ్ల కుట్రకు బలయ్యాడు. నిజాం సైన్యం తూటాలకు నేలకొరిగాడు. 01-09-1940 నాడు వీరమరణం పొందాడు.

**ముగింపు :**

నైజాం పాలన నుండి ఆదివాసి ప్రజల కొరకు భూమికోసం, భుక్తికోసం పోరాడి వీరమరణం పొందిన గోండువీరుడు. గోండు వారి కోసం పరితపించి అమరుడయ్యాడు. ఆయన లేకపోయినా, ఆయన ఆశయం చరితార్థమయింది. కుంరంభీం జ్ఞాపకార్థం తెలంగాణ రాష్ట్రంలో "కుంరం భీం ఆసిఫాబాదు జిల్లా" అనే పేరుతో జిల్లాను ఏర్పాటు చేశారు.

**ఆ) కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1) కుంరం భీం గుణగణాల గురించి రాయండి.

___

2) గోండు యువకుడి చేతి వేళ్లను జంగ్లాత్ వాళ్లు ఎందుకు నరికారు?

___

3) ఆదిలాబాద్ అడవుల్లో ఎలాంటి గిరిజన తెగల వాళ్లు నివసిస్తారు?

___

4) కుంరం భీం నిజాం ప్రభుత్వాన్ని ఎందుకొరకు ఎదిరించాడు?

___

## III. వ్యక్తీకరణ-సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులను రాయండి.**

1) తెలుగు భాషకు పి.వి. చేసిన కృషి శ్లాఘనీయమైనది అని ఎలా చెప్పగలవు?

2) కాకతీయ పత్రిక ప్రజాస్వామ్య, సామ్యవాద సిద్ధాంత వ్యాప్తికి కృషి చేసిన పత్రిక అని ఎలా చెప్పగలవు?

3) గార్లపాటి, పి.వి.ల స్నేహబంధం 'ప్రాచీనత – ఆధునికత' పెనవేసుకొన్న బంధమని అనడంలో ఉద్దేశమేమిటి?

4) పాఠ్యభాగ రచయిత బి.యన్. శాస్త్రి గురించి సొంతమాటల్లో రాయండి.

**ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబును రాయండి.**

1) పి.వి సాహితీ చిద్విలాసమూర్తి అని ఎలా చెప్పగలవు?

(లేదా)

పి.వి. గుణగణాలు తెలుపుతూ, సాహితీ సేవను వివరించండి.

## సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది ప్రశ్నకు జవాబును సృజనాత్మకంగా రాయండి.**

1) "వార్తాపత్రికల" ప్రయోజనాల గురించి ఒక వ్యాసం రాయండి.

## నేను ఏయే సామర్థ్యాలు సాధించాను? (స్వీయమూల్యాంకనం)

| | | |
|---|---|---|
| 1) | పదాలతో సొంతవాక్యాలు, వ్యతిరేకార్థకపదాలు రాయగలుగుతాను. | అవును / కాదు |
| 2) | గుణసంధి గురించి చెప్పగలుగుతాను, రాయగలుగుతాను. | అవును / కాదు |
| 3) | వ్యాసం అంటే తెలుసుకొన్నాను, చదివి అర్థం చేసుకోగలను. | అవును / కాదు |
| 4) | పి.వి. నరసింహారావు గురించి సొంతంగా రాయగలను. | అవును / కాదు |
| 5) | వ్యాస లక్షణాల ప్రకారం వ్యాసం రాయగలను. | అవును / కాదు |

## సూక్తి

మనం చేసే ప్రతి పని ఓ విలువైన అర్థాన్ని
అందివ్వగలదై ఉండాలి. అదే జీవిత పరమార్థం.

– స్వెట్టర్న్

# 12 శతక పద్యాలు

– శతక కవులు

## సాధించాల్సిన సామర్థ్యాలు – అభ్యసన ఫలితాలు

ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఈ కింది సామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలను సాధిస్తారు.

**I. భాషాంశాలు :**

అ) **పదజాలం** :
- వాక్యాల్లో ఇచ్చిన పదాలకు సరైన అర్థాలను రాయగలుగుతారు.
- ఇచ్చిన పదాలకు పర్యాయపదాలను రాయగలుగుతారు.
- ఇచ్చిన పదాలకు నానార్థాలను రాయగలగుతారు.

ఆ) **వ్యాకరణాంశాలు** : ద్వంద్వ సమాసాన్ని అర్థం చేసుకొని ద్వంద్వసమాస పదాలను గుర్తించగలుగుతారు.

**II. అవగాహన – ప్రతిస్పందన :**

అ) పరిచిత పద్యాన్ని పూరించగలుగుతారు.

ఆ) పరిచిత పద్యానికి తాత్పర్యం రాయగలుగుతారు.

**III. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

అ) **స్వీయరచన** : శతక పద్యాల్లో ఉండే మంచి విషయాలను రాయగలుగుతారు.

ఆ) **సృజనాత్మకత** : 'తాను తినక, ఇతరులకు పెట్టక కూడబెట్టిన ధనం దొంగల పాలౌతుంది' అనే విషయం తెలియజెప్పే విధంగా కథ రాయగలుగుతారు.

## అభ్యాసకులకు సూచనలు

- పాఠాన్ని చదువండి. తెలియని పదాలను గుర్తించండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరి అకారాది పట్టికలో వెతుకండి.
- పాఠాన్ని మళ్ళీ చదివి అర్థం చేసుకోండి.
- పాఠంలో అర్థంకాని అంశాల గురించి మీ సమీపంలోని ఉపాధ్యాయులు లేదా కేంద్రంలో బోధించే వారితో చర్చించి తెలుసుకోండి.
- బాక్సులో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను పాఠంలో గుర్తించండి.



## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం శతక ప్రక్రియకు చెందినది. శతకం అంటే నూరు పద్యాలు కలది అని అర్థం. కానీ చాలా శతకాల్లో నూటెనిమిది వరకు పద్యాలు ఉంటున్నాయి. శతక పద్యాల్లో సాధారణంగా పద్యం చివరలో ఉండే పదం కాని, చివరి పాదం కాని, చివరి రెండు పాదాలు కాని ఆ శతకంలోని అన్ని పద్యాల్లో వస్తూ ఉంటాయి. దాన్ని మకుటం అంటారు. శతకాల్లోని పద్యాలు ఏ పద్యానికి ఆ పద్యం స్వతంత్రభావాన్ని కలిగి ఉంటుంది. అందుకే వీటిని ముక్తకాలు అంటారు.

ఈ పాఠంలోని పద్యాలు సుమతి శతకం, శ్రీకాళహస్తీశ్వరం శతకం, వేమన శతకం, భాస్కర శతకం, దాశరథి శతకం, నీతిశతకం, నరసింహ శతకం మరియు కృష్ణశతకం అనే శతకాలలోనివి.

## పాఠం ఉద్దేశం / నేపథ్యం

నీతిని, ధర్మాన్ని, మంచి ప్రవర్తనను, లోకం పోకడను తెలిపేవి శతకపద్యాలు. వీటిని అభ్యసించడం ద్వారా అభ్యాసకులలో సామాజిక, నైతిక, కుటుంబ, మానవీయ విలువలను పెంపొందింపజేయడం ఈ పాఠం ఉద్దేశం.

## కవుల పరిచయం



13వ శతాబ్దం

1) **సుమతి శతకం - బద్దెన :** వేములవాడ చాళుక్యరాజు భద్రభూపాలుడే బద్దెన అని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. ఈయన సుమతి శతకంతో పాటు, నీతిశాస్త్రముక్తావళి అనే గ్రంథాన్ని కూడా రాశాడు. సులభంగా అర్థమయ్యే విధంగా సరళమైన పదాలతో ఈ శతకాన్ని రాశాడు. సుమతీ! అనే మకుటంతో ఈ శతకంలోని పద్యాలు ఉంటాయి.



16వ శతాబ్దం

2) **శ్రీకాళహస్తీశ్వర శతకం - ధూర్జటి :** శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులలో ఒకరు. శివభక్తితోపాటు నైతిక, మానవీయ, ఆధ్యాత్మిక విలువలను కూడా ఈ శతకంలో చెప్పాడు. రాజులను సేవించడం నరకంతో సమానమని అనేక పద్యాల్లో ధైర్యంగా చెప్పాడు. ఈ శతకంతో పాటు శ్రీకాళహస్తీశ్వరమాహాత్మ్యం అనే ప్రబంధాన్ని కూడా రాశాడు.





17వ శతాబ్దం

3) **వేమన శతకం – వేమన :** నీతులను, లోకపు రీతులను, అలవోకగా, తేలికైన పోలికలతో, సరళమైన శైలిలో రాశాడు వేమన. వందల సంవత్సరాలుగా ఈయన పద్యాలు ప్రజల నాలుకలపై నాట్యమాడుతున్నాయి. ఈయన వందో రెండువందలోకాక అనేకవందల పద్యాలు రాసినట్టుగా తెలుస్తున్నది. ఈయన రాసిన పద్యం రాని తెలుగువాడు ఉండడు. ప్రజాకవిగా ప్రసిద్ధుడు. విశ్వదాభిరామ వినురవేమ!, వేమా! అనే మకుటాలతో ఈ పద్యాలు ఉంటాయి. ఈయన కడప జిల్లాకు చెందినవాడు.



17వ శతాబ్దం

4) **భాస్కర శతకం – మారద వెంకయ్య :** భాస్కరా! అనే మకుటంతో పద్యాలను రాశాడు. భాస్కర శతకంలోని పద్యాలకు ఒక ప్రత్యేకత ఉన్నది. పద్యంలోని మొదటి రెండు పాదాల్లో నీతిని చెప్పి తరువాతి రెండు పాదాల్లో దాన్ని సమర్థిస్తూ ఒక దృష్టాంతాన్ని చెప్పడం ఈ శతకం ప్రత్యేకత.



17వ శతాబ్దం

5) **దాశరథి శతకం – కంచర్ల గోపన్న :** కంచర్ల గోపన్న భక్తరామదాసుగా ప్రసిద్ధుడు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి వాస్తవ్యుడు. భద్రాచల రామాలయ నిర్మాణం కోసం కృషిచేసిన మహాభక్తుడు. 'దాశరథీ! కరుణాపయోనిధీ!' అనే మకుటంతో ఈ శతకంలోని పద్యాలు ఉంటాయి. ఈ శతకంతో పాటు అనేక కీర్తనలు కూడా రాశాడు.



18వ శతాబ్దం

6) **సుభాషిత రత్నావళి – ఏనుగు లక్ష్మణకవి :** భర్తృహరి సంస్కృతంలో రాసిన 'సుభాషిత త్రిశతి'ని 'సుభాషిత రత్నావళి' పేరుతో సరళంగా తెలుగులోనికి అనువదించిన కవుల్లో ఈయన ఒకడు. పద్యాల్లోని భావం, శైలివల్ల ఈ శతకపద్యాలు ప్రజల్లో చాలా ప్రచారం పొందినవి.



18వ శతాబ్దం

7) **నరసింహ శతకం – కాకుత్థ్సం శేషప్ప కవి :** ప్రజలనోళ్లలో నాట్యమాడే విధంగా సరళంగా, సుబోధకంగా పద్యాలు రాసిన కవి కాకుత్థ్సం శేషప్ప కవి. పూర్వపు కరీంనగర్, ప్రస్తుత జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన కవి. అందుకే తన పద్యాల్లో 'శ్రీధర్మపుర నివాస' అంటూ ధర్మపురిలో ఉండే నరసింహస్వామిని తలుచుకుంటూ ఈ శతకం రాశాడు. ఇదే కాక నరహరి శతకం, నృకేసరి శతకం అనే శతకాలను, ధర్మపురి రామాయణం అనే గ్రంథాన్నీ రచించాడు.



18వ శతాబ్దం

8) **కృష్ణ శతకం – కాకుత్థ్సం నరసింహదాసు :** చిన్న చిన్న పదాలతో సరళంగా, మనోహరంగా పద్యాలు రాసిన కవి కాకుత్థ్సం నరసింహదాసు. శ్రీకృష్ణుడిని స్తుతిస్తూ రాసిన ఈ పద్యాల్లో చాలా పద్యాలు పిల్లలకు చిన్న వయస్సులో నేర్పేవారు. పద్యాలు అంత సులభంగా అర్థమయ్యే రీతిలో ఉంటాయి. ధర్మపురి ప్రాంతంవాడని చరిత్రకారుల అభిప్రాయం.



# I



కం॥ బలవంతుడ నాకేమని
పలువురతో నిగ్రహించి పలుకుట మేలా
బలవంతమైన సర్పము
చలిచీమల చేతజిక్కి చావదె సుమతీ! 1

**– సుమతి శతకం, బద్దెన**



మ॥ కొడుకుల్ పుట్టరటంచు నేడ్తు రవివేకుల్ జీవన భ్రాంతులై
కొడుకుల్ పుట్టరె కౌరవేంద్రున కనేకుల్ వారిచే నేగతుల్
వడసెం, బుత్రులు లేని యాశుకునకున్ వాటిల్లెనే దుర్గతుల్
చెడునే మోక్షపదం బపుత్రుకునకున్ శ్రీకాళహస్తీశ్వరా! 2

**– శ్రీకాళహస్తీశ్వర శతకం, ధూర్జటి**



ఆ॥ అనగననగ రాగ మతిశయిల్లుచునుండు
తినగ తినగ వేము తియ్యనుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ వినురవేమ! 3

**– వేమన శతకం, వేమన**

## మీరేమి అర్థం చేసుకున్నారు?

- *'అనేక మందిని తోసిపారేసి మాట్లాడడం మంచిదా?' అనే అర్థం వచ్చే పద్యపాదం ఏది?*
- *2వ పద్యంలో కొడుకు లేదా 'కొడుకు' అనే అర్థం వచ్చే పదాలు ఎన్ని సార్లు వచ్చాయి? వాటి కింద గీతలు గీయండి.*
- *'అభ్యాసం చేస్తూ ఉంటే పనులవుతాయి' అనే అర్థం వచ్చే పద్యపాదం ఏది?*



## II



చం॥ చదువది యెంతగల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు గుణసంయుతు లెవ్వరు మెచ్చరెచ్చటం;
బదునుగ మంచికూర నలపాకము చేసిననైన నందు నిం
పొదవెడు నుప్పులేక రుచి పుట్టఁగ నేర్చునటయ్య భాస్కరా! 4

– *భాస్కర శతకం, మారద వెంకయ్య*



ఉ॥ దాసిన చుట్టమా శబరి? దాని దయామతి నేలినావు; నీ
దాసుని దాసుడా గుహుడు? తావక దాస్యమొసంగినావు; నే
జేసిన పాపమా? వినుతి సేసిన గావవు, కావుమయ్య నీ
దాసులలోన నేనొకడ దాశరథీ కరుణాపయోనిధీ! 5

– *దాశరథి శతకం, కంచర్ల గోపన్న*



శా॥ ఆరంభింపరు నీచమానవులు విఘ్నాయాస సంత్రస్తులై,
ఆరంభించి పరిత్యజింతు రురువిఘ్నాయత్తులై మధ్యముల్,
ధీరుల్ విఘ్ననిహన్యమానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థములుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్! 6

– *నీతి శతకం, ఏనుగులక్ష్మణకవి*

### మీరేమి అర్థం చేసుకున్నారు?

- 'మంచి వారు ఎప్పుడూ మెచ్చుకోరు' అనే అర్థం వచ్చే మాటలు ఏ పద్యంలో ఉన్నాయి? ఆపద్య పాదం కింద గీత గీయండి.
- 'ఎంత ప్రార్థించినా నన్ను కాపాడవు? నన్ను కాపాడు' అనే అర్థం వచ్చే పద్య పాదం ఏది?
- 'పని మొదలుపెట్టి ఆటంకాలవల్ల మధ్యలో వదిలివేసేవారు మధ్యములు' అనే అర్థం వచ్చే పద్యపాదం ఏది?

## III

సీ. తల్లి గర్భమునుండి ధనము తేడెవ్వడు
వెళ్ళిపోయెడినాడు వెంటరాదు
లక్షాధికారైన లవణమన్నమె కాని
మెరుగు బంగారంబు మ్రింగబోడు
విత్తమార్జన చేసి విఱ్ఱవీగుటె గాని
కూడబెట్టిన సొమ్ము కుడువబోడు
పొందుగా మరుగైన భూమిలోపల బెట్టి
దానధర్మము లేక దాచిదాచి



తుదకు దొంగలకిత్తురో? దొరలకౌనొ?
తేనె జుంటీగలియ్యవా తెరువరులకు
భూషణవికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురితదూర! 7

**– నరసింహ శతకం, కాకుత్థ్సం శేషప్పకవి**



కం॥ నీవే తల్లివి తండ్రివి
నీవే నాతోడు నీడ నీవే సఖుడౌ
నీవే గురుడవు దైవము
నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా! 8

**– కృష్ణ శతకం, కాకుత్థ్సం నరసింహదాసు**

### మీరేమి అర్థం చేసుకున్నారు?

- 'ధనం సంపాదించి గర్వపడుతాడు కాని ఆ ధనాన్ని అనుభవించలేడు' అనే అర్థం వచ్చే పద్యపాదాలు ఏవి?
- 'తల్లి గర్భము నుండి' అనే పద్యంలో మకుటం ఏది? దాని కింద గీత గీయండి.
- 'విత్తమార్జన చేసి విఱ్ఱవీగుటేగాని కూడబెట్టిన సొమ్ము కుడువబోడు' అంటే ఏమిటి?

## తాత్పర్యాలు

1) ఓ బుద్ధిమంతుడా! 'నేను బలవంతుడిని, నన్నెవరూ ఎదిరించలేరు' అనే గర్వంతో అనేకమందిని తోసివేసి (చులకన చేసి) మాట్లాడడం మంచిదికాదు. ఎంతో బలమైన పాము కూడా చిన్నవైన చలిచీమల చేతిలోబడి మరణిస్తున్నది కదా! (ఇందులో గర్వం పనికిరాదని చెప్పడం, ఐకమత్యం వల్ల వచ్చే శక్తి గురించి చెప్పడం జరిగింది).

2) శ్రీ కాళహస్తీశ్వరా! 'నాకు కొడుకులు పుట్టలేదే' అని తెలివిలేని వారు ఏడుస్తుంటారు. అయితే కౌరవుల తండ్రి అయిన ధృతరాష్ట్రునికి వందమంది కొడుకులు పుట్టారు. వారివల్ల ఆయనకు ఏం మేలు జరిగింది? అదే కొడుకులు లేని శుకునికి చెడు జరిగిందా? కాబట్టి కొడుకులు లేనంత మాత్రాన మోక్షం లభించదు అనే మాట అబద్ధం.

3) ఓ వేమా! పాడగా పాడగా రాగం వృద్ధి చెందుతుంది. తింటూ తింటూ ఉంటే చేదుగా ఉండే వేప కూడా తియ్యగా అనిపిస్తుంది. అభ్యాసం (ప్రయత్నం) చేస్తూ చేస్తూ ఉంటే ఎంతటి కష్టమైన పనైనా పూర్తవుతుంది.

4) భాస్కరా! ఎంత చదువు చదివినా అందులోని అంతరార్థాన్ని గ్రహించలేకపోతే ఆ చదువు వ్యర్థం. అటువంటి చదువును గుణవంతులు మెచ్చుకోరు. ఎలాగంటే ఎంతబాగా వంట చేసినా దానిలో తగినంత ఉప్పు లేకపోతే అది రుచించదు కదా!

5) శ్రీరామా! కరుణాసముద్రుడా! 'శబరి నీకు దగ్గరి చుట్టమా? ఆమెను దయతో రక్షించినావు? గుహుడు నీ సేవకులకు సేవకుడా, నీకు సేవచేసే అదృష్టం కల్పించావు? మరి నేనేం పాపం చేశాను. నిన్ను ఇంత ప్రార్థిస్తున్నా నన్ను కాపాడవు? నీ సేవకుల్లో నేను కూడా ఒకడిని. నన్ను కాపాడు.

6) ఆటంకాలు వస్తాయేమో అన్న భయంతో నీచులు ఏ పనినీ మొదలుపెట్టరు. మధ్యములేమో పనులను మొదలుపెట్టి, వచ్చే ఆటంకాలను చూసి ఆ పనులను మధ్యలోనే వదిలేస్తారు. అదే ధైర్యవంతులు తెలివైనవారు కనుక, ఎన్ని ఆటంకాలు (కష్టాలు) వచ్చినా వాటిని ఎదుర్కొంటూ, మరింత ఉత్సాహంతో తాము మొదలుపెట్టిన పనులను పూర్తిచేసి తీరుతారు.

7) తల్లి కడుపులోంచి పుట్టినప్పుడు ఎవ్వడూ ధనాన్ని వెంట తీసుకొని రాడు. పోయేటప్పుడు వెంట తీసుకొని పోడు. ఎంత ధనవంతుడైనా ఉప్పుతో కూడిన అన్నాన్నే తింటాడు కాని బంగారాన్ని మింగడు. డబ్బు సంపాదించుకొని గర్వపడడమే తప్ప, సంపాదించిన ఆ డబ్బును తినడు. దానం చేయక, ధర్మం చేయక ఎక్కడో భూమిలోపల దాచిపెట్టి, చివరికి దొంగల పాలో, రాజులపాలో చేస్తుంటాడు. ఎలాగంటే తేనెటీగలు తేనెను కూడబెట్టి కూడబెట్టి చివరకు ఏ బాటసారుల పాలో చేసినట్లుగా చేస్తుంటాడు.

8) కృష్ణా! నీవే నాకు తల్లివి, తండ్రివి, రక్షకుడవు. నా వెంట ఉండేవాడివి, నీవే నాకు స్నేహితుడివి, గురువు, దైవము కూడా. నాకు యజమానివీ నీవే. చివరకు నేను చేరేది కూడా నీ దగ్గరికే.



# భాషాసామర్థ్యాలను సాధిద్దాం!

## I. భాషాంశాలు

### పదజాలం

**అ) కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి.**

1) ప్రాణులన్ని ధరమీద నివసిస్తున్నాయి.

ఉదా : ధర = భూమి

2) పనికాకపోతే చేసిన ప్రయాణము నిరర్థకం అవుతుంది. ______

3) 1947లో బ్రిటిషువాళ్ళ దాస్యము నుండి మనం విడుదలయ్యాము. ______

4) ప్రజ్ఞానిధులు మొదలుపెట్టిన పని పూర్తిచేసి తీరుతారు. ______

5) ఇప్పుడు అందరి దృష్టి విత్తము సంపాదించడం మీదనే ఉంటున్నది. ______

6) తెలివిలేని వారు ఆటంకాలకు భయపడి మధ్యలోనే పనిని పరిత్యజిస్తారు. ______

**ఆ) కింది పదాలకు పర్యాయపదాలను రాయండి.**

ఉదా : దయ : జాలి, కరుణ

1) ధర : ______ ______

2) దాసుడు : ______ ______

3) విఘ్నము : ______ ______

4) ధనం : ______ ______

5) సఖుడు : ______ ______

**ఇ) కింది పదాలకు నానార్థాలను రాయండి.**

ఉదా : పతి : భర్త, రాజు

1) మరుగు : ______ ______

2) ధర : ______ ______

## వ్యాకరణాంశాలు

## సమాసం

**అ) కింది వాక్యాలను చదువండి.**

1) మాకు దేశభక్తి ఉన్నది.

2) సురేశ్ వేసుకున్నది తెల్లచొక్క.

3) లక్ష్మీపతి దయ నాపై ఉన్నది.

4) ఏకలవ్యుడు గురుదక్షిణ ఇచ్చాడు.

5) పావని అంగడికి పోయి కూరగాయలు తెచ్చింది.

6) మాధవునికి పది ఎకరాల పొలం ఉన్నది.

పై వాక్యాల్లో గీతగీసిన పదాలకు అర్థాలను గమనించండి.

| | | |
|---|---|---|
| దేశభక్తి | - | దేశమునందు భక్తి |
| తెల్లచొక్క | - | తెల్లనైన చొక్క |
| లక్ష్మీపతి | - | లక్ష్మి యొక్క పతి |
| గురుదక్షిణ | - | గురువు కొరకు దక్షిణ |
| కూరగాయలు | - | కూర మరియు కాయ |

పై పదాల్లో వేరు వేరు అర్థాలుగల రెండు పదాలు కలిసి ఒకే పదంగా ఏర్పడ్డాయి కదా! ఈ విధంగా అర్థవంతమైన రెండు పదాలను కలిపి కొత్తపదంగా ఏర్పడటాన్నే **'సమాసం'** అంటారు.

సమాసంలో మొదటి పదాన్ని **'పూర్వపదం'** అని, రెండవపదాన్ని **'ఉత్తరపదం'** అనీ అంటారు.

సమాసంలో ఉండే పదాల, అర్థాల ప్రాధాన్యతను బట్టి సమాసాలకు లక్షణాలు (పేర్లు) ఏర్పడ్డాయి.

## ద్వంద్వ సమాసం

**ఆ) కింది వాక్యాన్ని పరిశీలించండి.**

గురుశిష్యుల సంబంధం గొప్పది.

ఈ వాక్యంలో గురుశిష్యులు అనే మాటలో రెండు పదాలను సులభంగా గుర్తించవచ్చు. అవి గురువు, శిష్యుడు అని. ఇట్లా వివరించి చెప్పడాన్ని **'విగ్రహవాక్యం'** అంటారు. ఇందులో గురువు శిష్యుడు ఇద్దరూ ముఖ్యులే. ఇట్లా

రెండు కాని అంతకంటే ఎక్కువగాని సమప్రాధాన్యంగల నామవాచకాలు కలిసి ఒకే మాటగా ఏర్పడే సమాసాన్ని **'ద్వంద్వ సమాసం'** అంటారు.

ఇ) కింది పేరాను చదివి అందులోని ద్వంద్వ సమాస పదాలను గుర్తించి రాయండి.

ఒక ఊరిలో ఇద్దరు అన్నదమ్ములు ఉండేవారు. వారు ఇతరులకు సహాయం చేసే గుణం కలవారు. ఇతరుల కష్టసుఖాలు తెలిసినవారు. ఎవరు వచ్చి అడిగినా వారి కలిమిలేములను గురించి ఆలోచించకుండా తమకున్నంతలో దానధర్మాలు చేసేవారు. ఇట్లా జీవిస్తూ అందరి ప్రేమాభిమానాలు చూరగొని ఈ సోదరులు రామలక్ష్మణులు అన్నంత కీర్తిప్రతిష్ఠలు పొందారు.

## II. అవగాహన-ప్రతిస్పందన

అ) ఈ పాఠంలోని పద్యాలను కంఠస్థం చేయండి. వాటి తాత్పర్యాలు సొంతమాటల్లో చెప్పండి.

ఆ) మీరు చదివిన ఒక పద్యంలోని పాదాలు కింద ఉన్నాయి. కాని అవి తారుమారయ్యాయి. వాటిని సరిచేసి వరుసలో రాయండి.

బలవంతమైన సర్పము
బలవంతుడ నాకేమని
చలిచీమల చేతజిక్కి చావదె సుమతీ
పలువురతో నిగ్రహించి పలుకుట మేలా

ఇ) కింది పద్యాన్ని పూరించండి, తాత్పర్యం రాయండి

అనగ ననగ రాగ ______________ వినుర వేమ!

## III. వ్యక్తీకరణ-సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులను రాయండి.**

1) బద్దెన బలవంతుడిని పాముతో పోల్చాడు కదా! అది సరైనదేనా? ఎందుకు?

2) పనులు పూర్తిచేసే విషయంలో నీచులకు ధీరులకు గల తేడా ఏమిటి?

3) పిసినారి చేసే పనేమిటి? చివరకు వాడు పొందే ఫలితం ఏమిటి?

4) కృష్ణ శతక కర్త తనకు భగవంతుడికి గల సంబంధం ఎట్లాంటిదని చెప్పుకున్నాడు?

**ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబును రాయండి.**

1) మీరు ఈ శతకపద్యాల ద్వారా తెలుసుకున్న మంచి విషయాలేమిటి?

### సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది ప్రశ్నకు జవాబును సృజనాత్మకంగా రాయండి.**

'పిసినారియైన ధనవంతుడు తాను తినడు, ఇతరులకు పెట్టడు. చివరకు వాని సొమ్ము దొంగలపాలో దొరలపాలో అవుతుంది' అని శతక పద్యాల్లో చదువుకున్నారు కదా! ఈ విషయం వచ్చే విధంగా 12 నుండి 15 వాక్యాల్లో ఒక కథ రాయండి.

### నేను ఏయే సామర్థ్యాలు సాధించాను? (స్వీయమూల్యాంకనం)

| | | |
|---|---|---|
| 1) | పదాలకు అర్థాలు, నానార్థాలు, పర్యాయపదాలను రాయగలను. | అవును / కాదు |
| 2) | ద్వంద్వసమాస పదాలను గుర్తించగలను. | అవును / కాదు |
| 3) | పాఠంలోని పద్యాలను నోటికి చెప్పగలను. తాత్పర్యాలు రాయగలను. | అవును / కాదు |
| 4) | పద్యాన్ని పూరించగలను, తాత్పర్యం రాయగలను. | అవును / కాదు |
| 5) | శతకపద్యాల ద్వారా తెలుసుకున్న మంచి విషయాలను రాయగలను. | అవును / కాదు |
| 6) | పాఠం ఆధారంగా ఒక కథ రాయగలను. | అవును / కాదు |

**సూక్తి**

ఇతరుల్లో ఉండే లోపాన్ని కాదు, వారిలో ఉండే కొంచెం
మంచినైనా కొండంత చేసి చూడడమే గొప్పవారి లక్షణం.

– నీతి శతకం

# 13 భాగ్యోదయం

- కృష్ణస్వామి ముదిరాజ్

## సాధించాల్సిన సామర్థ్యాలు - అభ్యసన ఫలితాలు

ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఈ కింది సామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలను సాధిస్తారు.

### I. భాషాంశాలు :

అ) **పదజాలం** : ఇచ్చిన పదంతో అంత్యాక్షరి పదాలు, సొంతవాక్యాలు, పదబంధాలను వివరించి రాయగలుగుతారు.

ఆ) **వ్యాకరణాంశాలు** : ద్విగు సమాసాన్ని అర్థం చేసుకొని గుర్తించగలుగుతారు.

### II. అవగాహన - ప్రతిస్పందన :

అ) అపరిచిత గద్యాంశాలను చదివి అర్థం చేసుకొని, ప్రశ్నలకు జవాబులు రాయగలుగుతారు.

### III. వ్యక్తీకరణ - సృజనాత్మకత :

అ) **స్వీయరచన** :
- చదువుకుంటే లాభాలు, వ్యసనాలవల్ల కలిగే నష్టాలు రాయగలుగుతారు.
- ప్రజల శ్రేయస్సు కోసం భాగ్యరెడ్డివర్మ చేసిన కృషిని వివరించగలుగుతారు.
- పాఠ్యాంశానికి సంబంధించిన ప్రశ్నలకు సొంతమాటల్లో జవాబులు రాయగలుగుతారు.

ఆ) **సృజనాత్మకత** :
- 'అభినందన' వ్యాసం రాయగలుగుతారు.

## అభ్యాసకులకు సూచనలు

- పాఠాన్ని చదువండి. తెలియని పదాలను గుర్తించండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరి అకారాది పట్టికలో వెతుకండి.
- పాఠాన్ని మళ్ళీ చదివి అర్థం చేసుకోండి.
- పాఠంలో అర్థంకాని అంశాల గురించి మీ సమీపంలోని ఉపాధ్యాయులు లేదా కేంద్రంలో బోధించే వారితో చర్చించి తెలుసుకోండి.
- బాక్సులో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను పాఠంలో గుర్తించండి.



## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠ్యాంశం 'జీవిత చరిత్ర' ప్రక్రియకు చెందినది. విభిన్న రంగాలలో పనిచేస్తూ సమాజంమీద ప్రభావం చూపిన వ్యక్తుల విశిష్టతలను తెలుపుతూ రాసే గ్రంథమే 'జీవిత చరిత్ర'. భాగ్యరెడ్డివర్మ కుమారుడైన ఎం.బి.గౌతమ్ రచించిన 'భాగ్యరెడ్డివర్మ జీవితచరిత్ర' గ్రంథంలోని కృష్ణస్వామి ముదిరాజ్ రాసిన వ్యాసంలోనిది ఈ పాఠ్యభాగం.

## పాఠం ఉద్దేశం / నేపథ్యం

స్వయంకృషి, ఆత్మవిశ్వాసం ఉంటే ప్రతి ఒక్కరూ ఏమైనా సాధించగలరు. అన్ని వర్గాల వాళ్ళలో సామాజిక భాగస్వామ్యం, చైతన్యం అవసరం. స్వార్థం పెరిగిపోతున్న ప్రస్తుత సమాజంలో ఇతరుల గురించి ఆలోచించి, వాళ్ళ ప్రగతికి తోడ్పడే వ్యక్తులు అరుదు. అటువంటి వ్యక్తిత్వం నుండి స్ఫూర్తి పొందడమే ఈ పాఠం ఉద్దేశం.

## కవి పరిచయం



**25-08-1893**
**15-12-1967**

హైదరాబాద్‌లో సామాజిక రాజకీయ ఉద్యమాలకు నాందీ గీతం పలికిన చైతన్యశీలి కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్. ఈయన స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, జర్నలిస్ట్ కూడా. 1957లో హైదరాబాద్ నగరమేయర్‌గా ఎన్నికై నగరాభివృద్ధికోసం అవసరాలకనుగుణంగా 'మాస్టర్‌ప్లాన్' తయారుచేసిన దార్శనికుడు. 'దక్కన్‌స్టార్' అనే ఆంగ్లవారపత్రికను స్థాపించి సంపాదకుడిగా విలువైన సంపాదకీయాలు, వ్యాసాలను రచించాడు. హైదరాబాద్ చరిత్రను తెలుసుకోవడానికి ఈయన రచనలు ప్రామాణిక ఆధారాలు. అంతేకాదు హైదరాబాద్ నగరాన్ని ఛాయాచిత్రాల్లో వెయ్యిపేజీల్లో బంధించి 'పిక్టోరియల్ హైదరాబాద్' అనే అద్భుతమైన గ్రంథాన్ని దృశ్యరూపంగా మనకు అందించాడు.

తన మిత్రుడు భాగ్యరెడ్డివర్మతో కలిసి దళితుల అభ్యున్నతి కోసం కృషిచేశాడు. 1948లో ఉర్దూలో 'హైదరాబాద్-కి తీస్ సాలా సియాసి జదు జిహద్' పేరుతో హైదరాబాద్‌లోని రాజకీయోద్యమాలపై గ్రంథాన్ని రాశాడు. భారత ప్రభుత్వంచే 'భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర' రాసే సంఘంలో ప్యానల్ సభ్యుడిగా నియమితుడయ్యాడు.

## I

తన జాతి జనుల బాగుకోసం చిన్నప్పటి నుండే అంకితమయిన భాగ్యరెడ్డి వర్మ 1888లో పుట్టినాడు. ఆయన చిన్నప్పుడు చదువుకున్న చదువే ఆయన జీవిత గమనాన్ని నిర్దేశించింది. అంటరాని వర్గాలు అప్పటికి అనుభవిస్తున్న అవస్థల నుంచి గట్టెక్కించడానికి ఆయన అంకిత భావంతో పని చేశాడు. తాను చదివిన చదువు వల్ల కులవ్యవస్థ అంటే ఏమిటో దాని నిజస్వరూపం ఎటువంటిదో అవగతమయింది. ఇందుకు ధర్మశాస్త్రాలను, చరిత్రను బాగా చదివినాడు. వాటి వల్ల అంటరాని వర్గాల కడగండ్లను అర్థం చేసుకోవడానికి వాటిని నిర్మూలించి వారిలో సామాజిక వికాసం కలిగించడానికి ఆయనకు దారి దొరికినట్టయింది.




అత్యంత ముఖ్యమయిన ఈ పనికి సంబంధించి ఆచరణ, ఆలోచనలో ఆయన పూర్తి స్వేచ్ఛను అనుభవించాడు. స్వతంత్రంగా పని చేశాడు. ప్రభుత్వపక్షం నుంచి సైతం ఆయనకు అండ దొరికింది. అణగారిన కులాల నాయకులతో కూడా ఈ క్రమంలో పరిచయం పెరిగింది. క్రమ క్రమంగా వారి నుంచి సహకారం, నైతిక మద్దతు కూడగట్టుకున్నాడు. గొప్ప మనుషులలో, సంస్కర్తలలో ఉండే చిత్తశుద్ధిని అలవర్చుకుని ఆయన అంటరాని వర్గాల ఉన్నతి కోసం సంస్కరణ మొదలు పెట్టాడు.

ఒకవేళ హిందూమతం, హిందువులు తమ చరిత్రను లిఖిత బద్ధం చేయాలనుకుంటే సంస్కర్తగా భాగ్యరెడ్డివర్మ పేరు మొదటిస్థానంలో ఉంటుంది. అణగారినవర్గాల వికాసానికి ఆయన తన సమస్తాన్ని అర్పించాడు. తన తెలివితేటలను అందుకోసమే వెచ్చించాడు. ఏమీ ఆశించకుండా, తమకోసం ఎప్పటికీ పనిచేసే ఆయనను చూసి అంటరాని వర్గాలన్నీ ఆయనను తిరుగులేని నాయకునిగా ఒప్పుకున్నాయి.

చిత్తశుద్ధి, నిజాయితీ, పట్టుదలతో పనిచేసే వర్మ అచిరకాలంలోనే వారి నమ్మకాన్ని చూరగొనగలిగాడు. తమ దుస్థితికి కారణం తమ అజ్ఞానం, ఉదాసీనతేనన్న ఎరుకను తన అనుచరులలో కలిగేటట్లు చేయగలిగాడు.

మనుషులంతా పుట్టుకతో సమానమని, ఎవరూ ఎక్కువ, ఎవరూ తక్కువ కాదన్న సత్యాన్ని తెలుసుకునేటట్లు చేశాడు. అయితే లోలోపల జీర్ణించుకుపోయిన మూఢనమ్మకాలు అజ్ఞానాన్ని తొలగించడం అంతగా సులువుకాదన్నది తెలిసిందే. అయితే కొద్ది కొద్దిగానే అయినప్పటికీ ఆయన నిరంతర శ్రద్ధ వల్ల అంటరాని వర్గాలు చదువుపై చూపు పెట్టడం సాధ్యమైంది. ఇందువల్ల కొన్ని సాంఘిక దురాచారాలు మటుమాయం కావడం జరిగింది.

### మీరేమి అర్థం చేసుకున్నారు?

- అంటరాని వర్గాల గూర్చి అర్థం చేసుకోవడానికి భాగ్యరెడ్డి వర్మకు ఏమి ఉపకరించాయి?
- భాగ్యరెడ్డివర్మ అణగారిన వర్గాల వారి నమ్మకాన్ని ఎలా చూరగొనగలిగాడు?

## II

ఆయన అనేక బహిరంగ సభలు నిర్వహించాడు. సామాజిక స్వచ్ఛత గురించి చెప్పి తన జాతి జనులను ఏకతాటిపై నడుపగలిగాడు. ఆయన చేపట్టిన పనులలో కెల్లా మరుపురానిది దేవదాసి, వేశ్యా సంప్రదాయాలను అడ్డుకోవడం. పసివాళ్ళయిన ఆడ, మగ పిల్లలను దేవునికి వదిలి వేయడాన్ని తీవ్రంగా నిరసించాడు. తాగుడు వలన కుటుంబాలు ఎట్లా గుల్లగా మారిపోతాయో కుల పెద్దలకు ఆ మహమ్మారి గురించి చెప్పి వారిని మానిపించగలిగినాడు. నిరంతరం తన కార్యాచరణకు దొరికే సహకారంవలన ఆయన కొన్ని కుటుంబాలను ఈ దురాచారాలనుంచి బయటపడేలా చేశాడు.

ప్రతి ఏటా జరిగే మత సాంఘికసభలకు ఆయన హాజరయ్యేవారు. ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే ప్రముఖులపై ఆయన ప్రభావం ఎంతగానో ఉండేది. ఆంధ్రమహాసభ, ఆదిహిందూ మహాసభ, అఖిలభారత అంటరానివర్గాల సభ వంటి సంస్థలు జాతీయ స్థాయిలో నిర్వహించిన అనేక సభలలో ఆయన చురుకుగా పాల్గొన్నాడు. ఆయన పాల్గొన్న ప్రతి సభలో తన జాతి జనులు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులపై వివరంగా చెప్పేవాడు. ఆయన జన జీవితంలో కాలు పెట్టినదాదిగా మొత్తం 3,348 ఉపన్యాసాలు ఇచ్చినట్టు తేలింది. ఆయన అణగారిన వర్గాలలో చైతన్యాన్ని తేవడానికి కృషి చేసినాడు.

1925లో న్యాయమూర్తి రాయ్‌బాల ముకుంద్ అధ్యక్షత వహించిన ఒక సభలో హైదరాబాద్ సంస్థానంలో గల ఆది హిందువుల ప్రతినిధులంతా ఆయనను తమ మార్గదర్శకునిగా ఎన్నుకున్నారు. ఇది ఏ సామాజిక వర్గపు నాయకునికైనా గర్వకారణమవుతుంది. ఆయన 1925లో ఆదిహిందువుల ఆటల ప్రదర్శన నిర్వహించి, ఆదిహిందూ యువతీయువకులు సవర్ణ యువతీ యువకులతో సమంగా రాణిస్తారని నిరూపించాడు.

ఆది హిందువుల మేలుకోసం వర్మ నిరంతరం చేపట్టిన కార్యాచరణ ఎంతో మంది ప్రముఖుల మనసులను చూరగొని వారు ఆదిహిందువులకు దగ్గరయ్యేలా చేసింది. భాగ్యరెడ్డివర్మ నిరంతర కార్యాచరణ సభల వలన ఆదిహిందూ సమాజం జాగరూకమయ్యింది. ఆదిహిందువులు సొంతకాళ్ళ మీద నిలబడాలంటే చదువు ఒక్కటే మార్గమని వర్మ బలమయిన నమ్మకం. ఈ విషయంలో ఆయన ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి తన బాధ్యతను గుర్తించేలా చేశాడు.



కృషి, పోరాటం ఫలితంగా ప్రభుత్వం ఆదిహిందువుల కోసం ఎన్నో పాఠశాలలు నెలకొల్పింది. 1931 జనాభా లెక్కల సేకరణ సందర్భంగా వర్మ ఎంతగానో శ్రమపడి అంటరాని వర్గాలను ఆది హిందువులుగా నమోదు చేయించాడు. ఇది ఆయన నాయకత్వ పటిమకు మచ్చుతునక. హిందూ సమాజం మొత్తంగా ఆయనకు రుణపడి ఉండాలె. ఆ చర్యతో హిందూ సమాజాన్ని ఆయన చీలికలు, పేలికలు కాకుండా రక్షించగలిగాడు.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

- భాగ్యరెడ్డివర్మ ఏయే సాంఘిక దురాచారాలను రూపుమాపాడు?
- భాగ్యరెడ్డివర్మకు హిందు సమాజం ఎందుకు ఋణపడి ఉండాలి?

# భాషాసామర్థ్యాలను సాధిద్దాం!

## I. భాషాంశాలు

### పదజాలం

**అ) అంత్యాక్షరి : కింది పదం చూడండి. దానిలోని చివరి అక్షరంతో పదం రాయండి. మీరు రాసిన పదంలోని చివరి అక్షరంతో మళ్ళీ పదం రాయాలి. ఇలా ఎన్ని పదాలు రాయగలరో ప్రయత్నించండి.**

ఉదా : సభ → భవనం → నంది

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1) | పుట్టుక | → | | → | |
| 2) | | → | | → | |

**ఆ) కింది పదాలను ఉపయోగిస్తూ సొంతవాక్యాలు రాయండి.**

1) ఏకతాటిపై = ______________________
2) మచ్చుతునక = ______________________
3) మహమ్మారి = ______________________
4) నిరంతరం = ______________________

**ఇ) కింది పదబంధాలను వివరించి రాయండి.**

1) సామాజిక వికాసం = ______________________
2) అణగారిన వర్గాలు = ______________________
3) మూఢనమ్మకాలు = ______________________
4) సాంఘిక దురాచారాలు = ______________________
5) సొంతకాళ్ళపై నిలబడడం = ______________________

## వ్యాకరణాంశాలు

### ద్విగు సమాసం

**అ) కింది పదాలను పరిశీలించండి.**

| | | |
|---|---|---|
| నవరసాలు | చతుర్వేదములు | షట్చక్రవర్తులు |
| పంచపాండవులు | దశదిశలు | ఎనిమిది బొమ్మలు |

ఈ పదాలలో మొదటి (పూర్వ) పదం సంఖ్యా వాచకంగా ఉండి, రెండవ పదం (పర) నామవాచకంగా ఉంది. వీటికి విగ్రహవాక్యాలు ఇట్లా ఉంటాయి.

| | | |
|---|---|---|
| నవరసాలు | - | తొమ్మిది సంఖ్యగల రసాలు |
| చతుర్వేదములు | - | నాలుగు సంఖ్యగల వేదములు |
| షట్చక్రవర్తులు | - | ఆరు సంఖ్యగల చక్రవర్తులు |
| పంచపాండవులు | - | ఐదు సంఖ్యగల పాండవులు |
| దశదిశలు | - | పది సంఖ్యగల దిక్కులు |
| ఎనిమిది బొమ్మలు | - | ఎనిమిది సంఖ్యగల బొమ్మలు |

మొదటి (పూర్వ) పదం సంఖ్య అయితే తర్వాత (పర) పదం ఆ సంఖ్యను సూచించే నామవాచకం అయి ఉంటుంది.

**పూర్వ పదం సంఖ్యావాచకమైతే అది 'ద్విగు సమాసం'**

**ఆ) కింది సమాస పదాలకు విగ్రహ వాక్యాలను రాసి సమాసాల పేర్లను రాయండి.**

| | | |
|---|---|---|
| ఉదా: వంద సంవత్సరాలు | వంద సంఖ్యగల సంవత్సరాలు | ద్విగు సమాసం |
| 1) ఏడేండ్లు | ______________ | ______________ |
| 2) ఆరువేలగుణ్ణాలు | ______________ | ______________ |

## II. అవగాహన-ప్రతిస్పందన

**అ) కింది పేరా చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అంబేద్కర్ తల్లిదండ్రులు భీమాబాయి, రాంజీ మాలోజీ సక్‌పాల్. వీరిది మహారాష్ట్రలోని రత్నగిరిజిల్లా. రాంజీసక్‌పాల్ మధ్యప్రదేశ్‌లో ఉద్యోగం చేశాడు. అక్కడే 'మౌ' అనే గ్రామంలో పద్నాలుగవ సంతానంగా అంబేద్కర్ జన్మించాడు. అంబేద్కర్ చిన్నప్పటి నుండి పఠనాభిలాషి. ఆలోచనాపరుడు. ఎవరేమన్నా ఎదురించే ధైర్యసాహసాలు గలవాడు. అనేక అవమానాలెదుర్కొంటూనే 1907లో మెట్రిక్యులేషన్ పూర్తిచేశాడు.

ఆ సందర్భంగా జరిగిన సన్మానసభకు ప్రముఖ మరాఠీ రచయిత కేలూస్కర్ హాజరై 'గౌతమబుద్ధుని జీవిత చరిత్రను' బహుమతిగా ఇచ్చి అంబేద్కర్‌ను ఉన్నత విద్య చదివేందుకు ప్రోత్సహించాడు. ప్రపంచానికి అహింసా సిద్ధాంతాన్ని బోధించిన బౌద్ధం నుండే స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే విలువైన మాటల్ని గ్రహించానని అంబేద్కర్ ప్రకటించాడు. ఈ అంశాలు ప్రతి ఒక్కరికీ లభించిననాడే సామాజిక న్యాయం జరుగుతుందని ఆకాంక్షించాడు. పుస్తక పఠనాన్ని అమితంగా ఇష్టపడే అంబేద్కర్ ఇంగ్లాండులో చదువుకునే రోజుల్లో ప్రపంచంలోనే అతిపెద్ద గ్రంథాలయమైన లండన్ లైబ్రరీలోని గ్రంథాలన్నింటినీ చదివాడు. ఈ గ్రంథాలన్నీ చదివినవారు ప్రపంచంలో ముగ్గురే! ఆ ముగ్గురిలో ఒకరు అంబేద్కర్ కావడం దేశానికే గర్వకారణం.

న్యాయవాదవృత్తిలో ప్రవేశించి ఒకవైపు పేదలందరికీ న్యాయం అందిస్తూనే మరోవైపు అట్టడుగు వర్గాలవారి అభ్యున్నతికోసం శ్రమించాడు. బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడిగా నామినేట్ అయి వివిధ సమావేశాల్లో, కమిటీల్లో కీలకపాత్ర పోషించాడు. సమసమాజ స్థాపన కోసం కృషిచేసిన అంబేద్కర్ విద్యకు, స్వాభిమానానికి, శీలానికి అత్యంత ప్రాధాన్యమిచ్చాడు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుతోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆ రోజుల్లోనే కాంక్షించి విశ్వసించిన దార్శనికుడు అంబేద్కర్.

1) అంబేద్కర్ చిన్నప్పటి నుండి ఏయే లక్షణాలను కలిగి ఉండేవాడు?

______________________________

2) అంబేద్కర్ సన్మానసభలో కేలూస్కర్ ఏం చేశాడు?

______________________________

3) అంబేద్కర్ బౌద్ధం నుండి ఏమి గ్రహించాడు?

______________________________

4) అంబేద్కర్ దేంట్లో నామినేట్ అయి కీలకపాత్ర పోషించాడు?

______________________________

5) అంబేద్కర్‌ను ఎందుకు దార్శనికుడు అని అన్నారు?

______________________________

**ఆ) కింది పేరా చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

మహారాష్ట్రలో పుట్టిన జ్యోతిబాఫూలె బహుజనుల అభివృద్ధికి విశేషకృషి చేశాడు. దొరల దోపిడీ దౌర్జన్యాలను ధైర్యంతో ఎదుర్కొన్నాడు. పేదలందరికీ విద్య అందుబాటులోకి రావాలని ఉద్యమాలు చేశాడు. సత్యశోధక సమాజం ఏర్పాటు చేశాడు. బి.యస్.వెంకటరావు హైదరాబాద్‌లోని ఘాన్సీమండిలో పుట్టాడు. హైదరాబాదు అంబేద్కర్‌గా ప్రసిద్ధి చెందాడు. హైదరాబాదులో అంబేద్కరిజానికి పాదులు తీసి, దారులు వేశాడు. సమరోత్సాహంతో దళిత ఉద్యమాలను నడిపిన ధీశాలి. హైదరాబాద్‌లో దేవదాసీ దురాచార నిర్మూలనకు, దళితులలో విద్యాభివృద్ధికి కృషి చేశాడు.

సరైన జవాబు గుర్తించి కుండలీకరణం(బ్రాకెట్)లో రాయండి.

అ) జ్యోతిబాపూలె స్థాపించిన సమాజం పేరు ఏమిటి? ( )

అ) సత్యశోధక ఆ) సమసమాజం ఇ) నవసమాజం

ఆ) పేదలందరికీ అందుబాటులోనికి రావలిసింది. ( )

అ) డబ్బు ఆ) చదువు ఇ) న్యాయం

ఇ) దేవదాసీ దురాచార నిర్మూలనకు కృషిచేసింది. ( )

అ) జ్యోతిబాపూలె ఆ) అంబేద్కర్ ఇ) బి.ఎస్.వెంకటరావు

ఈ) జోయతిబాపూలె వేటిని ధైర్యంగా ఎదుర్కొన్నాడు? ( )

అ) మోసాలను ఆ) ఆటుపోట్లను ఇ) దోపిడి దౌర్జన్యాలను

## III. వ్యక్తీకరణ-సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులను రాయండి.**

1) చదువుకుంటే కలిగే లాభాలను తెలుపండి.

2) ప్రజలలో అసమానతలు తొలగి సమానత్వ భావన కలగాలంటే ఏం జరగాలి?

3) అంకితభావంతో పని చేయడం అంటే ఏమిటి?

4) వ్యసనాల వల్ల ఎట్లాంటి నష్టాలు కలుగుతాయి?

**ఆ) కింది ప్రశ్నలకు పది వాక్యాలలో జవాబులు రాయండి.**

1) మీ చుట్టూ ఉన్న సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలను పారదోలడానికి మీరు ఏం చేయగలరు?

(లేదా)

2) భాగ్యరెడ్డివర్మ ఆదిహిందువులకోసం చేసిన కృషిని వివరించండి.

### సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది అంశాన్ని గురించి సృజనాత్మకంగా / ప్రశంసిస్తూ రాయండి.**

1) భాగ్యరెడ్డివర్మ గురించి తెలుసుకున్నారు కదా! ఇట్లాగే సమాజం కోసం పాటుపడిన వాళ్ళలో ఎవరి గురించైనా 'అభినందన' వ్యాసం రాయండి.



## నేను ఏయే సామర్థ్యాలు సాధించాను? (స్వీయమూల్యాంకనం)

1) అంత్యాక్షరి పదాలను, ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు, పదబంధాలు రాయగలను. అవును / కాదు

2) ద్విగు సమాసాన్ని అర్థం చేసుకొని గుర్తించగలను. అవును / కాదు

3) అపరిచిత గద్యాంశాలను చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలను. అవును / కాదు

4) భాగ్యరెడ్డివర్మ ఆది హిందువుల కోసం చేసిన కృషిని సొంతమాటల్లో రాయగలను. అవును / కాదు

5) 'అభినందన' వ్యాసం రాయగలను. అవును / కాదు

### సూక్తి

మంచి సమాజం మనిషి శరీరం వంటిది. అందుకే శరీరమైనా, సమాజమైనా – అందులో ఏ ఒక్క భాగానికి బాధ కలిగినా, నివారణకు అందరూ నడుం బిగించాలి.

– వినోబాభావే

# 14 ప్రపంచ పదులు

– సి.నారాయణరెడ్డి

## సాధించాల్సిన సామర్థ్యాలు – అభ్యసన ఫలితాలు

ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఈ కింది సామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలను సాధిస్తారు.

### I. భాషాంశాలు :

అ) **పదజాలం** : పదాలకు అర్థాలను, పర్యాయపదాలను రాయగలుగుతారు.

ఆ) **వ్యాకరణాంశాలు** : అంత్యానుప్రాస అలంకారం గురించి తెలుసుకొని పాఠంలోనివి గుర్తించగలుగుతారు.

### II. అవగాహన – ప్రతిస్పందన :

అ) ఇచ్చిన అపరిచిత పద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు, రుబాయిని చదివి, యిచ్చిన వాక్యాలలోని తప్పు ఒప్పులను రాయగలుగుతారు.

### III. వ్యక్తీకరణ – సృజనాత్మకత :

అ) **స్వీయరచన** : ప్రపంచపదుల ద్వారా కవి ఇచ్చిన సందేశాన్ని సొంతమాటల్లో రాయగలుగుతారు.

ఆ) **సృజనాత్మకత** : 'ప్రపంచ పదులు' పాఠంలోని అంత్యప్రాస పదాల ఆధారంగా యిచ్చిన వచన కవితను పొడిగిస్తూ రాయగలుగుతారు.

## అభ్యాసకులకు సూచనలు

- పాఠాన్ని చదువండి. తెలియని పదాలను గుర్తించండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరి అకారాది పట్టికలో వెతుకండి.
- పాఠాన్ని మళ్ళీ చదివి అర్థం చేసుకోండి.
- పాఠంలో అర్థంకాని అంశాల గురించి మీ సమీపంలోని ఉపాధ్యాయులు లేదా కేంద్రంలో బోధించే వారితో చర్చించి తెలుసుకోండి.
- బాక్సులో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను పాఠంలో గుర్తించండి.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'ప్రపంచ పదులు' ప్రక్రియకు చెందినది. ఒక నిర్దిష్ట గేయగతిలో ఐదు పాదాలుగా సాగిపోయే మాత్రా ఛందస్సులోని ప్రక్రియ ప్రపంచపదులు. ఇది రూపం దృష్ట్యా ఐదు పాదాలుగా ఉన్నప్పటికీ, వస్తువురీత్యా లోకరీతులకు సంబంధించినది. ప్రపంచపదులు కేవలం ఛందస్సు పేరు కాదు. శబ్దలయ, భావస్పందనలు కలిగిన ఒక కొత్త అభివ్యక్తిరూపం. ప్రస్తుత పాఠ్యభాగం "డాక్టర్ సి.నారాయణరెడ్డి సమగ్ర సాహిత్యం" ఆరవ సంపుటిలోని ప్రపంచ పదులులోనిది.

## పాఠం ఉద్దేశం / నేపథ్యం

మనిషి సంఘజీవి. సమాజంలోని తోటివారిపట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలి. సామూహిక జీవనంలో నిరాశా నిస్పృహలపాలు కాకూడదు. ప్రాపంచిక అవగాహనను కల్గిస్తూ, వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే మార్గాలను చూపిస్తూ, తెలుగు కవిత్వ ప్రక్రియలో 'ప్రపంచ పదులు' సాహిత్య ప్రక్రియను పరిచయం చేయడం ఈ పాఠం ఉద్దేశం.

## కవి పరిచయం



**29-07-1931**

**12-06-2017**

పూర్వపు కరీంనగర్ జిల్లా నేటి రాజన్న సిరిసిల్ల జిల్లా, హనుమాజీపేట గ్రామంలో జన్మించిన ఆచార్య సింగిరెడ్డి నారాయణ రెడ్డి ప్రముఖ కవి, గొప్ప వ్యక్తి, సాహితీ పరిశోధకుడు, బహుభాషావేత్త, ప్రయోగశీలి.

నాగార్జునసాగరం, కర్పూర వసంతరాయలు, మధ్యతరగతి మందహాసం, ద్విపదులు, ప్రపంచ పదులు మొదలైన 70 పైగా కావ్యాలు రాశాడు. సాహితీగుబాళింపుతో సినిమాపాటలు రాశాడు. ఈయన రాసిన ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు ప్రయోగములు" అనే ప్రామాణిక సిద్ధాంతగ్రంథం ఎందరో పరిశోధకులకు మార్గదర్శనం చేస్తుంది.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖలో ఆచార్యుడుగా అధికారభాషా సంఘం అధ్యక్షుడిగా, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి, తెలుగు విశ్వవిద్యాలయానికి ఉపకులపతి (వైస్‌చాన్సలర్)గా పనిచేశాడు. భారత ప్రభుత్వంచే పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించబడ్డాడు. 'విశ్వంభర' కావ్యానికి జాతీయస్థాయిలో అత్యున్నతస్థాయి సాహితీ పురస్కారమైన 'జ్ఞానపీఠ అవార్డు'ను అందుకున్నాడు. శబ్దశక్తి, అర్థయుక్తి సి.నా.రె. కలానికి, గళానికీ ఉన్న ప్రత్యేకత.



## I

1. ఒక్క నుదుటనే పొద్దుపొడిస్తే ఎక్కడికెళుతుందీ లోకం
ఒక్క చేతనే అన్నినడిస్తే ఏమవుతుంది ప్రజానీకం
నలుగురితో శ్రుతి కలపని యోచన నడిచే నైజం భ్రాంతిసుమా!
ఏది పలికినా శాసనమైతే ఎందుకు వేరేజనవాక్యం
ఏది ముట్టినా కాంచనమైతే ఏదీ శ్రమశక్తికి మూల్యం.



2. ఏ రాపిడిలేకుండా వజ్రం ఎలా మెరుస్తుంది
ఏ అలజడి లేకుండా సంద్రం ఎలా నిలుస్తుంది
నడిపించే చైతన్యం లేనిదె నడవదు ఈ సృష్టి
ఏ ప్రేరణ లేకుండా నాదం ఎలా పలుకుతుంది
ఏ స్పందన లేకుండా హృదయం ఎలా బతుకుతుంది.



3. ఎన్ని మెట్లు ఎక్కావని కాదు ఎంత యెత్తుకెదిగావనీ
ఎన్నిమునకలేశావని కాదు ఎంత లోతు చూశావనీ
గమనం సార్థకమవుతుంది నీ గమ్యాన్ని చేరినప్పుడే
ఎన్ని సభలు తిరిగావని కాదు ఎంత బుద్ధిపెంచావనీ
ఎన్ని కృతులు చదివావని కాదు ఎంత సిద్ధిపొందావనీ

*4. బురదలోన వుంటున్నా తరగదు పద్మం విలువ
తాటాకున పడివున్నా తగ్గదు పద్యం విలువ
అసలు సిసలు పసవుంటే అవరోధించేదెవరు
అరసికులేమంటున్నా చెరగదు గానం విలువ
మూర్ఖులు ముంచేస్తున్నా మునగదు జ్ఞానం విలువ

### మీరేమి అర్థం చేసుకున్నారు?

- 'నడిపించే చైతన్యం లేనిదే నడవదు ఈ సృష్టి' అని చెప్పడానికి కవి వేటిని ఉదాహరించాడు?
- 3వ కవితలో వాక్యాల చివరవచ్చే 'ఎదిగావనీ, చూశావనీ, పెంచావనీ, పొందావనీ వంటి పదాలను ఏమంటారు? పాఠంలోని ఇటువంటివి మరికొన్నింటిని గుర్తించండి.



II



*5. కరగనిదే కొవ్వొత్తికి కాంతి ఎలా పుడుతుంది
చెక్కనిదే శిలకడుపున శిల్పమెలా పుడుతుంది
ఫలితం అందేది తీవ్రపరిణామంలోనె సుమా
మరగనిదే నీరు ఎలా మబ్బు రూపుకడుతుంది
నలగనిదే అడుగు ఎలా నటన రక్తి కడుతుంది.

6. ఎంత దున్నినా మట్టికి ఎప్పుడైన కలత వున్నదా
ఎంత ఉరికినా ఏటికి ఎప్పుడైన నలత వున్నదా
అంతలోనె ఉసూరంటు అలసిసొలసిపోతున్నారా?
ఎంత ఎగిసినా నింగికి ఎప్పుడైన కొరత వున్నదా
ఎంత పీల్చినా గాలికి ఎప్పుడైన కోత వున్నదా?



7. పక్షిరెక్కలకు మబ్బులు గొడుగులు పట్టినప్పుడే సార్థక్యం
పారేయేటికి పైరుగొంతులో పాడినప్పుడే సార్థక్యం
ఏ లక్ష్యానికి కట్టుపడక బతుకీడ్చుకుపోతే ఏం లాభం?
నేర్చిన చదువుకు జాతి జాతకం మార్చినప్పుడే సార్థక్యం
కట్టుబానిసకు సంకెళ్ళు మట్టిగరిచినప్పుడే సార్థక్యం.

8. ఈ చెట్టును చూసిన మరునిమిషం ఆ మట్టినికాస్తా తలచుకో
ఈ గట్టును చేరిన మరునిమిషం ఆపుట్టినికాస్తా తలచుకో
నువ్వెంతటి యెత్తుల్లో వున్నా జన్మించిన సంచిని మరవకోయ్
ఈ మేడను ఎక్కిన మరునిమిషం ఆ మెట్లను కాస్తా తలచుకో
ఈ గద్దెను ఏలిన మరునిమిషం ఆ సుద్దులుకాస్తా తలచుకో.

### మీరేమి అర్థం చేసుకున్నారు?

- 'ఫలితం అందేది తీవ్రపరిణామంలోనే' అని చెప్పడానికి కవి వేటిని పేర్కొన్నాడు?
- కవి ఎవరెవరిని, ఎప్పుడు, కాస్తా తలచుకోమంటున్నాడు?

## తాత్పర్యాలు

1) సూర్యుడు ఉదయించిన చోటనే వుంటే లోకం ముందుకు సాగదు. ఒక్కడివల్లనే అన్నీ జరగవు. కోట్ల ప్రజల అవసరాలు తీరవు. నలుగురిని కలుపుకుపోని ఆలోచనలు, నడిచేవిధానం పనికిరాదు. ఏది మాట్లాడితే అదే చట్టంగా మారితే ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఏముంటుంది? (వుండదు)? ఎవరేది పట్టుకుంటే అది బంగారమైనప్పుడు శ్రమశక్తికి విలువ వుండదు. పరస్పర సహకారంతోనే మానవ జీవితం ఫలవంతమవుతుంది.

2) సానబట్టకుండా వజ్రం ప్రకాశించదు. ఎగసిపడే అలలులేని సముద్రాన్ని ఊహించలేం. నడిపించే చైతన్యం ఉండడంవల్లనే ఈ సృష్టి నడుస్తుంది. నాదం పలకాలంటే ప్రేరణ జరగాలి. ఏకదలికలూ లేనపుడు హృదయం జీవించలేదు. ఇతరుల బాధలపట్ల స్పందించనపుడు అది హృదయం కాదు. హృదయానికి స్పందన కావాలి.

3) ఎంత ఎత్తుకు చేరుకున్నామో ముఖ్యంకాదు. ఎంత ఉన్నతి సాధించామో ముఖ్యం. నీళ్ళలో మునిగితేలడం కాదు, దానిలోతు కనుక్కోవాలి. అనుకున్న గమ్యం చేరినప్పుడే ప్రయాణానికి ఒక అర్థం వుంటుంది. ఎన్ని సభలలో పాల్గొన్నామన్నసంగతి కంటే, ఎంత వివేకాన్ని పెంచుకున్నామన్నదే ముఖ్యం. ఎన్ని పుస్తకాలు చదివామన్నదాని కన్నా, ఎంత జ్ఞానం సంపాదించామనేదే ప్రధానం. చేసిన శ్రమకు తగిన ఫలితాన్ని మనిషి పొందాలి.

4) బురదలో పుట్టినంత మాత్రాన పద్మానికి విలువ తగ్గదు. తరాలుగా తాటాకులమీదనే ఉన్నప్పటికినీ పద్యానికి విలువతగ్గదు. అసలు సిసలు శక్తివున్నప్పుడు, దాన్ని ఎవరూ అడ్డుకోలేరు. రసికత తెలియనివారు ఆదరించకపోయినా గానం (పాట) విలువతగ్గదు. మూర్ఖులు ఎన్ని విధాలుగా ప్రయత్నించి అడ్డగించినా జ్ఞానం విస్తరణను ఆపలేరు. నిజమైన ప్రతిభకు, కళకు ఎప్పుడైనా శాశ్వతవిలువ, గుర్తింపు లభిస్తుంది.

5) కొవ్వొత్తి కరిగితేనే కాంతి నివ్వగలుగుతుంది. రాయిని చెక్కినప్పుడే శిల్పంగా మారుతుంది. తీవ్రమైన మార్పులకు సిద్ధమైనప్పుడే ఫలితం దక్కుతుంది. ఎండవేడికి బాగా కాగిన నీరే ఆవిరై మబ్బుగా మారుతుంది. నాట్యమైనా, మరేదైనా ఆదరించబడాలంటే నిత్యం సాధన చేయాలి. కష్టపడడం ద్వారానే ఏ విజయమైనా, ఫలితమైనా వస్తుంది.

6) తరతరాలుగా మట్టిని దున్నుతున్నప్పటికినీ అది బాధపడదు. అలాగే ఎల్లప్పుడూ పరవళ్ళు తొక్కుతూ ప్రవహించే ఏటికి కూడా అనారోగ్యం ఉండదు. మరి యీ కొద్ది ప్రయాణానికే అలసిపోయే మానవులారా! ఆలోచించుకోండి. ఎంత ఎత్తుకు ఎగిరినప్పటికీ ఆకాశానికి అంతు ఉండదు. ప్రాణికోటి ఎంత పీల్చుకుంటున్నా గాలికి కరువు ఉండదు. మనిషి కూడా ఇటువంటి చైతన్యంతో ఉన్నతమైన లక్ష్యం కోసం కృషిచేయాలి.



7) పక్షివంటి అల్పప్రాణులకూ నీడ ఇచ్చినప్పుడే మబ్బులకు ఒక ప్రయోజనం ఉంటుంది. పైరు పండటానికి పొలాలలో పారినప్పుడే ఏటి నీటికీ ప్రయోజనం కలుగుతుంది. ఏ విధమైన లక్ష్యాన్ని పెట్టుకోకుండా సాదాసీదాగా బతుకుతూపోతే ఏమి ఉపయోగం? మానవ జీవితాలకు మేలు కలిగించినప్పుడే నేర్చుకున్న చదువుకు ప్రయోజనం. వెట్టిచాకిరి బంధనాలు తెగిపోయినప్పుడే, కష్టజీవుల బతుకులకు ప్రయోజనం దక్కినట్లు. స్వార్థాన్ని వదిలిపెట్టి ఇతరులకు ఉపయోగపడినప్పుడే మనిషి జీవితం సార్థకం అవుతుంది.

8) ఈ పచ్చని చెట్టును చూసిన వెంటనే, దాని పుట్టుకకు కారణమైన మట్టిని ఒకసారి తలచుకోవాలి. ఈ గట్టుకు చేరిన తక్షణమే నిన్ను దరికి చేర్చిన పుట్టిని (నదిని దాటడానికి వెదురుతో అల్లిన పెద్ద గంప వంటి సాధనం) తలచుకోవాలి. నువ్వు ఎంతటి ఉన్నతస్థితిలో ఉన్నప్పటికీ నీకు పుట్టుకనిచ్చిన తల్లిని మరచిపోకూడదు. గొప్ప భవంతులలో నివసిస్తున్నా, ఆ భవంతిలోనికి నిన్ను చేర్చేవి మెట్లేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. పాలకునిగా మారిన మరో నిమిషంలోనే ఇచ్చిన హామీలను కాస్త గుర్తుతెచ్చుకోవాలి, వాటిని నెరవేర్చాలి. జీవితంలో కృతజ్ఞతకు ఉన్న విలువను తెలుసుకోవాలి.

# భాషాసామర్థ్యాలను సాధిద్దాం!

## I. భాషాంశాలు

### పదజాలం

**అ) కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి.**

1) మా ఊరి చెరువు <u>గట్టు</u>మీద నిలువెత్తు తాటిచెట్లున్నాయి. ____________

2) శిల్పి చేతిలోపడిన <u>శిల</u> దేవతారూపమై పూజలందుకుంటుంది. ____________

3) అభ్యర్థులు ఓట్లకోసం జనం దగ్గర ఎన్నో <u>సుద్దులు</u> చెపుతారు. ____________

**ఆ) కింది వాక్యాలలోని పదాలలో పర్యాయపదాలను గుర్తించండి. వాటి కింద గీత గీయండి.**

1) పాఠశాల ఆవరణలో పెద్ద పిల్లలు పరుగు బెడుతున్నారు, వారితోపాటు చిన్న పిల్లలూ ఉరుకుతున్నారు.

2) మాటలలో పసలేనప్పుడే చేతుల శక్తిని చూపుతారు కొందరు.

3) కాంచనం చాలా విలువగలది. కాబట్టే తల్లిదండ్రులు తమ పిల్లల్ని బంగారం అంటారు.

## వ్యాకరణాంశాలు

### శబ్దాలంకారాలు (అంత్యానుప్రాస)

ఇ) కింది వాక్యాలను పరిశీలించండి. ప్రత్యేకతను గుర్తించండి.

........... ఎక్కడికి వెళుతుందీ లోకం

........... ఏమవుతుంది ప్రజానీకం

పై పాదాల చివర ఒకే అక్షరం ఉంది కదా! అలా అక్షరాలు మళ్ళీ మళ్ళీ రావడాన్ని పునరుక్తం కావడం అంటారు.

| పదాల, పాదాల, వాక్యాల చివరలో అక్షరాలు పునరుక్తమైతే అది 'అంత్యానుప్రాసాలంకారం'. |
|---|

❖ పాఠంలోని అంత్యానుప్రాసాలంకార పంక్తులను గుర్తించి రాయండి.

## II. అవగాహన-ప్రతిస్పందన

అ) పువ్వు గుర్తుగల 'ప్రపంచ పదులు' ను కంఠస్థం చేయండి. వాటి భావాలను సొంతమాటల్లో చెప్పండి.

ఆ) కింది పద్యాన్ని చదువండి.

ఈ పద్యం ఉత్పల సత్యనారాయణాచార్య రచించిన 'ఉత్పలమాల' శతకంలోనిది. ఈయన ఖమ్మం జిల్లా చింతకానిలో జన్మించారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కూడా! ఈయన బాలసాహిత్యంలోనూ విశేష కృషిచేశారు.

అనయము దోషమే పరులయందు కనుంగొని పల్కునట్టి యా
జనుని కొగిన్ గుణగ్రహణశక్తి నశించును; మంచి మాత్రమే
జనములలోన చూడగల చక్కని చూపులు పల్కునాల్క నా
కెనయగనిమ్ము వేంకటపతీ! అఖిలాండపతీ! శ్రియఃపతీ!

పై పద్యం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1) పై పద్య రచయిత ఎవరు? పద్యం దేనిలోనిది?

2) ఎల్లప్పుడూ ఇతరుల తప్పులే వెతికే వారికి కలిగే నష్టాలేమిటి?

3) ఈ పద్యంలో కవి తనకు దేవుణ్ణి ఏమివ్వమని కోరుతున్నాడు?

4) 'శ్రియఃపతీ' అనగానేమి?



**ఇ) కింది 'రుబాయి'ని చదువండి.**

ఈ 'రుబాయి' సామల సదాశివ రచించిన 'అమ్జద్ రుబాయిలు' లోనిది. ఈయన సంస్కృతం, హిందీ, ఆంగ్లం, ఉర్దూ, పార్శీ, మరాఠీ భాషల్లో పండితుడు. పూర్వపు ఆదిలాబాద్ జిల్లా నేటి కుంరంభీం జిల్లాలోని దహెగామ్ మండలం తెనుగు పల్లెలో జన్మించాడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే ఉత్తమ అనువాద పురస్కారం పొందాడు.

ఫలము వలదేని విత్తనమలికి చూడు
పడయఁదలచిన సర్వంబు విడిచి చూడు
మొక్క సారి స్వార్థము వీడి యొరుల వాడ
వై సమములేని యానంద మంది చూడు.

**పై విషయం ఆధారంగా తప్పు (✗) / ఒప్పు (✓) లను గుర్తించండి.**

1) పంట కావాలంటే విత్తనం నాటాలి. ( )

2) స్వార్థం కలిగివుంటే నిజమైన ఆనందం లభిస్తుంది. ( )

3) అనుకున్నది సాధించాలంటే త్యాగాన్ని ప్రదర్శించాలి. ( )

## III. వ్యక్తీకరణ-సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులను రాయండి.**

1) సి.నారాయణరెడ్డి గారి గురించి రాయండి.

2) అసలు సిసలు శక్తిని ఎవరూ అడ్డుకోలేరని చెప్పడానికి కవి చూపించిన ఆధారాలేమిటో రాయండి.

3) కొద్ది ప్రయాణానికే అలసిసొలసిపోయే మానవులు వేటిని చూసి స్ఫూర్తిపొందాలి?

4) 'గమనం', 'గమ్యం' అంటే ఏమిటి? ఇవి వ్యక్తులకు ఎలా అవసరమో తెలుపండి.

**ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబును రాయండి.**

1) 'ప్రపంచ పదులు' పాఠం ద్వారా కవి అందించే సందేశం ఏమిటో వివరించండి.

## సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది ప్రశ్నకు జవాబును సృజనాత్మకంగా రాయండి.**

'ప్రపంచ పదులు' లోని అంత్యప్రాసల ఆధారంగా యిచ్చిన ఈ వచన కవితను పొడిగిస్తూ రాయండి.

మట్టిని చీల్చుకొని ఓ మొక్క పుడుతుంది

చెట్టుగా ఎదిగి నీకు ఒక గూడు కడుతుంది

______________________________ మెరుస్తుంది

______________________________ నిలుస్తుంది

______________________________ పలుకుతుంది

______________________________ బతుకుతుంది

## నేను ఏయే సామర్థ్యాలు సాధించాను? (స్వీయమూల్యాంకనం)

| | | |
|---|---|---|
| 1) | పదాలకు అర్థాలు, పర్యాయపదాలు రాయగలను. | అవును / కాదు |
| 2) | అంత్యానుప్రాస అలంకారాన్ని అర్థంచేసుకొన్నాను, గుర్తించగలను. వాక్యాలలోని సమాసాలను, పాఠంలోని ప్రాసపదాలు గుర్తించగలను. | అవును / కాదు |
| 3) | అపరిచిత పద్యం, రుబాయిలను చదివి అర్థంచేసుకోగలను. ప్రశ్నలకు జవాబులు, తప్పొప్పులను రాయగలను. | అవును / కాదు |
| 4) | ప్రపంచపదుల ద్వారా కవి ఇచ్చిన సందేశాన్ని రాయగలను. | అవును / కాదు |
| 5) | 'ప్రపంచ పదులు' పాఠంలోని అంత్యప్రాస పదాల ఆధారంగా వచన కవితను పొడిగించగలను. | అవును / కాదు |

### సూక్తి

అందరిలోనూ మంచిని చూడటం నేర్చుకుంటే

మనలోని మంచి పెరుగుతుంది.

– రామకృష్ణ పరమహంస

# 15 సీతమ్మగారి సీమ ప్రయాణం

- పాకాల యశోదారెడ్డి

## సాధించాల్సిన సామర్థ్యాలు - అభ్యసన ఫలితాలు

ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఈ కింది సామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలను సాధిస్తారు.

### I. భాషాంశాలు :

అ) **పదజాలం** : సొంతవాక్యాలు రాయడం, జాతీయాలను సరైన వివరణలతో జతపరచడం వంటివి చేయగలుగుతారు.

ఆ) **వ్యాకరణాంశాలు** : వృత్త్యనుప్రాస అలంకార లక్షణాల్ని అర్థం చేసుకోగలుగుతారు.

### II. అవగాహన - ప్రతిస్పందన :

అ) అపరిచిత గద్యం చదివి ప్రశ్నలు తయారుచేయగలుగుతారు.

ఆ) ఆత్మకథ భాగాన్ని చదివి వివరణలతో పూరించగలుగుతారు.

### III. వ్యక్తీకరణ - సృజనాత్మకత :

అ) **స్వీయరచన** : ఇచ్చిన ప్రశ్నలకు, సీతమ్మ మనస్తత్వాన్ని గురించి సొంతవాక్యాల్లో రాయగలుగుతారు.

ఆ) **సృజనాత్మకత** : హాస్యసంఘటన గురించి వివరిస్తూ మిత్రునికి లేఖ రాయగలుగుతారు.

## అభ్యాసకులకు సూచనలు

- పాఠాన్ని చదువండి. తెలియని పదాలను గుర్తించండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరి అకారాది పట్టికలో వెతుకండి.
- పాఠాన్ని మళ్ళీ చదివి అర్థం చేసుకోండి.
- పాఠంలో అర్థంకాని అంశాల గురించి మీ సమీపంలోని ఉపాధ్యాయులు లేదా కేంద్రంలో బోధించే వారితో చర్చించి తెలుసుకోండి.
- బాక్సులో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను పాఠంలో గుర్తించండి.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం కథానిక ప్రక్రియకు చెందినది. జీవితంలోని అనుభవాలను, అనుభూతులను, కొన్ని సంఘటనల మధ్య సంబంధాన్ని కళాత్మకంగా చిత్రించే వచనప్రక్రియ కథానిక. కథనం, సంభాషణలు, శిల్పం వంటి లక్షణాలతోపాటు సంక్షిప్తంగా ఉండడం కథానిక ప్రత్యేకత.

ఒక సాధారణ మధ్యతరగతి గృహిణి మనస్తత్వాన్ని తెలిపే కథ ఇది. ఈ పాఠం పాకాల యశోదారెడ్డి రాసిన 'ధర్మశాల' కథా సంపుటిలోనిది.

## పాఠం ఉద్దేశం / నేపథ్యం

అమెరికా వంటి పాశ్చాత్య దేశాలకు వెళ్లడాన్ని గొప్పగా జనం భావించేవారు. అమెరికా వెళ్లాల్సి వచ్చిన ఓ మధ్యతరగతి మహిళపడే ఆరాటం, సందడిని ఈ కథలో చిత్రించింది రచయిత్రి. పెద్దగా చదువుకోని, ఎప్పుడూ పరాయి దేశాలకు వెళ్లని ఒక సాధారణ గృహిణి చేసే హడావుడి ఎట్లా ఉంటుందో హాస్యంతో మేళవించి చెప్పడం ఈ పాఠం ఉద్దేశం.

## కవి పరిచయం



08-08-1929
07-10-2007

పాకాల యశోదారెడ్డి పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లా ప్రస్తుత నాగర్‌కర్నూలు జిల్లాకు చెందిన రచయిత్రి. ఈమె స్వగ్రామం బిజినేపల్లి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీవిరమణ పొందింది. ఈమె 'తెలుగులో హరివంశాలు' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ (పిహెచ్.డి.) పట్టా పొందింది. ధర్మశాల, మావూరి ముచ్చట్లు, ఎచ్చమ్మ కథలు వంటి కథాసంపుటాలను, ఆంధ్రసాహిత్య వికాసం, పారిజాతాపహరణ పర్యాలోచనం, వంటి పరిశోధనా గ్రంథాలను, ఎన్నో పరిశోధనాత్మక వ్యాసాలను రాసింది. తెలంగాణ సామాజిక, సాంస్కృతిక జీవనాల్ని ప్రతిబింబింపజేసే కథల్ని ఎన్నో రాసింది తెలంగాణ సౌందర్యాన్ని ఈమె కథల ద్వారా తెలుసుకోవచ్చు. యశోదారెడ్డి అధికార భాషా సంఘం తొలి మహిళా అధ్యక్షురాలిగా పనిచేసింది. అప్పట్లో ఈమె రేడియో ధారావాహిక కార్యక్రమం 'మహాలక్ష్మి ముచ్చట్లు' ద్వారా బహుళ ప్రచారం పొందింది.



# I

సీతమ్మ దంపతులు సీమ వెళ్తున్నారు. ఎంత అదృష్టం!

నిజమే! పెట్టిపుట్టిన జన్మలు! అందరికీ దక్కుతుందా ఈ వైభోగం?

'అవును! ఏరుదాటి అవతలికి వెళ్లలేం. సముద్రాలు దాటి పాతాళలోకం లాంటి అమెరికా దేశం అంటే మాటలా? దేనికైనా పెట్టిపుట్టాలి!' అనుకుంటున్నారు చుట్టూ చేరిన అమ్మలక్కలు.

ఇల్లంతా పెళ్లి వాతావరణం నిండుకుంది. అందరూ గలగలమంటూ తలో మాట అడ్డుతున్నారు. అందరికీ సమాధానంగా సీతమ్మ వరసలు కల్పుతూ "ఇంత దూర ప్రయాణమంటే మాటలా? ఎన్ని సర్దుకోవాలి? సమయానికి రెండో కోడలు ఇంట్లో లేదు. ఆవిడ పుట్టింటినించి వచ్చేవరకు నేనిలా కాళ్లుచాపుకు కూచుంటే అవతల పనులేం కావాలి? ఆ ఇంతకూ అసలు విషయం మరిచాను, సిద్ధాంతిగారిని వో మాటిలా రమ్మని కబురు పెట్టాలి. దూర ప్రయాణం, క్షేమంగావెళ్లి లాభంగా వచ్చేట్టు ఉండాలికదా!"

ఇంతలో మరో చెలికత్తె "సీతా! పచ్చళ్ల సంగతేం చేశావ్" అంటూ ప్రశ్నించింది.

"అన్నీ సిద్ధంగానే ఉంచాను. ఆ దేశంల జనం పచ్చడికి మొహం వాచి వుంటారంటూ విని కాస్త ఎక్కువ రకాలే పెట్టాను. అవన్నీ సర్దుకోవాలి. అవే అయిదు జాడీలయ్యాయి."

"అవును మరి! సీతమ్మ పచ్చళ్లంటే మాటలా? ఈ పచ్చళ్ల రుచిగనక అక్కడి మనవాళ్లు చూచారంటే? నోటి తుప్పుడుల్లంగా ఆ పచ్చడి రుచి చూచిన ప్రతినోటా సీతమ్మ మాటే రావాలి" అన్నారు మరో ఇద్దరు.

"అట్లని కాదులెండి!" అంది సీతమ్మ.

మరో పెద్దావిడ అందుకొని "సీతా! ఎన్నైనా చెప్పు; నీ చేతి మహత్తు ఉంది చూశావూ! అది అందరికీ రాదు. ఆ వొడుపూ, నేర్పూ నీ ప్రత్యేకతలు. అయినా నీది ఈనాటి అనుభవం గనకనా?" అంటూ వుంటే సీతమ్మ ఏదో మరిచినట్లు ఏదో జ్ఞాపకం చేసుకుంటూ, "మరిచాను, పచ్చళ్లకు తోడు కొన్నిరకాల కారప్పొళ్లూ అవి పట్టుకెళ్లాలి. సున్నివుండలూ, అరిసెలు, కారప్పూసా అది మా వియ్యంకురాలు అప్పటికప్పుడు చేసి తాజాగా పంపుతానంది. ఇకవాటి చింత నాకు అట్టేలేదు" అంటూ లేచి వంటింట్లోకి నడిచింది.

ఒక్కొక్కరే సీతమ్మను కలిసివత్తామంటూ బయలుదేరారు. వచ్చినవాళ్లు ఉత్త చేతుల్తో రాలేదు సుమా! వాళ్లూ అక్కడున్న తమవారికంటూ పచ్చళ్లూ, గాజులూ, బ్లౌజులూ, మిఠాయిలు డబ్బాల్లో నింపుకొని, అడ్రసూ టెలిఫోను నంబర్లతో సహా వచ్చి సీతమ్మగారిని అభినందిస్తూ, కారప్పూస తిని, కాఫీతాగి, సీతమ్మగారు ఆ చలిదేశంలో పాటించాల్సిన భద్రతల గూర్చి వుచిత సలహాలిచ్చి మరీ వెళ్తున్నారు.

సీతమ్మలో తొలిసారిగా గర్వరేఖ తొంగి చూసింది. తాను ఇలా ఇంపార్టెంట్ వ్యక్తినంటూ ఫీలైపోతూ వుంది. ఈ సామాన్లన్నీ ముందటి వసారా చాలక పడకగది దాకా వ్యాపించాయి. తానంటే అందరికీ ఎంత ఆప్యాయత! ఎంత అదీ ఇదీ అంటూ సంబరపడిపోయింది.

ఈ విధంగా సీతమ్మ వో రెండు వ్యాన్లకు సరిపోయే సామాన్లని విదేశీ ప్రయాణానికంటూ తనవెంట తీసుకెళ్లడానికి సిద్ధపరిచింది. చివరకు ఇంటి నుంచి బయలుదేరే ముహూర్తం సమీపించింది.

ఈ సామానంతా చూచి పాపం ఆనందరావు నిజంగానే హడలిపోయాడు. ఇందులో పదోవంతుకూడా పట్టుకెళ్లడానికి వీల్లేదన్నాడు.

సీతమ్మ మూతి తిప్పుతూ, ముక్కు చీత్తూ "మీరలా అంటే పదిమందిలోనూ నా పరువేం కాను? భద్రంగా తీసుకెళ్లుతానంటూ మాటిచ్చాను. ఇంత బ్రతుకూ బ్రతికి, చివరకు సీతమ్మ మాట తప్పింది అనే నడికి నన్ను అర్హురాలిని చేస్తున్నారు. అయినా నాకు తెలియక అడుగుతాను మన వాడకట్టంత విమానం కదా? యీ మాత్రం బరువు మోయలేదా ఏం? అంతగా డబ్బుకు ఆశపడితే వో వందరూపాయలు చేతిలో పెడితేపోలా?" అంటూ మొదలుపెట్టింది.

విషయం అంతా గ్రహించిన సీతమ్మ తమ్ముడు కలుగజేసుకుంటూ "అక్కా! నీవు వూర్కో! ఈ సామానంతా నీవెంబడే వస్తుంది, కానీ నీ పక్కనే ఉండదు. సామాన్లు పెట్టే చోట ఉంటుంది. మీరు వెళ్లండి. ఆ తరువాత నేను పంపిస్తాగా" అంటూ సమాధానపరిచాడు. ఆనందరావు బావమరిది చలాకీతనాన్ని లోలోపలే మెచ్చుకున్నాడు.

సీతమ్మ ఆనందరావులు కలిసి మురుస్తూ బయలుదేరి వెళ్లారు. అమెరికాకు పోయే విమానం తెల్లవారుఝామున బొంబాయి నుండి మూడున్నర గంటలకు బయలుదేరుతుంది.

ఏమైతేనేం అపురూపమైన ఆ ఘడియలు రానేవచ్చాయి. చెకింగ్ అదీ పూర్తిచేసుకొని దంపతులిద్దరూ ప్లేన్ ఎక్కి కూర్చున్నారు. ప్లేను కొంతదూరం భూమ్మీద కదిలినట్టే కదిలి ఝూం అంటూ లేస్తూ తరతరాలుగా స్పీడు అందుకొని స్థిమితంగా, వింతగా, కదలిక లేకుండా ప్రయాణిస్తూంది.

ఇంతలో ఏర్‌హోస్టెస్ కాఫీ అందిస్తూ వచ్చింది. ఈ కాఫీ గట్రా తాగేలోపు ఓమారు సామాను గదిలోకివెళ్లి తన పచ్చళ్ల ఐదుజాడీల్లో నూనే అదీ వొలికి పోకుండా జాగ్రత్తగా ఉన్నాయో లేదో చూసుకోవాలి అనే తాపత్రయాన్ని పక్కనున్న భర్తకు తెల్పింది. ఆనందరావుకి నవ్వూ, కోపం రెండూ వచ్చాయి. కానీ భార్య అమాయకతకు నవ్వుకుంటూ లాలింపుగా "ఓసి పిచ్చిదానా! సామానుల గదికి తాళం వేసి వుంచుతారు. ఆ తాళపు చెవి పెద్ద పైలట్ చేతిలో ఉంటుంది. దాన్ని ఆయన ఎవ్వరికీ ఇవ్వరు. మన అందరి సామాన్లూ జాగ్రత్తగా ఉంటాయ్!" అంటూ బుకాయించి సమాధానపరిచాడు.





సీతమ్మ సంతృప్తిగా, సంతోషంగా నిద్రలోకి జారుకుంది. ఈలోపు లండన్ చేరుకున్నారు.

### మీరేమి అర్థం చేసుకున్నారు?

- అమెరికా ప్రయాణానికి సిద్ధమైన సీతమ్మ ఏమేమి తీసుకెళ్లడానికి ఏర్పాట్లు చేసుకుంటుంది?
- ప్లేను ఎక్కిన సీతమ్మ దేనిగురించి తాపత్రయ పడింది?

## II

కొంత విశ్రాంతి తర్వాత తిరిగి బయలుదేరిన విమానం అమెరికావైపు వెళ్లుతూ వుంది.

సీతమ్మ కిటికీలోంచి చూస్తూంది. భూమ్యాకాశాలకు భేదమే తెలియడంలేదు. "ఏమిటండీ... ఇక్కడ భూమి ఏదీ? ఆకాశం ఏదీ?" అంటూ అడిగింది.

"మనం ఇప్పుడు ఆరుగంటలు సముద్రంపైనే ప్రయాణం చేయాలి. ఇప్పుడు మన విమానం మేఘాలకన్నా ఎత్తుగా ఎంతో వేగంగా ప్రయాణిస్తూ వుంది. ఆ కారణంగానే నీకు అంతా మహార్ణవంలా గోచరిస్తూంది. భగవంతుడు కళ్లు యిచ్చినందుకు ఈ దృశ్యం చూసి ఆనందించు" అన్నాడు స్విట్జర్లాండు మంచు పర్వతాలు చూపిస్తూ.

తాము విమానంలో సముద్రంపై ప్రయాణం చేస్తున్నామంటూ భర్త చెప్పగానే 'అయ్యో! ఏదైనా దెబ్బతగిలి జాడీ పగిల్తే పచ్చడి కాస్తా నీళ్లపాలౌతుందేమో?' అంటూ వో లిప్తకాలం సీతమ్మ ఆలోచన అటుమళ్లించింది. ఈలోపు మరో సందేహం వచ్చి అడిగింది. "ఏవండీ! మనం ఏదారీతెన్నూ లేని అఖండమైన సముద్రంపై ప్రయాణం చేస్తున్నాం కదా! కాలం కలిసిరాక విమానానికి ఏదైనా జరిగితే ఎలా దిగడం? ఎక్కడ అడుగు మోపడం?" అంటూ ప్రశ్నించింది భర్తను.

ఆ ప్రశ్నవిని ఆనందరావు కోపగించుకోలేదు. "పిచ్చిదానా! విమానానికి ఏ ప్రమాదమూ జరక్కూడదు. ఒకవేళ జరిగిందీ అంటే భూమికీ, సముద్రానికీ భేదం అంటూ వుండదు. ఇంత పై నుండి కూలినప్పుడు మధ్యలోనే ప్రాణాలు 'హరీ'మంటూ పంచభూతాల్లో కలిసిపోతాయి. శరీరావశేషాలు తునాతునకలై ఎక్కడపడ్తాయో? అందుకోసం అయ్యో సముద్రమే...! అంటూ ప్రత్యేకంగా భయపడకు. ఈ సందేహాలూ, భయాలూ బాదరబందీ అంతా విడిచి హాయిగా పడుకో' అన్నాడు.

అమెరికాలో విమానం దిగారు. కూతురూ, అల్లుడూ కలిసి వచ్చినట్లున్నారు. అల్లుడు కనబడగానే సీతమ్మ కొంగు నిండుగా సవరించుకొంది. వీసాలు, పాసుపోర్టులూ అన్నీ చూపించి, చెకింగ్ అంతా పూర్తయ్యాక దంపతులు లాంజివైపు నడిచారు. అప్పుడు సీతమ్మకు మళ్లా తన సామాను జ్ఞాపకం వచ్చింది.

ఆత్రంగా భర్తను చూస్తూ కమాండింగ్ టోన్‌లో "అదేమిటండీ! మనం ఉత్త చేతులు ఊపుకుంటూ నడిచివెళ్తున్నాం? మరి మన సామాన్ల సంగతేం చేశారు?" అన్నది.

“అందుకోసమేనోయ్ వెళ్లుతూంట. సామాన్లన్నీ అదుగో అక్కడ ఖాళీగా వున్నచోట వో గుండ్రటి స్థలంలో రైలు పట్టాల్లా అమర్చారే? అక్కడికి ట్రాలీల్లో వచ్చి చేరుతుంది. ఎవరి సామాను వారు గుర్తుపట్టి తీసుకోవాలి అంతే!” అన్నాడు.

సీతమ్మ “అంతా అబ్బురంగా ఉందండీ! దారిలోనే ఇన్ని వింతలూ చూస్తున్నామే! ఆ మహానగరంలో ఇంకెన్ని వింతలూ, విడ్డూరాలు కనిపిస్తాయో?” అంది వింతగా చూస్తూ.

ఆ యంత్రం ప్రయాణీకుల సామాను మోస్తూ గుండ్రంగా గిరగిరా చెక్కర్లు కొడుతూ వుంది. ఎవరి సామాను వారు తీసుకుంటున్నారు. సీతమ్మ దంపతుల తాలూకు సూటుకేసు వచ్చింది. నిండుగా పిక్కటిల్ల నింపిన రెండు హాండుబ్యాగులొచ్చాయి. మరో అట్టడబ్బా లాంటిదీ వచ్చింది. అవి కనపడ్డప్పుడల్లా సీతమ్మ సంతోషంతో అరిచినంతపని చేస్తుంది. భర్తను ‘తీసుకోండి, పట్టుకోండి..” అంటూ ఆదుర్దా పెడుతూంది.

సామాన్ల చక్రం తిరగడం కూడా ఆగింది. ఏవో రెండు మూడు సూట్‌కేసులు ఎవ్వరూ తీసుకోకపోతే అక్కడే పడేసి వున్నాయి. కానీ తన జాడీల జాడ మాత్రం సీతమ్మకు కనిపించలేదు.

సీతమ్మకు కంగారు ఎక్కువైంది. ఇక తట్టుకోలేకపోయింది. “అయ్యో! మన ఐదు రకాల పచ్చళ్ల జాడీలు ఏమయ్యాయో! ఈ ముదనష్టపు ప్లేను ఏడ విడిచిందో?” అంటూ పక్కన ఉన్న భర్తను “అయ్యో! మన పచ్చళ్ల జాడీలు రాలేదండీ...!” అంటూ గట్టిగా వూపుతూ తట్టింది.

మాంచి నిద్రలోంచి లేస్తూ కళ్లు తెరిచి “ఏం సీతా! కలగన్నావా?” అంటూ అడిగాడు ఆనందరావు.

పరిసరాలు కలియజూసుకున్న సీతమ్మ ‘అయ్యో! ఇదంతా కలేనా?? కలైనా ఎంత సుఖం అనుభవించాను..’ అనుకుంది.

### మీరేమి అర్థం చేసుకున్నారు?

- సీతమ్మ భర్తను వేసిన ప్రశ్నలు ఏవి?
- సీతమ్మ భర్తను నిద్ర లేపడానికి కారణం ఏమిటి?





# భాషాసామర్థ్యాలను సాధిద్దాం!

## I. భాషాంశాలు

### పదజాలం

**అ) కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు అర్థాలు రాసి, తిరిగి సొంతవాక్యాల్లో ప్రయోగించండి.**

1) శ్రీరామనవమి రోజున భద్రాచలంలో సీతారామకల్యాణం వైభోగంగా జరుగుతుంది.

______________________________

2) ఆదుర్దా పడి చేసే పనులు సత్ఫలితాలను ఇవ్వవు.

______________________________

3) దూరదేశాల్లో ఉన్నవారు స్వదేశంలో అడుగుమోపగానే ఆనందానికి, ఉద్వేగానికి లోనవుతారు.

______________________________

**ఆ) కింది జాతీయాలను సరైన వివరణలతో జతచేయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| 1) | పెట్టిపుట్టడం | (     ) | ఎ) | ఎదుటివారు ఏదంటే అదే అని సమర్థించడం |
| 2) | కాళ్లుచాపుకు కూచోవడం | (     ) | బి) | చనిపోవడం |
| 3) | మొహం వాచి ఉండడం | (     ) | సి) | ఏపనీ చేయకుండా ఉండడం |
| 4) | తాళం వేయడం | (     ) | డి) | ఆశతో ఎదురుచూస్తూ ఉండడం |
| 5) | హరీమనడం | (     ) | ఇ) | భాగ్యవంతుడుగా పుట్టడం |

### వ్యాకరణాంశాలు

### వృత్త్యనుప్రాస అలంకారం

**అ) కింది వాక్యాలను చదవండి.**

1) రంగడు తడబడు అడుగులతో వడివడిగా వెడుతున్నాడు.

2) మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబు వోవునే మదనములకు.

పై వాటిల్లో ఏం గమనించారు?

మొదటి వాక్యంలోగానీ, తర్వాత పద్య పాదంలోగానీ ఒకేరకమైన హల్లులు (డ-మ) మళ్ళీ మళ్ళీ వచ్చాయి కదా! ఇట్లా పద్యాల్లోగానీ, వాక్యాల్లోగానీ ఒకే హల్లు తిరిగి తిరిగి వస్తే దాన్ని **'వృత్త్యనుప్రాస'** అలంకారం అంటారు.

**ఆ) కింది వాక్యాలు కూడా చదువండి. వాటిలో వృత్త్యనుప్రాస లక్షణాల్ని గుర్తించండి.**

1) ఆకులు తినే మేక తోకలో ఈకలు పీకడమెందుకో!

2) డాండడ డాండ డాండ నినదంబులజాండము నిండమత్తవే దండమునెక్కి....

**ఇ) మీకు తెల్సిన ఇట్లాంటి వృత్త్యనుప్రాస కలిగిన వాక్యాల్ని సేకరించి రాయండి.**

## II. అవగాహన-ప్రతిస్పందన

**అ) కింది కథను చదువండి. ఐదు ప్రశ్నలు తయారుచేయండి.**

కొందరు దొంగలు తెనాలి రామకృష్ణుడి ఇంటిని దోచుకోవడానికి పన్నాగం పన్ని చీకటిపడే వేళ గోడదూకి పెరట్లో దాక్కుంటారు. రామకృష్ణుడు అది గమనించి భార్యతో "నీ నగలన్నీ మూటకట్టి ఇవ్వు, బావిలో వేసేద్దాం. ఊళ్లో దొంగల భయం ఎక్కువగా ఉంది. తర్వాత దొంగల బెడద తీరాక తీసుకోవచ్చు" అని చెట్లచాటున దాక్కున్న దొంగలకు వినబడేలా చెప్పాడు. సరే అని భార్య ఓమూట తీసుకురాగానే దాన్ని దొంగలు గమనిస్తుండగా బావిలో పడవేశాడు.

దొంగలు వెతకబోయిన తీగ కాళ్లకు తగిలినట్లు సంతోషపడి రాత్రి పొద్దుపోయేవరకు ఆగి బావిలోకి దిగి గాలించారు. నీళ్లు బాగా ఉండడంతో ముందు నీళ్లన్నీ తెల్లవార్లూ తోడిపోశారు. చివరకు ఓ మూట దొరికించుకొని విప్పి చూస్తే అందులో అన్నీ గులకరాళ్లు కనిపించి తెల్లబోయారు. అప్పటికే తెలవారుతుండడంతో సందడికి జనం పోగయ్యారు. ఆ నీళ్లతో పెరడు పారించుకొంటున్న రామకృష్ణుడు "ఏమయ్యా... దొంగబాబులూ! మీరు తోడిన నీళ్లతో నాపెరడు ఒకపక్కే తడిసింది. ఇంకాస్త తోడిపొయ్యండయ్యా... మిగతాపక్క తడుపుకుంటాను..." అని అరవడంతో దొంగలు బెదిరి పారిపోయారు.

**ఆ) తన గురించి తాను రాసుకునేది ఆత్మకథ. మహాత్మాగాంధి ఆత్మకథ 'సత్యశోధన' నుండి తీసుకున్న కింది పేరా చదువండి. ప్రశ్నలు తయారుచేయండి.**

నాకు బిడియమెక్కువ. నా ఈ బిడియానికి నేనే విచారపడేవాన్ని. కొత్తవారిని చూస్తే మాట్లాడాలంటే సంకోచం కలిగేది. అప్పుడు విచారం కలిగించిన ఆ పద్ధతి తర్వాత ఆనందం కలిగించింది. మితంగా మాట్లాడడం అంటే తక్కువ పదాల్ని ఉపయోగించడం జరిగేదన్నమాట. నా నోటి నుండి కానీ, నా కలాన్నుండి కానీ పొల్లుమాట ఒక్కటి కూడా దొర్లలేదని నాకు నేను సర్టిఫికెట్టు ఇచ్చుకోగలను. సత్యారాధకునికి మౌనం అవసరమని నాకు కలిగిన అనుభవం. అయితే మితభాషి అర్థంలేని మాటలు మాట్లాడడు. ప్రతిమాట ఆచితూచి మాట్లాడతాడు. మాట్లాడటానికి ఆరాటపడేవారిని మనం చూస్తుంటాం. అనుమతి యివ్వగానే వక్త సమయాన్ని అతిక్రమించడం జరిగిపోతుంటుంది. ఇలా మాట్లాడేవారివల్ల కాలాపహరణం జరిగిపోతుంది. అందువల్ల బిడియం నాకు డాలుగా పనిచేసింది.



## III. వ్యక్తీకరణ-సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులను రాయండి.**

1) 'తనంటే చుట్టుపక్కల వాళ్లకి ఎంతో ఆప్యాయత' అని సీతమ్మ మురిసిపోవడానికి కారణం ఏమిటి?

2) 'దూర ప్రయాణం కనుక క్షేమంగా వెళ్లి లాభంగా రావాలి' అనడంలో సీతమ్మ ఉద్దేశం ఏమిటి?

3) విమానానికి ప్రమాదం జరిగితే భూమికి సముద్రానికి తేడా ఉండదు' అన్న ఆనందరావు మాటల ద్వారా ఏం అర్థం చేసుకున్నారు?

4) పాకాల యశోదారెడ్డి గురించి రాయండి.

**ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబును రాయండి.**

1) పాఠం ఆధారంగా సీతమ్మ మనస్తత్వం ఎట్లాంటిదో రాయండి.

### సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది ప్రశ్నకు జవాబును సృజనాత్మకంగా రాయండి.**

1) మీరు చూసిన లేదా మీకు ఎదురైన ఏదేని హాస్య సంఘటన గురించి వివరిస్తూ మీ మిత్రునికి లేఖ రాయండి.

### నేను ఏయే సామర్థ్యాలు సాధించాను? (స్వీయమూల్యాంకనం)

| | | |
|---|---|---|
| 1) | సొంతవాక్యాలు, జాతీయాలను సరైన వివరణలతో జతపరచగలను. | అవును / కాదు |
| 2) | వృత్త్యనుప్రాస అలంకార లక్షణాల్ని అర్థం చేసుకొన్నాను. | అవును / కాదు |
| 3) | అపరిచిత గద్యం చదివి ప్రశ్నలు తయారుచేయగలను, వివరణలు రాయగలను. | అవును / కాదు |
| 4) | సీతమ్మ మనస్తత్వాన్ని వివరిస్తూ సొంతమాటల్లో రాయగలను. | అవును / కాదు |
| 5) | హాస్యసంఘటన గురించి వివరిస్తూ మిత్రునికి లేఖ రాయగలను. | అవును / కాదు |

**సూక్తి**

ఏ దేశం వెళ్లినా స్వదేశాన్ని మరవకు...

ఎంతెత్తుకు ఎదిగినా స్వకీయులను విడువకు!

# 16 హితబోధ

- గోనబుద్ధారెడ్డి

## సాధించాల్సిన సామర్థ్యాలు - అభ్యసన ఫలితాలు

ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఈ కింది సామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలను సాధిస్తారు.

### I. భాషాంశాలు :

అ) **పదజాలం** : పాఠంలోని ప్రకృతి-వికృతులను జతచేయగలుగుతారు. పదంలోని అక్షరాలతో పదాలు రాయగలుగుతారు. ఇచ్చిన పదాలను సొంతవాక్యంలో ప్రయోగించగలుగుతారు.

ఆ) **వ్యాకరణాంశాలు** : ఇచ్చిన ఉదాహరణలలో ఉన్న అలంకారాలను గుర్తించగలుగుతారు. అతిశయోక్తి అలంకారం అవగాహన చేసుకోగలుగుతారు. ఉదాహరణలు ఇవ్వగలుగుతారు.

### II. అవగాహన - ప్రతిస్పందన :

అ) అపరిచిత గద్యానికి ప్రశ్నలను తయారుచేయగలుగుతారు.

ఆ) అపరిచిత ద్విపదను చదివి ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయగలుగుతారు.

### III. వ్యక్తీకరణ - సృజనాత్మకత :

అ) **స్వీయరచన** : మందోదరి శ్రీరాముడి గురించి చెప్పిన అంశాలను సొంతమాటల్లో రాయగలుగుతారు.

ఆ) **సృజనాత్మకత** : పాఠం ఆధారంగా సంభాషణను రాయగలుగుతారు.

## అభ్యాసకులకు సూచనలు

- పాఠాన్ని చదువండి. తెలియని పదాలను గుర్తించండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరి అకారాది పట్టికలో వెతుకండి.
- పాఠాన్ని మళ్ళీ చదివి అర్థం చేసుకోండి.
- పాఠంలో అర్థంకాని అంశాల గురించి మీ సమీపంలోని ఉపాధ్యాయులు లేదా కేంద్రంలో బోధించే వారితో చర్చించి తెలుసుకోండి.
- బాక్సులో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను పాఠంలో గుర్తించండి.



## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠ్యభాగం ద్విపద అనే ఛందో ప్రక్రియకు చెందింది. ద్విపద అంటే రెండు పాదాలుండే పద్యం అని అర్థం. ఇది దేశీకవితా ప్రక్రియ. ప్రస్తుత పాఠం గోనబుద్ధారెడ్డి రాసిన రంగనాథ రామాయణంలోని యుద్ధకాండ లోనిది.

## పాఠం ఉద్దేశం / నేపథ్యం

కౌసల్య దశరథ మహారాజుల కొడుకు శ్రీరాముడు. ఆయన భార్య సీత. శ్రీరాముడు తండ్రిమాట ప్రకారం వనవాసంకు వెళ్ళాడు. వనవాసంలో ఉండగా లంకాధిపతి రావణుడు సీతను ఎత్తుకుపోయాడు. సీత గురించి లక్ష్మణునితో కలిసి చాలా ప్రదేశాలలో వెతికాడు. హనుమ పరిచయంతో సుగ్రీవుని స్నేహం కుదిరింది. సీత లంకలో ఉందనే విషయం తెలిసింది. రావణునితో యుద్ధం నిశ్చయమైంది. తమ్ముడు విభీషణుడి మంచిమాటలను రావణుడు లెక్కచేయలేదు. మామ మాల్యవంతుడి మంచి మాటలు పెడచెవిన పెట్టాడు. పోరులోకి దిగినాడు. ధూమ్రాక్షుడు, అకంపనుడు, మహాకాయుడు, ప్రహస్తుడు మొదలగు వీరులంతా యుద్ధంలో చనిపోయారు. ఇంద్రజిత్తు వెనుదిరిగాడు. ఆ సమయంలో రావణాసురుని భార్య మందోదరి. రాజభవనానికి వస్తుంది. రాముడితో యుద్ధం వద్దు అని చెప్తుంది. శ్రీరాముణ్ణి శరణువేడుకో అని చెప్పే సందర్భమే మన పాఠ్యభాగం.

**ఉద్దేశం :** పరస్త్రీ వ్యామోహం మంచిదికాదు. దానివల్ల వినాశం జరుగుతుంది. ఎదుటి వ్యక్తి బలాబలాలను చూసుకొని ధర్మమార్గమైతేనే పోరాడాలని లేదంటే తప్పు ఒప్పు కోవాలని తెల్పడమే ఈ పాఠం ఉద్దేశం.

## కవి పరిచయం



(13వ శతాబ్దం)

గోనబుద్ధారెడ్డి తెలుగులో తొలి రామయణ కర్త. ఈయన ఆరుకాండలు (పూర్వ రామాయణం) రాసాడు. ఉత్తర రామాయణాన్ని గోన కాచవిభుడు, గోన విఠ్ఠల విభుడు రాసి రామాయణాన్ని పూర్తిచేసారు. వీరిద్దరూ గోనబుద్ధారెడ్డి కుమారులు. గోనబుద్ధారెడ్డిని బుద్ధ భూపతి అని కూడా పిలుస్తారు. ఈయన కాకతీయుల సామంతరాజు. మహబూబ్‌నగర్ జిల్లా ప్రాంతంలోని వద్దెమాను (వర్ధమానపురం) రాజధానిగా పరిపాలించాడు.

బుద్ధారెడ్డి తన తండ్రి విఠలుడి ఆజ్ఞతో ఈ రామాయణం రాసాడు. ఇది ద్విపద కావ్యం. పాడుకోవడానికి వీలుగా ఉంటుంది. ఇందులోని అనేక కథలు ప్రజలు గేయాలుగా మలచుకున్నారు. రాముని మీద భక్తి, సమాజహితం కోరి వాల్మీకి రామాయణంలో లేని కొన్ని విషయాలను బుద్ధారెడ్డి తన రచనలో చేర్చాడు.

## I

సకల భూషణ మణిజాలంబు వెలుగ,
సకల మంత్రులతోడ చనుదెంచుచుండఁ
గడునొప్పు నీల మేఘముఁజొచ్చు మెఱుపు,
వడుపునఁ జొచ్చె రావణసభాస్థలము
ఆ సతి నప్పుడర్థాసనాసీనఁ,
జేసి రావణుఁడు విశేష ప్రయోక్తి
గొలువు లోపల కిట్లు కువలయ నేత్ర,
తలడు నెన్నఁడు రానిదానవు నీవు
వడ వడ వడఁ కుచు వచ్చుటలెల్లఁ
గడు చోద్యమైనది కారణంబేమి?
యనిన మందోదరి యాత్మేశుఁ జూచి
దనుజేశ నాకురా దరవాయిగాన
వచ్చితినేడు నావచ్చుట కెల్ల,
నిచ్చ లోపల గడునెగ్గు సేయ కుము.

### మీరేమి అర్థం చేసుకున్నారు?

- ఈ భాగంలో ఎవరి మధ్య సంభాషణ ఉంది? ఏ సందర్భంలో?
- రావణాసురుడడిగిన విషయమేమి? మందోదరి ఏమి చెప్పింది?

## II

అనిలోన ధూమ్రాక్షుఁ డాదిగాఁగలుగు
మనవారు దనుజేశ మడియుకంటె
యల జనస్థానంబునందు రాక్షసుల
నలి దునుమాడెఁ బద్నాలుగు వేల
సరి ఖరత్రిశిరులఁ జంపినవాడు
నరుడు గాఁడంటి నా నరనాథు రాముఁ
దలిగి వెండియు దండకారణ్యమందు
బలవంతుడైన కబంధునిర్జించె
మారీచుఁదునుమాడె మాయఁబోనీక,
ఘోరాస్త్రమున వాలిఁగూలంగసేసె
దేవహితార్థమై తివిరి రాఘవుడు



భూవలయంబున బుట్టినవాడు
ఆదినారాయణుండతఁడు గాఁడేని,
మేదిని నింతటి మిక్కిలి నరుఁడు
కలుగునే మహి కఱకంఠునిచాప
మలవొప్ప విఱిచెఁ బ్రఖ్యాతంబుగాఁ గఁ
దమ తండ్రి పనుపునఁ దపసియై సత్య,
సమయంబుతో వనస్థలినుండ నతని
సీతఁదెచ్చితి వీవు శ్రీరామచంద్రుఁ,
డే తెఱంగున నీకు నెగ్గేమి చేసె

**III**

రామలక్ష్మణులతో రణమొనరింప,
నీ మూఁడు జగముల నెవ్వరు గలరు
నలి సామభేదదానంబులు సూఁ
గలిగిన దండంబుఁ గాదు పాటింప
దండంబుఁ బాటింపఁ దలఁచెదవేని
దండంబుఁ బడుదురె దశరథాత్మజులు
దేవ రాముడుపరదేవతగాన,
నీవు మ్రొక్కుట యెల్ల నిందగా దెందు
శరణన్నఁ జేకొను శరణన్న నీకు,
నరు శుభం బగుఁగాని యొక కీడు రాదు
గణరూప దాక్షిణ్య గుణగణాకేళి,
గణుతింప నలవియె కాకుత్స్థరాముఁ
దలిగిన నిలువ రింద్రాది దేవతలు,
దలఁప వయ్యెదు నీకు దరముగా దెందు
వలదు వృథాగర్వవహ్నిఁ గూలకుము,
చలమొప్ప నొప్పదు సంతాపముడుఁగ
నింకనైనను సీతనిచ్చుటమేలు,
లంకేశకులమును లంకయు నిలుపు

### మీరేమి అర్థం చేసుకున్నారు?

- రాముడు చంపిన రాక్షసులు ఎవరెవరు?
- మందోదరి రాముడిని ఏమని కీర్తించింది?





మహనీయ వాహనమణి భూషణాది,
సహితంబుగా నీవు జానకినిచ్చి
యపాక్షునతికాయు నొగి మాల్యవంతు,
భూపాలుపాలికిఁ బుచ్చు సంధికిని
మతిమంతుఁడగుచున్న మన విభీషణుఁడు,
హితబుద్ధిఁ గావించు నీ సంధి మనకు.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

- సీత గురించి మందోదరి రావణాసురునికి ఏమని బోధించింది?
- ఎవరి గుణగణాలు లెక్కింప సాధ్యంకాదని మందోదరి చెప్పింది? ఎందుకు?

## తాత్పర్యం

మందోదరి సకల మణిభూషణాలను అలంకరించుకొని ఉంది. ఆమె వెంట సకల మంత్రులూ ఉన్నారు. అలా ఉండగా నీలమేఘములోకి ప్రవేశించే మెరుపువలె రావణుని సభాస్థలానికి వచ్చింది. అది చూసిన రావణుడు మందోదరిని –

“కలువ పూల వంటి కన్నులుకల నా మందోదరీ! నీవు ఎప్పుడూ ఈ సభాస్థలంకు రావాలని కూడా ఆలోచించవు. నాకు చాలా వింతగా తోస్తున్నది. నువ్వు ఇక్కడికి ఎందుకు వచ్చావు?” అని అడిగాడు. దానికి మందోదరి –

“ఈ రోజు ఇక్కడికి రావాలని నాకు ఉంది. కాబట్టి వచ్చాను. నేనిక్కడకు వచ్చినందుకు నన్ను నిందించాలని నీ మనసులో అనుకోకు” అని సమాధానం చెప్పింది.

ఆ తర్వాత తన మాటలను మందోదరి కొనసాగిస్తూ –

“దనుజేశా! శ్రీరాముడు మహాపరాక్రమసంపన్నుడు. ధూమ్రాక్షుడిని చంపాడు. అంతకు ముందే పద్నాలుగు వేల రాక్షససైన్యాన్ని చంపాడు. ఖరుని నేలగూల్చాడు. త్రిశిరుణ్ణి కూల్చాడు. దండకారణ్యంలో కబంధుడనే మహా రాక్షసునిపై విజయం సాధించాడు. మారీచుణ్ణి, వాలినీ అంతమొందించాడు. ఆయన నరుడు కాడు. నారాయణుడే. దేవతల మేలుకోరి భూమ్మీద అవతరించాడు. ప్రసిద్ధిపొందిన శివధనుస్సును విరిచాడు. తన తండ్రి మాట పాలనకోసం వనవాసానికి వచ్చాడు. ఆయన సత్యవంతుడు.

నీవు ఆయన భార్యను తీసుకువచ్చావు. ఆయన నీకేమైనా కీడు చేసాడా? రామలక్ష్మణులను జయించేవాళ్ళు మూడు లోకాల్లోనూ లేరు. నాథా! సామదాన భేదాలతోనే ముందుకు వెళ్ళాలి. దండోపాయం నీకు మంచిదికాదు. దానివల్ల నీకే నష్టం. దశరథుని కొడుకు (రామ, లక్ష్మణ) లకు దండోపాయం వద్దు. రాముడు దేవుడు. కాబట్టి నీవు ఆయన్ను శరణువేడుకో. అది నీకు, కులానికి, లంకకు అందరికి మంచిది. రాముడు నీకు శుభం



కలిగిస్తాడు. రాముడి మంచి గుణగణాలను లెక్కింప మనకు సాధ్యంకాదు. అంత గొప్పవాడైన రాముడికి కోపం రాదు. వచ్చిందంటే ఇంద్రాది దేవతలే నిలువలేరు. గర్వంతో అనవసరంగా నిన్ను నీవు కాల్చుకోకు. అనవసర బాధను విడిచిపెట్టు. సీతను వాహన, భూషణ సహితంగా శ్రీరాముడికి అప్పజెప్పు. నీ కులాన్ని, లంకను కాపాడుకో. అదే నీకు మేలు. యూపాక్షుడు, అతికాయుడు, మాల్యవంతుడు మొదలగు వారిని సంధికొరకు పంపు. బుద్ధివంతుడైన మన విభీషణుడు శ్రీరాముడితో మనకు సంధి కుదురుస్తాడు" అని రావణుడికి హితబోధ చేసింది.

# భాషాసామర్థ్యాలను సాధిద్దాం!

## I. భాషాంశాలు

### పదజాలం

**అ) కింద కొన్ని పదాలున్నాయి. వాటిలోని ప్రకృతి పదాలకు వికృతులను జతచేసి రాయండి.**

రక్కసుడు గర్వం చోద్యము గౌనము రాక్షసుడు గరువము సోదెము గుణము

ఉదా : గుణము – గొనము

**ఆ) 'మందోదరి హితబోధ' ఈ పదంలోని అక్షరాలతో వీలైనన్ని పదాలు రాయండి.**

ఉదా : హిమం

**ఇ) కింది పదాలకు అర్థాలు రాయండి, ఆ పదాలతో సొంతవాక్యాలు రాయండి.**

ఉదా: రణము = యుద్ధం ______ వీరుడు రణము చేయడానికి వెనుకకుపోడు.

1) అలిగి = ______ ______

2) నిర్జించు = ______ ______

3) మతి = ______ ______

### వ్యాకరణాంశాలు

**అ) కింది విగ్రహవాక్యాలకు సమాసపదాలు రాయండి.**

1) ఖరుడు మరియు త్రిశిరుడు ______

2) రాముడు మరియు లక్ష్మణుడు ______

3) మూడు సంఖ్యగల జగములు ______

## అతిశయోక్తి అలంకారం

**ఆ) కింది ఉదాహరణలను పరిశీలించండి.**

1) హైదరాబాద్ నగరంలోని భవనాలు ఆకాశానికి తగులుతూ ఉన్నాయి.

2) హనుమంతుడు తన విశ్వరూపం చూపినప్పుడు ఆకాశంలోని నక్షత్రాలు ఆయన తలలో పూవుల్లాగా ఉన్నాయి.

3) సోమయ్య తాటి చెట్టంత పొడవు ఉన్నాడు.

పరిశీలించారు కదా! పై ఉదాహరణల్లో విషయాన్ని ఉన్నది ఉన్నట్లు చెప్పలేదు కదా! అంటే ఎక్కువ చేసి చెప్పినట్లు ఉంది. ఇలా విషయాన్ని ఉన్నది ఉన్నట్లు కాకుండా ఎక్కువ చేసి చెప్తే అదే అతిశయోక్తి అలంకారం.

విషయాన్ని ఉన్నదానికంటే ఎక్కువ చేసి చెప్పడమే అతిశయోక్తి లేదా అతిశయం చేసి చెప్పేదే అతిశయోక్తి.

**ఇ) కింది వాక్యాల్లో ఏ విషయం ఎక్కువ ఉంది. ఏ అలంకారమౌతుంది?**

1) పొలాల్లో బంగారం పడింది. ____________ ____________

2) మా ఊర్లో చెరువు సముద్రమంత ఉంది. ____________ ____________

**ఈ) అతిశయోక్తి అలంకారానికి కొన్ని ఉదాహరణలు రాయండి.**

## II. అవగాహన-ప్రతిస్పందన

**అ) కింది అపరిచిత ద్విపద పద్యాన్ని చదువండి. దీనిని పాల్కురికి సోమనాథుడు రాసాడు. ఇది బసవ పురాణం రెండవ ఆశ్వాసం లోనిది. ద్విపద అనే దేశీఛందస్సులో తొలిసారిగా రచన చేసినవాడు. అందుకే ఆయనను తొలి తెలుగు కవి అంటారు.**

వెండియు నొకనాడు దండనాయకుడ
ఖండిత భక్తి వికస్వరలీల
జంగమార్చన సేయు సమయంబునందు
దొంగలు బందివెట్టంగ నూహించి
'లింగవంతులుగాని లెంగులకతని
యంగణాంతరమున కరుగరా' దనుచు

వంగకాయలు గట్టుకొంగులఁ బొదివి,
లింగ సన్నిహితుల భంగి వట్రిల్లఁ
గని భయంవడి మ్రొక్కఁ, గన్నుల నవ్వి
"లింగవంతులు గాని లెంగులకీశ్వ
రాంగణంబున కెట్లులరుదేరవచ్చు
నింక భక్తులుకాక యీశ్వరార్చనలు
కొంకక చేయుఁడు గూర్చుండు"ఁడనిన
నుల్లముల్ గలగ నొండొరుల జూచుచును.

**కింది ప్రశ్నలకు జవాబులను రాయండి.**

1) జంగమార్చన చేసిన వారెవరు?

______________________________

2) లింగధారణ చేసిన వారిని తెల్పడానికి కవి ఏ పదం వాడాడు?

______________________________

3) దండనాయకుని ఇంట్లో ప్రవేశించినవారెవరు?

______________________________

4) దొంగలు వేటిని మూటగట్టుకున్నారు?

______________________________

5) దండనాయకుడు అందరికి ఏమని చెప్పాడు?

______________________________

**ఆ) కింది అపరిచిత గద్యాన్ని చదువండి. ఐదు ప్రశ్నలను తయారుచేయండి.**

జాంబవంతుడి మాటల్ని విన్నాడు హనుమంతుడు. సముద్రాన్ని దాటాలని నిశ్చయించుకున్నాడు. ఒక్కసారి తన శరీరాన్ని పెంచుకున్నాడు. మహేంద్రగిరి పర్వతము నుండి బయలుదేరాడు. వాయువేగంతో సముద్రంపై సాగిపోతున్నాడు. మధ్యలో 'సింహిక' అనే రాక్షసిని చంపాడు. మొత్తం నూరు యోజనాలు ప్రయాణించాడు. లంకకు చేరుకున్నాడు. అడ్డుకున్న లంకాధిదేవత లంకిణిని ఒక దెబ్బతో ప్రక్కకు తప్పించాడు. లంకలోపలికి చిన్న రూపంలో వెళ్ళాడు. లంకంతావెతికాడు. చివరకు అశోకవనంకు చేరాడు. శింశుపా

వృక్షంపై కూర్చున్నాడు. తెల్లవారి రావణుడు సీతను హెచ్చరించడం విన్నాడు. తర్వాత సీతకు రామకథ వినిపించాడు. తన విశ్వరూపం చూపాడు. రాముడిచ్చిన ఉంగరాన్ని ఇచ్చాడు. విజయం సాధించి తీసుకెళ్తామని చెప్పాడు. రావణుని కలిసాడు. రాముని గొప్పతనాన్ని తెలిపాడు. రావణుని లంకనుకాల్చాడు. తిరిగి సముద్రం దాటాడు. అంగదుడు మొదలగువారితో మధువనంలోకి వెళ్ళాడు. అందరూ కలిసి సంతోషంతో సుగ్రీవుణ్ణి కలిసారు. ప్రసవణగిరిపై ఉన్న రాముని సన్నిధికి చేరారు. హనుమ జరిగిన విషయమంతా చెప్పాడు. రాముడు సంతోషపడ్డాడు. ఎవరికీ సాధ్యంకాని పని చేసావని పొగడినాడు. హనుమను తన హృదయానికి హత్తుకున్నాడు.

## III. వ్యక్తీకరణ-సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులను రాయండి.**

1) సీతను ఏరకంగా రాముడికి అప్పజెప్పుమని మందోదరి చెప్పింది?

2) తన భర్త కొలువుకు మందోదరి వచ్చిన తీరు రాయండి.

3) గోనబుద్ధారెడ్డి గురించి రాయండి.

4) శ్రీరాముడిని శరణు పొందితే ఏమౌతుందని మందోదరి చెప్పింది?

**ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబును రాయండి.**

1) మందోదరి శ్రీరాముడి గురించి చెప్పిన విశేషాలను సొంతమాటల్లో రాయండి.

( లేదా )

రావణుడు శ్రీరాముడి గురించి ఏయే అంశాలను మందోదరి ద్వారా విన్నాడు?

### సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది ప్రశ్నకు జవాబును సృజనాత్మకంగా రాయండి.**

ఈ పాఠ్యభాగ నేపథ్యాన్ని తెలుసుకున్నారు. పాఠ్యభాగాన్ని చదువుకున్నారు కదా! వీటి ఆధారంగా సంభాషణ రాయండి.

## నేను ఏయే సామర్థ్యాలు సాధించాను? (స్వీయమూల్యాంకనం)

| | | |
|---|---|---|
| 1) | ప్రకృతి వికృతులను జత చేయగలను. పదాలతో సొంతవాక్యాలు, పదంలోని అక్షరాలతో పదాలు రాయగలను. | అవును / కాదు |
| 2) | అతిశయోక్తి అలంకారాన్ని అర్థం చేసుకొన్నాను. ఉదాహరణలు రాయగలను. | అవును / కాదు |
| 3) | అపరిచిత గద్యాన్ని చదివి ప్రశ్నలు తయారుచేయగలను. | అవును / కాదు |
| 4) | అపరిచిత ద్విపదను చదివి ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయగలను. | అవును / కాదు |
| 5) | శ్రీరాముణ్ణి గురించి చెప్పిన విశేషాలను సొంతమాటల్లో రాయగలను. | అవును / కాదు |
| 6) | పాఠం ఆధారంగా సంభాషణను రాయగలను. | అవును / కాదు |

### సూక్తి

యత్ర నార్యస్తు పూజ్యంతే
రమంతే తత్ర దేవతాః

ఎక్కడైతే స్త్రీలు గౌరవింపబడతారో అక్కడ దేవతలు సంతృప్తి చెందుతారు.

అంటే 'స్త్రీ' ని దేవతగా చూసే సంస్కృతి మనది.

# 17 పుస్తకాలు మన నిత్య సహచరులు

- ఎ.పి.జె.అబ్దుల్ కలాం

## సాధించాల్సిన సామర్థ్యాలు - అభ్యసన ఫలితాలు

ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఈ కింది సామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలను సాధిస్తారు.

**I. భాషాంశాలు :**

అ) **పదజాలం** : ఇచ్చిన పదంలో సొంతవాక్యాలు రాయగలుగుతారు. పదాల వరుసలో వేరుగా ఉన్న పదాన్ని గుర్తించగలుగుతారు.

ఆ) **వ్యాకరణాంశాలు** : ఉపమాలంకారం గురించి తెలుసుకుంటారు, ఉదాహరణలు రాయగలుగుతారు.

**II. అవగాహన - ప్రతిస్పందన :**

అ) ఆహ్వానపత్రం, పుస్తక సమీక్ష గురించి అవగాహన చేసుకోగలుగుతారు.

**III. వ్యక్తీకరణ - సృజనాత్మకత :**

అ) **స్వీయరచన** : కలాం అభిప్రాయాలను సొంతమాటల్లో రాయగలుగుతారు.

ఆ) **సృజనాత్మకత** : ఏదైనా ఒక పుస్తకం చదివి సమీక్ష రాయగలుగుతారు.

## అభ్యాసకులకు సూచనలు

- పాఠాన్ని చదువండి. తెలియని పదాలను గుర్తించండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరి అకారాది పట్టికలో వెతుకండి.
- పాఠాన్ని మళ్ళీ చదివి అర్థం చేసుకోండి.
- పాఠంలో అర్థంకాని అంశాల గురించి మీ సమీపంలోని ఉపాధ్యాయులు లేదా కేంద్రంలో బోధించే వారితో చర్చించి తెలుసుకోండి.
- బాక్సులో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను పాఠంలో గుర్తించండి.

## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం 'ప్రసంగ వ్యాసం' ప్రక్రియలో ఉన్నది. ఆయా సందర్భాలలో ఉపన్యాసం ఇవ్వడానికి అనుగుణంగా ముందుగా సిద్ధం చేసుకునేదే ప్రసంగ వ్యాసం. కలాం భారత రాష్ట్రపతిగా చేసిన వివిధ ప్రసంగాల సందేశాల తెలుగు అనువాదం 'ఎవరికీ తలవంచకు'. దీనిని వాడ్రేవు చినవీరభద్రుడు తెలుగులో అనువాదం చేశాడు. ప్రస్తుత పాఠం "ఎవరికీ తలవంచకు" పుస్తకంలోనిది.

## పాఠం ఉద్దేశం / నేపథ్యం

మనిషి జీవితంలో పుస్తకాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. అవి మనుషులు సరైన దిశలో పయనించేలా మార్గనిర్దేశనం చేస్తాయి. సామాన్య కుటుంబంలో పుట్టిన అబ్దుల్ కలాం కష్టపడి బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదిగాడు. పుస్తకాలు చదివి, వాటి ప్రభావంతో తన జీవితాన్ని గొప్పగా తీర్చిదిద్దుకున్నాడు. కాబట్టి ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పుస్తకాలు చదువడం అలవాటు చేసుకోవాలి. ఒక పుస్తకం మనిషి జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో, పుస్తకాలు ఎందుకు చదవాలో తెలియజెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

## కవి పరిచయం



15-10-1931

27-07-2015

ఏ.పి.జె.అబ్దుల్ కలామ్ పూర్తిపేరు డాక్టర్ అవుల్ ఫకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలామ్. తమిళనాడులోని రామేశ్వరం దగ్గర ఉన్న ధనుష్కోటిలో జన్మించాడు. సామాన్య కుటుంబంలో పుట్టినా పట్టుదల, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతస్థాయికి ఎదిగాడు. ఇంజనీరుగా, శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా సేవలను అందించాడు.

ఇండియా 2020, ఇగ్నైటెడ్ మైండ్స్, ఇండియా మై డ్రీమ్ వంటి రచనలు చేశాడు. కలాం ఆత్మకథ 'వింగ్స్ ఆఫ్ ఫైర్' (ఒక విజేత ఆత్మకథ) ఎంతో ప్రాచుర్యం పొందింది. ప్రేరణాత్మకమైన ఆయన ఉపన్యాసాలు, రచనలు విద్యార్థులను, యువతను ఆకట్టుకుని చైతన్యవంతులను చేసేలా ఉంటాయి.

శాస్త్రరంగంలో విశేష కృషి చేసినందుకుగాను 'పద్మభూషణ్', 'పద్మవిభూషణ్'తో పాటు అత్యున్నత పురస్కారం 'భారతరత్న'తోనూ భారత ప్రభుత్వం సత్కరించింది. దేశవిదేశాల్లోని విశ్వవిద్యాలయాలు 'గౌరవ డాక్టరేట్'తో ఆయనను గౌరవించాయి.

I



మంచి పుస్తకం పరిచయం కావడం, దాన్ని మనం సంపాదించుకోవడం జీవితానికి ఒక శాశ్వత ఆవరణ సమకూర్చుకోవటంలాంటిది. మంచి పుస్తకం మనకొక నిత్య సహచరి. కొన్ని సందర్భాల్లో పుస్తకాలు మనకన్నా ముందు పుట్టి మన జీవితయాత్రలలో మనకు దారి చూపుతూ, మన తదనంతరం కూడా అలా మార్గదర్శనం చేయిస్తూనే ఉంటాయి.

పన్నెండేళ్ల వయస్సులో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌కి అతని గురువు మాక్స్ టాల్మడ్ యూక్లిడ్ రేఖాగణితం మీద రాసిన చిన్న పుస్తకం ఒకటి బహూకరించాడు. ఆ పుస్తకం ఐన్‌స్టీన్‌ని ఒక అద్భుత ప్రపంచంలోకి తీసుకుపోయింది. ప్రయోగశాలలు, ప్రయోగసామాగ్రి వంటి వాటితో నిమిత్తం లేకుండా కేవలం భావనాబలంతో సార్వత్రిక సత్యాలు సంశోధించడమెట్లానో తెలుసుకున్నాడు.

## నాకు నచ్చిన పుస్తకాలు

నేను పిల్లలతో సంభాషిస్తున్నప్పుడల్లా వాళ్లు నన్ను తరచూ అడుగుతున్న ప్రశ్నలు :

మీకు నచ్చిన పుస్తకాలేవి? మీరు ఇప్పుడేం పుస్తకం చదువుతున్నారు?

అన్ని రకాల పుస్తకాలు చదువడం నాకు ఇష్టమైనప్పటికీ నాకు చాలా బాగా నచ్చిన పుస్తకాలు మూడున్నాయి. ఒకటి లిల్లియన్ ఇష్లర్ వాట్సన్ సంకలనం చేసిన 'లైట్ ఫ్రమ్ మెనీ లాంప్స్'. ఈ పుస్తకం నేను 1953లో చెన్నైలో మూర్ మార్కెట్‌లో పాత పుస్తకాల దుకాణంలో కొన్నాను. అప్పటి నుండి గత ఐదు దశాబ్దాలుగా ఆ పుస్తకం నా ఆత్మీయ మిత్రుడిగా, సహచరుడిగా ఉంటూ వచ్చింది. పదే పదే చదవడంతో ఆ పుస్తకం ఎంతగా నలిగిపోయిందంటే దాన్ని బైండు చేయించి మళ్లా ఎన్నోసార్లు రీబైండు చేయించవలసి వచ్చింది. నాకెప్పుడు ఏ సమస్య ఎదురైనా నేను ఆ పుస్తకంలో తల దూరుస్తాను. అప్పుడది నా కన్నీళ్లు తుడిచి నన్ను సేదదీరుస్తుంది. నేను సంతోషంతో ఉప్పొంగిపోయిన సమయాల్లో కూడా ఆ పుస్తకం నా హృదయాన్ని మృదువుగా స్పృశించి నా కాళ్లను నేలమీదికి దింపుతుంది. ఈ మధ్య న్యాయశాఖలో పనిచేస్తున్న నా మిత్రుడొకాయన ఆ పుస్తకం కొత్త ప్రతి నాకు బహుకరించినప్పుడు ఆ పుస్తకం ప్రాధాన్యత నాకు మరొక్కసారి బోధపడింది. నా మిత్రుడు తను నాకివ్వగల అత్యుత్తమ కానుక ఆ పుస్తకమేనని అన్నాడు. ఏమో బహుశా ఆ పుస్తకం మరొక ఏభై ఏళ్లనాటికి ఏ కొత్త అవతారం దాలుస్తుందో ఎవరు చెప్పగలరు!



నేనెంతో గౌరవించే మరొక పుస్తకం తిరువళ్లువర్ కృతి 'తిరుక్కురళ్'. ప్రతి ఒక్కరికీ చక్కని నడవడికను సూచించే రచన అది. జాతి, భాష, మతం, సంస్కృతి వంటి వాటి సంకుచిత పరిధిని దాటి ఆ ఋషీశ్వరుడి ఆలోచన మానవ హృదయాలను సమున్నత పరుస్తుంది.

మూడవ పుస్తకం డాక్టర్ అలెక్సికారెల్ రచించిన 'మాన్ ద అన్నోన్'. ఆయన దార్శనికునిగా మారిన వైద్యుడు. నోబెల్ బహుమతి గ్రహీత. ఏదైనా ఒక వ్యాధికి చికిత్స చేయవలసి వచ్చినప్పుడు మనఃశరీరాలు రెండింటికీ కలిపే చికిత్స చేయవలసి ఉంటుందని ఆయన తన పుస్తకంలో చెప్తాడు. ఆ రెండూ వేరువేరు కాదనీ ఒకే సమగ్ర అస్తిత్వమని, ఒకదానికి చికిత్స చేసి మరొకదాన్ని ఉపేక్షించలేమనీ అంటాడు. ముఖ్యంగా డాక్టరు కాగోరే విద్యార్థులు ఈ పుస్తకం చదవాలి. అప్పుడు వాళ్లు మానవ శరీరం ఒక యాంత్రిక వ్యవస్థ కాదని తెలుసుకోగలుగుతారు. ఎంతో జాగ్రత్తగా అల్లుకున్న సునిశిత సమాచార వ్యవస్థ కలిగిన సమగ్ర అస్తిత్వం మానవదేహమని గ్రహిస్తారు.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

- కలాం 'లైట్ ఫ్రమ్ మెనీ లాంప్స్' పుస్తకాన్ని ఆత్మీయమిత్రుడు, సహచరుడు అని ఎందుకన్నాడు?
- అబ్దుల్ కలాం మూడవ పుస్తకం గురించి ఏమని చెప్పాడు?

**II**

## రచయితల గొప్పదనం

పుస్తక రచయితలు మనిషి జీవితంలో చాల ముఖ్యపాత్ర పోషిస్తారు. ఏ రచయిత రాసిన మంచి పుస్తకమైనా ఎన్నో తరాలపాటు గొప్ప భావాల గనిగా, సంపదగా నిలబడుతుంది. ఒక్కొక్కప్పుడు కొన్ని పుస్తకాలు ఆయా రచయితల జీవిత కాలాల్లో పాఠకులను ప్రభావితం చేయకపోవచ్చు. కాని కాలం గడుస్తున్న కొద్దీ ఆ పుస్తక సందేశం మరింత బోధపడి సమాజం ఆ పుస్తకం విలువను గుర్తించగలుగుతుంది. ఇక ఆ పుస్తకం ఒక వెలుగు వెలగడం ప్రారంభిస్తుంది. అయితే ఎన్నో తరాలపాటు సదా శాశ్వతంగా ప్రకాశిస్తూ ఉండే సర్వశ్రేష్ఠ కృతులు ఇందుకు మినహాయింపు.

జ్ఞానపీఠం 38వ బహుమతి గ్రహీత ప్రఖ్యాత తమిళ రచయిత జయకాంతన్ అంటాడు కదా : పాఠకుల్ని దాటి మనగలగడమే రచయిత సాధించే విజయమని. ఏ పాఠకుడికైనా తనని దాటుకుని ప్రయాణించగలిగే అవకాశాన్ని ఇవ్వడమే ఏ సాహిత్య విజయానికైనా నిజమైన ప్రమాణం.

ఎంత సుందర ప్రభావశీల వాక్యమిది. ఈ వాక్యాన్ని చదివినప్పుడల్లా నా కళ్లు కన్నీటితో తడిసిపోతాయి. ఎందుకంటే నా చుట్టూ నిరాశ నిస్పృహలు అలముకొని ఉన్నప్పటికీ ప్రగాఢ విశ్వాసం వాటిని ఎదిరించి నిలబడుతూనే ఉంది. సాహిత్యం మానవ హృదయాలను సమున్నతం చేయటమంటే ఇదే. రచయితలు సమాజానికి అంతరాత్మలు.

మన తత్త్వవేత్తల, రచయితల మహా సమూహం మన యువతీయువకుల నుండి పరిణత మనస్కులైన నాయకులు రూపొందడాన్ని సులభసాధ్యం చేస్తారు. వాళ్ల రచనలద్వారా మానవ హృదయ ఔన్నత్యం గురించీ, మానవాళి ఆత్మబలం గురించీ మన యువతీయువకులను చైతన్యవంతుల్ని చేస్తారు. తద్వారా వారు మన ఆత్మసంకల్పాల అజేయత్వం గురించి బోధపరచి ఎటువంటి దౌర్బల్యాలైనా, నిస్పృహలైనా జయించగలిగే విధంగా మనకు ధైర్యాన్నిస్తారు. ఇది రచయితలకు మనం విధిస్తున్న విద్యుక్త ధర్మం కాదు. మానవాళి తన ప్రతికూల పరిస్థితుల్ని అధిగమించి జీవితంలో విజయం సాధించేలా సహకరించటానికి రచయితలకు మాత్రమే లభించిన అపూర్వ అవకాశమిది.



ఏ దేశమైనా దాని ప్రాకృతిక సంపదవల్లా, జీవన వైవిధ్యంవల్ల, తన ప్రజలవల్ల సంపన్నురాలవుతుంది. కాని ఒక జాతి ప్రభాసమాన వైభవం దాన్ని తత్త్వవేత్తలవల్ల మాత్రమే దానికి చేకూరుతుంది. ఆ తత్త్వవేత్తలు తమ సమాజాన్ని కాలంకన్నా ముందుకు నడిపించగలుగుతారు. అనివార్యమైన మార్పుని అంగీకరించేలా చేయగలుగుతారు.



మనం పిల్లలకీ, విద్యార్థులకీ తప్పనిసరిగా చెప్పవలసిన మాట 'రోజూ కనీసం ఒక గంటసేపైనా పుస్తకాలు చదవటానికి కేటాయించండి. అనతికాలంలోనే మీరొక విజ్ఞాననిధిగా మారిపోతా'రని. మనం ఎవరికైనా కానుకలు ఇచ్చేటప్పుడు, ముఖ్యంగా పిల్లలకు కానుకలిచ్చేటప్పుడు, పుస్తకాలు బహూకరించడం అలవాటు చేసుకోవాలి. ఇటువంటి పనులు మన యువతకి మేలుచేస్తాయి. వాళ్లు మన సమాజాన్ని విజ్ఞాన సమాజంగా మార్చటానికి దోహదపడతాయి.

**మీరేమి అర్థం చేసుకున్నారు?**

- జయకాంతన్ ఏమని భావించాడు?
- రచయితలకు మాత్రమే లభించిన అవకాశం ఏమిటి?

## భాషాసామర్థ్యాలను సాధిద్దాం!

### I. భాషాంశాలు

#### పదజాలం

**అ) కింది పదాలతో సొంతవాక్యాలను రాయండి.**

1) అంతరాత్మ : నా అంతరాత్మ ప్రకారం నేను నడుచుకుంటాను.

2) సంకల్పం : ____________________

3) మార్గదర్శనం : ____________________

4) ఉవ్విళ్ళూరు : ____________________

**ఆ) కింది పదాల వరుసలో ఒక పదం వేరుగా ఉంటుంది. దాని కింద గీత గీయండి.**

1) అబ్దుల్‌కలాం, ఇందిరాగాంధీ, పి.వి.నరసింహారావు, జవహర్‌లాల్‌నెహ్రూ

2) మహాభారతం, పంచతంత్రం, భాగవతం, రామాయణం

3) గురువు, శిష్యులు, విమానం, విద్య

4) సహచరులు, తోటివారు, మిత్రులు, మామిడిచెట్టు

## వ్యాకరణాంశాలు

### ఉపమాలంకారం

❖ కింది వాక్యాలు గమనించండి.

ఆమె ముఖం అందంగా ఉన్నది.

ఆమె ముఖం చంద్రబింబంవలె అందంగా ఉన్నది.

పై వాక్యాల్లో తేడాను చూస్తే 'ఆమె ముఖం అందంగా ఉన్నది' అనే దానికి బదులు 'ఆమె ముఖం చంద్రబింబం వలె అందంగా ఉన్నది' అనే వాక్యం బాగా ఆకట్టుకుంటుంది కదా! ఇట్లా ఆకట్టుకునేటట్లు చెప్పడానికి చంద్రబింబం అనే పోలికను తీసుకున్నాం. ఇట్లా చక్కని పోలికతో చెప్పడాన్ని **'ఉపమాలంకారం'** అంటారు.

**పై వాక్యం ఆధారంగా ఉపమాలంకారంలో ఉండే నాలుగు అంశాల గురించి తెలుసుకుందాం.**

**1) ఉపమేయం :** దేనిని / ఎవరిని వర్ణిస్తున్నామో తెలిపే పదం

(పై వాక్యంలో ఆమె ముఖాన్ని వర్ణిస్తున్నారు. కాబట్టి 'ఆమె ముఖం' ఉపమేయం)

**2) ఉపమానం :** దేనితో / ఎవరితో పోలుస్తున్నామో తెలిపే పదం

(పై వాక్యంలో ఆమె ముఖాన్ని చంద్రబింబంతో పోలుస్తున్నారు. కాబట్టి 'చంద్రబింబం' ఉపమానం)

**3) సమానధర్మం :** ఉపమేయ, ఉపమానాలు రెండింటిలోనూ ఉండే ఒకే విధమైన లక్షణం లేక ధర్మం

(పై వాక్యంలో ఆమె ముఖం అందంగా ఉంది. చంద్రబింబం అందంగా ఉంది. ఇలా రెండింటిలోనూ ఉండే ఒకేవిధమైన లక్షణం సమానధర్మం. కాబట్టి 'అందంగా ఉండటం' – సమానధర్మం)

**4) ఉపమావాచకం :** ఉపమేయ, ఉపమానాలకు అన్వయం (సంబంధం) కలిగించే పదం

(పై వాక్యంలో ఉపమేయ, ఉపమానాలకు 'వలె' అనే పదం అన్వయం (సంబంధం) కలిగిస్తుంది. కాబట్టి 'వలె' – ఉపమావాచకం)

**ఉపమాలంకార లక్షణం :** ఉపమాన, ఉపమేయాలకు చక్కని పోలిక చెప్పడమే ఉపమాలంకారం.

**అ) కింది వాక్యాలను చదవండి. వాటిలో ఉపమేయం, ఉపమానం, ఉపమావాచకం, సమాన ధర్మాలను గుర్తించి రాయండి.**

1) ఏకలవ్యుడు అర్జునుడి వలె గురితప్పని విలుకాడు.

2) తోటలో పిల్లలు సీతాకోక చిలుకలలాగా అటూ ఇటూ తిరుగుతున్నారు.

3) ఆకుల మీది మంచు బిందువులు వజ్రాల వలె మెరుస్తున్నాయి.

## II. అవగాహన-ప్రతిస్పందన

అ) మనం అనేక సందర్భాలలో ఆహ్వానపత్రాలను చూస్తుంటాం. కింది ఆహ్వానపత్రాన్ని చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

**తెలంగాణ సాహిత్య అకాదమి, హైదరాబాదు**

**ఆహ్వానం**

**కాళోజి జయంతి వేడుక**

09 సెప్టెంబర్, 2018 మ॥ 2.00 గం॥ల నుండి. వేదిక : రవీంద్రభారతి, మినీ కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాదు.

**సభాధ్యక్షులు**

**డాక్టర్ నందిని సిధారెడ్డి,**

చైర్మన్, తెలంగాణ సాహిత్య అకాదమి.

**ముఖ్యఅతిథి**

**శ్రీ బుర్రా వెంకటేశం,** ఐ.ఏ.ఎస్.,

కార్యదర్శి, యువజనాభ్యుదయం, పర్యాటక, సాంస్కృతిక శాఖ

**ఆత్మీయ అతిథి**

**శ్రీ సైదా దేవదాసు,** నేటినిజం

సంపాదకులు

**ప్రసంగం**

**శ్రీ ఎం.నారాయణశర్మ**

అంశం : సృజనాత్మక రచనల్లో తెలంగాణ భాష

**వ్యాఖ్యానం : సోమశిల తిరుపాల్**

కీ॥శే॥కాళోజీ నారాయణరావు 104వ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణ సాహిత్య అకాడమీ నిర్వహించే ఈ కార్యక్రమానికి మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

1) ఆహ్వాన పత్రిక ద్వారా ఆహ్వానిస్తున్నది ఎవరు?

2) దేని గురించి ఆహ్వాన పత్రాన్ని రూపొందించారు?

3) ప్రసంగం అంశం ఏమిటి? ఎవరు ప్రసంగిస్తున్నారు?

4) కార్యక్రమాన్ని ఎక్కడ నిర్వహిస్తున్నారు?

5) కార్యక్రమ సభాధ్యక్షులు ఎవరు? ముఖ్య అతిథి ఎవరు?

ఆ) మంచి పుస్తకం ఉత్తమ మిత్రునితో సమానం. శరీరానికి వ్యాయామం ఎట్లాంటి శక్తినిస్తుందో మంచి పుస్తకం చదువడంవల్ల మనసుకు అలాంటి ఉత్తేజం కలుగుతుంది. ఏది మంచి పుస్తకం, ఏ పుస్తకాన్ని చదువాలనే ఎంపికలో పుస్తక సమీక్షలు మార్గదర్శనం చేస్తాయి. కింది పుస్తక సమీక్షను చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

## సత్యశోధన

**I) ప్రాథమిక వివరాలు :**

**పుస్తకం పేరు :** సత్యశోధన లేక ఆత్మకథ, **రచయిత :** మోహన్‌దాస్ కరమ్ చంద్ గాంధీ. **పుటలు :** 356, **ధర :** రూ. 40, **ప్రక్రియ :** ఆత్మకథ, **ప్రచురణ :** నవజీవన్ పబ్లిషింగ్ హౌస్, అహ్మదాబాద్. (ఒక వ్యక్తి తన జీవితం గురించి తానే రాసుకుంటే దాన్ని 'ఆత్మకథ' లేదా 'స్వీయచరిత్ర' (Autobiography) అంటారు. ఇది ఉత్తమ పురుషలో ఉంటుంది. ఒక వ్యక్తి గురించి మరొక వ్యక్తి రాస్తే దాన్ని 'జీవిత చరిత్ర' (Biography) అంటారు. ఇది ప్రథమ పురుషలో ఉంటుంది. ఉదా: నేను గుజరాత్‌లో పుట్టాను. (ఉత్తమ పురుష). గాంధీ గుజరాత్‌లో పుట్టాడు. (ప్రథమ పురుష)

**II) పుస్తకంలోని అంశాలు :**

ఆత్మకథ అనే ఈ గ్రంథం మహాత్మాగాంధీ ఆత్మకథ. ఇందులో ప్రతి విషయాన్ని నిజాయితీగా రాశారు. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలను చెప్పాడు. చిన్నతనంలో చెడు అలవాట్ల నుంచి గాంధీ బయటపడ్డాడు. తాను చేసిన దొంగతనం గురించి తండ్రికి లేఖ రాశాడు. లండన్‌లో బారిష్టర్ చదువడం కోసం వెళుతున్నప్పుడు ఎటాంటి తప్పులు చేయనని తన తల్లికి ప్రమాణం చేశాడు. బ్రిటన్‌లో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నా తన తల్లికి చేసిన ప్రమాణాన్ని మాత్రం తప్పలేదు. చదువు ముగించుకున్న తర్వాత దక్షిణాఫ్రికా వెళ్ళాడు. అక్కడ బ్రిటీష్ వారి దురాగతాలకు వ్యతిరేకంగా పోరాటం చేశాడు. సత్యం, అహింస, సత్యాగ్రహంవంటి వాటి శక్తిని గురించి తెలుసుకున్నాడు. భారతదేశానికి తిరిగివచ్చి స్వాతంత్ర్యోద్యమంలో భాగమయ్యాడు. కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొన్నాడు. సబర్మతి ఆశ్రమం స్థాపించాడు. అహింసా మార్గంలో నిజాయితీ, పట్టుదలతో పనిచేశాడు. భారతదేశ స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించే స్థాయికి ఎదిగాడు.

**III) అభిప్రాయం :**

గాంధీ ఆత్మకథ చదువడమంటే దేశ స్వాతంత్రోద్యమం గురించి తెలుసుకోవడమే. ఒక సాధారణ మనిషి మహాపురుషునిగా ఎలా మారవచ్చో, ఒక గొప్ప నాయకునిగా ఎలా ఎదగవచ్చో చెప్పే మార్గదర్శి 'సత్యశోధన' గ్రంథం. తప్పులు అందరూ చేస్తారు. కానీ ఆ తప్పులు సరిదిద్దుకోవచ్చని చెప్పేందుకు చక్కని సాక్ష్యం గాంధీ ఆత్మకథ. సత్యం, అహింసలను ఆయుధాలుగా చేసుకుని దేశానికి స్వాతంత్ర్యం సాధించిపెట్టాడు. తన సంకల్పబలం, ధృడదీక్షలతో ఇంత గొప్ప విజయాన్ని సాధించిన గాంధీ, కేవలం భారతీయులకే కాదు... నెల్సన్ మండేలా, మార్టిన్ లూథర్ కింగ్, బరాక్ ఒబామా, ఆంగ్ సాన్ సూకీ, దలైలామా వంటి ఎంతో మంది విదేశీయులకు కూడా గాంధీ ఆదర్శంగా నిలిచాడు. ఇంతటి గొప్ప గ్రంథాన్ని ప్రతి విద్యార్థి తప్పనిసరిగా చదువాలి. మంచి లక్షణాలు అలవర్చుకోవాలి.

కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1) తన తల్లికి గాంధీ ఏమని ప్రమాణం చేశాడు?

2) గాంధీని ఆదర్శంగా తీసుకున్న విదేశీయులు ఎవరు?

3) ఎవరు గొప్ప వ్యక్తులుగా ఎదుగుతారు?

4) సత్యశోధన గ్రంథాన్ని ప్రచురించిన సంస్థ ఏది?

5) సత్యశోధన గ్రంథం ఏ ప్రక్రియలో ఉంది?

## III. వ్యక్తీకరణ-సృజనాత్మకత

### స్వీయరచన

అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులను రాయండి.

1) కలాం 'పుస్తకాలు బహూకరించడం అలవాటు చేసుకోవాలి' అని ఎందుకు అన్నాడు?

2) పుస్తకాలు చదువడంవల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి?

3) మీరు ఎలాంటి పుస్తకాలు చదువాలనుకుంటున్నారు? ఎందుకు?

4) అబ్దుల్ కలాం గురించి సొంతమాటల్లో రాయండి.

ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబును రాయండి.

1) పుస్తకాల గురించి అబ్దుల్ కలాం అభిప్రాయాలను సొంతమాటల్లో రాయండి.

### సృజనాత్మకత / ప్రశంస

అ) కింది ప్రశ్నకు జవాబును సృజనాత్మకంగా రాయండి.

1) 'పుస్తక సమీక్ష' గురించి ముందు అభ్యాసంలో తెలుసుకున్నారు కదా! ఏదైనా ఒక కథ / వ్యాసం / పుస్తకం చదివి దాని గురించి సమీక్ష రాయండి.

## నేను ఏయే సామర్థ్యాలు సాధించాను? (స్వీయమూల్యాంకనం)

| | | |
|---|---|---|
| 1) | ఇచ్చిన పదంలో సొంతవాక్యాలు రాయగలను. | అవును / కాదు |
| 2) | పదాల వరుసలో వేరుగాఉన్న పదాన్ని గుర్తించగలను. ఉపమాలంకారం గురించి తెలుసుకున్నాను, ఉదాహరణలు రాయగలను. | అవును / కాదు |
| 3) | ఆహ్వానపత్రం, పుస్తక సమీక్షలను చదివి అవగాహన చేసుకోగలను. | అవును / కాదు |
| 4) | అబ్దుల్‌కలాం అభిప్రాయాలను సొంతమాటల్లో రాయగలను. | అవును / కాదు |
| 5) | కథ / వ్యాసం / పుస్తకం గురించి సమీక్ష రాయగలను. | అవును / కాదు |

### సూక్తి

మంచి పుస్తకం మంచి మనసుకు మరోపేరు.

సొంత పుస్తకం మంచి మనిషికి మరో తోడు.

– ఇరివెంటి కృష్ణమూర్తి

# 18 అహంకారం

- కొఱవి గోపరాజు

## సాధించాల్సిన సామర్థ్యాలు - అభ్యసన ఫలితాలు

ఈ పాఠం పూర్తయ్యేసరికి మీరు ఈ కింది సామర్థ్యాలకు చెందిన అభ్యసన ఫలితాలను సాధిస్తారు.

### I. భాషాంశాలు :

అ) **పదజాలం** : పదాలకు అర్థాలు, పర్యాయపదాలు రాయగలుగుతారు.

ఆ) **వ్యాకరణాంశాలు** : ఛందస్సులోని మౌలికాంశాలైన గురువులు, లఘువులను గుర్తించగలుగుతారు.

### II. అవగాహన - ప్రతిస్పందన :

అ) చుక్క గుర్తు ఉన్న పద్యాలను కంఠస్థంచేసి తాత్పర్యాలు రాయగలుగుతారు. పూరించగలుగుతారు.

ఆ) అపరిచిత పద్యాన్ని అర్థం చేసుకుని అడిగిన ప్రశ్నలకు సమాధానాలు రాయగలుగుతారు.

### III. వ్యక్తీకరణ - సృజనాత్మకత :

అ) **స్వీయరచన** : సుదర్శనుడి వ్యక్తిత్వాన్ని సొంతమాటల్లో రాయగలుగుతారు.

ఆ) **సృజనాత్మకత** : అహంకారం మనిషి పతనానికి కారణం అనే ఇతివృత్తానికి తగిన కథను రాయగలుగుతారు.

## అభ్యాసకులకు సూచనలు

- పాఠాన్ని చదువండి. తెలియని పదాలను గుర్తించండి.
- వాటి అర్థాలను పుస్తకం చివరి అకారాది పట్టికలో వెతుకండి.
- పాఠాన్ని మళ్ళీ చదివి అర్థం చేసుకోండి.
- పాఠంలో అర్థంకాని అంశాల గురించి మీ సమీపంలోని ఉపాధ్యాయులు లేదా కేంద్రంలో బోధించే వారితో చర్చించి తెలుసుకోండి.
- బాక్సులో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను పాఠంలో గుర్తించండి.



## పాఠ్యభాగ వివరాలు

ఈ పాఠం కొఱవి గోపరాజు రచించిన "సింహాసన ద్వాత్రింశిక" అను కథాకావ్యములోనిది. ఈ గ్రంథం కథాకావ్య ప్రక్రియకు చెందినది.

ఉజ్జయినీ రాజ్యాన్ని విక్రమార్కుడనే రాజు పరిపాలిస్తుంటాడు. ఇతడు సాహసవంతుడు. ప్రజలను కన్నబిడ్డవలె చూసుకునేవాడు. స్వర్గములో ఇంద్రునికి సహాయంచేయగా కృతజ్ఞతగా ఇంద్రుడు ఒక దివ్య సింహాసనాన్ని విక్రమార్కునికి బహూకరిస్తాడు. ఆ దివ్యసింహాసనం మెట్లకు ఇరువైపులా 32 సాలభంజికలు (బొమ్మలు) ఉంటాయి. విక్రమార్కుడు ఈ సింహాసనమెక్కి చిరకాలం పరిపాలించాడు. విక్రమార్కుని మరణానంతరం ఈ సింహాసనాన్ని ఒక పొలంలో పాతిపెడుతారు. కాలక్రమేణా ఈ పొలం ఒక బ్రాహ్మణుడికి లభిస్తుంది. అతడు పొలం దున్నుతూ ఉండగా ఈ సింహాసనం బయటపడుతుంది. ఈ విషయాన్ని ఆనాడు పరిపాలిస్తున్న భోజరాజుకు తెలియజేస్తాడు. భోజరాజు ఆ సింహాసనాన్ని వెలికితీయించి తన ఆస్థానంలో ప్రతిష్ఠిస్తాడు. ఒక సుమూహూర్తమున అందరి ముందు ఆ సింహాసనాన్ని అధిష్ఠించబోతాడు. ఆ సింహాసనం మొదటి మెట్టుకిరువైపులా ఉన్న బొమ్మలలో ఒక బొమ్మ భోజరాజును వారిస్తుంది. విక్రమార్కుడెక్కిన సింహాసనాన్ని విక్రమార్కుడంతటివాడే ఎక్కాలి. అని విక్రమార్కునికి సంబంధించిన ఒక కథను చెబుతుంది. ఇలా ప్రతిరోజు ఒక బొమ్మ చొప్పున 32 బొమ్మలు కథలు చెబుతాయి. ఆ కథలే "సింహాసన ద్వాత్రింశిక" పేరున గోపరాజు కథా కావ్యంగా రచించాడు.

## పాఠం ఉద్దేశం / నేపథ్యం

సుదర్శనుడనే ఒక రాజు అయోధ్యను పరిపాలిస్తుంటాడు. ప్రజారంజకమైన ఇతని పాలనలో ప్రజలు సుఖశాంతులతో జీవిస్తుంటారు. ప్రతిరోజు లక్షాపాతికవేల బ్రాహ్మణులకు, అన్నార్థులకు భోజనం పెడుతూ ఉంటాడు. ఇతని గొప్పతనాన్ని తెలుసుకున్న నారదుడు రాజు దగ్గరకు వస్తాడు. సుదర్శనునికి నారదునికి మధ్య జరిగిన సంభాషణే ఈ పాఠ్యభాగ నేపథ్యం. అహంకారం వల్ల కలిగే నష్టాల గురించి తెలుపడమే పాఠం ఉద్దేశం.

## కవి పరిచయం



15వ శతాబ్దం

కొఱవి గోపరాజు తల్లిదండ్రులు కామాంబిక, కొఱవి కసవరాజు. గోపరాజు నిజామాబాద్ జిల్లాలోని భీంగల్ ప్రాంతంవాడు. నాటి పల్లికొండ సంస్థానాధీశుడు, మహారాజు రాణా మల్లన ఆస్థాన పండితుడు. సాహిత్యంతోపాటు రాజనీతి, ఛందస్సు, యోగం, జ్యోతిషం మొదలైన శాస్త్రాలలో ప్రవీణుడు. అందరికీ సులభంగా అర్థమయ్యే విధంగా కథలు చెప్పడం ఈయన ప్రత్యేకత.



# I

ఆ.వె. ఎచటి నుండి యిటకు నేతెంచితిరి నన్ను
ధన్యుఁజేయ నన్నఁ దపసి వలికెఁ
బరమ ధర్మశీల బ్రహ్మలోకమున నీ
దానధర్మ వార్తఁ దడవ వింటి 1



* చ. విని నినుఁ జూడ వచ్చితి భువింగడుఁ బుణ్యుఁడ వంచు నన్న నో
మునివర శిష్యుఁగా దలఁచి ముద్దునఁ బల్కెద వెంతవాఁడ నే
ననుచు వినీతుఁడైనఁ గొనియాడి గుణాఢ్యుఁడ వీవు నీ యశం
బనఘ చరిత్ర బ్రహ్మ భువనాంతము ముట్టిన దింత చాలదే. 2

క. స్వకులోచిత ధర్మముఁ ద
ప్పక మనువారలకు వలయుపని దుర్ఘటమే?
ప్రకటంబుగ ఋషిపత్నులు
సికతా కలశముల జలము చేరుపుగొనరే. 3

వ. దీనికి దృష్టాంతంబుగ నీవును దీనం గుండఁజేసి నీరు నించిన నిలుచునని యిసుక చేతికిచ్చిన నృపాలుండందుకొని. 4

క. అటు చేసినఁ జిత్రము మి
క్కుటముగ నా దాన ధర్మగుణ సిద్ధునిచే
ఘటితరస మైనసికతా
ఘటి యొప్పెను రసము ఘటిక గట్టిన భంగిన్! 5

## మీరేమి అర్థం చేసుకున్నారు?

- "ఓ రాజా! నీ దానగుణపు గొప్పదనము బ్రహ్మలోకమున వినిపిస్తున్నది." అనే అర్థంగల వాక్యాన్ని గుర్తించండి.
- సికతా కలశము అనగా నీవేమి అర్థం చేసుకున్నావు?
- నారదుడు ఇసుకతో సుదర్శనుని ఏమి చేయమన్నాడు?

II

క. కృతిఁ గుండలు నిలిచిన స
త్కృతిఁ గనుఁగొని నారదుండు దినమును నీ వీ
గతిఁ బుణ్యకీర్తి వెలయిం
పు తపోనిష్ఠలను వెలసి పుణ్యవిచారా. 6

*మ. అని మృద్భాండము లెల్లమాని సికతాయత్తంబు లౌ కుండలన్
ఘనుఁడాపాయసశాక సూపముల పాకంబెప్పుడుం జేయుచుం
దనియన్ బ్రాహ్మణ భోజనంబు లిడుచుం దానొక్కనాఁ డప్పుదా
ర్థనికాయంబులు వండుచోటఁ జని తత్సామగ్రి వీక్షింపఁగాన్. 7

* క. వెసలుడుకంగని నృపుఁడు
బ్బుసమున నే నిట్టి ఘనత వడసితి ననఁగా
నిసుమునఁ జేసిన కుండలు
విసవిసలై విరిసెఁ బుణ్య విపరీతగతిన్. 8





క.	ఉలికి యతండప్పుడు మదిఁ
గలఁగుచు నిటఁగల్మషంబు గలసెనొ తగువి
ప్రుల యెన్నిక గూడదొ హో
తలు మంత్రముఁదప్పిరొక్కొ ధర గదలెనొకో. 9

> **మీరేమి అర్థం చేసుకున్నారు?**
>
> - సుదర్శనుడు వంటశాలకు ఎందుకు వచ్చాడు?
> - "నా గొప్పతనంవల్లనే ఇసుక కుండలలో వండడం సాధ్యమైంది." ఈ వాక్యం ఏ పద్యంలో ఉందో గుర్తించండి.

## III

మ.	అని యుత్సాహవిహీనుఁడౌచు నతి చింతాక్రాంతుఁడై యుండఁగా
దనయిచ్చన్ముని తొంటిచాడ్పున వియద్భాగంబు శోభిల్ల వ
చ్చినఁ బూజించి మునీంద్ర నామహిమకుం జేటయ్యెఁ బో నీవు చె
ప్పిన మర్యాదయునెట్లు దప్పెననినం బృథ్వీశు బోధించుచున్. 10

క.	మర్యాదఁ దప్పెఁ జిత్తవి
పర్యాసాహంకృతులను బార్థివ "గర్వా
త్కార్యం వినశ్యతి" యనుచు
నార్యులు మునుచెప్పునీతి యది తప్పగునే. 11

* ఉ.	నావుడు భూవరుండు మునినాయక నేనపరాధినైతినేఁ
డావిధ మేక్రియంగలుగు నానతియిమ్మని మ్రొక్కినంత నా
దేవమునీంద్రుఁడిట్లనియె ధీరుఁడవై మదినుబ్బులేక భూ
దేవసపాదలక్షఁ బరితృప్తి యొనర్పుము భుక్తిముక్తులన్. 12

> **మీరేమి అర్థం చేసుకున్నారు?**
>
> - "గర్వము పనిని చెడగొడుతుంది." అని ఎవరన్నారు?
> - నారదుడు సుదర్శనునిలో ఏది ఉండకూడదన్నాడు?

## తాత్పర్యాలు

1) సుదర్శనుడు తన వద్దకు వచ్చిన నారదుడిని చూసి ఓ! మునీంద్ర! నన్ను ధన్యుడిని చేయుటకు మీరు ఎక్కడ నుండి వచ్చారని గౌరవంగా పలుకగా, నారదుడు ఓ సుదర్శనా! ధర్మాత్ముడవైన నీ దానశీలం గురించి బ్రహ్మలోకంలో విన్నాను.

2) ఆ వార్తవిని ఈ భూమి మీద మిక్కిలి పుణ్యాత్ముడవైన నిన్ను చూడవచ్చాను అని నారదుడు చెప్పాడు. సుదర్శనుడు ఓ! మునివరా! నన్ను శిష్యునిగా తలచి ప్రేమతో నాపట్ల గొప్పగా మాట్లాడుతున్నారు, కానీ నేను ఎంతవాడిని? అని వినయముగా పలికాడు. నారదుడు, సుదర్శనుని పొగడుతూ ఓ! రాజా! నీ కీర్తి, నీ సచ్చరిత్ర బ్రహ్మలోకం వరకు చేరినవి. ఇది సరిపోదా! అని అన్నాడు.

3) తన కుల ధర్మాన్ని విడిచిపెట్టకుండా అనుసరిస్తూ జీవించేవారికి అసాధ్యమైన పని ఏమైనా ఉంటుందా? మునుల భార్యలు ఇసుక కుండలో నీరు నింపుట ప్రసిద్ధం కదా!

4) దీనికి నిదర్శనంగా దీనితో కుండలుచేసి నీటితో నింపితే అవి నిలుస్తాయి చూడు! అని నారదుడు రాజు చేతిలో ఇసుకనుంచాడు. దానిని అందుకొని

5) ఆ నారదుడు చెప్పినట్లు దానగుణ ప్రసిద్ధుడైన సుదర్శనుడు ఇసుకతో కుండలుచేసి నీటితో నింపాడు. ఆశ్చర్యం గొల్పునట్లుగా నీరు ఉండకట్టిన విధముగా నిలిచింది.

6) ఆ విధంగా తయారుచేసిన కుండలు పలిగిపోకుండా ఉండుటచూసి నారదుడు, సుదర్శనుని చూసి, పుణ్య బుద్ధికలవాడా! నీవు శ్రద్ధతో తపస్సు చేస్తున్నావు. ప్రతిరోజు ఈ విధంగానే కుండలు చేస్తూ సంతర్పణ చేయగలవు. దానివల్ల నీ పుణ్యము యొక్క కీర్తి ప్రకాశిస్తుంది అని నారదుడు అన్నాడు.

7) నారదుని ఉపదేశాన్ని శిరసావహించిన సుదర్శనుడు ఆనాటి నుండి మట్టి కుండలలో కాకుండా ఇసుకతో చేసిన కుండలలో పాయసము, కూరలు, పప్పు మొదలగు పదార్థములను వండి బ్రాహ్మణులకు భోజనము పెడుతూ ఉండేవాడు. ఒకనాడు వంటశాలను పర్యవేక్షించుటకు వచ్చాడు సుదర్శనుడు.

8) అక్కడ ఇసుక కుండలో పదార్థాలు ఉడుకుట చూసి "నా గొప్పతనము వల్లనే ఇది సాధ్యమయింది" అని సుదర్శనుడు గర్వంతో అనుకున్నాడు. వెంటనే ఆశ్చర్యంగా ఇసుక కుండలు విచ్చిపోయాయి. అతని పుణ్య ప్రభావం నశించింది.

9) సుదర్శనుడు భయపడి ఇక్కడ ఏమైనా మలినం కలిసినదా? తగిన బ్రాహ్మణులను ఆహ్వానించలేదా? యాజ్ఞికులు మంత్రములను తప్పుగా పఠించిరా? లేదా ఈ భూమే కంపించినదా?



10) ఆ విధముగా నిరుత్సాహంతో సుదర్శనుడు చింతిస్తూ ఉండగా, నారదుడు ఎప్పటివలెనే ఆకాశమార్గాన ప్రకాశింపచేస్తూ వచ్చాడు. సుదర్శనుడు అతనిని పూజించి "స్వామీ! నా మహిమ నశించింది. మీరు చెప్పిన నియమానికి భంగం ఎట్లు కలిగిందో తెలియడంలేదు" అని పలికాడు. అప్పుడు నారదుడు సుదర్శనునికి బోధిస్తూ..

11) నీ మనసులో తగని ఆలోచనలు కలిగి అహంకారం పుట్టింది. నేను చెప్పిన విధానానికి భంగం వాటిల్లింది. రాజా! గర్వం కారణంగా చేసే పని నశిస్తుంది అని పెద్దలు చెప్పిన మాటలు తప్పునా!

12) నారదుడు ఇలా చెప్పగా, సుదర్శనుడు తన తప్పును మన్నించమని అన్నాడు. తాను అపరాధినని పలుకుతూ పూర్వపుణ్యం మళ్ళీ ఏవిధంగా లభిస్తుందో! సెలవియ్యండి అని నమస్కరించాడు. నారదుడు "ఓ! రాజా! మనసులో గర్వం తలెత్తకుండా ప్రతిరోజూ లక్షాపాతికవేల బ్రాహ్మణ, అన్నార్థులను తృప్తిపరచు" (లోకంలో ఆకలిగొన్న వారికి భోజనం పెట్టడం కన్న మరొక గొప్ప పనిలేదు అని అంతరార్థము) అని చెప్పాడు.

# భాషాసామర్థ్యాల సాధన చేద్దాం!

## I. భాషాంశాలు

### పదజాలం

**అ) కింది పదాలకు అర్థాలను రాయండి.**

1) యశము ____________________

2) సికతము ____________________

3) ఉచిత ____________________

**ఆ) కింది వాక్యాలలో ఒకే అర్థాన్నిచ్చే రెండు పదాలను గుర్తించండి.**

1) రాజు పిరికివాడు కాకూడదు. ప్రభువు శత్రువులకు భయపడరాదు.

____________________ ____________________

2) విప్రులు వేదాధ్యయనం చేస్తారు. భూసురులు ప్రజల మేలు కోరుతారు.

____________________ ____________________



## వ్యాకరణాంశాలు

### ఛందస్సు - గురు, లఘువుల పరిచయం

పద్యాలలో, గేయాలలో ఉండే మాత్రలు, గురులఘువులు, గణాలు, యతులు, ప్రాసలు మొదలైన వాటి గురించి తెలిపేదే ఛందస్సు.

i) **లఘువు** : క్షణకాలంలో ఉచ్చరించేది. దీనిని 'I' (నిలువుగీత)తో సూచిస్తారు. ఈ కింది అక్షరాలు లఘువులని గమనించండి.

1) హ్రస్వాక్షరాలు (పొట్టి అక్షరములు)

| | | | | | |
|---|---|---|---|---|---|
| I | I | I | I | I | I |
| అ | ఇ | ఉ | ఋ | ఎ | ఒ |
| I | I | I | I | I | I |
| క | కి | కు | కృ | కె | కొ |

2) దీర్ఘంలేని ద్విత్వాక్షరాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| I | I | I | I | I | I |
| క్క | చ్చ | మ్మ | ర్ర | ల్ల | త్త |

3) దీర్ఘంలేని సంయుక్తాక్షరాలు

| | | | |
|---|---|---|---|
| I | I | I | I |
| క్న | ష్ణ | వ్య | త్రి |

ii) **గురువు :** రెండు క్షణాల కాలంలో ఉచ్చరించేది. దీనిని 'U' సంకేతంతో సూచిస్తారు.

గురువులనెలా గుర్తిస్తారో చూద్దాం.

1) దీర్ఘాక్షరాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| U | U | U | U | U | U | U | U |
| ఆ | ఈ | ఊ | ౠ | ఏ | ఐ | ఓ | ఔ |
| U | U | U | U | U | U | U | U |
| కా | కీ | కూ | కౄ | కే | కై | కో | కౌ |

2) సున్నాతో కూడిన అక్షరాలు.

U U U U U
కం లం అం గం చం

3) విసర్గతో కూడిన అక్షరాలు.

U U U U U
దుః మః కః యః శః

4) పొల్లుతో కూడిన అక్షరాలు.

U U U U
నిన్ నున్ చెన్ యెన్

5) ద్విత్వాక్షరాలకు ముందున్న అక్షరం.

UI UI UI U I
అక్క చెల్లి చిన్న బొమ్మ

6) సంయుక్తాక్షరాలకు ముందున్న అక్షరం.

UI U I U I U I
రశ్మి భవ్య పద్య చిత్ర

**అ) కింది వానిలో లఘువు, గురువులను గుర్తించండి.**

చక్కని పాలపై చెందిన పాకము.

పుణ్యముల్ నమః రైతులు గౌరీపతి మత్తులు

**ఆ) కింది వానిలో తప్పు / ఒప్పులను గుర్తించండి.**

U I
రాజు - తప్పు / ఒప్పు

I U
కృష్ణ - తప్పు / ఒప్పు

U U
వాక్యం - తప్పు / ఒప్పు

## II. అవగాహన-ప్రతిస్పందన

**అ) పాఠంలోని కింది పద్యాన్ని పాదభంగం లేకుండా పూరించండి.**

అని మృద్భాండము ______________________

______________________________

______________________________

______________________ వీక్షింపcగాన్

**ఆ) చుక్క గుర్తున్న పద్యాలను కంఠస్థం చేయండి, వాటి తాత్పర్యాలను రాయండి.**

**ఇ) కింది అపరిచిత పద్యం చదవండి. ప్రశ్నలకు జవాబులను రాయండి.**

చుట్టములకు తలిదండ్రుల
కెట్టియెడంబ్రియము నెఱపనెడపని చదువుల్
గట్టిగ నెరుగని పుత్రుడు
పుట్టుట కులమునకు తెవులు పుట్టుట చుమ్మీ!

1) చదువు ఎవరెవరికి సంతోషాన్నివ్వాలి?

______________________________

2) చదువు గట్టిగా నెరుపుట అంటే అర్థం ఏమై ఉంటుంది?

______________________________

3) చదువు రాని వానిని కవి దేనితో పోల్చాడు?

______________________________

4) ప్రియము నెఱపుట అంటే ఏమర్థం చేసుకున్నావు?

______________________________

5) ఈ పద్యమునకు తగిన పేరు (శీర్షిక) పెట్టండి.

______________________________

## III. వ్యక్తీకరణ-సృజనాత్మకత

### స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులను రాయండి.**

1) ఇసుక కుండలు పగిలిపోవుటకు కారణము ఏమై ఉంటుంది?

2) పెద్దల మాటలు మనల్ని మంచిమార్గంలో నడిపిస్తాయి. ఎట్లాగో వివరించండి.

3) అహంకారాన్ని అదుపులో ఉంచుకోవడానికి నీవు ఏమి చేస్తావు?

4) కొఱవి గోపరాజును గురించి రాయండి.

**ఆ) కింది ప్రశ్నకు పది వాక్యాలలో జవాబును రాయండి.**

1) నారదుడు, సుదర్శనుల సంభాషణ ఆధారంగా సుదర్శనుని వ్యక్తిత్వాన్ని వివరించండి.

### సృజనాత్మకత / ప్రశంస

**అ) కింది ప్రశ్నకు జవాబును సృజనాత్మకంగా రాయండి.**

1) 'పొగడ్తలకు ఉబ్బిపోయి కీర్తిని పోగొట్టుకోరాదు' అని తెలిపే ఒక కథ రాయండి.

### నేను ఏయే సామర్థ్యాలు సాధించాను? (స్వీయమూల్యాంకనం)

| | | |
|---|---|---|
| 1) | పదాలకు అర్థాలను, పర్యాయపదాలను గుర్తించగలను. | అవును / కాదు |
| 2) | గురువు లఘువులను గుర్తించగలను. | అవును / కాదు |
| 3) | పాఠంలోని చుక్క పద్యాలను కంఠస్థం చేసి, పద్యాల సారాంశాన్ని రాయగలను. | అవును / కాదు |
| 4) | అపరిచిత పద్యం చదివి అర్థంచేసుకొని ప్రశ్నలకు జవాబులు రాయగలను. | అవును / కాదు |
| 5) | పాఠం ఆధారంగా సుదర్శనుడి వ్యక్తిత్వాన్ని సొంతమాటల్లో రాయగలను. | అవును / కాదు |
| 6) | 'ఇతివృత్తం' ఆధారంగా కథను రాయగలను. | |

### సూక్తి

అహంకారం అనర్థాలకు మూలం

# పదవిజ్ఞానం

## పదాలు - అర్థాలు

### అ

అఖండం = సమస్తం
అద్వితీయం = సాటి లేనిది
అనఘుడు = పాపం చేయనివాడు
అని = యుద్ధం
అనివార్యం = తప్పనిసరిగా చేయవలసినది, నివారించలేనిది
అనుక్షణం = ఎల్లప్పుడు
అపుత్రకుడు = కొడుకు లేనివాడు
అబ్బురము = ఆశ్చర్యం
అర్ణవం = సముద్రం
అర్పించు = అప్పగించు
అల = కెరటం
అలిగి = కోపించి
అలవి = సాధ్యము (శక్యము)
అవశేషాలు = మిగిలిపోయినవి
అహంభావము = గర్వము, నేనే గొప్ప అను భావము
అహరహము = ప్రతిదినము

### ఆ

ఆత్మేశుడు = భర్త
ఆర్యులు = పూజ్యులు, పెద్దవారు
ఆక్షేపణ = అభ్యంతరం

### ఇ

ఇచ్ఛ = కోరిక

### ఉ

ఉచిత = తగినది
ఉజ్జగింపరు = వదిలిపెట్టరు
ఉన్నతం = గొప్పది
ఉబ్బు = గర్వపడు
ఉరు = గొప్పదగు

### ఎ

ఎగ్గు = కీడు

### ఏ

ఏతెంచుట = వచ్చుట
ఏరు = నది

### ఒ

ఒడుపు = ఉపాయం

### ఓ

ఓర్పు = సహనం

### క

కృతి = ప్రబంధము, చేయుట
కడు = మిక్కిలి, అత్యంత
కరకంఠుడు = శివుడు
కలశము = కుండ, కడవ
కల్మషము = పాపము
కాచుట = రక్షించడం

కాన = అడవి
కుట్రలు = మోసాలు
కుడువడం = తినడం
కులము = వంశము
కువలయము = భూమి
కేలు = చేయి
కోక = వస్త్రం

## గ

గతి = తోవ
గమనం = ప్రయాణం
గమ్యం = పొందదగినది
గుణాఢ్యుడు = మంచి గుణములు కలవాడు
గణుతించు = లెక్కించు, ఎంచు

## చ

చవట = చాతగానివాడు
చవి = రుచి
చామరము = వింజామర
చాలు = వరుస
చింత = తలపు (ఆలోచన)
చిద్విలాసం = చిరునవ్వు
చిహ్నము = గుర్తు
చెలువు = అందం
చేటు = నాశనం, కీడు
చోద్యము = వింత

## ఛ

ఛత్రం = గొడుగు

## జ

జనం = ప్రజలు

## త

తనుము = ఖండించు, చంపు
తనువు = శరీరం
తపసి = తపస్సు చేయువాడు
తరగలు = అలలు
తలపగ = ఆలోచించగ
తాపత్రయం = తపన
తావక = నీయొక్క
తావి = సువాసన
తార్కాణము = నిదర్శనం
తూకం = తూచుట
తెరువరులు = బాటసారులు
తైలం = నూనె
తొంటి = ఇంతకు మునుపు

## ద

దనుజుడు = రాక్షసుడు
దాస్యం = సేవ, పని
దాసిన = దగ్గరి
దిటవు = దృఢము
దిమ్ము = దిబ్బ
దివి = ఆకాశం
దుకాణం = అంగడి, కొట్టు
దురితము = పాపము
దుస్తులు = బట్టలు
దృష్టాంతము = ఉదాహరణ
దోస్తీ = స్నేహం

## ధ

ధర = భూమి
ధృతి = ధైర్యం

## న

నలత = అనారోగ్యం
నాదం = ధ్వని
నిగ్రహం = అడ్డగింపు, నిరోధింపు
నిరర్థకం = ప్రయోజనం లేనిది
నిర్జించు = జయించు
నిష్పాక్షికము = పక్షపాతం లేనిది
నిహన్యమానులు = కొట్టబడినవారు
నెలవు = స్థానము
నైజం = స్వభావం

## ప

పనిముట్లు = పనికి ఉపయోగించే వస్తువులు
పబ్బము = ఉత్సవం, వేడుక
పరిజ్ఞానము = తెలివి
పరిణామం = మార్పు
పరిత్యజించు = వదిలిపెట్టు
పరిధి = హద్దు
పర్వము = పండుగ
పశుపతి = శివుడు
ప్రజ్ఞానిధులు = పండితులు, బుద్ధి కలవారు
ప్రకటము = స్పష్టము
పారిభాషిక పదాలు = ఇతర భాషా పదాలు
పారిశుద్ధ్యము = పరిశుభ్రత
పార్థివుడు = రాజు
పునుగు = పునుగు పిల్లి నుండి లభించే సుగంధ ద్రవ్యం
పృథ్వీశుడు = రాజు
పెనవేసుకొని = అల్లుకొని
పొందుగా = చక్కగా
ప్రారబ్ధము = ప్రారంభించబడినది, కర్మ విశేషం
ప్రూఫులు దిద్దడం = తప్పొప్పులు సరిచేయడం

## బ

బతుకు = జీవనం
బహుభాషా కోవిదులు = చాలా భాషల్లో పండితులు

## భ

భువి = భూమి

## మ

మంజుల = మనోహరమైన
మందానిలం = మెల్లగావీచే గాలి
మగటిమి = పౌరుషం
మట్టి = మన్ను
మడియు = చచ్చు
మతి = బుద్ధి
మనుగడ = బతుకు, జీవనము
మయూరం = నెమలి
మరుగు = చాటు
మలుపుట = ఆర్పుట
మహత్తు = మహిమ
మహనీయుడు = గొప్పవాడు
మార్గదర్శనం = దారి చూపడం
మిక్కుటము = అధికం
మృద్భాండము = మట్టికుండ
మేదిని = భూమి
మౌళి = సిగ, కొప్పు

## య

యశము = కీర్తి
యోచన = ఆలోచన

## ర

రజము = పుప్పొడి
రణము = యుద్ధము

రసజ్ఞత = సారం తెలుసుకోవడం
రసికత = రసజ్ఞత
రోషం = కోపం

## ల

లవణం = ఉప్పు
లాలింపు = బుజ్జగింపు

## వ

వర్ణం = రంగు
వర్గం = సమూహం
వలయుపని = చేయవలసినపని
వసుధ = భూమి
వహ్ని = అగ్గి
వికాసము = అభివృద్ధి
విఘ్నము = ఆటంకము
విజ్ఞులు = నిపుణులు, మిక్కిలిగా తెలిసినవారు
విత్తము = ధనము
వినీతుడు = అణుకువ కలవాడు
వినుతి = ప్రార్థన
విపంచి = వీణ
విప్రుడు = బ్రాహ్మణుడు
విరివి = విశాలం, విస్తృతం
వియద్భాగం = ఆకాశం
వీడియం = తాంబూలం
వృషభం = ఎద్దు
వెండి = రజతం, మరియు
వైశిష్ట్యము = గొప్పదనం, విశిష్టత

## శ

శాకము = కూర (ఆకుకూర)
శ్లాఘనీయము = పొగడతగినది
శ్రీ = లక్ష్మి, సంపద
శేముషి = తెలివి, ప్రతిభ
శోకం = ఏడుపు

## స

సంకల్పం = ఒక పని చేయాలనే ఆలోచన
సంఘర్షణ = ఒరిపిడి, పోరాటం
సంత్రస్తులు = భయపడినవారు
సడి = సవ్వడి
సత్కృతి = మంచిపని
సమగ్రం = పూర్తిగా
సమన్వయం = కలిసి పనిచేయడం
సమ్మెట = పెద్దసుత్తె
సరసిజం = తామర, కలువ
సర్వశ్రేష్ఠ = అన్నింటిలోకి ఉత్తమమైనది
సహజీవనం = కలిసి జీవించడం
స్వ = తన
సాధనము = ఉపకరణము, ఉపాయం
సికత = ఇసుక
సూపం = పప్పు
సిద్ధి = సమకూరు
స్నిగ్ధము = చిక్కని కలది, స్నేహం కలది
సుద్దులు = మంచి మాటలు
సోపానం = మెట్టు
సౌధము = భవనము

## హ

హఠాత్తుగా = వెంటనే
హర్మ్యము = భవనము

## క్ష

క్షీరం = పాలు

# పర్యాయపదాలు

దివి - ఆకాశం, నింగి, గగనం
పశుపతి - శివుడు, ముక్కంటి, శంకరుడు
మయూరం - నెమలి, పికము
వసుధ - భూమి, పృథ్వి, ధరణి
ఓర్పు - క్షమ, తాలిమి
స్నేహితుడు - సంగడీడు, సఖుడు, మిత్రుడు, సోపతి
స్నేహం - నెయ్యము, చెలిమి
అద్దము - దర్పణము, ముకురము, ఆదర్శనము
ఆకాశము - నింగి, నభము, మిన్ను, అంబరము
ఇల్లు - గృహము, గేహము, గీము
దుస్తులు - బట్టలు, వస్త్రములు
బ్రతుకు - మనుగడ, జీవనం, జీవితం
రాత్రి - రేయి, నిశ, మాపటేల
వేకువ - తెల్లవారుజాము, మబ్బుల, తెల్లిరగట్ల
సౌధము - భవనం, హర్మ్యము, రాజగృహం
కేలు = చేయి, హస్తం
చాలు = వరుస, పంక్తి
తనువు = శరీరం, దేహం
తరగలు = అలలు, కెరటాలు
తావి = సువాసన, పరిమళం
మౌళి = సిగ, కొప్పు
ధర = భూమి, నేల, అవని, ధరణి
దాసుడు = సేవకుడు, బానిస
విఘ్నము = ఆటంకం, అడ్డు
విత్తం = ధనం, డబ్బు, సొమ్ము
అబ్బురము = అచ్చెరువు, వింత, చోద్యము, నివ్వెర
ఇచ్ఛ = కోరిక, ఇష్టము, వాంఛ
కలశము = కుండ, భాండము, కుంభము
చేటు = కీడు, ఆపద
పార్థివుడు = రాజు, ప్రభువు, పృథ్వీశుడు
విప్రులు = బ్రాహ్మణులు, భూసురులు
అస్తిత్వం - ఉనికి, ఉండుట
ఉపేక్షించు - నిర్లక్ష్యం చేయు, అశ్రద్ధచేయు
ఔన్నత్యం - గొప్పతనం, ఉన్నతి
సంకుచితం - ముడుచుకొన్నది, వికసించనిది, తగ్గిపోయినది
సహచరుడు - స్నేహితుడు, సహవాసి, ఆప్తుడు
గాలి = వాయువు, పవనం
గొంతు = కుత్తుక, గళము
చెట్టు = వృక్షం, తరువు
మబ్బు = మేఘం, జలధరం
మూల్యం = వెల, ధర
మేడ = భవనం, ప్రాసాదం
నింగి = ఆకాశం, గగనం
సంద్రం = సముద్రం, జలధి
హృదయం = గుండె, ఎడద
భర్త = పతి, మొగుడు
సడి = సవ్వడి, సద్దు, శబ్దం
అని = యుద్ధం, రణం
ఉరు = గొప్ప, ఘనము
చోద్యము = వింత, ఆశ్చర్యం
నరుడు = మానవుడు, మనిషి
మడియు = మరణించు, చచ్చు

# ప్రకృతి-వికృతులు

దిశ - దెస

ప్రాణం - పానం

ముఖం - మొగం

స్నానం - తానం

రోషం - రోసం

దీపం - దివ్వె

ఆకాశం - ఆకసం

కష్టము - కస్తి

నిద్ర - నిదుర

పట్టణము - పట్టము

పర్వము - పబ్బము

రహాటము - రాట్నము

రాత్రి - రాతిరి

వీధి - వీది

కంఠం - గొంతు

ఘుమఘుమ - గుమగుమ

ముత్యము - ముత్తెము

శిఖ - సిగ

స్థలము - తలము

గుణము - గొనము

ధర్మము - దమ్మము

ప్రజ్ఞ - పగ్గె

చిత్రము - సిత్రము

పంక్తి - బంతి

పుణ్యము - పున్నెము

బ్రహ్మ - బొమ్మ

భోజనము - బోనము

జీవితం - జీతం

పుస్తకం - పొత్తం

యాత్ర - జాతర

సంతోషం - సంతసం

గద్దె - గద్దియ

చైతన్యం - చేతన

నిమిషం - నిముసం

మబ్బు - మొగులు

సముద్రం - సంద్రం

హృదయం - ఎడద

అపూర్వం - అబ్బురం

ఆశ - ఆస

ప్రయాణం - పయనం

సంభ్రమము - సంబరం

సుఖము - సుకం



## నానార్థాలు

| | | |
|---|---|---|
| కాచు | = | రక్షించు, కావలికాయు, ఓర్పువహించు |
| శ్రీ | = | లక్ష్మి, సాలెపురుగు |
| మరుగు | = | చాటు, ద్రవాలు మరగడం |
| రీతి | = | విధము, సంగీతము, మర్యాద, వ్యవహారము |
| ఉబ్బు | = | గర్వము, వాపు |
| క్రియ | = | పని, విధము |
| గుణము | = | లక్షణము, వింటినారి, ఫలితము |
| ధర | = | భూమి, విలువ |
| కృతి | = | కావ్యం, నేర్పరి, పండితుడు |
| క్షేత్రం | = | ఉపవాసము, గోడ, శరీరము, భూమి |
| కోత | = | బాధ, కోయుట |
| చైతన్యం | = | తెలివి, ప్రాణం |
| సభ | = | సమూహం, గృహము |
| శ్రుతి | = | వేదం, చెవి, ధ్వని |
| అని | = | పలికి, యుద్ధం |
| కులము | = | వంశం, ఇల్లు, శరీరము |
| కువలయము | = | భూమి, తెల్లకలువ |
| కొలువు | = | రాజసభ (ఆస్థానం), ఉద్యోగము (సేవ) |

## వ్యుత్పత్త్యర్థాలు

| | | |
|---|---|---|
| హృదయము | = | హరింపబడునది–గుండెకాయ, మనసు |
| శ్వేతపత్రము | = | తెల్లని రెక్కలు కలది (హంస) |
| జానకి | = | జనక మహారాజు కూతురు (జానకి) – సీత |
| దశరథాత్మజులు | = | దశరథుని కుమారులు (రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు) |
| రావణుడు | = | పెద్దగా రవము (శబ్దము) చేసినవాడు – దశగ్రీవుడు |

## పద వివరణలు

**అపవర్గము** – అపవర్గం అంటే మోక్షం. మంచి పనులు చేయడంవల్ల, భక్తితో కూడిన జ్ఞానంవల్ల ఇది లభిస్తుంది.

**అప్సరసలు** – రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమాది దేవ నర్తకీమణులు. అందమైనవారు. వీళ్ళు మొత్తం 31 మంది ఉన్నట్లు భాగవతంలో ఉంది.

**ఆపద్ధర్మము** – ధర్మం కాకపోయినా కూడా ఆపద సమయంలో పాటించాల్సిన విధి.

**కుండపోత** – కుండలతో పోసినట్లుగా కురిసే పెద్దవాన. దీనినే కుంభవృష్టి అని అంటారు.

**గంధర్వులు** - దేవతాగణాలలో ఒకరు. వీరు సంగీతంలో, గానంలో ప్రసిద్ధులు.

**గెరిల్లా వీరుడు** - తమ సమూహం (గుంపు)తో రహస్యంగా పొంచి ఉండి శత్రువులపై అకస్మాత్తుగా ఆయుధాలతో విరుచుకుపడి యుద్ధం చేయడాన్ని గెరిల్లా యుద్ధం అంటారు. గెరిల్లా పోరాటం చేసిన వాడిని గెరిల్లా వీరుడు అంటారు.

**చామరము** - చమరీమృగం యొక్క పొడవైన వెంట్రుకలతో గాలి విసురుటకు తయారుచేసిన విసనకర్ర వంటి సాధనం. దీనిని భగవంతుడి సేవలో ఎక్కువగా వినియోగిస్తారు.

**జ్ఞానపీఠం** - భారతీయ అధికార భాషలలో రచనలు చేసిన రచయితలకు ఇచ్చే అత్యున్నత సాహితీ పురస్కారం. దీనిని 1964లో నెలకొల్పారు. తెలుగువాళ్ళల్లో ఇప్పటివరకు విశ్వనాథ సత్యనారాయణ, డా॥ సి. నారాయణరెడ్డి, రావూరి భరద్వాజ ఈ జ్ఞానపీఠ్ పురస్కారం పొందారు.

**జీతనాతాలు** - నెలవారీ జీతంతో పాటు రోజూ లభించే దినసరి బత్తెములను కలుపుకుని జీతనాతాలు అంటారు.

**తడికెల గుమ్మి** - ధాన్యాన్ని నిలువ ఉంచడానికి ఉపయోగించే తడకల బుట్ట.

**తలంబ్రాలు** - తలపై పోసే బియ్యం. వీటినే అక్షతలు లేదా అక్షింతలు అని కూడా అంటారు. ఆశీర్వదించేటప్పుడు, పెండ్లిండ్లలో వీటిని తలపై పోస్తారు.

**దమ్మిడీ** - స్వాతంత్ర్యానికి పూర్వం చెలామణిలో ఉన్న అతి తక్కువ విలువగల నాణెం. అణా (6 పైసలు) లో 12వ వంతు భాగం దమ్మిడీ.

**దేవదాసి** - దేవుడికోసం దేవుడి ఉత్సవాలలో నాట్యంచేస్తూ జీవితాంతం పెండ్లి చేసుకోకుండా ఉండిపోయే స్త్రీ. ఆధునిక కాలంలో దీనిని సాంఘిక దురాచారంగా గుర్తించారు.

**నలపాకము** - మంచి రుచికరమైన వంట. పూర్వకాలంలో నిషిధ దేశపు రాజైన నలుడు కలి ప్రభావంతో అన్నింటినీ కోల్పోయి వంటవాడుగా మారుతాడు. ఆయన చేసిన వంట ఘుమఘుమలాడుతూ ఎంతో రుచిగా ఉండేదని పురాణాలలో వర్ణించారు. అందుకే మంచి రుచికరమైన వంటను నలుని పాకం (వంట)తో పోల్చి నలపాకం అంటారు.

**పంచభూతాలు** - భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం. ఈ ఐదింటినీ పంచభూతాలు అంటారు.

**పాసుపోర్టు** - విదేశ ప్రయాణానికి ఆ దేశ పౌరులకు ప్రభుత్వం ఇచ్చే అర్హత ప్రయాణ పత్రం.

**పుట్టి** - నదిని దాటడానికి వెదురుతో అల్లిన పెద్ద గంప.

**పునుగు పిల్లి** - పిల్లి జాతికి చెందిన ఒక చిన్న జంతువు. దీని గ్రంథుల నుండి పునుగు అనే సుగంధ ద్రవ్యం లభిస్తుంది. తిరుమలలో వేంకటేశ్వరస్వామి పూజకు ఈ పునుగు సుగంధ ద్రవ్యం నుండి తీసిన నూనెను ఉపయోగిస్తారు.

**ముహూర్తం** - చేపట్టిన లేదా ప్రారంభించిన పని విజయవంతం కావడానికి, శుభం కలుగడానికి తగిన సమయాన్ని నిర్ణయించడమే ముహూర్తం.

**లిప్తకాలం** - కనురెప్ప వేయునంత సమయం. భారతీయ కాల గణన ప్రమాణంలో 'లిప్త' అనేది ఒకటి. 60 లిప్తల కాలం 24 సెకండ్లకు సమానం.

**సాంస్కృతిక పునరుజ్జీవము** - కాలానుగుణంగా భాషాసాహిత్యాలలో, సంస్కృతి సంప్రదాయాలలో, కళారూపాలలో సంతరించుకున్న కొత్త భావనలు, ఆలోచనలు, ఆవిష్కరణలే సాంస్కృతిక పునరుజ్జీవం.